

'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 సంచిక: 4

SUNDAY Special | ఆదివారం 17-9-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



స్వచ్ఛ ప్రపంచం కోసం...

2050కి కర్బన, గ్రీన్ హౌస్ ఉద్గారాలను తగ్గించాలంటే ప్రపంచస్థాయిలో ఇప్పటి నుంచి ఏటా రూ.2.24 కోట్ల కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని నివేదిక తెలిపింది.

- వివరాలు 6లో



నిరీక్షణ ముగించాలని!

వర్షంతో దోబూచులాడిన ఆసియా కప్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ తుది అంకానికి చేరుకుంది. నేడు భారత్, శ్రీలంక జట్ల మధ్య జరిగే ఫైనల్‌తో ఈ టోర్నీకి తెరపడనుంది.


- వివరాలు 12లో



రేపటి నుంచి పార్లమెంట్

పార్లమెంట్ సమావేశాలు 18 నుంచి ప్రారంభం కానుండగా..ఆదివారం అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్ల సమావేశం జరగనుంది.

వివరాలు 6లో ▸



23న కోవింద్ కమిటీ తొలి భేటీ

జమిలిపై సిఫార్సులు చేసేందుకు మాజీ రాష్ట్రపతి కోవింద్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ తొలి సమావేశం ఈ నెల 23న జరగనుంది.

వివరాలు 6లో ▸



యూకే వీసా ఫీజుల్లో పెరుగుదల

విజిటింగ్ వీసాపై 15, విద్యార్థి వీసాపై అదనంగా 127 పౌండ్లను పెంచనున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం వెల్లడించింది.

వివరాలు 6లో ▸



పాక్‌లో లీటర్ పెట్రోలు రూ.330

పాకిస్తాన్‌లోని ఆపద్ధర్మ ప్రభుత్వం లీటర్ పెట్రోల్‌పై రూ.26.02, డీజిల్‌పై రూ.17.34 పెంచుతున్నట్లు ప్రకటించింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ఏపీ ఎఫ్‌డీసీకి జాతీయ గుర్తింపు



ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ జి. దేవేందర్‌రెడ్డికి లోక్‌సభాపతి ఓంబిర్లా టాప్ ఎక్స్‌పోర్ట్ అవార్డ్ ఆఫ్ క్యాపెక్సెల్ అవార్డును అందజేశారు.

వివరాలు 10లో ▸

ఎగుమతుల్లో అదే జోష్



సముద్ర వాణిజ్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. దేశీయ వాణిజ్య ఎగుమతుల్లో ఏపీ దూసుకుపోతోంది. ప్రపంచ ఆర్థిక మందగమనం వల్ల ఈ ఏడాది దేశవ్యాప్తంగా ఎగుమతుల్లో క్షీణత నమోదవుతున్నా, మన రాష్ట్రంలో మాత్రం వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం ఏప్రిల్–జూన్ మధ్య దేశవ్యాప్తంగా ఎగుమతులు 8.48 శాతం క్షీణించగా, ఏపీ ఎగుమతుల్లో 6.20 శాతం వృద్ధి నమోదైంది.

వివరాలు 14లో ▸

సూత్రధారి, పాత్రధారి చంద్రబాబే

ప్రజాధనం దోచేసిన వాళ్లను జైల్లో కాక మరెక్కడ పెట్టాలి?

చంద్రబాబు అవినీతిపై నిప్పులు చెరిగిన సీఎం వైఎస్ జగన్

రూ.371 కోట్లు ప్రజాధనం ఎక్కడికి పోయింది?

- లేని కంపెనీ ఉన్నట్టు ఫేక్ అగ్రిమెంటుతో దోపిడీ
- అడ్డంగా దొరికినా అడ్డగోలు వాదనలు
- సాక్ష్యాధారాలతో కేంద్ర దర్యాప్తు సంస్థలకు దొరికినా బుకాయింపే
- బాబు దొంగతనాల్లో వారంతా వాటాదారులే
- అందుకే నిజాలు మాట్లాడటం లేదు.. చట్టం అందరికీ సమానమని చెప్పలేరు
- ప్రశ్నిస్తా అన్నవాడు ములాఖత్‌లో మిలాఖతై పొత్తు
- మోసం వైపా? మంచి వైపా? ఎటువైపు నిలుస్తారో ఆలోచించండి

2లో



తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో కాపు నేస్తం చెక్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న సీఎం జగన్

"ప్రజల సొమ్ము, ఇంత అడ్డగోలుగా ఎలా దోచేశారు? ఎవరి జేబులోకి ఈ డబ్బులు పోయాయి? దోచేసిన వాళ్లను జైళ్లలో పెట్టకపోతే మరెక్కడ పెట్టాలి? అని ప్రశ్నించాల్సిన వారు ములాఖత్‌లో మిలాఖత్ అయిపోతే పరిస్థితి ఏమిటని ఆలోచన చేయండి. వీళ్లందరి కండకావరం ఏమిటంటే.. మాకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ- 5 అండగా ఉంది.. ఓ దత్తపుత్రుడి సపోర్టు ఉంది.. కాబట్టి మేం దోచేసి పంచుకున్నా కూడా ఎవరూ మాట్లాడరనే ధీమా వాళ్లకుంది.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అందరికంటే మిన్నగా 'కాపు'కాశాం

మేనిఫెస్టోలో చెప్పిన మాట కంటే మిన్నగా మేలు చేశాం

నాలుగో విడత కాపునేస్తం నిధుల విడుదల సభలో సీఎం

2లో



కూటమిగా కలబడదాం.. గర్వంగా నిలబెడదాం

10లో

సీడబ్ల్యూసీ సమావేశంలో నిర్ణయం

కొత్త రాజ్యాంగ రూపకల్పన ప్రతిపాదనకు నో

కులగణన చేపట్టాలి.. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ల పరిమితిని పెంచాలి.. వన్ నేషన్-వన్ ఎలక్షన్‌కు వ్యతిరేకం

14 అంశాలపై తీర్మానాలు.. హైదరాబాద్‌లో ప్రారంభమైన సమావేశాలు

న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ హాల్‌లో రాష్ట్ర విద్యార్థులు



ప్రపంచ చోదక శక్తి యువతే

యూఎన్‌ఓలో జరిగే సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సదస్సుకు వెళ్లిన ఏపీ విద్యార్థులు శనివారం జనరల్ అసెంబ్లీలో జరిగిన సదస్సులో ప్రసంగించారు. న్యూయార్క్‌లోని యూఎన్‌ఓ ప్రధాన కార్యాలయంలో ప్రారంభమైన సదస్సులో ఏపీ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ గళం వినిపించారు.

14లో

శైలజ చెప్పకుండా దేశం దాటారు



- చందాదారుల ప్రయోజనాలు కాపాడేందుకే లుక్ అవుట్ నోటీసులు
- దర్యాప్తునకు ఆమె సహకరించడంలేదు
- విదేశాలకు వెళ్తున్నట్లు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు
- విచారణను తప్పించుకోవడానికే అమెరికా వెళ్లారు
- 'మార్గదర్శి' కేసులో తెలంగాణ హైకోర్టులో ఏపీ సీఐడీ కౌంటర్

10లో

• తెలంగాణ

నేడు అతిరథుల మహాసభలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ ఆదివారం(సెప్టెంబర్ 17న) హైవోల్టేజీ రాజకీయాలకు వేదిక కాబోతోంది. ఒక్కరోజే 4 సభలు.. 4 ప్రధాన పార్టీలు పోటాపోటీగా, వాడివేడీగా కార్యక్రమాలు చేపట్టాయి. మరో రెండు, మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు వస్తాయని భావిస్తున్న తరుణంలో ప్రధాన రాజకీయ పక్షాలు తమ ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, ప్రత్యర్థులపై విమర్శలకు ఈ సభలను వేదికలుగా మార్చుకోబోతున్నాయి. సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం సమైక్యతా దినోత్సవంగా నిర్వహిస్తుంటే.. కేంద్రం మాత్రం విమోచన దినోత్సవంగా జరపనుంది. కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సమావేశాలు, సెప్టెంబర్ 17 కలిసి వచ్చేలా బహిరంగసభ నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించి, అక్కడ నిర్వహించే సభలో మాట్లాడనున్నారు.

ఇదండీ సంగతి



మిమ్మల్ని నేను, నన్ను మీరు ఆహ్వానించుకోవాల్సిందే! ప్రపంచంలో మనల్ని ఎవరూ ఆహ్వానించరు..!!

మరింత మందికి రైతు భరోసా

భూ యజమానులకు మరో ఛాన్స్

నాలుగేళ్లలో అదనంగా 5.08 లక్షల మందికి అదనంగా లబ్ధి

కొత్తగా భూముల కొనుగోలు, మ్యుటేషన్ చేయించుకున్న వారికి అవకాశం.. ఆర్బీకేల్లో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచన

సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతు భరోసా సాయం అందని రైతు ఒక్కరు కూడా ఉండకూడదన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. అర్హత కలిగి ఇంకా పెట్టుబడి సాయం దక్కని భూ యజమానులను గుర్తించి, వారి వివరాలను నమోదు చేసేందుకు అవకాశం కల్పించింది. ఆర్బీకే సిబ్బంది ద్వారా రైతు భరోసా పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో అర్హులకు అక్టోబర్‌లో రెండు విడతల సాయం కలిపి పంపిణీ చేయనున్నారు.



ఏటా మూడు విడతల్లో పెట్టుబడి సాయం

2023–24 వ్యవసాయ సీజన్‌కు సంబంధించి ఇటీవల పంపిణీ చేసిన తొలి విడత సాయంతో కలిపి ఈ నాలుగేళ్లలో ఇప్పటివరకు 52,57,263 రైతు కుటుంబాలకు రూ.31 వేల కోట్ల పెట్టుబడి సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించింది. ఏటా తొలి విడత సాయం పంపిణీ సమయంలోనే రైతు భరోసా పోర్టల్ లాగిన్‌ను తెరుస్తుంటారు. ఆ సమయంలో చనిపోయిన వారి వివరాలను తొలగించడంతో పాటు ఆ ఏడాది అర్హత పొందిన భూ యజమానుల వివరాలను నమోదు చేసి పెట్టుబడి సాయం అందిస్తున్నారు. ఇలా తొలి ఏడాది (2019–20) 45,11,252 భూ యజమానులు అర్హత పొందగా.. ఆ తర్వాత వరుసగా 2020–21లో 50,04,874 మంది, 2021–22లో 50,66,241 మంది, 2022–23లో 49,26,041 మంది లబ్ధి పొందారు. 2023–24 వ్యవసాయ సీజన్‌లో 50,19,187 మంది భూ యజమానులు లబ్ధి పొందారు.

ఏటా పెరుగుతున్న భూ యజమానులు

ఇలా ఈ నాలుగేళ్లలో 5,07,935 మంది అదనంగా భూ యజమానులు అర్హత పొందారు. ఈ ఏడాది కూడా అన్ని అర్హతలు ఉండి ఈ పథకం కింద లబ్ధి పొందలేకపోయిన వారికి మరో అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టాదార్ పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్స్ పొందిన వారు, తల్లిదండ్రులు మృతిచెందగా వారసత్వంగా భూములు పొందినవారు, అన్నదమ్ములు వాటాల కింద భూములు పంచుకున్న వారు, వివిధ రూపాల్లో మ్యుటేషన్ పొందిన వారు తమ వివరాలను రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఇప్పటివరకు లాక్ అయిన ఈ పోర్టల్ లాగిన్‌ను ఈ నెల 12నుంచి కొత్త రిజిస్ట్రేషన్స్ కోసం తెరిచారు. ఇంకా అర్హత ఉండి అవకాశం వినియోగించుకోని మిగిలిన రైతులతో పాటు కొత్తగా చేరిన రైతు కుటుంబాలు ఈ పథకంలో అర్హత సాధించటానికి ప్రస్తుతం భూ యజమాని రైతులకు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించింది. నమోదు చేసుకున్న వారిలో అన్ని అర్హతలు కల్గిన భూ యజమానులకు అక్టోబర్‌లో రెండు విడతల సాయం అందించనున్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

"సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు సంతృప్తికర స్థాయిలో అర్హత ఉన్న వారికి పెట్టుబడి సాయం అందించే సంకల్పంతో రైతు భరోసా పోర్టల్‌లో రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించాం. మ్యుటేషన్ చేయించుకున్న వారు, కొత్తగా భూములు కొనుగోలు చేసిన వారు, వారసత్వ హక్కులు పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. తమ పరిధిలోని ఆర్బీకే సిబ్బందిని సంప్రదించి వివరాలను నమోదు చేయించుకోవాలి.

– చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

క్లుప్తంగా...

వైఎస్సార్ జిల్లాకు సైనిక్ స్కూలు

• రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్సార్ జిల్లా పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లికి సైనిక్ స్కూలు మంజూరైంది. ఎన్జీవోలు/ప్రైవేటు పాఠశాలలు/రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నూతన సైనిక్ స్కూళ్ల ఏర్పాటుకు కేంద్రం ఇటీవల ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి వచ్చిన దరఖాస్తులను మూల్యాంకనం చేసి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యాన నల్లపురెడ్డిపల్లి జెడ్పీ హైస్కూలుకు భాగస్వామ్య పద్ధతిలో సైనిక్ స్కూలు ఏర్పాటుకు కేంద్ర రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. అదేవిధంగా దేశవ్యాప్తంగా 23 పాఠశాలలకు ఆమోదం తెలిపింది. ఆయా పాఠశాలలు సైనిక్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పని చేయనున్నాయి.

పెట్రోలియం కోక్ హ్యాండ్లింగ్‌లో మరో రికార్డు

• విశాఖ పోర్టులో ఒకే రోజు 41,420 మెట్రిక్ టన్నుల కోక్ దిగుమతి

సాక్షి, విశాఖపట్నం: కార్గో హ్యాండ్లింగ్‌లో విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) మరో రికార్డును లిఖించింది. ఇటీవలే బాక్సైట్, ఐరన్ ఓర్, పెల్లెట్స్ సరకు రవాణాలో కొత్త నంబర్లు నమోదు చేసిన వీపీఏ.. తాజాగా పెట్రోలియం కోక్ దిగుమతిలోనూ అదే జోరు కొనసాగించింది. గల్ఫ్ దేశాలకు చెందిన ఏరియస్ కరిన్ అనే కార్గోషిప్ ఈ నెల 15న విశాఖపట్నం పోర్టుకు చేరుకుంది. ఈ షిప్ నుంచి రికార్డు స్థాయిలో 41,420 మెట్రిక్ టన్నుల పెట్రోలియం కోక్‌ను ఒకే రోజు దిగుమతి చేసింది. గతేడాది సెప్టెంబర్ 2న 37,474 మెట్రిక్ టన్నుల పెట్రోలియం కోక్ దిగుమతిని అధిగమించినట్లు పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు ప్రకటించారు.

వైఎస్సార్ జిల్లా ఎస్పీకి 'ఫిక్కీ' అవార్డు


సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్: వైఎస్సార్ జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సిద్ధార్థ్ కౌశల్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) స్మార్ట్ పోలీసింగ్ అవార్డ్స్ పేరిట జాతీయ స్థాయిలో ప్రతి ఏటా అందజేసే ప్రతిష్టాత్మక అవార్డు 2022 సంవత్సరానికి సిద్ధార్థ్‌కు లభించింది. కర్నూలు జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తించే సమయంలో సాంకేతికతను పోలీస్ సిబ్బందికి మరింత చేరువ చేసేందుకు, మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు వీలుగా ట్రైనింగ్ అండ్ యాక్టివిటీస్ ఫర్ టెక్నాలజీ అడాప్షన్ (టి.ఎ.టి.ఎ)ను రూపొందించి అమలు చేసి సత్ఫలితాలు సాధించారు. ట్రైనింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్ కేటగిరిలో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌కు అవార్డును 'ఫిక్కీ' నిర్వాహకులు ప్రకటించారు.

ప్రతాప్‌కు బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కారం



సఖినేటిపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం ఉయ్యూరువారి మెరకకు చెందిన శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక డాక్టర్ బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజ్, కల్చర్ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు నుంచి అధికారిక ఉత్తర్వులు అందినట్టు ఆయన శనివారం తెలిపారు. డాక్టర్ భీమన్న జయంతి వేడుకల సందర్భంగా విజయవాడ బరంపార్కులో ఆదివారం జరిగే కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖా మంత్రి ఆర్కే రోజా చేతుల మీదుగా ఈ పురస్కారం, రూ.2 లక్షల ప్రోత్సాహక నగదు అందుకోనున్నట్టు ప్రతాప్ చెప్పారు.

ముగ్గురు కళాకారులకు సంగీత నాటక అకాడమీ అవార్డులు

• అందజేసిన ఉప రాష్ట్రపతి


మహంకాళి శ్రీమన్నారాయణమూర్తికి అవార్డు అందజేస్తున్న ఉపరాష్ట్రపతి

సాక్షి, న్యూఢిల్లీ/కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు కళాకారులకు సంగీత నాటక అకాడమీ అవార్డులు పొందారు. ఢిల్లీలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఈ అవార్డులను అందజేశారు. అవార్డులు స్వీకరించినవారిలో కూచిపూడికి చెందిన మహంకాళి శ్రీమన్నారాయణమూర్తి(కూచిపూడి), ముమ్మిడివరానికి చెందిన పండితారాధ్యుల సత్యనారాయణ (హరికథ), మచిలీపట్నానికి చెందిన మహాభాష్యం చిత్తరంజన్(సంప్రదాయ సంగీతం–సుగమ్ సంగీత్) ఉన్నారు. అవార్డు గ్రహీతలకు రూ.లక్ష నగదు బహుమతి, తామ్రపత్రం ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు.

అందరికంటే మిన్నగా 'కాపు' కాశాం

మేనిఫెస్టోలో చెప్పిన మాట కంటే మిన్నగా మేలు చేశాం

నాలుగో విడత కాపునేస్తం నిధుల విడుదల సభలో సీఎం వైఎస్ జగన్

• ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఇస్తామన్నాం
• నాలుగేళ్లలోనే డీబీటీ, నాన్ డీబీటీతో రూ.39,247 కోట్లు ఇచ్చాం
• వరుసగా నాలుగో ఏట 3,57,844 మంది అక్కచెల్లెమ్మలకు లబ్ధి
• కంప్యూటర్‌లో బటన్ నొక్కి రూ.536.77 కోట్లు జమ
• నాలుగేళ్లలో 4 లక్షల మందికి రూ.2029 కోట్ల సాయం


నిడదవోలులో జరిగిన బహిరంగసభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

నిడదవోలు నుంచి సాక్షి ప్రతినిధి: 'మేనిఫెస్టోలో చెప్పిన దాని కంటే మిన్నగా మన ప్రభుత్వంలో కాపుల సంక్షేమానికి అన్ని విధాలా కాపు కాశాం. కాపు నేస్తంతో పేదలైన కాపు అక్కచెల్లెమ్మలను ఆర్థికంగా ఆదుకున్నాం. నాతో పాటు కేబినెట్‌లో కాపులను పక్కన కూర్చోబెట్టుకున్నా. నామినేటెడ్ పదవుల్లోనూ మిగిలిన వర్గాల పక్కనే కూర్చోబెట్టాం. కాపు కుటుంబాల్లోని అక్కచెల్లెమ్మల ఆర్థిక స్వావలంబన కోసం మన ప్రభుత్వం గత నాలుగేళ్లుగా పరితపిస్తోంది' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో శనివారం ఆయన కాపు నేస్తం నాలుగో విడత సొమ్ము విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాపు, ఒంటరి, బలిజ, తెలగ కులాలకు చెందిన అర్హులైన 3,57,844 మంది పేద అక్కచెల్లెమ్మలకు రూ.536.77 కోట్ల ఆర్థిక సాయాన్ని కంప్యూటర్‌లో బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా తరలివచ్చిన అశేష జనవాహినిని ఉద్దేశించి మాట్లాడారు. 'కాపు, తెలగ, ఒంటరి, బలిజ కులాలకు చెందిన నా అక్క చెల్లెమ్మల్లో 45 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల మధ్య ఉన్న పేదలకు ఏటా రూ.15 వేల చొప్పున ఇస్తున్నాం. వరుసగా ఐదేళ్ల పాటు, మొత్తంగా రూ.75 వేల ఆర్థిక సాయం అందించే పథకాన్ని అమలు చేస్తున్నాం. ఎక్కడా లంచాలు, వివక్షకు తావు లేకుండా సాయం అందజేస్తున్నాం. ఈ పథకం కింద ఇప్పటి వరకు సుమారు రూ.2029 కోట్ల ఆర్థిక సాయం చేసినట్టయింది. ఈ ఒక్క పథకం ద్వారానే దాదాపు 4 లక్షల మంది నా అక్కచెల్లెమ్మలకు ఈ నాలుగేళ్లలో ఒక్కొక్కరికి రూ.60 వేలు చొప్పున అందజేశాం. అక్కచెల్లెమ్మలు వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడాలని, ఆర్థిక స్వావలంబన సాధించాలని అడుగులు ముందుకు వేస్తున్నాం' అని చెప్పారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..




అదుగో జగన్.. అంటూ అక్కచెల్లెమ్మల ఆనందోత్సాహం

ఈ డబ్బు వారికి ఎంతో ఉపయోగం

- నా అక్కచెల్లెమ్మల్లో పేదవాళ్లు ఎక్కడున్నా, వారికి మంచి జరగాలన్న తపన, తాపత్రయంతో నాలుగేళ్లుగా అడుగులు వేస్తున్నాం. 45–60 ఏళ్ల మధ్య వయసు ఉన్న అక్కచెల్లెమ్మల చేతిలో ఈ డబ్బు పెడితే అది వారి కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్న నమ్మకంతో వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రవేశపెట్టాం.
- నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు ఈ పథకం ద్వారా ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో రూ.75 వేలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఇప్పటిదాకా 26,39,703 మందికి రూ.14,129 కోట్లు అందజేశాం.
- ఓసీల్లో పేదరికంలో ఉన్న అక్కచెల్లెమ్మలకు కూడా అండగా నిలబడాలని 45–60 ఏళ్ల మధ్య ఉన్న వారి కోసం వైఎస్సార్ ఈబీసీ నేస్తం తీసుకొచ్చాం. ఈ పథకం ద్వారా ఏటా రూ.15 వేలు చొప్పున వరసగా మూడేళ్లలో మొత్తం రూ.45 వేలు ఇచ్చే కార్యక్రమం చేస్తున్నాం. ఇప్పటి వరకు 4,39,068 మంది అక్కచెల్లెమ్మలకు రూ. 1,257 కోట్లు ఇచ్చాం. నా కాపు అక్కచెల్లెమ్మలకు కూడా అదే తరహాలో మద్దతు ఇవ్వాలన్న మంచి ఆలోచనతో మేనిఫెస్టోలో చెప్పకపోయినా వైఎస్సార్ కాపునేస్తం పథకాన్ని ప్రారంభించాం. ఇది రాష్ట్ర చరిత్రలో గతంలో ఏ ప్రభుత్వం ఎప్పుడూ అమలు చేయని కార్యక్రమం. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ కాపునేస్తం.. ఈ మూడు పథకాల ద్వారానే 34.37 లక్షల మందికి తోడుగా ఉన్నాం.
- రాష్ట్రంలో మనందరి ప్రభుత్వం వచ్చాక, వివిధ పథకాల ద్వారా 2.06 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు ఇచ్చాం. సచివాలయాల్లో మన కళ్లెదుటే దాదాపు 1.30 లక్షల మంది పిల్లలు వైద్య, ఆరోగ్య, ఇతర రంగాల్లోనూ కనిపిస్తారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి మన ప్రభుత్వం రానంత వరకు దాదాపు 4 లక్షల మంది ఉద్యోగులు ఉంటే, ఈ నాలుగేళ్ల మీ బిడ్డ పరిపాలనలో మరో 2.06 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం. ఈ 2.06 లక్షల ఉద్యోగాలలో కాపు చెల్లెమ్మలు, తమ్ముళ్లకు లభించిన ఉద్యోగాలు దాదాపు 9.5 శాతం.

సామాజిక న్యాయం మన విధానం

- సామాజిక న్యాయాన్ని ఒక నినాదంగా కాకుండా, ఒక విధానంగా మార్చుకున్న ప్రభుత్వం ఇది. కాపు సోదరులకు రెండు కేబినెట్లలో సముచిత స్థానం కల్పించాం. ఒక్కో కేబినెట్‌లో నలుగురు మంత్రులతో పాటు, ఉప ముఖ్యమంత్రి పదవి కూడా ఇచ్చి నా పక్కనే కూర్చోబెట్టుకున్నాను. మీ బిడ్డ ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ఐదుగురు మంత్రులు కనిపిస్తారు. ఉప ముఖ్యమంత్రి పదవుల్లో ఒక బీసీ, ఒక ఎస్సీ, ఒక ఎస్టీ, ఒక మైనార్టీతో పాటు నా కాపుసోదరుడు కనిపిస్తాడు. కారణం ఇది మీ అందరి ప్రభుత్వం కాబట్టి.
- మొత్తంగా నామినేటెడ్ పోస్టుల్లో ఏకంగా 12 శాతం కాపు సోదరులకు, అక్కచెల్లెమ్మలకే ఇచ్చాం. ఇప్పటి వరకు నవరత్నాల్లోని వివిధ పథకాల ద్వారా నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేసిన రూ.2.31 లక్షల కోట్లలో కాపులకు అందిన మొత్తం రూ.22,333 కోట్లు.
- నాన్ డీబీటీ పథకాలలో జగనన్న తోడు, గోరుముద్ద, సంపూర్ణ పోషణ, విద్యా కానుక, 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌ల పంపిణీ, అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు ఇలా ఎన్నో చేశాం. ప్రాంతాన్ని బట్టి ఇంటి స్థలం విలువ మారుతుంది. ఉభయగోదావరి జిల్లాల్లో ఒక్కో ఇంటి స్థలం విలువ కనీసం రూ.5 లక్షలు ఉంటుంది. ఇలా నాన్ డీబీటీ పథకాల ద్వారా నా కాపు అక్కచెల్లెమ్మలు, వారి కుటుంబాలకు కలిగిన లబ్ధి మరో రూ.16,914 కోట్లు. 2.46 లక్షల మంది కాపు అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు ఇచ్చాం. ఇలా డీబీటీ, నాన్ డీబీటీ పథకాలను కలిపి చూస్తే కాపు అక్కచెల్లెమ్మలు, వారి కుటుంబాలకు ఈ నాలుగేళ్లలో రూ.39,247 కోట్లు లబ్ధి కల్పించాం.

10 శాతం కూడా మేలు చేయని చంద్రబాబు

- మనం ఖర్చు చేసిన రూ.39,247 కోట్లలో గతంలో చంద్రబాబు ప్రభుత్వం కనీసం 10 శాతం కూడా ఇచ్చిన పరిస్థితులు లేవు. గత ప్రభుత్వం కాపుల్ని మంజునాథ కమిషన్ పేరిట చేసింది ఒక మోసమైతే.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఈబీసీ రిజర్వేషన్లలో భాగాన్ని పంచడం సాధ్యం కాదని తెలిసి కూడా మరో మోసం చేసింది. అలాంటి మోసాలు మన ప్రభుత్వం చేయలేదు.
- మనం మేనిఫెస్టోలో చేసిన వాగ్దానం మేరకు ఏటా రూ.2 వేల కోట్లు కాపుల సంక్షేమానికి ఖర్చు చేస్తామని చెప్పాం. ఇలా ఐదేళ్లలో కాపులకు రూ.10 వేల కోట్లు ఇస్తామని చెప్పాం. కానీ, నాలుగేళ్లలోనే డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.39,247 కోట్లు ఖర్చు చేశాం. చంద్రబాబు తన జీవితమంతా సామాజిక వర్గాలన్నింటినీ వంచించారు.
- మీ బిడ్డ ప్రభుత్వం 2019లో ఏర్పడింది. గత ప్రభుత్వంలో ఎంత బడ్జెట్ ఉందో మీ బిడ్డ ప్రభుత్వంలో కూడా దాదాపు అదే బడ్జెట్. అప్పుడు ఎంత ఆదాయం ఉందో ఇప్పుడూ కూడా అంతే. పైగా మీ బిడ్డ ప్రభుత్వంలో అనుకోకుండా కోవిడ్ వచ్చి ఆదాయాలు తగ్గి ఖర్చులు పెరిగాయి. అయినప్పటికీ మీ బిడ్డ రూ.2.35 లక్షల కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో ఎలా జమ చేశాడు. ఇలా చంద్రబాబు ఎందుకు చేయలేదు? మీరే గమనించాలి.

మా కుటుంబానికి రూ.4,45,000 లబ్ధి



అన్నా.. మీలాగ ఏ రాజకీయ నాయకుడు కూడా మా కాపులను గుర్తించలేదు. మీరు వచ్చాక అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సాయం చేస్తున్నారు. నేను గత ఏడాది, ఈ ఏడాది సాయం పొందాను. నేను చదువుకోకపోయినా, మీ పథకాల ద్వారా నా పిల్లలు ముగ్గురినీ చదివిస్తున్నా. చాలా ఆనందంగా ఉంది. మా డ్వాక్రా గ్రూప్‌కు రుణమాఫీ జరిగింది. సొంతింటి కల నెరవేరుతోంది. మొత్తంగా మా కుటుంబానికి ఈ ప్రభుత్వంలో రూ.4,45,000 లబ్ధి కలిగింది. నాలాగ లబ్ధి పొందిన వారంతా మీకు రుణపడి ఉంటాం.

– సుబ్రమణ్యేశ్వరి, లబ్ధిదారు, వేమగిరి, కడియం మండలం


సభాప్రాంగణం నిండిపోవడంతో బయట నుంచే సీఎం ప్రసంగాన్ని వింటున్న జనవాహిని

చిన్నారికి ప్రాణం పోస్తున్న సీఎం జగన్ మానవత్వం

• అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి దయానాశాంతి
• 9 నెలల క్రితం సీఎం జగన్‌కు వివరించిన చిన్నారి తల్లి
• వెంటనే స్పందించి వైద్యానికి ఏర్పాట్లు చేసిన సీఎం జగన్
• చిన్నారికి రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ అవసరం
• సీఎం చొరవతో ఉచితంగా ఇంజెక్షన్ ఇవ్వడానికి ముందుకు వచ్చిన ఢిల్లీ ఎయిమ్స్
• 3 వారాల్లో ఎయిమ్స్‌లో ఇంజెక్షన్
• రూ.లక్ష సాయం, చిన్నారి తల్లికి ఉద్యోగం, ఇతరత్రా సాయం
• సీఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన తల్లి


చిన్నారితో కలిసి సీఎం జగన్‌కు కృతజ్ఞతలు చెబుతున్న సూర్యకుమారి

నిడదవోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనల్లో ఎవరు సమస్యల్లో ఉన్నా, వారికి వెంటనే సాంత్వన చేకూర్చి, వారి సమస్యను పరిష్కరిస్తుంటారు. జనవరిలో సీఎం జగన్ తూర్పు గోదావరి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో చిట్టీ సూర్యకుమారి వచ్చి తన మూడేళ్ల కుమార్తె డయానా శాంతి అరుదైన స్పైనల్ మస్కులర్ అట్రోఫీ టైప్–2 వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తెలిపి, ఆదుకోవాలని సూర్యకుమారి కోరింది. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి ఆ చిన్నారి వైద్యానికి ఏర్పాట్లు చేశారు. వ్యాధి నివారణకు రూ.16 కోట్లు ఖరీదైన ఇంజెక్షన్ చేయాల్సి ఉంటుంది. సీఎం వైఎస్ జగన్ చొరవతో అత్యంత ఖరీదైన ఇంజక్షన్, ఇతర వైద్య సాయం అందించడానికి ఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ముందుకు వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శనివారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పర్యటనకు వచ్చి తిరిగి వెళుతున్న సమయంలో హెలీపాడ్ వద్దకు ఆ చిన్నారి తల్లి వచ్చింది. ఆమెను చూసిన వెంటనే సీఎం జగన్ 9 నెలల క్రితం ఇదే జిల్లాలో కలిసి కుమార్తె వ్యాధి గురించి ఆమె పడ్డ ఆవేదనను గుర్తుకు తెచ్చుకున్నారు. అక్కడే ఉన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ మాధవీలత ఆ బాలికకు ఢిల్లీ ఎయిమ్స్‌లో ప్రత్యేక వైద్య బృందం ద్వారా జరుగుతున్న వైద్యాన్ని సీఎంకి వివరించారు. 8 నెలలుగా డయానా శాంతికి రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులతో అందిస్తున్న ప్రాథమిక వైద్యాన్ని వివరించారు. జెనెటిక్స్ పరీక్ష కోసం చిన్నారి రక్త నమూనాలను 6 సార్లు ఢిల్లీ ఎయిమ్స్, సింగపూర్, అమెరికాలో నినోవాటిస్ కంపెనీకి పంపిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షలన్నింటిలోను పాపకు సానుకూల ఫలితాలు వచ్చాయన్నారు. మూడు వారాల్లో పాపకు ఎయిమ్స్‌లో దాదాపు రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ ఇవ్వనున్నారు. సీఎం ఆదేశాల మేరకు అధికారులు ముఖ్యమంత్రి తక్షణ ఆర్థిక సహాయంగా చిన్నారి తల్లికి రూ.లక్ష అప్పట్లోనే అందించారు. ప్రతి నెలా రూ.5 వేల వైఎస్సార్ నవశకం ఆరోగ్య పింఛను ఇస్తున్నారు. చిన్నారి తల్లి సూర్యకుమారికి నిడదవోలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఉద్యోగం కూడా ఇచ్చారు. తన కుమార్తెకు అత్యంత ఖరీదైన వైద్యం ఇప్పించడంతోపాటు కుటుంబాన్ని ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను చిన్నారి తల్లి సూర్యకుమారి శనివారం స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సూత్రధారి, పాత్రధారి చంద్రబాబే

• ప్రజాధనం దోచేసిన వాళ్లను జైల్లో కాక మరెక్కడ పెట్టాలి?
• బాబు అవినీతిపై నిప్పులు చెరిగిన సీఎం జగన్


సీఎం జగన్ వస్తున్న వాహనంపై పూలవర్షం కురిపిస్తున్న జనం

నిడదవోలు నుంచి సాక్షి ప్రతినిధి: 'స్కిల్ స్కామ్ సూత్రధారి, పాత్రధారి చంద్రబాబే. ఫేక్ అగ్రిమెంట్‌తో ప్రభుత్వ ఖజానా దోచేశారు. సీమెన్స్ కంపెనీ మాకు సంబంధం లేదని చెప్పింది. ఎన్ని దొంగతనాలు చేసినా, ఎంత దోపిడీ చేసినా, ఎన్ని వెన్నుపోట్లు పొడిచినా చంద్రబాబునాయుడు అనే వ్యక్తిని రక్షించుకునేందుకు పలుకుబడి కలిగిన దొంగల ముఠా సభ్యులు ఉన్నారు. చంద్రబాబును వెనకేసుకు వచ్చిన వారంతా గజదొంగలే. రూ.371 కోట్ల ప్రజా ధనం దోచేసిన వాళ్లను జైల్లో కాకుండా మరెక్కడ పెట్టాలి? పవన్, ఎల్లో మీడియా.. బాబును వెనకేసుకు రావడానికి కారణం వాళ్లు కూడా దొంగల ముఠాలో వాటాదారులు కావడమే' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో కాపు నేస్తం నిధుల విడుదల సందర్భంగా జరిగిన సభలో చంద్రబాబు అవినీతిని ఆయన తూర్పారబట్టారు. 'ప్రజలను వంచించి 45 ఏళ్లుగా దోపిడీనే రాజకీయంగా మార్చుకుని ఇటీవలే అవినీతి కేసులో సాక్ష్యాధారాలతో అరెస్టు అయిన ఒక మహానుభావుడి గురించి నాలుగు మాటలు చెబుతాను. చట్టం ఎవరికైనా ఒక్కటే. దురదృష్టమేమిటంటే ఎన్ని దొంగతనాలు చేసినా, ఎంత దోపిడీ చేసినా, ఎన్ని వెన్నుపోట్లు పొడిచినా చంద్రబాబునాయుడు అనే వ్యక్తిని రక్షించుకునేందుకు పలుకుబడి కలిగిన దొంగల ముఠా సభ్యులు రంగంలోకి దిగారు. ఒక మామూలు వ్యక్తి ఇదే తప్పు చేస్తే ఏ రకమైన శిక్ష పడుతుందో.. తప్పు చేస్తే అధికారంలో ఉన్న వాళ్లకు కూడా అదే శిక్ష పడాలని, చట్టం ఎవరికైనా ఒకటే అని చెప్పే వారే ఇంతకాలం లేరు. ఇప్పుడు చట్టం ఎవరికైనా ఒక్కటే అని చెప్పే గొంతుకలు గళం విప్పుతున్నాయి. ఇలా గళం విప్పడాన్ని ఈ దొంగల ముఠా సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు, తట్టుకోలేకపోతున్నారు' అని అన్నారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఇవాళ రూ.371 కోట్లు ప్రజలకు చెందాల్సిన ప్రభుత్వ ధనం ఎక్కడికి పోయింది? చంద్రబాబు నడిపిన కథలో చంద్రబాబును కాక మరెవరిని అరెస్టు చేయాలి? ఈ విషయంలో ఈ దొంగల ముఠా సభ్యులు నోరెత్తరు. ఎల్లో మీడియాకు ఇది కనిపించదు. కారణం దొంగ వాళ్ల వాడే కాబట్టి. వాటాలు పంచుతాడు కాబట్టి నోరు విప్పరు. పైగా నిస్సిగ్గుగా పేపర్లో ఎడిటోరియల్స్ రాస్తారు. మా బాబు లంచాలు తీసుకుంటే తప్పేంటని ఒకరు చెత్త పలుకులు రాస్తే.. మరొకరు బాబు అవినీతిని దాచడానికి అష్టకష్టాలు పడుతున్నారు. నేరుగా జైలుకు వెళ్లి ములాఖత్‌లో మిలాఖత్ చేసుకుని పొత్తు పెట్టుకునేవారు ఇంకొకరు. ఎలాంటి మనుషులున్నారో ఆలోచించండి.

– సీఎం వైఎస్ జగన్

ఓటుకు కోట్లు గుర్తుండే ఉంటుంది..

- తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల కోసం కోట్లు ఇస్తూ చంద్రబాబు దొంగగా అడ్డంగా, నిలువుగా దొరికిన విషయం మీ అందరికీ గుర్తుండే ఉంటుంది. నల్లధనం ఇస్తూ ఆడియో, వీడియో టేపులతో అడ్డంగా దొరికారు. చివరికి ఆ ఆడియో టేపుల్లో ఉన్న వాయిస్ చంద్రబాబుదే అని ఫోరెన్సిక్ వాళ్లు సర్టిఫికెట్ ఇచ్చారు.
- అది దోపిడీ సొమ్ము అని ప్రజలందరికీ అర్థం అయింది. అయినా కూడా బాబు చేసింది అసలు నేరమే కాదని వాదించడానికి.. 10 కోట్ల మంది ప్రజల కళ్లకు గంతలు కట్టడానికి ఆ దొంగతనాల్లో వాటాదారులు పది మంది వెంటనే సిద్ధం అయ్యారు. అరడజను ఎల్లో చానెళ్లు, రెండు ఎల్లో పత్రికలు రెడీగా నిలబడ్డాయి.
- కానీ నిజం నిర్భయంగా చెప్పడానికి ఈ పెద్ద మనుషులుగా చలామణి అవుతున్న వారిలో ఏ ఒక్కరూ సిద్ధంగా లేరు. ఎందుకంటే బాబు దొంగతనాల్లో వీళ్లు కూడా వాటాదారులు కాబట్టి. ఇంత అడ్డగోలుగా నల్లధనం ఇస్తూ ఆడియో, వీడియో టేపుల సాక్షిగా దొరికినా, ఆ వాయిస్ చంద్రబాబుదేనని ఫోరెన్సిక్ వాళ్లు నిర్ధారించినా వారు నీతి, న్యాయం, ధర్మం వైపు నిలబడలేదు.

ఆధారాలు చూపిస్తున్నా బుకాయింపే

- లేని కంపెనీని ఉన్నట్టుగా ఒక ఫేక్ అగ్రిమెంటు సృష్టించి, ప్రభుత్వ నిబంధనలు అన్నింటినీ సాక్షాత్తూ చంద్రబాబే పక్కన పెట్టించారు. చివరకు ఆ సీమెన్స్ కంపెనీయే మాకు రూ.371 కోట్లు డబ్బు ముట్టలేదని, ఆ అగ్రిమెంట్‌తో మాకు ఎలాంటి సంబంధం లేదని లిఖిత పూర్వకంగా చెప్పింది.
- సాక్ష్యాత్తు కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థ ఈడీ రూ.371 కోట్ల స్కిల్ స్కాంలో ఆ ఫేక్ అగ్రిమెంట్ చేసిన దొంగలను ఇప్పటికే అరెస్టు చేసింది. ఈ స్కిల్ స్కామ్ సూత్రధారి, పాత్రధారి చంద్రబాబే అని చెప్పేందుకు సాక్ష్యాలు, ఆధారాలు, నోట్ ఫైల్స్ ఉన్నప్పటికీ.. బాబు స్వయంగా ఈ ఫేక్ అగ్రిమెంట్ నిబంధనలన్నింటికీ విరుద్ధంగా అధికారులంతా డబ్బులు ఇవ్వొద్దని సలహా ఇచ్చినా.. వాటిని కూడా పక్కన పెట్టారు.
- ఏకంగా 13 సందర్భాల్లో ఒత్తిడి తెచ్చిమరీ సంతకాలు పెట్టారు. సీఐడీ వారు ఇవన్నీ స్వయంగా చూపిస్తున్నా, ఆ డబ్బును డొల్ల సూట్ కేసు కంపెనీలకు ఎలా మళ్లించారో వివరిస్తున్నా ఈ దొంగల ముఠా ఒప్పుకోవడం లేదు.
- దీంతో సంబంధం ఉన్న వ్యక్తులతో సెల్‌ఫోన్లలో చాట్‌లు, ఈ మెయిల్స్‌తో చంద్రబాబు పీఏ అడ్డంగా దొరికిపోయారు. ఐటీ విచారణలో, ఐటీఏఆర్‌లో బాబు పీఏ ఇచ్చిన స్టేట్‌మెంట్ విషయాలను ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ వాళ్లు చూపించి బాబుకు నోటీసులిస్తున్నారు. చివరకు కోర్టుల్లో సుమారు 10 గంటలపాటు ఇరువైపులా వాదనలు జరిగాయి. ఆ వాదనలు విని సాక్ష్యాలు, ఆధారాలు చూసిన తర్వాతే కోర్టు చంద్రబాబును రిమాండ్‌కు పంపించింది.
- ఇంత బాహాటంగా దొరికినా కూడా ప్రశ్నిస్తా.. ప్రశ్నిస్తా.. అన్నవాడు ప్రశ్నించడు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5.. ఈ ఎల్లో మీడియా పత్రికలు, టీవీ చానెళ్లు నిజాన్ని చూపవు. వినిపించవు. నోరెత్తవు. పైగా నిస్సిగ్గుగా ఆ పని సబబే అని సపోర్టు చేస్తారు. మనం ఎలాంటి ప్రపంచంలో బతుకుతున్నామన్నది ఆలోచించండి.

మీరే నా బలం

మీ బిడ్డ దేవుడి దయను, మిమ్మల్ని తప్ప ఇతరులెవరినీ నమ్ముకోలేదు. జరగబోయేది కురుక్షేత్ర యుద్ధం. ఈ యుద్ధంలో న్యాయం, ధర్మం మీ బిడ్డ పక్షాన ఉంది. అన్యాయం, మోసం, వెన్నుపోట్లు అటువైపు ఉన్నాయి. మిమ్మల్ని కోరేది ఒక్కటే. మీ బిడ్డ ప్రభుత్వంలో మీ ఇంట్లో మీకు మంచి జరిగిందా? లేదా? అన్నది మాత్రమే కొలమానంగా తీసుకోండి. మంచి జరిగి ఉంటేనే మీ బిడ్డకు మీరే సైనికులు కావాలని కోరుతున్నాను. పేదల గుండె చప్పుడుగా, సామాజిక న్యాయానికి చిరునామాగా మీ బిడ్డ ప్రభుత్వం పని చేసింది. రాబోయే రోజుల్లో కూడా ఇంకా మెరుగైన పాలన సాగించేలా మీరంతా ఆశీర్వదించాలని మనసారా కోరుకుంటున్నాను.

క్లుప్తంగా...

'కొలికపూడి'పై చర్యలు తీసుకోండి

- డీజీపీకి హైకోర్టు న్యాయవాదుల సంఘం విజ్ఞప్తి
- ఏఏజీ సుధాకర్‌రెడ్డిపై కొలికిపూడి వ్యాఖ్యలకు ఖండన

సాక్షి అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో సీఐడీ తరఫున వాదనలు వినిపిస్తున్న అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని దూషించిన అమరావతి జేఏసీ నేత కొలికపూడి శ్రీనివాసరావుపై ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. సుధాకర్‌రెడ్డిపై శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలను ఖండించింది. కొలికపూడి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరింది. ఏఏజీ సుధాకర్‌రెడ్డిపై ఆయన చేసిన వ్యాఖ్యలు మొత్తం న్యాయ సమాజాన్నే కించపరిచేలా ఉన్నాయని తెలిపింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు ఇటీవల కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించిన నేపథ్యంలో ఎల్లో మీడియాకు చెందిన ఓ చానల్ చర్చా కార్యక్రమం నిర్వహించింది. ఈ చర్చలో కొలికపూడి మాట్లాడుతూ చంద్రబాబుకు వ్యతిరేకంగా సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారన్న కారణంతో ఆయనను తీవ్రపదజాలంతో దూషించారు. దీంతో హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యవర్గం అత్యవసరంగా సమావేశమై శ్రీనివాసరావు చేసిన అనుచిత, అభ్యంతరకర వ్యాఖ్యలను ఖండించింది.

ఆర్థిక నేరస్తుడు చంద్రబాబు కోసం అల్లాహ్‌ను ప్రార్థిస్తారా!

- ఖాదర్ బాషా

సాక్షి, అమరావతి: ఆర్థిక నేరాలకు పాల్పడిన చంద్రబాబును జైలు నుంచి తప్పించాలని కొందరు అల్లాహ్‌ను ప్రార్థించడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు వి.ఖాదర్‌బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేసిన తప్పులకు చంద్రబాబు చట్టప్రకారం జైలుకు వెళ్లాడని, ఆయన అవినీతి, అక్రమాలపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. ఇస్లాం సంప్రదాయంలో రిష్వత్ ఖోర్(లంచావతారు)లకు, నాజాయిజ్(అక్రమ సంపదను కూడబెట్టేవారు)లకు చోటు ఉండదని, వారిని ప్రోత్సహించకూడదని వివరించారు.

'సిద్ధార్థ లూథ్రాపై చర్యలు తీసుకోండి'




ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న బహుజన నేతలు

తాడికొండ: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రాపై గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో శనివారం బహుజన పరిరక్షణ సమితి నాయకులు ఫిర్యాదు చేశారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో వాదించేందుకు వచ్చిన సిద్ధార్థ లూథ్రా గురు గోవింద్ నాయక్ చెప్పిన వ్యాఖ్యలను ట్వీట్ చేయడం ద్వారా రాష్ట్రంలో అల్లర్లకు ఆజ్యం పోశారని వారు పేర్కొన్నారు. సిద్ధార్థ లూథ్రాపై ఫిర్యాదు చేసిన వారిలో సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎస్‌డీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం, హైకోర్టు లాయర్ పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి ఉన్నారు.

ఆధారాలు లేకుండా అరెస్టు చేశారు

- కొవ్వొత్తుల ర్యాలీలో బ్రాహ్మణి
- బాబు రిమాండ్ ఆరు రోజులు పూర్తి



ర్యాలీలో పాల్గొన్న భువనేశ్వరి, బ్రాహ్మణి

సాక్షి, రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ ఆయన సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని తిలక్ రోడ్డు సాయిబాబా ఆలయం నుంచి శ్యామలా జంక్షన్ రామాలయం వరకు ర్యాలీ సాగింది. బ్రాహ్మణి మాట్లాడుతూ అభివృద్ధి చేయడం, ఉద్యోగాలు ఇవ్వడం నేరమా? అని ప్రశ్నించారు. చంద్రబాబును ఆధారాలు లేకుండా అరెస్టు చేయడం దారుణమన్నారు. కాగా, బాబు జ్యుడీషియల్ రిమాండ్ శనివారంతో ఆరో రోజుకు చేరింది. సెంట్రల్ జైల్లో బాబుకు ప్రభుత్వం పటిష్ట భద్రత కల్పించింది. ప్రత్యేక వైద్య బృందాన్ని నియమించి వైద్య సేవలు అందిస్తోంది.

పోలీసు నా.. అధికారపార్టీకి తొత్తులు

- నోరు పారేసుకున్న అయ్యన్న

నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా): టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు పోలీసులపై నోరు పారేసుకున్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు శనివారం నర్సీపట్నంలో నిరసన దీక్ష చేపట్టారు. దీక్షలో అయ్యన్నపాత్రుడు ప్రభుత్వంపై పలు విమర్శలు చేస్తూనే పోలీసులపైనా రెచ్చిపోయారు. పోలీసు నా... అధికార పార్టీకి తొత్తులుగా మారారని, విజయవాడలో పోలీసు నా... ఆడవాళ్లని కాళ్లతో తన్నారని అన్నారు. ఇప్పటికే తనపై 15 కేసులు పెట్టి ఏం పీకారని విరుచుకుపడ్డారు.

ఫేక్ ప్రచారంలో టీడీపీ 'స్కిల్'

- చంద్రబాబు సత్య హరిశ్చంద్రుడంటూ పెయిడ్ ప్రమోషన్
- సోషల్ మీడియాలో బాబు అనుకూల బ్యాచ్ బుకాయింపు
- ప్రజలకు ఫోన్లు, ఐటీ ఉద్యోగుల పేరుతో ఆందోళనలు
- ఇందులో బయటి వారే అధికంగా ఉన్నట్లు కథనాలు
- స్విగ్గీ కూపన్లు ఇచ్చి తరలించినట్లు విస్తృతంగా వార్తలు



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబుకు మద్దతుగా తెలుగుదేశం పార్టీ పెద్దఎత్తున అబద్ధపు ప్రచారానికి తెరలేపింది. ఆయన అవినీతి స్పష్టంగా కనబడుతుండడంతో ప్రజల్లో ఏమాత్రం మద్దతు లభించడంలేదు. దీంతో ఎల్లో మీడియా, ఆ పార్టీకి అనుబంధంగా ఉన్న సోషల్ మీడియాతోపాటు టీడీపీ శ్రేణులు, రంగంలోకి దిగి చంద్రబాబు సత్యహరిశ్చంద్రుడంటూ ప్రజలను ఏమార్చేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. ఒకవైపు చంద్రబాబు చేసిన అవినీతిపై సీఐడీ స్పష్టమైన ఆధారాలు చూపిస్తున్నా వాటిని పట్టించుకోకుండా.. ఆధారాల్లేవని, చంద్రబాబును అన్యాయంగా జైల్లో పెట్టారని, దార్శనికుడికి ఇలాంటి పరిస్థితి కల్పించారంటూ సానుభూతి వచ్చేలా బుకాయిస్తూ రకరకాల ప్రచారాలు చేస్తున్నారు. ఆ పార్టీకి మొదటి నుంచి అలవాటైన పెయిడ్ ప్రమోషన్‌కు తెరలేపారు. ఇందులో భాగంగా రెండ్రోజులుగా ప్రజలకు అదేపనిగా ఐవీఆర్ఎస్ ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. 'మచ్చలేని రాజకీయాలకు మారుపేరైన చంద్రబాబునాయుడు వంటి నిజాయితీ గల నాయకుడిని చేయని తప్పుకు జైల్లో పెట్టారు. ఆయనకు అందరూ అండగా నిలవాలి'.. అంటూ 50 సెకన్ల ఫోన్‌కాల్ రాష్ట్రంలోని అన్ని మొబైల్ యూజర్లకు వెళ్లేలా భారీ పెయిడ్ ప్రమోషన్ చేపట్టారు.

ఐటీ ప్రొఫెషనల్స్ పేరుతో హడావుడి

ఎల్లో మీడియా అయితే అడ్డూఅదుపు లేకుండా చంద్రబాబును సమర్థించే పనిలో మునిగిపోయింది. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు గురించి రకరకాల వ్యక్తులతో మాట్లాడిస్తూ అది నిజంగా అమలు జరిగినట్లు భ్రమ కల్పించే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తోంది. ఈ విషయంలో రాష్ట్రంలోని జనం నుంచి స్పందన లేకపోవడంతో ఐటీ ఉద్యోగులను ఉపయోగించుకుంటున్నారు. టీడీపీ ఐటీ, ఎన్ఆర్ఐ విభాగాలు ప్లాన్‌చేసి హైదరాబాద్‌లో కొందరు ఐటీ ఉద్యోగులను సమీకరించి ఆందోళనలు చేయించారు. కానీ, ఇందులో ఐటీ ఉద్యోగుల కంటే బయటి వ్యక్తులే భారీగా ఉన్నట్లు తేలింది. వారిలో చాలామందికి స్విగ్గీ కూపన్లు ఇచ్చి తీసుకొచ్చినట్లు విస్తృత ప్రచారం జరుగుతోంది. బెంగళూరులోనూ ఇదే తరహాలో కొందరు ఐటీ ఉద్యోగులతో ఆందోళన చేయించారు. నిజానికి.. చంద్రబాబు అరెస్టయితే టీడీపీ శ్రేణులు, నాయకులే పెద్దగా బయటకు రాలేదు. దయచేసి బయటకు రావాలని అచ్చెన్నాయుడు, యనమల వంటి నేతలు పార్టీ శ్రేణుల్ని టెలికాన్ఫరెన్స్‌లో బతిమాలుకున్నా ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో మెట్రో నగరాల్లోని ఐటీ ఉద్యోగులతో టీడీపీ ముఖ్య నేతలు ఆందోళనలు చేయిస్తున్నట్లు తేలింది. దీనికి వారు తెరవెనుక వ్యూహ రచనచేసి అన్ని ఏర్పాట్లుచేస్తున్నారు.

పథకం ప్రకారం ఫేక్ ప్రచారం..

ఇక టీడీపీ ప్రొఫెషనల్స్ విభాగానికి చెందిన తేజశ్విని అనే యువతి చంద్రబాబుకు మద్దతుగా విడుదల చేసిన ఒక వీడియోను వైరల్ చేశారు. అమరావతి ఉద్యమంలో ఆమె చురుగ్గా పాల్గొంది. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు పలు కార్యక్రమాల్లోనూ పాలుపంచుకుంది. టీడీపీకి సంబంధించి ముఖ్యమైన ప్రతి కార్యక్రమంలో ఆమె పాల్గొంటుంది. ఇప్పుడు చంద్రబాబుకు మద్దతుగా ఆమెను ఐటీ ప్రొఫెషనల్‌గా రంగంలోకి దింపి వీడియోలు చేయించి వైరల్ చేస్తున్నారు. ఇలాంటి మరికొందరిని టీడీపీ ఒక వ్యూహం ప్రకారం పని చేయిస్తూ చంద్రబాబు నిజాయితీపరుడని కలర్ ఇచ్చేందుకు యత్నిస్తున్నారు. 'స్కిల్ డెవలప్‌మెంట్'ను సమర్థించుకుంటూ శుక్రవారం ఆ పార్టీ ఏకంగా ఒక వెబ్‌సైట్‌ను రూపొందించడం విశేషం. వీటన్నింటినీ చూపిస్తూ 'వీ స్టాండ్ విత్ చంద్రబాబు'.. పేరుతో సోషల్ మీడియాను హోరెత్తిస్తున్నారు. కానీ, సాధారణ ప్రజానీకంలో మాత్రం చంద్రబాబు అరెస్టు వ్యవహారంపై పెద్దగా స్పందన కనిపించడంలేదు. వారి నుంచి ఎలాగైనా సానుభూతి పొందడానికి ఆ పార్టీ అన్ని రకాలుగా అబద్ధపు ప్రచారాలకు దిగింది.

సీఎంతో చర్చేందుకు.. దర్యాప్తు సంస్థలు పిలుస్తున్నాయి వెళ్లు..

- లోకేశ్‌పై మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపాటు
- విచారణకు రమ్మని ఈడీ, ఐటీ, సీఐడీ లోకేశ్‌ను పిలుస్తున్నాయి
- ఆయన ముందుగా అక్కడికి వెళ్లాలి
- సీఎంని చర్చకి పిలిచే స్థాయి లోకేశ్‌కు లేదు
- బాబు తప్పు చేయలేదని లోకేశ్ ఎందుకు చెప్పడం లేదు?
- కాపు ఉద్యమాలకు ఏనాడూ సహకరించని పవన్‌ని ఎవరూ నమ్మరు



మహారాణిపేట (విశాఖ దక్షిణ): తప్పు చేసి జైలులో చిప్పకూడు తింటున్న చంద్రబాబు చేసిన అవినీతి మీద చర్చకు రమ్మని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని లోకేశ్ పిలవడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆయన శనివారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఈడీ, ఐటీ, సీఐడీ అధికారులు విచారణకు రమ్మని లోకేశ్‌ను పిలుస్తున్నారని, ముందు అక్కడికి వెళ్లమని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌ని చర్చకు పిలిచిన లోకేశ్ ఆయన స్థాయి, బతుకేమిటో ముందుగా తెలుసుకోవాలని ధ్వజమెత్తారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో లోకేశ్ పాత్రను బయట పెట్టడానికే దర్యాప్తు సంస్థలు ఆయన్ని పిలుస్తున్నాయన్నారు. లోకేశ్ స్థాయికి చర్చకు తాను వస్తానని, సిద్ధంగా ఉండాలని సవాల్ చేశారు. ఐటీ కేసులో నోటీసులు ఇచ్చినప్పుడు తప్పించుకుని లా పాయింట్లు మాట్లాడుతున్నారని అన్నారు. అతని తండ్రి తప్పు చెయ్యలేదని ఎందుకు చెప్పలేకపోతున్నాడని ప్రశ్నించారు. ఈ స్కామ్‌లో ఉన్న 13 సంతకాలు చంద్రబాబువి కావని చెప్పగలవా అని ప్రశ్నించారు. చంద్రబాబు, ఆయన తోడు దొంగలు చెబుతున్న కథలను సీమెన్స్ యాజమాన్యం కొట్టిపారేసిందని, ఎక్కడా గ్రాంట్ ఇచ్చే ప్రాజెక్టులు లేవని ఈడీకి నేరుగా చెప్పిందని మంత్రి అన్నారు.

రంగాని హత్యచేసి, ముద్రగడను చిత్రహింసలు పెట్టిన చంద్రబాబుకు వంతా!

కాపు నేత వంగవీటి రంగాని హత్య చేసి, ముద్రగడ పద్మనాభాన్ని చిత్ర హింసలు పెట్టిన చంద్రబాబుకు పవన్ వంత పాడటం తగదన్నారు. కాపు ఉద్యమానికి పవన్ ఏనాడైనా మద్దతిచ్చారా అని ప్రశ్నించారు. పవన్ మాటలను కాపులు విశ్వసించరన్నారు. ఒక దొంగను కాపాడడానికి తోడు దొంగలు వచ్చారని అన్నారు. జనసేన పార్టీని టీడీపీలో విలీనం చేస్తే వచ్చే ఎన్నికల్లో రెండు జెండాలకు బదులు టీడీపీ జెండా పట్టుకొని తిరిగితే సరిపోతుందన్నారు. కాపులకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన గుర్తింపు మరెవరూ ఇవ్వలేదన్నారు. 30 మంది ఎమ్మెల్యేలు, అయిదుగురికి మంత్రి పదవులు, ఎంతోమంది జెడ్పీటీసీ, ఎంపీటీసీలతోపాటు నామినేటెడ్ పదవులూ ఇచ్చారన్నారు.

రామోజీ.. నీకు మానవత్వం లేదా!

నిప్పులు చెరిగిన ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి

- జైలు సూపరింటెండెంట్ రాహుల్‌పై తప్పుడు కథనాలా..
- ఆడ కూతురు ఆస్పత్రిలో చనిపోతే ఆమె భర్త వెళ్లాడు
- నీవు చనిపోతే నీ కొడుకు రాకుండా ప్రజాసేవ చేస్తాడా?
- నీవెంతటి బ్రోకరువో నాకు, చిరంజీవి, అరవింద్‌లకు తెలుసు
- రామోజీరావు.. ఇప్పటికే అక్షరాలను వేశ్యలుగా మార్చావు
- ఏదో ఒక రోజు ఆ అక్షరాల ఎయిడ్స్ తగిలి కుళ్లికుళ్లి చస్తావు
- భువనేశ్వరీ.. నీ భర్త చేసిన అక్రమాలన్నీ ప్రజలకోసమేనా?



సాక్షి, అమరావతి: రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్ సెలవు విషయంలో తన స్నేహితుడు చంద్రబాబు కోసం రామోజీరావు దిగజారి ఈనాడులో తప్పుడు రాతలు రాయించాడని ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన చెత్త పేపర్‌ను అడ్డుపెట్టుకుని తప్పుడు రాతలు రాసి, రాజకీయ వ్యభిచారం చేస్తున్నాడని మండిపడ్డారు. జైలుకు కొత్త అధికారిగా వచ్చిన వారిపైనా ఈనాడు పత్రిక బురద జల్లే ప్రయత్నం చేసిందని, రామోజీ దిగజారిపోయినంత మాత్రాన అధికారులు దిగజారిపోరని చెప్పారు. అధికారం కోసం అవినీతి, వెన్నుపోట్లు, మేనేజ్‌మెంట్లు చేసి చంద్రబాబు ఇన్నాళ్లు నెట్టుకొచ్చాడని, అలాంటి దుర్మార్గుడిని అక్షరాలతో వ్యభిచారం చేసే రామోజీ తన భుజాన మోస్తున్నాడని ధ్వజమెత్తారు. రామోజీ కథనంపై శనివారం పోసాని హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ నిప్పులు చెరిగారు. ఆయన ఏమన్నారంటే..

బుద్ధిలేనోడా.. రామోజీ

'జైలు సూపరింటెండెంట్ రాహుల్ భార్య కొన్నాళ్లుగా ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రిలో ఉంది. ఉన్నతాధికారుల అనుమతితో సెలవులో రాహుల్ ఆస్పత్రికి వెళ్లారు. కానీ ఈనాడు పత్రిక దిగజారిపోయి తప్పుడు రాతలు రాసింది. ఒరే బుద్ధిలేనోడా రామోజీరావు.! నీ చిన్న కొడుకు ఎలాగైతే చనిపోయాడో రాహుల్ భార్య కూడా అలాగే చనిపోయింది. నీకో చెత్త పేపర్ ఉందని ఇంత రాజకీయ వ్యభిచారం చేస్తావా? ఇప్పటికే నీ పత్రికలో అక్షరాలను వేశ్యలుగా మార్చావు. ఏదో రోజు ఆ అక్షరాల ఎయిడ్స్ తగిలి కుళ్లికుళ్లి చస్తావు. ఓ ఆడ కూతురు చనిపోయి రాహుల్ కుటుంబం ఏడుస్తుంటే.. కావాలనే ప్రభుత్వ పెద్దలు ఆయన్ను సెలవులో పంపించారని తప్పుడు రాతలు రాస్తావా.? ఇది నిజమని నిరూపించు. నీకు మానవత్వం అనేది లేదా? రేపు రామోజీ చనిపోతే ఆయన కొడుకు కిరణ్ తన తండ్రి శవాన్ని చూడ్డానికి వెళ్లకుండా ఈనాడు కార్యాలయంలో పనిచేసుకుంటూ ఉంటాడా.. నాకు నా తండ్రి కంటే పత్రికే ముఖ్యమంటాడా? నీ కొడుకే చచ్చాడనుకో ఆయన భార్య నేను రాను అని మార్గదర్శిలోనే ఉంటుందా.. వెళ్లి నీ కొడుకును చూసి కన్నీళ్లు పెట్టుకోదా? నీకు మాత్రమే కన్నీళ్లు ఉంటాయా? రాహుల్‌కు కన్నీళ్లు ఉండవా? రాహుల్‌తో సెలవు పెట్టించి రవికిరణ్‌ను తీసుకొచ్చారని, ఆయన ఆర్థికమంత్రి బుగ్గనకు దగ్గరి బంధువంటూ తప్పుడు రాతలు రాస్తావా? అధికారులంటే నీలా, ఏబీఎన్ రాధాకృష్ణ, టీవీ5లా జగన్ నాశనం కావాలని కోరుకునేవారే ఉంటారనుకున్నావా. మా కమ్మోడు.. మా చంద్రబాబే ముఖ్యమంత్రి కావాలి. ఆయన ఎన్ని వెధవ పనులు చేసినా, ఆడవారి జీవితాలను నాశనం చేసినా.. ఆయనే సీఎం కావాలి అంటున్నావా?. మీరు ఎన్ని తిట్టినా ప్రజలు మాత్రం జగన్నే నమ్మారు, అందుకే 151 సీట్లు ఇచ్చారు. మళ్లీ మీ కుళ్లు రాతలు రాయండి, యజ్ఞాలు, చేతబడులు చేయండి. ప్రజలు మాత్రం జగన్‌ను గుండెల్లో పెట్టుకున్నారు. మీరు ఎంత ఏడ్చినా ఆయనకేం కాదు.

భువనేశ్వరీ.. నీ భర్త ప్రజల కోసం ఆలోచిస్తాడా!

తప్పు చేసిన వారు ఎవరైనా జైలుకెళితే వారి భార్య చివాట్లు పెట్టి, ఇప్పటికైనా మనిషిగా మారమని భర్తకు చెబుతుంది. కానీ చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి మాత్రం ములాఖత్‌కు వెళ్లి వచ్చి విలేకరుల వద్ద మా ఆయన జైలు కట్టారు... ఆ జైల్లోనే ఆయన్ను పెట్టారు... నా భర్త ప్రజల కోసమే ఆలోచిస్తారు... ఆయన జీవితమంతా ప్రజలకోసమే ధారపోశారు.. అని చెబుతున్నారు. చంద్రబాబు నాయుడు ప్రజల కోసమే ఆలోచించేవాడైతే.. మొదట కాంగ్రెస్‌ను తన్ని బయటికి వచ్చింది... నీ తండ్రిని చెప్పులతో కొట్టించింది... నీ తండ్రిని బయటకు నెట్టి పార్టీని కబ్జా చేసింది... తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ఎమ్మెల్యేను కొనేందుకు ప్రయత్నించింది... వైఎస్సార్‌సీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను చంద్రబాబు నాయుడు కొనుగోలు చేసింది.. ఇవన్నీ ప్రజల కోసమేనా? నీ భర్త జైల్లో పడుకుని ఇప్పుడూ ప్రజలకోసమే ఆలోచిస్తున్నాడు అని చెబుతుంటే నవ్వొస్తోంది.

రమేశ్ గారు.. వారి వద్ద కూర్చుని నీతులా!

ప్రభుత్వం అడ్డదారులు తొక్కితే ప్రజలే బుద్ధి చెబుతారని ఐఏఎస్ ఆఫీసర్ పీవీ రమేశ్ అన్నారు. ఎప్పుడూ జగన్, ఆయన ప్రభుత్వం నాశనం కావాలని కోరుకునే వారి దగ్గర కూర్చుని ఈ మాటలు మాట్లాతుంటే నవ్వొస్తుంది. ప్రభుత్వం అడ్డదారులు తొక్కడం కాదు.. ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ అడ్డమైన రాతలు రాస్తే ప్రజలు బుద్ధి చెబుతారు. వారి దగ్గర కూర్చుని మీరు చెబుతున్నప్పుడే మీ నిజాయతీ ఏంటో తెలిసింది. రామోజీ ఓ బ్రోకర్.. దీనికి నా వద్ద సాక్ష్యం ఉంది. కోర్టుకు వెళ్లినా నేను రెడీ.. అతను బ్రోకరో కాదో చిరంజీవికి, అల్లు అరవింద్‌కు, నాకు కూడా తెలుసు. రామోజీకి, రాధాకృష్ణకు, పీవీ రమేశ్‌కు ఆ నిజాలు తెలుసు. ఇద్దరిని తుపాకీతో కాలిస్తే ఎవరైనా జైలుకు వెళ్లకుండా ఉంటారా.. మరి బాలకృష్ణ ఎలా బయట ఉన్నాడు. ఆ విషయం నీకు తెలుసుకదా? ఆ విషయం మాట్లాడవేం పీవీ రమేశ్. ఎక్కడ మేనేజ్‌మెంట్ జరిగిందో తెలియదా! ప్రజలకు నేను చెప్పేదొక్కటే.. చంద్రబాబును నమ్మకండి, మీ వద్దకు ఏ హీరో వచ్చినా.. ఏ కులం పేరుతో వచ్చినా నమ్మొద్దు.

కుర్చీ కోసం బాలకృష్ణ, లోకేశ్ పాకులాట


మంత్రి ఆదిమూలపు సురేశ్



యర్రగొండపాలెం: ఆర్థిక నేరాల్లో పీకల వరకు కూరుకుపోయిన చంద్రబాబు జైల్లో కూర్చుంటే.. అతడికి బెయిల్ కోసం ప్రయత్నించకుండా టీడీపీ కుర్చీ కోసం బావమరిది బాలకృష్ణ, కుమారుడు లోకేశ్ పాకులాడుతున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ అన్నారు. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం నరజాముల తండాలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేశ్ మీడియాతో మాట్లాడుతూ జైల్లో ఉన్న బాబుతో ములాఖత్ అనిచెప్పి ఆయన దత్తపుత్రుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పొత్తు కుదుర్చుకున్నాడన్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను అడ్డం పెట్టుకుని టీడీపీ శ్రేణులు, ఆయన సుపుత్రుడు లోకేశ్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ చేస్తున్న యాగీ, విన్యాసాలు అంతా ఇంత కాదన్నారు. ఇది అదునుగా తీసుకుని వచ్చే ఎన్నికల్లో ప్రజా విశ్వాసం పొందేందుకు ప్రయత్నిస్తున్నారని.. కానీ.. ఆ విశ్వాసాన్ని చంద్రబాబు ఎప్పుడో కోల్పోయాడని అన్నారు. ఇప్పుడు పవన్‌కళ్యాణ్ కూడా అదే మార్గంలో పయనిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలతోపాటు జనసేన కార్యకర్తల విశ్వాసాన్ని కూడా పవన్‌కల్యాణ్ కోల్పోతారన్నారు. జనసేన కార్యకర్తలకు ఎన్నో ఆశలు కల్పించి ఇప్పుడు టీడీపీ పల్లకి మోద్దామని, ఆ పార్టీకి వత్తాసు పలుకుతున్నాడని అన్నారు.

ఎన్డీయేలో ఉన్నాం.. మోదీకే మద్దతు

- జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తాజా ప్రకటన
- ఆరు నెలల్లో జనసేన–టీడీపీ–బీజేపీ ప్రభుత్వం ఖాయం
- మేం గెలిచే ఎంపీ సీట్లతో ఎన్డీయేకు మద్దతు
- టీడీపీతో పొత్తు ప్రకటనపై ఢిల్లీకి వెళ్లి వివరిస్తా



సాక్షి, అమరావతి : 'మనం ఎన్డీయేలోనే ఉన్నాం.. బీజేపీతో పొత్తులో కొనసాగుతున్నాం.. ఈ విషయాన్నే పార్టీ నేతలందరూ బలంగా చెప్పండి' అని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తాజాగా ప్రకటించారు. జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశం పేరిట శనివారం ఆయన మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నేతలను ఉద్దేశించి మాట్లాడారు. ఆరు నెలల్లో రాష్ట్రంలో జనసేన–టీడీపీ–బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పారు. రాష్ట్రంలో తాము గెలిచే ఎంపీ సీట్ల ద్వారా ఎన్డీయేకే మద్దతు తెలుపుతామని స్పష్టం చేశారు. ప్రత్యేకించి ప్రధాని మోదీ పేరు ఉచ్చరిస్తూ మరొకరికి మద్దతివ్వమని వ్యాఖ్యానించారు. (ఈ ఒక్క వాక్యాన్ని ఇంగ్లిష్‌లో చెప్పారు) మూడేళ్ల కిత్రం బీజేపీతో జనసేన పొత్తు పెట్టుకున్న తర్వాత.. చాలా సమయం ఉన్నప్పటికీ, రకరకాల పరిస్థితుల వల్ల ఆ సమయాన్ని ఇరు పార్టీలు వినియోగించుకోలేకపోయాయన్నారు. ఆ సమయాన్ని వినియోగించుకుని ఉంటే జగన్‌ను నిలువరించేవాళ్లమని అన్నారు. ఎన్డీయే భాగస్వామిగా కొనసాగుతున్న తాను రాజమండ్రిలో పొత్తు ప్రకటన ఎందుకు చేయాల్సి వచ్చిందో ఢిల్లీకి వెళ్లి వివరిస్తానన్నారు.

రాహుల్‌ను తక్కువగా అంచనా వేయొద్దు

'కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు రాహుల్ గాంధీని అందరూ పప్పు అన్నారు. కానీ, ఆయనే కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేశాడు. ఎవరినీ తక్కువగా అంచనా వేయొద్దు' అని పవన్ అన్నారు. తానేమీ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపడం లేదని, అయితే కొత్త యూపీఏ కూటమిని తక్కువగా అంచనా వేయొద్దన్నదే తన ఉద్దేశమని చెప్పారు. టీడీపీతో పొత్తును చెడగొట్టేలా పార్టీ నేతలెవరూ వ్యాఖ్యానించవద్దని సూచించారు. టీడీపీ బలహీన పడటాన్ని ఆనందించకూడదని, టీడీపీ నేతలను ఎక్కడా కించపరిచేలా మాట్లాడకూడదని స్పష్టం చేశారు. అసెంబ్లీతో పాటు పార్లమెంటులో కూడా జనసేన అడుగు పెట్టాలన్నారు.

మేమూ అధికారుల తలలు నేలకేసి కొట్టగలం

'రాష్ట్రంలో పోలీసు అధికారులు జాగ్రత్త.. వైఎస్సార్‌సీపీ కొమ్ము కాస్తూ తలకాయలు ఎగరేయకండి... వాటిని ఎలా నేలకేసి కొట్టాలో అలా కొట్టగలం.. గుర్తుపెట్టుకోండి...' అని పవన్ కళ్యాణ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'అహంకారంతో తల ఎగరేస్తే, ఆ అహంకారం తీసేసి, వినమ్రతతో ఉండే తలలు పెట్టగలం... గుర్తు పెట్టుకోండి.. తమాషాగా ఉందా..' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము తలుచుకుంటే వీరభద్రులమవుతామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైనా పవన్ కళ్యాణ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'నువ్వు ఎంత.. నీ బతుకెంత.. నీ స్థాయి ఎంత..'అని నోరుపారేసుకున్నారు.

చంద్రబాబు అరెస్ట్‌ను పార్లమెంట్‌లో ప్రస్తావించండి

టీడీపీ ఎంపీలతో భేటీలో నారా లోకేశ్

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేసులో ఎటువంటి ఆధారాలు లేకుండానే టీడీపీ అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారని పార్లమెంట్‌లో బలంగా చెప్పాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తమ ఎంపీలకు సూచించారు. జాతీయ స్థాయిలో ముఖ్య నేతలందరికీ చంద్రబాబు అరెస్ట్ అంశాన్ని తెలియజేసి, వారి మద్దతు పొందాలని చెప్పారు. చంద్రబాబు అరెస్ట్ అంశాన్ని జాతీయ స్థాయిలో వివరిస్తామంటూ మూడు రోజుల కిందట ఢిల్లీకి వచ్చిన లోకేశ్ శనివారం మధ్యాహ్నం ఎంపీ కేశినేని నాని నివాసంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, కె.రామ్మూర్తినాయుడు, కేశినేని నాని, గల్లా జయదేవ్‌తోపాటు సీనియర్ నాయకుడు కంభంపాటి రామ్మోహనరావు హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా పార్లమెంట్ సమావేశాలను చంద్రబాబుకు మద్దతు కూడగట్టేందుకు ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. అవకాశాలను బట్టి పార్లమెంట్‌లో నిరసనలు సైతం తెలియజేయాలని లోకేశ్ చెప్పినట్లు సమాచారం. జాతీయ నాయకులను కలిసి చంద్రబాబు అరెస్ట్‌ను ఖండించాలని అభ్యర్థించాలని చెప్పినట్లు తెలిసింది. ముఖ్యంగా బీజేపీ పెద్దలను కలిసేందుకు ఉన్న అవకాశాల గురించి చర్చించినట్లు సమాచారం. చంద్రబాబుకు మద్దతు ప్రకటిస్తే దానికి మీడియాలో విస్తృత ప్రచారం కల్పించాలని కూడా నిర్ణయించినట్లు తెలిసింది. అదేవిధంగా పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే బిల్లులు, వాటిపై ఎలాంటి వైఖరి తీసుకోవాలనే అంశాలపై చర్చించారు. అంతకుముందు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో లోకేశ్ సమావేశమై చంద్రబాబును బెయిల్‌పై బయటకు తీసుకురావడం గురించి చర్చించారు.

మీ పీఏలు దేశం వదిలి ఎందుకెళ్లారు?

చంద్రబాబు, లోకేశ్‌లకు మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రశ్న



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు నిజాయితీపరుడైతే కోర్టులో తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. చంద్రబాబు, లోకేశ్‌ల పీఏల ఖాతాల్లోకి డబ్బులు ఎలా జమ అయ్యాయి, వారు ఎందుకు దేశం దాటి వెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా జీవితంలో ఉన్నవారు ప్రజల సొమ్ము తింటే ప్రభుత్వాలూ, కోర్టులూ ఊరుకోవన్నారు. శ్రీకాకుళంలో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజలను రెచ్చగొట్టే చర్యలు ప్రతిపక్షాలు మానుకోవాలన్నారు. గతంలో అవినీతి ఆరోపణల్లో ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, జయలలిత వంటి నేతలు దర్యాప్తు సంస్థలకు సహకరించారని, న్యాయస్థానం ముందు నిలబడ్డారని, వాటి తీర్పులను గౌరవించారని, వారికంటే చంద్రబాబు ఎక్కువేం కాదని చెప్పారు. ప్రజాస్వామ్యంలో వ్యవస్థలకు సహకరించడం, వాటిని గౌరవించడం రాజకీయ నాయకుల బాధ్యతన్నారు. సంక్షేమం చంద్రబాబు ఎందుకు ఇవ్వలేకపోయారంటే.. ఆయన షెల్ కంపెనీ ద్వారా ప్రభుత్వ ధనాన్ని అడ్డంగా దోచుకుతిన్నారు కాబట్టి అని ధర్మాన వివరించారు.

• తెలంగాణ

అబర్న్ వర్సిటీతో తెలంగాణ ఫారెస్ట్ కాలేజీ ఒప్పందం

ప్రతీ యేటా ఇద్దరు ఎఫ్‌సీఆర్ఐ విద్యార్థులకు పూర్తి ఫండింగ్‌తో మాస్టర్స్ డిగ్రీ

సాక్షి, హైదరాబాద్: అమెరికా అలబామాలోని అబర్న్ యూనివర్సిటీలో ఫారెస్ట్రీవిద్యను అభ్యసించే అవకాశం రాష్ట్ర విద్యార్థులకు దక్కనుంది. ఫారెస్ట్ కాలేజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఆర్ఐ)లోని ఇద్దరు బీఎస్సీ ఫారెస్ట్రీ విద్యార్థులు ప్రతీఏటా ఎమ్మెస్సీ ఫారెస్ట్రీ చదివేందుకు పూర్తి ఫండింగ్ చేస్తామని అబర్న్ యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు అమెరికా యూనివర్సిటీ ప్రాంగణంలో ఒప్పందం కుదిరింది. అబర్న్ యూనివర్సిటీ ఫారెస్ట్రీ కాలేజీ డీన్ డాక్టర్ జానకి అలవలపాటి, తెలంగాణ ఫారెస్ట్ కాలేజీ డీన్ ప్రియాంక వర్గీస్‌లు ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ఆరేళ్లపాటు అమల్లో ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో అబర్న్ వర్సిటీ ప్రతినిధులు విన్నీ నాథన్, డాక్టర్ క్రిస్టోఫర్ రాబర్ట్స్, బ్రెట్ వైట్, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ చొరవ, ముందుచూపుతో ప్రారంభించిన అటవీ కళాశాలకు అంతర్జాతీయ గుర్తింపుతోపాటు తెలంగాణ విద్యార్థులు అటవీవిద్యలో ఉన్నత చదువు, పరిశోధనలు, మంచి ఉద్యోగాల కల్పనకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని ప్రియాంక వర్గీస్ తెలిపారు. ఇందుకు సహకరించిన అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, చీఫ్ సెక్రటరీ, స్పెషల్ సీఎస్(అటవీశాఖ) శాంతికుమారి, పీసీసీఎఫ్ డోబ్రియాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే డీమ్డ్ హోదా పొందనున్న ఎఫ్‌సీఆర్ఐ, ఈ తరహా ప్రత్యేకంగా ఫారెస్ట్రీ విద్య కోసమే నెలకొల్పిన యూనివర్సిటీగా ప్రపంచంలోనే మొదటిది అవుతుందన్నారు.



దేవోక్తి లేనియెడల జనులు కట్టులేక తిరుగుదురు. ధర్మశాస్త్రము ననుసరించువాడు ధన్యుడు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.విదియ ఉ.9.16 వరకు తదుపరి తదియ, **నక్షత్రం:** హస్త ఉ.9.32 వరకు తదుపరి చిత్త, **వర్జ్యం:** సా.6.01 నుండి 7.43 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.21 నుండి 5.12 వరకు, **అమృతఘడియలు:** తె.4.16 నుండి 5.34 వరకు (తెల్లవారితే సోమవారం)

సూర్యోదయం : 5.51
సూర్యాస్తమయం : 6.00
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

జైరాం రమేశ్ (కాంగ్రెస్ ఎంపీ)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

శుక్రవారం మేము తుక్కుగూడాలో ఉన్నప్పుడు.. "జయ్! పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఎందుకై ఉంటాయి?" అని మళ్లొకసారి అడిగారు వేణుగోపాల్.

ఏఐసీసీకి ఆయనొక ప్రధాన కార్యదర్శి, నేనొక ప్రధాన కార్యదర్శి. ప్రధాన కార్యదర్శులం ఇద్దరం హైదరాబాద్ వచ్చినప్పటి నుంచీ కమ్యూనికేషన్ సౌలభ్యం కోసం ఎక్కడున్నా పక్కపక్కనే ఉంటున్నాం.

'జయ్! పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఎందుకై ఉంటాయి?' అని వేణుగోపాల్ నన్ను అడిగే సమయానికి మేము తుక్కుగూడాలో 'విజయభేరి' సభకు జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ ఉన్నాం. మాకు కొద్ది దూరంలో... పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి... "కానివ్వండి... కానివ్వండి..." అని పనులు చేయిస్తున్నారు. సీఎల్పీ లీడర్ భట్టి విక్రమార్క, తెలంగాణ ఇంఛార్జి మాణిక్‌రావ్ ఠాక్రే మాతో ఉన్నారు.

"జైరాం సర్ పన్నెండేళ్లు ఇక్కడే ఖైరతాబాద్‌లో ఉన్నారు తెలుసా మాణిక్‌జీ.." అని మాణిక్‌రావ్‌కు చెబుతున్నారు భట్టి విక్రమార్క. మాణిక్‌రావుకు ఆ సంగతి తెలిసి



ఉండకపోదు కానీ, "అవునా!!" అన్నారు ఎక్సయిటింగ్‌గా భట్టి విక్రమార్క వైపు చూస్తూ.

శనివారం మధ్యాహ్నం తాజ్‌కృష్ణలో సీడబ్ల్యూసీ సమావేశాలు మొదలవబోతుండగా ఈసారి నాకు సందేహం వచ్చింది... 18 నుంచి మోదీ పెట్టించిన ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు నిజంగా ఎందుకై ఉంటాయి?!

మోదీ, అమిత్‌షా వాళ్లేం చేస్తున్నదీ చెప్పరు. ఏం చేయబోతున్నదీ చెప్పరు. భారతదేశ జనాభా కేవలం తామిద్దరేనని వాళ్లు అనుకుంటున్నట్లుగా ఉంది!

హైదరాబాద్ వచ్చేందుకు ఢిల్లీ ఎయిర్ పోర్ట్‌లో ఉన్నప్పుడు ఊరికే నా జ్ఞాపకశక్తిని టెస్ట్ చేసుకోవడం కోసం... యువకుడైన ఉదయనిధి స్టాలిన్‌కి ఫోన్ చేసి, "స్టాలిన్! నువ్వు మన రాజ్యాంగాన్ని పూర్తిగా ఎంత సేపటిలో చదవగలవు?" అని అడిగాను.

"సనాతన ధర్మ రాజ్యాంగమేనా అంకుల్?" అన్నాడు!

బిగుసుకుపోయాన్నేను! అతడింకా సనాతన ధర్మాన్ని వదిలినట్లు లేదు. ఈ మధ్యే సడన్‌గా ఎందుకో పట్టుకున్నాడు.

"సనాతన ధర్మం కాదు స్టాలిన్... భారత రాజ్యాంగం గురించి అంటున్నా.. పూర్తిగా ఎంతసేపటిలో చదవగలవు?" అని అడిగాను.

"చదవడం ఎందుకు అంకుల్, మొత్తం అంతా నా ఫింగర్ టిప్స్ మీదే ఉంది. చెప్పండి ఏం కావాలో..." అన్నాడు!

"మరేం లేదూ... ఈ.. 'స్పెషల్ సెషన్' అనే మాట రాజ్యాంగంలో ఎక్కడెక్కడ ఉందో చెప్పగలవా?" అని అడిగాను.

ఉదయనిధి స్టాలిన్ పెద్దగా నవ్వాడు.

"ఎక్కడెక్కడ ఉండటం కాదు అంకుల్.. అసలెక్కడా లేదు. మొత్తం రాజ్యాంగంలోనే స్పెషల్ సెషన్ అనే మాటే లేదు.." అన్నాడు!!

"నువ్వు సూపర్ స్టాలిన్" అన్నాను.

"థ్యాంక్యూ అంకుల్.." అని హడావిడిగా ఫోన్ పెట్టేశాడు. అటువైపు సనాతన ధర్మంపై గొడవింకా ముగిసినట్లు లేదు!


తాజ్‌లో శనివారం మీటింగ్ అయ్యాక... ఆదివారం సాయంత్రం తుక్కుగూడాలో భారీ బహిరంగ సభకు అరేంజ్‌మెంట్స్‌ని చూసుకుంటున్నాం. అప్పుడు మళ్లీ అడిగారు వేణుగోపాల్..!

"పార్లమెంటు స్పెషల్ సెషన్ ఎందుకు అయుండొచ్చు జయ్? వన్ నేషన్–వన్ ఎలక్షన్ కోసమా?"... అని.

"మొదట అదే అయుంటుంది. ఇప్పుడు సనాతన ధర్మం మొదటిదై ఉంటుంది" అన్నాను. ఆ మాటకు వేణు నవ్వారు.

ప్రతిపక్ష కూటమికి తను వెయ్యేళ్లు ముందుగానీ, వెయ్యేళ్లు వెనక గానీ ఉండాలని మోదీ కోరుకుంటున్నట్లుంది! సనాతన ధర్మాన్ని నిర్మూలిస్తే దేశం వెయ్యేళ్లు ముందుకు వెళుతుందని పొరపాటున ఎవరైనా అన్నారా... సనాతన ధర్మాన్ని నిర్మూలించి దేశాన్ని వెయ్యేళ్లు వెనక్కు తీసుకెళతారా అని వెంటనే అనేస్తున్నారాయన!!

కళాత్మక చౌర్యం



జనతంత్రం

వర్ధెల్లి మురళి



చతుష్షష్టి కళల్లో హస్తలాఘవం కూడా ఒకటి. దానర్థం దొంగతనమేనని మృచ్ఛకటికం నాటకంలోని శర్విలకుడు అనే దొంగ అభిప్రాయం. కనుక చాకచక్యంగా, కళాత్మకంగా చేసే దొంగతనాన్ని చోరకళగా భావించాలని వాదిస్తాడు. ఓ తెలుగు సినిమాలోని బ్రహ్మానందం పాత్ర కూడా ఇటువంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తుంది. జైలు గదిలో తనతోపాటున్న బ్రహ్మాజీని ఏం చేశావని బ్రహ్మానందం అడుగుతాడు. ఫోర్జరీ అంటాడు బ్రహ్మాజీ. 'ఫోర్జరీ అంటే ఆర్ట్... ఆర్టిస్టులను కూడా అరెస్ట్ చేస్తారా?' అంటూ వాపోతాడు బ్రహ్మానందం. ఇప్పుడు తెలుగు దేశం, దాని మిత్రపక్షాలవారు, యెల్లో మీడియా బాస్‌లు కూడా ఇదేవిధంగా వాపోతున్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్ పేరు మీద చంద్రబాబు ప్రమేయంతో జరిగిన ఒక స్కామ్‌పై సీఐడీ దర్యాప్తు చేస్తున్నది. 371 కోట్ల రూపాయల ప్రజాధనానికి సంబంధించిన ఈ స్కామ్‌లో 241 కోట్ల రూపాయలు వివిధ మార్గాల ద్వారా చంద్రబాబుకు చేరిన వైనాన్ని సీఐడీ నిర్ధారించింది. ఈనెల తొమ్మిదో తేదీ ఉదయం 6 గంటలకు ఆయనను నంద్యాలలో అరెస్టు చేసింది. ఏ సెక్షన్‌ల కింద అరెస్ట్ చేస్తున్నారో తెలియజేసే ఫామ్‌పై (ఇంటిమేషన్ ఆఫ్ అరెస్ట్) ఆయన సంతకాన్ని తీసుకున్న దృశ్యం టీవీల్లో కనిపించింది. కానీ తనకు కారణం చెప్పకుండా అరెస్టు చేశారని ఆయన ఆరోపించారు. విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టడానికి హెలికాప్టర్‌లో తీసుకెళ్తామని పోలీసులు చెప్పారు. అందుకు ఆయన నిరాకరించారు.

అరెస్టు చేసిన ఇరవై నాలుగ్గంటల్లోగా కోర్టు ముందు ప్రవేశపెట్టవలసి ఉన్నందువల్ల, ఈలోగా సీఐడీ వారు ప్రశ్నించే సమయం ఇవ్వకూడదన్న వ్యూహంతో ఆయన వ్యవహరించినట్టు కనిపించింది. అందుకే హెలికాప్టర్‌లో కాకుండా తన వాహనంలోనే వస్తానని భీష్మించుకున్నారు. పోలీసులు ఆయన మాటను గౌరవించారు. మొదట అరెస్టవడానికి ఆయన సమ్మతించలేదు. మొండికేసే ప్రయత్నం చేశారు. కానీ, తప్పక పోవడంతో తన వాహనంలోకి ఎక్కి కూర్చున్నారు. రోడ్డు మార్గాన నెమ్మదిగా వెళ్తుంటే తన అరెస్ట్ వార్త దావానలంగా వ్యాపించకపోతుందా, వేలాదిమంది తెలుగుదేశం కార్యకర్తలు దండయాత్రకు రాకపోతారా? జనాన్ని చూసి జడుసుకొని అల్లూరి సీతారామరాజును విడిచిపెట్టి వెళ్లినట్టు పోలీసులు తనను కూడా వదిలేసి తోకముడవకపోతారా అనే రవ్వంత ఆశ కూడా ఏ మూలో ఉండవచ్చు.

మార్గమధ్యంలో దండయాత్రలూ, దండుయాత్రలూ ఎదురు కాలేదు కానీ, ఆయన కోరుకున్నట్టుగానే బాగా ఆలస్యమైంది. సీఐడీ అధికారుల ప్రశ్నలకు సహాయ నిరాకరణలో కొంత సమయాన్ని, విశ్రాంతి పేరుతో కొంత సమయాన్ని బాబు కరిగించారని సమాచారం. బాబు విజయవాడకు చేరుకోకముందే ఢిల్లీ నుంచి ఖరీదైన లాయర్ల బృందం చేరుకున్నది. కోర్టులో హోరాహోరీగా వాదప్రతివాదాలు జరిగాయి. పది గంటలపాటు జడ్జి ఈ వాదనల్ని విన్నారు. ఇరువైపుల నుంచీ పలు సందర్భాల్లో సందేహాలను నివృత్తి చేసుకున్నారు. చివరకు ప్రభుత్వ న్యాయవాది వాదన, రిమాండ్ రిపోర్ట్ అంశాలతో ఏకీభవించి చంద్రబాబును రిమాండ్‌కు పంపారు. హై ప్రొఫైల్ వ్యక్తికి సంబంధించిన కేసు కాబట్టేమో, సుదీర్ఘ సమయం వాదోపవాదాలు జరిగినా సరే జడ్జి ఓపిగ్గా విన్నారు. తీర్పు వెలువడిన మరుక్షణం నుంచే తెలుగుదేశం – యెల్లో కూటమి, దాని సోషల్ మీడియా బృందాలు వాటి వికృత స్వరూపాన్ని బయటపెట్టుకున్నాయి.

జడ్జి మీద వ్యక్తిగతంగా దాడుల్ని ఎక్కుపెట్టారు. ఎక్కడి నుంచి వెతికి పట్టుకున్నారో తెలియదు, అది నిజమో కాదో కూడా తెలియదు గానీ, జడ్జిగారిది బీసీ సామాజికవర్గంగా తేల్చేశారు. ఇంకేముంది... యెల్లో కూటమి పెత్తందారీ దురహంకారం బుసలు కొట్టింది. 'బీసీలు జడ్జీలుగా పనికిరారు, వారిని నియమించకండి' అంటూ కేంద్ర న్యాయశాఖకు లేఖలు రాసిన చరిత్ర చంద్రబాబుది. ఇప్పుడాయన అనుచర గణాలు ఆయన ఆదర్శాన్ని అందిపుచ్చుకొని విశృంఖలంగా చెలరేగిపోతున్నాయి. తీర్పు చెప్పే న్యాయమూర్తుల్లో, ప్రాణం పోసే డాక్టర్లలో, శాంతిభద్రతలు కాపాడే పోలీసుల్లో కూడా కులం నీడల్ని వెతికిపట్టుకునే దౌర్భాగ్యపు పెత్తందారీ దురహంకార సంప్రదాయాన్ని చంద్రబాబు కూటమి పెంచి పోషిస్తున్నది. పొరపాటున అవతలివారు బీసీలో, ఎస్సీలో, ఎస్టీలో, మైనారిటీలో అని తేలితే వారి ప్రతిష్ఠ మీద రెచ్చిపోయి దాడులు చేస్తున్నారు. అందుకే ఇవాళ ఆంధ్ర రాష్ట్రంలో పేదలకు, పెత్తందార్లకు మధ్యన జరుగుతున్న పోరాటం కేవలం రాజకీయ పరమైనది మాత్రమే కాదు... అది సామాజిక, సాంస్కృతిక విలువల పోరాటం కూడా!

ఇప్పుడు చంద్రబాబును జైల్లో పెట్టించిన స్కిల్ కేసు వివరాలను మరోసారి క్లుప్తంగా పరిశీలిద్దాం. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వృద్ధి చేయడం అనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. తన అనుచరులను తీసుకొచ్చి సంస్థ పగ్గాలను అందించారు. ఈ సంస్థకూ, డిజైన్ టెక్ అనే ప్రైవేట్ సంస్థకూ, జర్మనీకి చెందిన సీమెన్స్ సంస్థకూ మధ్యన ఒక త్రైపాక్షిక ఒప్పందం కుదిరిందని వెల్లడిస్తూ మరో జీవోను విడుదల చేశారు. ఈ జీవోలో పేర్కొన్న ప్రకారం సీమెన్స్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు సహకరిస్తుంది. ఇందుకోసం ఏర్పాటు చేసే శిక్షణ కేంద్రాలకు అవసరమైన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌ల కొనుగోలు కోసం 3,300 కోట్లు ఖర్చవుతుంది. ఇందులో 90 శాతాన్ని సీమెన్స్ సంస్థ గ్రాంట్- ఇన్-ఎయిడ్‌గా (ఉచిత సహాయం) సమకూరుస్తుంది. ప్రభుత్వం తరఫున 10 శాతం కింద 330 కోట్లను సమకూర్చాలి. జీఎస్టీ చెల్లింపులతో కలిపి అది 371 కోట్లు అవుతుంది. ఈమేరకు కుదిరిన ఒప్పంద పత్రంలో మాత్రం గ్రాంట్-ఇన్-ఎయిడ్ ప్రస్తావన గానీ, కుదిరిన తేదీగానీ ఏమీ లేవు.

> మామూలుగా తాను ఇంటర్వ్యూ చేసే వ్యక్తిని బెదరగొట్టే విధంగా విరుచుకుపడే ఓ జాతీయ టీవీ ఛానల్ యాంకర్ ఆర్ణబ్ గోస్వామి, చినబాబు విషయంలో కొంత మెతక వైఖరి ప్రదర్శించాడు. మొదటి ఒకటి రెండు ప్రశ్నలు కొంచెం గట్టిగా అడగ్గానే లోకేశ్ కంగారుపడ్డట్టు కనిపించాడు. దాంతో ఆర్ణబ్ కొంచెం నెమ్మదించాడు. 'లవకుశ' సినిమాలో 'ముక్కుపచ్చారని మునికుమారుల చంపకూడదని నే గొంకుచుంటి' అనే పద్యాన్ని చదువుతున్నప్పుడు ఎన్టీ రామారావు ముఖంలో కనిపించిన ఎక్స్‌ప్రెషన్స్ గోస్వామిలో కనిపించాయి. ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ తప్పు చేస్తే ఛైర్మన్ ఎలా బాధ్యుడవుతాడు అని లోకేశ్ ఎదురు ప్రశ్న వేశాడు. అంటే మేనేజర్ స్థాయిలో తప్పు జరిగినట్టు అంగీకరిస్తున్నారా అనే సరికి చినబాబు ఖంగుతిన్నారు. స్కామ్ జరిగితే ఆ డబ్బు ఎక్కడికి చేరిందో సీఐడీ నిరూపించాలి కదా, అలా నిరూపించలేదని ఆయన ఆఖరి బాణం వదిలారు.

ప్రభుత్వ వాటాగా 371 కోట్లను తక్షణం డిజైన్‌టెక్ సంస్థకు విడుదల చేయాలని పైనుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. సీమెన్స్ వాటా విడుదల కాకుండానే పది శాతాన్ని ఏకమొత్తంగా విడుదల చేయడం నిబంధనలకు విరుద్ధమని ఆర్థికశాఖ అధికారులు నోటు ఫైళ్లపై కామెంట్లు రాసినా ఖాతరు చేయలేదు. పదేపదే పైనుంచి ఒత్తిడి పెరగడంతో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విడుదల చేస్తున్నట్టు ఆర్థిక శాఖ కార్యదర్శులు నోటుఫైళ్లపై రాసి సంతకాలు చేశారు. ఆ తర్వాత డిజైన్‌టెక్ సంస్థకు ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా డబ్బులు వెళ్లాయి. అసలీ డిజైన్ టెక్ సంస్థ పాత్ర ఏమిటి? నేరుగా ఏపీఎస్ఎస్‌డీసీనే సీమెన్స్ సంస్థతో వ్యవహారం నడపవచ్చు గదా!

371 కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తున్నప్పుడు టెండర్లను పిలవకుండా ఉండడానికి సీమెన్స్ ఉచిత సాయం కథ ముందుకు తెచ్చారు. ఉచిత సాయం 90 శాతం కింద సాంకేతిక సహకారాన్ని అందిస్తారని మధ్యలో కథ మార్చారు. ఈ డిజైన్‌టెక్ అనే సంస్థది బ్రోకరేజీ పాత్ర. ఈ సంస్థకు చేరిన 371 కోట్లలో 59 కోట్లు వెచ్చించి సీమెన్స్ కంపెనీ నుంచి ఏపీఎస్ఎస్‌డీసీకి అవసరమైన పరికరాలను, సాఫ్ట్‌వేర్‌ను తెప్పించారు. ఈ కొనుగోలు జస్ట్ షాపింగ్ లాంటిదే. ఎవరైనా కొనుక్కోవచ్చు. ఒప్పందాలతో పనిలేదు. స్కిల్ సెంటర్ల కోసం మొత్తంగా చేసిన ఖర్చు ఇదే. దీనికే 3,300 కోట్ల బిల్డప్ ఇచ్చారు. టెండర్ల గోల లేకుండా గ్రాంట్ ఇన్ ఎయిడ్ కథను అల్లుకొచ్చారు. డిజైన్ టెక్ సంస్థ మిగిలిన సొమ్ములో 241 కోట్లను పీవీఎస్‌పీ అనే షెల్ కంపెనీకి తరలించింది. ఇది పుణె కంపెనీ. ఈ కంపెనీ నుంచి ఆ సొమ్ము ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్‌లోని షెల్ కంపెనీల ద్వారా దుబాయ్, సింగపూర్‌లోని కంపెనీకి తరలివెళ్లింది. వాటి వివరాలను కూడా సీఐడీ తన రిపోర్టులో పొందుపర్చింది.

ప్రభుత్వం ప్రకటించిన విధంగా మొత్తం ప్రాజెక్టు వ్యయానికి సరిపోయేలా నకిలీ ఇన్వాయిస్‌లను కూడా ఈ పుణె కంపెనీ సమీకరించుకున్నది. దీనికి బ్రోకరేజీ ఫీజు వసూలు చేసి ఉండవచ్చు. ఇదిగో ఈ షెల్ కంపెనీల మీద జీఎస్టీ అధికారులు జరిపిన తనిఖీల్లో నకిలీ ఇన్వాయిస్‌ల భాగోతం బయటపడింది. అప్పటికింకా రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వమే అధికారంలో ఉన్నది. జీఎస్టీ అధికారులు ఈ నకిలీ వ్యవహారాలను రాష్ట్ర ఏసీబీకి ఉప్పందించారు. ఏసీబీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లింది. సూత్రధారి తానే కనుక ఆయన మౌనం వహించారు. ఏసీబీకి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. మౌనంగా నోట్ ఫైళ్లతో సహా సంబంధిత డాక్యుమెంట్లను కాల్చేయాలని ఆదేశించారు. తదనంతరం రంగంలోకి దిగిన ఈడీ ఈ మనీల్యాండరింగ్ వ్యవహారాన్ని మొత్తం నిర్ధారించింది.

సీమెన్స్ కంపెనీకి ఇండియా విభాగం చీఫ్‌గా ఉన్న సుమన్ బోస్‌తో సహా డిజైన్‌టెక్ ఎండీ వికాస్ కన్విల్కర్, మరో ఇద్దరిని అరెస్ట్ చేసింది. ఈ సుమన్ బోస్ అసలు పేరు సౌమ్యాద్రి బోస్‌గానూ, డిజైన్‌టెక్ ద్వారా ఏపీతో కుదుర్చుకున్న ఒప్పందంలో సుమన్ బోస్‌గా సంతకం చేసినట్టుగానూ ఈడీ గుర్తించింది. దొంగ సంతకం దొంగ స్కీమ్‌కు రుజువు కదా! ఆంధ్రప్రదేశ్ సీఐడీ విభాగం ఈ కేసులో దర్యాప్తు చేయడానికి పూర్వమే కేంద్ర జీఎస్టీ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ ఈ స్కామ్‌ను పసిగట్టాయి. ఆ కారణంగా సీమెన్స్ ఇండియా ఎండీ సుమన్ బోస్ ఉద్యోగం కూడా ఊడింది. ఈ కేసు మొత్తంలో అన్నిటికంటే ప్రధానమైన అంశం – సీమెన్స్ సంస్థ ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)కి 2022, ఫిబ్రవరి మూడో తేదీ నాడు రాసిన లేఖ! ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో తాము ఎటువంటి ఒప్పందం చేసుకోలేదనీ, అసలు గ్రాంట్ ఇన్ ఎయిడ్ స్కీమ్ తమ దగ్గర ఏమీ లేదని ఆ లేఖలో కంపెనీ స్పష్టం చేసింది. కంపెనీ స్వయంగా ఇటువంటి స్కీమ్ లేదని చెబుతుంటే మన చినబాబు, పెదబాబు, యెల్లో మీడియా మాత్రం ఉందని దబాయిస్తున్నారు. శుక్రవారం నాడు ఢిల్లీలో ఒక జాతీయ మీడియా చానల్‌లో కూర్చొని లోకేశ్ ఇదే విషయాన్ని ప్రస్తావించాడు. ఉత్తర కుమారుడు యుద్ధానికి బయల్దేరితే జనించినంత ఆసక్తి చినబాబు మీడియా డిబేట్‌లపై జనించింది. కష్టంగా కొన్ని విషయాలు చెప్పాడాయన. అన్నీ టెక్నికల్ విషయాలే! గుజరాత్‌లో సీమెన్స్ కంపెనీ ఈ గ్రాంట్ ఇన్ ఎయిడ్ స్కీమ్‌ను అమలు చేసిందనీ, దాన్ని పరిశీలించాకనే తాము ఒప్పందం చేసుకున్నామనీ లోకేశ్ చెప్పాడు. గుజరాత్‌లో జరిగిన ఒప్పంద పత్రంపై సౌమ్యాద్రి బోస్ అని సంతకం చేసిన వ్యక్తి ఏపీ ఒప్పందంపై సుమన్ బోస్ అని చేశాడు. అక్రమ పథకానికి అక్రమ సంతకం, సక్రమ పథకానికి సక్రమ సంతకం అన్న మాట. చివరకు అతను కంపెనీ నుంచి వెళ్లిపోయాడు.

మామూలుగా తాను ఇంటర్వ్యూ చేసే వ్యక్తిని బెదరగొట్టే విధంగా విరుచుకుపడే ఆర్ణబ్ గోస్వామి చినబాబు విషయంలో కొంత మెతక వైఖరి ప్రదర్శించాడు. మొదటి ఒకటి రెండు ప్రశ్నలు కొంచెం గట్టిగా అడగ్గానే లోకేశ్ కంగారుపడ్డట్టు కనిపించాడు. దాంతో ఆర్ణబ్ కొంచెం నెమ్మదించాడు. 'లవకుశ' సినిమాలో 'ముక్కుపచ్చారని మునికుమారుల చంపకూడదని నే గొంకుచుంటి' అనే పద్యాన్ని చదువుతున్నప్పుడు ఎన్టీ రామారావు ముఖంలో కనిపించిన ఎక్స్‌ప్రెషన్స్ గోస్వామిలో కనిపించాయి. ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ తప్పు చేస్తే ఛైర్మన్ ఎలా బాధ్యుడవుతాడు అని లోకేశ్ ఎదురు ప్రశ్న వేశాడు. అంటే మేనేజర్ స్థాయిలో తప్పు జరిగినట్టు అంగీకరిస్తున్నారా అనే సరికి చినబాబు ఖంగుతిన్నారు. స్కామ్ జరిగితే ఆ డబ్బు ఎక్కడికి చేరిందో సీఐడీ నిరూపించాలి కదా, అలా నిరూపించలేదని ఆయన ఆఖరి బాణం వదిలారు.

నిరూపించకపోవడమేమిటీ? సీఐడీ నిక్షేపంగా నిరూపిస్తున్నది. ఈడీ కూడా నిర్ధారిస్తున్నది. షెల్ కంపెనీల ద్వారా సింగపూర్, దుబాయ్‌లకు డబ్బు చేరిన తర్వాత కథలోకి యోగేశ్ గుప్తా ఎంట్రీ ఇస్తాడు. ఆయన హవాలా మార్గంలో దేశానికి తరలించి, మనోజ్ వాసుదేవ్ పార్థసానికి అందజేస్తారు. పార్థసాని హైదరాబాద్‌లో పెండ్యాల శ్రీనివాస్‌కు (చంద్రబాబు పీఏ) అందజేస్తారు. శ్రీనివాస్ ద్వారా ప్యాలెస్ డెస్క్‌కు ఆ డబ్బు చేరుతుంది. సరిగ్గా ఇవే పేర్లు, ఇదే మోడస్ ఆపరెండీని మనం ఐటీ శాఖ వెలుగులోకి తెచ్చిన స్కామ్‌లో కూడా చూశాము.

> గడచిన మూడు దశాబ్దాలుగా ఎవరికీ దొరక్కుండా కళాత్మకంగా నెగ్గుకొస్తున్న 'స్కామింగ్'లో ఇప్పుడు తడబడట మేమిటని యెల్లో కూటమి విస్తుపోతున్నది. ఈ కేసులో అరెస్టయిన దగ్గర్నుంచీ ఈ శిబిరం నుంచి సాంకేతిక అభ్యంతరాలే తప్ప దొంగతనం జరిగిందా లేదా అనే అసలు విషయం జోలికి వెళ్లడం లేదు. మచ్చుకు కొన్ని చూద్దాం. ఎఫ్ఐఆర్‌లో తన పేరు లేదు గనుక స్కామ్‌తో తనకు సంబంధం లేదని బాబు వాదిస్తున్నారు. ఇదో వితండవాదం. నేరం జరిగినట్టు ఫిర్యాదందగానే అనుమానితుల పేర్లతో వేసేది ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్ఐఆర్). దర్యాప్తు క్రమంలో అసలు నేరస్తుడు బయట పడొచ్చు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేదు గనుక అసలు నేరస్తుడిని వదిలేస్తారా?.. నవ్విపోతారు.
>
> ఈ వ్యవహారంలో తన పాత్ర లేదనీ, ఎవరినీ ప్రభావితం చేయలేదనీ ఆయన చెప్పుకొస్తున్నారు. కానీ అడుగడుగునా ఈ వ్యవహారంలో ఆయన పాత్రను సీఐడీ దర్యాప్తు నిగ్గుదేల్చింది. ఏపీఎస్ఎస్‌డీసీని ఏర్పాటు చేయడం దగ్గర్నుంచి, నిబంధనలకు విరుద్ధంగా తన మనుషుల్ని దానిలో జొప్పించడం వరకు ఆయనదే ప్రధాన భూమిక.

అమరావతిలోని తాత్కాలిక సచివాలయం భవనం కాంట్రాక్టు ఇచ్చినందుకు గాను షల్లోంజీ సంస్థ చెల్లించిన 118 కోట్ల ముడుపులను (600 కోట్ల పనికి) ఇదే పద్ధతిలో తరలించినట్టు ఐటీ శాఖ కనిపెట్టింది. స్కిల్ స్కామ్‌లో విచారణ కోసం పై ముగ్గురికీ నోటీసులివ్వగానే వారు అందుబాటులో లేకుండా మాయమయ్యారు. యోగేశ్ గుప్తా కనిపించడం లేదు. మనోజ్ పార్థసాని దుబాయ్‌కీ, పెండ్యాల శ్రీనివాస్ అమెరికాకూ ఉడాయించారు. స్కామ్ డబ్బులు ఎక్కడికి వెళ్లాయో తెలుసుకోవాలన్న ఆసక్తి నిజంగానే లోకేశ్‌బాబుకు ఉంటే ఆ ముగ్గుర్నీ పిలిపించి సీఐడీకి అప్పగిస్తే సరిపోతుంది.

గడచిన మూడు దశాబ్దాలుగా ఎవరికీ దొరక్కుండా కళాత్మకంగా నెగ్గుకొస్తున్న 'స్కామింగ్'లో ఇప్పుడు తడబడట మేమిటని యెల్లో కూటమి విస్తుపోతున్నది. ఈ కేసులో అరెస్టయిన దగ్గర్నుంచీ ఈ శిబిరం నుంచి సాంకేతిక అభ్యంతరాలే తప్ప దొంగతనం జరిగిందా లేదా అనే అసలు విషయం జోలికి వెళ్లడం లేదు. మచ్చుకు కొన్ని చూద్దాం. ఎఫ్ఐఆర్‌లో తన పేరు లేదు గనుక స్కామ్‌తో తనకు సంబంధం లేదని బాబు వాదిస్తున్నారు. ఇదో వితండవాదం. నేరం జరిగినట్టు ఫిర్యాదు అందగానే అనుమానితుల పేర్లతో వేసేది ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్ఐఆర్). దర్యాప్తు క్రమంలో అసలు నేరస్తుడు బయట పడొచ్చు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేదు గనుక అసలు నేరస్తుడిని వదిలేస్తారా?.. నవ్విపోతారు.


ఈ వ్యవహారంలో తన పాత్ర లేదనీ, ఎవరినీ ప్రభావితం చేయలేదనీ ఆయన చెప్పుకొస్తున్నారు. కానీ అడుగడుగునా ఈ వ్యవహారంలో ఆయన పాత్రను సీఐడీ దర్యాప్తు నిగ్గుదేల్చింది. ఏపీఎస్ఎస్‌డీసీని ఏర్పాటు చేయడం దగ్గర్నుంచి, నిబంధనలకు విరుద్ధంగా తన మనుషుల్ని దానిలో జొప్పించడం వరకు ఆయనదే ప్రధాన భూమిక. హడావిడిగా ప్రభుత్వ వాటాను వెంటపడి విడుదల చేయించిందే నాటి ముఖ్యమంత్రి. ఇందు కోసం సంబంధిత ఫైళ్లలో 13 చోట్ల ఆయన సంతకాలు చేసిన విషయాన్ని సీఐడీ రుజువు చేసింది. విద్యాశాఖతో సంబంధం లేకుండా నిధుల విడుదలకు ప్రత్యేక గ్రీన్‌ఛానల్‌ను కూడా ఆయన ఏర్పాటు చేశారు. అప్పుడు ఆర్థిక శాఖ కూడా ఆయన ఆధ్వర్యంలోనే ఉన్నది. ఇవన్నీ ఎవరు చెబితే చేశారు? అవినీతి నిరోధక చట్టం 17ఏ ప్రకారం గవర్నర్ ఆమోదం లేకుండా తనను అరెస్టు చేయడం కుదరదనీ, తన మీద ఐపీసీ 409 సెక్షన్‌పై కేసు బనాయించడం చెల్లదనీ వాదిస్తున్నారు. అంతే తప్ప స్కామ్ జరగలేదని వాదించడం లేదు. ఈ రెండు అంశాలపై ఏసీబీ కోర్టులో విస్తృతంగా వాదప్రతివాదాలు జరిగాయి. గౌరవ న్యాయస్థానం ఒక నిర్ణయం తీసుకున్నది. ఆయనలో వణుకు మొదలైందని సమాచారం. ఈ స్కామ్‌తోనే కేసులు ఆగవని, మరో అరడజన్ కేసుల్లో తాను ఇరుక్కోవడం ఖాయమని భావిస్తున్నారట! చట్టానికి దొరక్కుండా కొల్లగొట్టే తన కౌశలం ఎందుకిలా కొడిగట్టిందో అర్థంకావడం లేదు.

చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లిన తర్వాత జనసేనాని పవన్ కల్యాణ్‌తో సహా బాలకృష్ణ, లోకేశ్ వెళ్లి కలిశారు. ఆయనతో రాజకీయాలేవో మాట్లాడుకొని బయటకు వచ్చిన తర్వాత చేసిన వీరవిక్రమ ధీర గంభీర స్టేట్‌మెంట్ మాత్రం ఆశ్చర్యం కలిగించింది. ఆయన ప్రకటనలో రెండు ముఖ్యమైన అంశాలున్నాయి. మొదటిది – వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కలిసి పోటీ చేస్తాయి. రెండో అంశం – ఇకపై వైసీపీ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తున్నామని చెప్పడం! వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసే పోటీ చేస్తాయని ఈ రాష్ట్ర జనాభాలో నూటికి తొంభైమందికి ఎప్పుడో తెలుసు. అంత ఆవేశంగా చెప్పవలసిన కొత్త విషయమేమున్నది ఇందులో! బహుశా జైల్లో చంద్రబాబు ఉపదేశించిన మంత్ర ప్రభావం వల్ల కావచ్చు. ఆయన మాత్రం చాలా ఆవేశపడ్డారు. యుద్ధం స్టోరీ కూడా పాతదే. పేద ప్రజల సాధికారత ఉద్యమం పైన పెత్తందార్ల తరఫున ప్రతిపక్ష శిబిరం ఎప్పటినుంచో యుద్ధం చేస్తున్నది. పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన బోధన కోసం సాగుతున్న యత్నాలపైనా యుద్ధం ప్రకటించింది. మహిళల పేర్ల మీద ఇళ్లు కట్టించి ఇస్తుంటే యుద్ధ సైరన్ వినిపించింది. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తుంటే రణభేరి మోగించింది. పెత్తందార్లు యుద్ధం ఆపిందెప్పుడు?

vardhelli1959@gmail.com

విమోచన కాదు విద్రోహం!

సందర్భం



బొల్లిముంత సాంబశివరావు


తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని కొన్ని రాజకీయ పక్షాలు తమ ప్రయోజనాలకు అనుగుణంగా చిత్రించుకుంటున్నాయి. కానీ అసలు చరిత్రలో జరిగింది వేరు.

నైజాం నవాబు ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎట్టి హక్కులు లేకుండా, వెట్టి చాకిరీ చేస్తూ, దారుణ దోపిడీకి గురౌతున్న సమయంలో 'ఆంధ్ర మహాసభ' ఏర్పడింది. క్రమంగా 'ఆంధ్ర మహాసభ' కమ్యూనిస్టుల నాయకత్వంలోకి వచ్చింది. వెట్టి చాకిరీ రద్దు, కౌలు తగ్గింపు, 'దున్నే వానికే భూమిపై హక్కు' వంటి డిమాండ్‌లను ముందుకు తెచ్చి నిజాం పాలనపై ఉద్యమించింది. సంఘంలోకి ప్రజలు పెద్ద ఎత్తున చేరారు. భూమి కోసం పోరు ప్రారంభమైంది. 'ఆంధ్ర మహాసభ' ప్రతి గ్రామానికీ విస్తరించింది. తన భూమి, పంటల రక్షణ కోసం చాకలి ఐలమ్మ ప్రదర్శించిన తెగువ భూపోరాట ప్రాధాన్యాన్ని ముందుకు తెచ్చింది.

జనగామ తాలూకా కలవెండి గ్రామంలో దేశ్ ముఖ్ విసునూరి రామచంద్రారెడ్డి గూండాలు జరిపిన కాల్పుల్లో దొడ్డి కొమురయ్య అమరత్వంతో పోరాటం కొత్త మలుపు తీసుకున్నది. దేశ్‌ముఖ్‌ల, జమీందార్ల దాడులను సాయుధంగా ప్రతిఘటన చేయాలని కమ్యూనిస్టు పార్టీ నిర్ణయం తీసుకుంది. రైతాంగ ఉద్యమంపై నిజాం నవాబ్ ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగించింది. నిజాం రజాకార్లు ప్రజలపై పాశవిక దాడులు చేశారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ఈ దాడులను తిప్పికొట్టేందుకు గెరిల్లా దళాలు ఏర్పడ్డాయి. పోరాటం ద్వారా పది లక్షల ఎకరాల భూములు ప్రజలు స్వాధీనపర్చుకుని సాగు చేశారు. వేలాది గ్రామల్లో గ్రామ రాజ్యాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రజాశక్తికి భయపడి జమీందార్లు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు పట్టణాలకు పారిపోయారు.

నిజాం నిరంకుశ ప్రభుత్వం నిర్బంధం పెంచి ప్రజలను తీవ్ర చిత్రహింసలకు గురిచేసింది. ప్రజలను ఒకేచోట మందవేసి పాశవికంగా హింసించారు. అయినా పోరాటం ఆగలేదు. పోరాటాన్ని అడ్డుకునే శక్తి నిజాం ప్రభుత్వం కోల్పోయింది.

రైతాంగ సాయుధ పోరాటం నెహ్రూ ప్రభుత్వ వెన్నులో వణుకు పుట్టించింది. ఉద్యమం కొనసాగితే కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరిగి ఇతర ప్రాంతాల్లో కూడా ఉద్యమాలు ప్రారంభమౌతాయని నెహ్రూ ప్రభుత్వం భయపడింది. అందుకే 1948 సెప్టెంబర్ 13న హైదరాబాద్ సంస్థానానికి సైన్యాలను పంపింది. నిజాం సైన్యాలు బూటకపు ప్రతిఘటన నాటకమాడాయి. రెండు రోజుల్లోనే నైజాం రాజు లొంగిపోయినట్లు ప్రకటించి, నెహ్రూ సైన్యాలకు స్వాగతం పలికాడు. దీన్ని గమనిస్తే ముందుగానే సైనిక చర్య గురించి నెహ్రూ ప్రభుత్వానికి, నైజాం నవాబుకూ మధ్య ఒప్పందం జరిగిందనేది వెల్లడవుతుంది. నిజాం నవాబును గద్దె దింపటానికే సైన్యం వస్తే, మరి నవాబును (రాజుని) అరెస్టు చేసి



సర్దార్ పటేల్ ముందు లొంగిపోతున్న నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్

నిర్బంధించాలి కదా! కానీ అలా జరగలేదు. 'రాజ్య ప్రముఖ్'గా నిజాం రాజుని ప్రకటించి 1950 జనవరి 26 వరకు నైజాం ప్రాంతాన్ని అతని పాలనలోనే ఉంచి, నెహ్రూ ప్రభుత్వం 1950లో సెప్టెంబర్ 17న భారత యూనియన్‌లో విలీనం చేసింది.

ఈ క్రమంలో గ్రామాలకు సైన్యాలను పంపి ప్రజలు సాగు చేసుకుంటున్న భూములను జమీందార్లకు, భూస్వాములకు అప్పగించింది. దీన్ని గమనిస్తే నైజాం నవాబును, జమీందార్లను, జాగీర్దారులను, భూస్వాములను రక్షించటానికే రైతాంగ సాయుధ పోరాటంపైకి మిలిటరీ దాడి అన్నది స్పష్టమవుతున్నది. అందుకు అనుగుణంగానే పెద్ద ఎత్తున నిజాం రాజ్యంలో సైన్యాన్ని దింపి రైతాంగ పోరాటంపై విరుచుకుపడింది. కాన్సన్‌ట్రేషన్ క్యాంపులు పెట్టి ప్రజలను తీవ్ర చిత్రహింసలకు గురి చేసింది. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించింది. నాయకులను, కార్యకర్తలను పట్టుకుని కాల్చి చంపింది. నెహ్రూ ప్రభుత్వం ఎంత నిర్బంధం ప్రయోగించినా రైతాంగ సాయుధ పోరాటం కొనసాగింది. పార్టీలో చోటు చేసుకున్న మితవాద, అతివాద ధోరణులు 1951 అక్టోబర్ 31న మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం విరమణకు కారణమయ్యాయి.

మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్మించింది కమ్యూనిస్టు పార్టీ. అందుకు అనేక త్యాగాలు చేసింది కమ్యూనిస్టు పార్టీనే! అందువలన ఆ పోరాట వారసులు కమ్యూనిస్టులే. ఇతరులు దాన్ని ఉచ్చరించటానికి కూడా హక్కు లేదు. అలాగే సెప్టెంబర్ 17న జరిగినది విమోచన కాదు, ప్రజలకు విద్రోహమని ప్రజలు గొంతు విప్పాలి. తెలంగాణ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని నినదించాలి.

వ్యాసకర్త ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు । 98859 83526

రూ.1.5 కోట్ల విలువైన సెల్‌ఫోన్ల చోరీ

డోన్ రూరల్ (నంద్యాల): హరియాణ నుంచి బెంగళూరుకు వెళ్తున్న పార్సిల్ కంటైనర్ నుంచి రూ.1.5 కోట్ల విలువైన సెల్‌ఫోన్లను ఇద్దరు డ్రైవర్లు చోరీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 11న హరియాణకు చెందిన పార్సిల్ కంటైనర్‌లో హైదరాబాద్ నుంచి రూ.1.5 కోట్ల విలువైన సెల్‌ఫోన్లను ట్రాన్స్‌పోర్ట్ యజమాని బల్వీందర్‌సింగ్ అనే వ్యక్తి బెంగళూరుకు చేర్చేందుకు బుక్ చేశాడు. అయితే ఆ సెల్‌ఫోన్లు బెంగళూరుకు చేరకపోవడంతో అనుమానం వచ్చి ఆరా తీయగా.. పార్సిల్ కంటైనర్‌ను డోన్ సమీపంలోని ఓబులాపురం మిట్ట వద్ద 44వ జాతీయ రహదారి పక్కన వదిలి వెళ్లినట్లు గుర్తించారు. దీంతో బల్వీందర్‌సింగ్ ఈ విషయంపై డోన్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా చోరీ జరిగిన విషయం వాస్తవమేనన్నారు. నిందితుల కోసం రెండు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు.

నేడు రాష్ట్రానికి ఇద్దరు కేంద్ర మంత్రుల రాక

సాక్షి, అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలతో పాటు విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు ఆదివారం ఇద్దరు కేంద్ర మంత్రులు రాష్ట్ర పర్యటనకు వస్తున్నారు. ఈ విషయాన్ని బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. విశాఖపట్నంలో జరిగే కార్యక్రమంలో కేంద్రమంత్రి దేవుసిన్హ్ చౌహాన్, విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో కేంద్రమంత్రి భగవంత్ కుబా పాల్గొంటారని పేర్కొంది.

బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

- రేపు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం వైఎస్ జగన్
- ఉత్సవాలకు సమాయత్తమైన టీటీడీ

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి అంకురార్పణ జరగనుంది. శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుడు. శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను విష్వక్సేనుడు పర్యవేక్షించే కార్యక్రమమే అంకురార్పణ. వైఖానస ఆగమోక్తంగా ఈ వేడుక నిర్వహించి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టడం సంప్రదాయం. ఇందులో భాగంగా నేటి సాయంకాల వేళలో విష్వక్సేనుడు నిర్ణీత పునీత ప్రదేశంలో 'భూమి పూజ'(మత్సంగ్రహణం)తో మట్టిని సేకరించి ఛత్ర చామర మంగళవాద్యాలతో ఊరేగుతూ ఆలయానికి చేరుకుంటారు. యాగశాలలో మట్టితో నింపిన తొమ్మిది పాళికలలో(మూకుళ్లు)–శాలి, వ్రహి,యవ, ముద్గ, మాష, ప్రియంగు మొదలగు నవ ధాన్యాలతో అంకురార్పణం (బీజావాపం) చేస్తారు. సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. సాయంత్రం మీన లగ్నంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాద్యాలు మోగుతుండగా అర్చక స్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేస్తారు. రాత్రి తొమ్మిది నుంచి 11 గంటల వరకు పెద్దశేష వాహన సేవ జరుగుతుంది. ఇందులో భాగంగా టీటీడీ ఈవో ధర్మారెడ్డి సర్వం సిద్ధం చేశారు. బ్రహ్మోత్సవాల్లో మొత్తం మూడు వేల మంది, గరుడసేవ కోసం మరో 700 మంది పోలీస్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశారు. తిరుమల సీవీఎస్‌వో నరసింహ కిషోర్, తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఉత్సవాల భద్రతను పర్యవేక్షిస్తున్నారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు జరగనున్నాయి.



ఫారెస్ట్ ఆఫీసు నుంచి ఆలయం వద్దకు మేళతాళాలతో తీసుకొస్తున్న దర్భ,చాప, తాడు

శ్రీవారి బ్రహ్మోత్సవాల దర్భ చాప, తాడు ఊరేగింపు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణానికి ఉపయోగించే దర్భ చాప, తాడును టీటీడీ అటవీ విభాగం కార్యాలయం నుంచి శనివారం డీఎఫ్‌వో శ్రీనివాసులు, సిబ్బంది ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం శ్రీవారి ఆలయం రంగ నాయకుల మండపంలోని శేషవాహనంపై దర్భతో తయారు చేసిన చాప, తాడును ఉంచారు. ఈ నెల 18వ తేదీ జరిగే ధ్వజారోహణంలో వీటిని ఉపయోగిస్తారు. 22 అడుగుల పొడవు, ఏడున్నర అడుగుల వెడల్పుతో దర్భ చాప, 200 అడుగుల పొడవుతో తాడు ఉంటుంది.

శ్రీవారి సేవలో మాజీ సీజేఐ టీఎస్ ఠాకూర్



ధ్వజస్తంభానికి మొక్కుతున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ ఠాకూర్



జస్టిస్ ఆలోక్ ఆరాధేకు శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న భూమన, ధర్మారెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ ఠాకూర్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ ఆరాధే శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. కాగా, శ్రీవారిని దర్శించుకున్నవారిలో బీఎస్ఎఫ్ డీజీ పీవీ రామశాస్త్రి తదితరులు ఉన్నారు. కాగా, తిరుమలలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 62,357 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.37 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు ఎనిమిది గంటల్లో దర్శనం లభిస్తోంది.

విస్తృత ప్రయోగాలే సమాజ ప్రగతికి మూలాధారం

ఓరల్ మ్యాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ రాష్ట్ర ముగింపు సదస్సులో ప్రొఫెసర్ తంగవేలు



గన్నవరం రూరల్: దవడ ఎముకల శస్త్ర చికిత్సలో విస్తృత ప్రయోగాలు సమాజానికి విశేషంగా ఉపయోగపడతాయని ప్రొఫెసర్ డాక్టర్ ఎ.తంగవేలు తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలం చినఅవుటపల్లి డాక్టర్స్ సుధ అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల ఆవరణలో నిర్వహించిన అసోసియేషన్ ఆఫ్ మ్యాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ 15వ వార్షిక సదస్సు రెండో రోజు శనివారం ముగిసింది. తంగవేలు మాట్లాడుతూ.. ముఖానికి సంబంధించిన అధునాతన శస్త్ర చికిత్సల్లో ఈ తరం పీజీ విద్యార్థులు మరిన్ని ప్రయోగాలతో దవడ, ఎముకల శస్త్ర చికిత్సలో మార్పులు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఏపీ చాప్టర్ ప్రెసిడెంట్, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 150 మంది సర్జన్స్, 100 మంది పీజీ సర్జన్స్ ఈ సదస్సులో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారన్నారు. సదస్సులో సందేశాలు అందించిన నిపుణులను జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో సత్కరించారు. ఆర్గనైజింగ్ చైర్మన్ కె.వై.గిరి, ఏపీ చాప్టర్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, డాక్టర్స్ సుధ అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామోజీరావు పాల్గొన్నారు.

చంద్రగిరిలో 1,060 భారీ వినాయక విగ్రహాల పంపిణీ

- నియోజకవర్గం నుంచి తరలివచ్చిన యువత
- జై బోలో గణేశ్ మహరాజ్‌కి.. అంటూ మార్మోగిన ప్రాంగణం
- సేవా కార్యక్రమాల నిర్వహణలో చెవిరెడ్డికి సాటిరారన్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుపతి రూరల్: వినాయక చవితిని పురస్కరించుకుని చంద్రగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిల ఆధ్వర్యంలో పేపర్, బంకమట్టితో తయారు చేసిన 1,060 భారీ వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని తిరుచానూరు మార్కెట్ యార్డులో శనివారం టీటీడీ ఈవో ధర్మారెడ్డి ప్రత్యేక పూజలు చేసి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలోని పల్లెలకు చెందిన యువకులు స్థానికులతో కలిసి వినాయక ఉత్సవాలు నిర్వహించుకునేందుకు సంకల్పించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇలా విగ్రహాల కోసం 1,060 వినతులు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దృష్టికొచ్చాయి. దాదాపు 25 వేల మంది యువత ఇందులో భాగస్వాములవుతున్నారు. పల్లెల్లో స్నేహపూర్వక వాతావరణం కల్పించడంతో పాటు యువతను ఆధ్యాత్మికత వైపు నడిపించాలని గత 15 ఏళ్లుగా ఎమ్మెల్యే చెవిరెడ్డి.. వినాయక విగ్రహాలను సొంత నిధులతో తయారు చేయించి ఉచితంగా అందిస్తున్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకకు చెందిన నిపుణులైన 160 మంది కార్మికులు ఏడు నెలలుగా నిర్విరామంగా శ్రమించి వీటిని తయారు చేశారు. ప్రతి సచివాలయానికి పది చొప్పున పల్లెలకు పంపించేందుకు సిద్ధం చేసిన విగ్రహాలతో కూడిన వాహనాలను ఈవో ధర్మారెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి శనివారం జెండా ఊపి ప్రారంభించారు. వీటిని తీసుకెళ్లేందుకు నియోజకవర్గంవ్యాప్తంగా దాదాపు 25 వేల మంది యువకులు విగ్రహాల పంపిణీ ప్రాంగణానికి చేరుకున్నారు. జై బోలో గణేశ్ మహరాజ్‌కి.. అంటూ నినాదాలతో ఆ ప్రాంగణం మార్మోగిపోయింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి సాటి మరెవరూ లేరని కొనియాడారు. హిందూ ధర్మాన్ని పెంపొందించేలా చెవిరెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే ప్రథమ కర్తవ్యంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఉచితంగా వినాయక విగ్రహాలను అందిస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ విగ్రహాన్ని అందించేందుకు తయరవుతున్న మట్టి విగ్రహాలను టీటీడీ ఈవో, వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు పరిశీలించారు. ఆదివారం ఇంటింటికీ వాటి పంపిణీని ప్రారంభిస్తారు.



విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈవో ధర్మారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి, మోహిత్‌రెడ్డి

వరసిద్ధి వినాయకుడి సన్నిధిలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకుడిని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కామేశ్వరరావు, జస్టిస్ అనుప్ శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు సాదర స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.



ఆలయం వద్ద ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కామేశ్వరరావు, జస్టిస్ అనుప్

కల్యాణ వెంకన్నకు బంగారు చక్రహస్తం సమర్పణ

చంద్రగిరి(తిరుపతి జిల్లా): శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామికి అన్నమయ్య జిల్లా పీలేరు జెడ్పీటీసీ సభ్యుడు రత్నాశేఖర్ రెడ్డి 246 గ్రాముల బంగారు హస్తం సమర్పించారు. సుమారు రూ.14.09 లక్షలు విలువైన ఈ హస్తాన్ని ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మికి శనివారం అందజేశారు. తొలుత బంగారు హస్తాన్ని స్వామివారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆలయ అధికారులకు బంగారు హస్తం అందజేస్తున్న దాతలు

కాణిపాకంలో ధర్మప్రచార రథం ప్రారంభం

వరసిద్ధి వినాయకుడికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి ఆర్కే రోజా

యాదమరి (చిత్తూరు జిల్లా): మన సనాతన ధర్మాన్ని ఊరూరా ప్రచారం చేద్దామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా పిలుపునిచ్చారు. ధర్మప్రచార మాసోత్సవాలను పురస్కరించుకుని గ్రామీణ ప్రజలకు సనాతన ధర్మంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధర్మప్రచార రథాన్ని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుతో కలిసి మంత్రి రోజా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన భారతదేశం పుణ్యభూమి అన్నారు. మన సనాతన ధర్మాన్ని, సాంప్రదాయాలను ప్రజలకు తెలియజేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచించారని తెలిపారు. ఈ ప్రచార రథం మారుమూల పల్లెల్లో సైతం ధర్మప్రచారం నిర్వహిస్తుందని వివరించారు.

కొలువుతీరిన సిద్ధి, బుద్ధి సమేత వినాయకుడు

మాసం రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్న స్వామివారి ప్రచార రథంలో సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామి కొలువుతీరారు. తొలుత ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా తీసుకెళ్లారు. చిత్తూరు జిల్లాలో 31 మండలాల్లో ఈ రథ యాత్ర సాగనుంది. కాగా, ఉదయం స్వామివారికి మంత్రి రోజా పట్టు వస్త్రాలను మేళ తాళాలతో మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. అనంతరం అభిషేక కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు పాల్గొన్నారు.



ధర్మప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కే రోజా, ఎమ్మెల్యే బాబు

మెనూ సక్రమంగా అమలు చేయాలి

భారత ఫుడ్ కమిటీ సభ్యుడు డాక్టర్ ఉపేంద్రసింగ్

రంపచోడవరం (అల్లూరి సీతారామ రాజు): ఏజెన్సీలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలని భారత ఫుడ్ కమిటీ సభ్యుడు డాక్టర్ ఉపేంద్రసింగ్ ఆదేశించారు. శనివారం మండలంలోని ఇర్లపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వేడి ఆహారం అందించాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూశారు. సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. ఫుడ్‌కమిటీ సభ్యులు సైపుద్దీన్, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్, డివిజనల్ సివిల్ సప్లయి అధికారి శ్రీహరి, ఏటీడబ్ల్యూవో రామతులసి పాల్గొన్నారు.



ఆహారాన్ని పరిశీలిస్తున్న భారత ఫుడ్ కమిటీ సభ్యుడు ఉపేంద్రసింగ్

తెలంగాణ

21 నుంచి మరోవిడత దోస్త్ కౌన్సెలింగ్

- 19 నుంచి ఇంట్రాకాలేజీల ఆప్షన్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశానికి మరోవిడత దోస్త్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు ఉన్నత విద్యామండలి తెలిపింది. ఇప్పటివరకూ రిజిస్ట్రేషన్ చేసుకోనివారు, రద్దయిన అభ్యర్థులు ఈ నెల 21 నుంచి 24వ తేదీలోగా రూ.400 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. దోస్త్ ద్వారా మిగిలిపోయిన వివిధ కాలేజీల్లోని సీట్లకు 21 నుంచి 25 వరకూ ఆప్షన్లు ఇవ్వొచ్చు. ఈ నెల 29న సీట్లు కేటాయిస్తారు. సీట్లు పొందిన అభ్యర్థులు 30వ తేదీలోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. వచ్చే నెల 3, 4 తేదీల్లో అన్ని ప్రైవేటు కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్ నిర్వహించాలని మండలి పేర్కొంది. కాగా, సీటు పొందిన కాలేజీలో వేరే బ్రాంచీకి మారాలనుకునే అభ్యర్థులు ఈ నెల 19, 20 తేదీల్లో ఇంట్రా కాలేజీ వెబ్ ఆప్షన్లు ఇవ్వొచ్చు. ఈ నెల 21న ఇంట్రా కాలేజీ సీట్ల కేటాయింపు ఉంటుంది.

కన్నబిడ్డలనే కాల్వలోకి తోసి...

- కల్లు తాగొద్దని భర్త మందలించాడని.. ఓ తల్లి ఘాతుకం
- ముగ్గురు కుమార్తెల మృతి.. దొరకని కుమారుని ఆచూకీ

బిజినేపల్లి: కల్లు తాగొద్దని భర్త హెచ్చరించాడన్న కోపంతో ఓ తల్లి ముక్కుపచ్చలారని తన నలుగురు చిన్నారులను కాల్వలో విసిరేసింది. ఈ ఉదంతం శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని ఎర్రకుంటతండాలో చోటుచేసుకుంది. మండలంలోని లట్టుపల్లి పంచాయతీ పరిధిలోని ఎర్రకుంట తండాకు చెందిన లలిత మంగనూర్‌కు చెందిన శరబందను ఎనిమిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి కూతుళ్లు మహాలక్ష్మి (7), సాత్విక (5), మంజుల (3)తోపాటు 7 నెలల కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో లలిత కొన్నాళ్లుగా మందు కల్లును తాగుతుండటంతో పలుమార్లు భర్త శరబంద మందలించాడు. దీంతో భర్త తరచూ మందలిస్తున్నాడని లలిత శనివారం బిజినేపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. పోలీసులు శరబందను స్టేషన్‌కు రావాలని ఫోన్ చేసి పిలిచారు. మధ్యాహ్నం కావడంతో పిల్లలకు ఏమైనా తినిపించుకు వస్తానని చెప్పి వెళ్లిన లలిత.. పోలీస్‌స్టేషన్ సమీపంలోని కేఎల్ఐ కాల్వలోకి చిన్నారులతో కలిసి దిగింది. అటుగా వెళ్తున్న కొందరు ఆమెను గమనిస్తుండగానే నలుగురు చిన్నారులను కాల్వలోకి విసిరేసింది. వెంటనే వారు బిజినేపల్లి పోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించి కాల్వలోకి దిగారు. పోలీసులు సైతం కాల్వ వద్దకు వచ్చి గాలించగా.. నీటి ఉధృతికి చిన్నారులు కిలోమీటరు మేర కొట్టుకుపోయారు. చివరికి ముగ్గురు కుమార్తెల మృతదేహాలు లభించగా.. బాలుడు మార్కండేయ ఆచూకీ లభించలేదు. అప్పటికే పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. చిన్నారులను కాల్వలో విసిరేసిన తల్లిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న భర్త శరబంద సైతం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. చిన్నారుల మృతదేహాలను పోలీసులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎవర్‌గ్రీన్.. సీఎస్ఈ

- కంప్యూటర్ సైన్స్ కోర్సులవైపే కళాశాలలు, విద్యార్థులు, తల్లిదండ్రుల మొగ్గు
- ఎక్కువ ఉద్యోగావకాశాలు, మంచి వేతన ప్యాకేజీలే కారణం
- సంప్రదాయ బ్రాంచ్‌లపై తగ్గిన మోజు
- ఏటా పెరుగుతున్న సీఎస్ఈ సీట్లు
- ఏఐ, ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ కోర్సులకు డిమాండ్
- కళాశాలల్లో 40కి పైగా బ్రాంచ్‌లున్నా 60 శాతం సీఎస్ఈ సీట్లే
- ఈ ఏడాది ఇంజనీరింగ్ మొదటి కౌన్సెలింగ్‌లోనే 90 శాతం సీట్ల భర్తీ



సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఇంజనీరింగ్‌లో దాదాపు 40కిపైగా బ్రాంచ్‌లున్నా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మొగ్గు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ)కే ఉంది. ఈ కోర్సుతో బీటెక్ చేసినవారికి అపార అవకాశాలు అందుబాటులో ఉండటమే ఇందుకు కారణం. సీఎస్ఈ విద్యార్థులు కోర్సు మూడో సంవత్సరంలోనే భారీ వార్షిక వేతన ప్యాకేజీలతో ఉద్యోగాలు కొల్లగొడుతున్నారు. ప్రస్తుతం కంపెనీల అవసరాలకనుగుణంగా, జాబ్ మార్కెట్ ట్రెండ్‌కు అనుగుణంగా కంప్యూటర్ సైన్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటివి అందుబాటులోకి వచ్చాయి. వీటికి దేశ, విదేశాల్లో అపార ఉద్యోగావకాశాలు ఉండటంతో విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరడానికి ఎగబడుతున్నారు. కన్వీనర్ కోటాలో సీటు రాకపోయినా పేరున్న ప్రైవేటు కళాశాలల్లో భారీ ఎత్తున లక్షలాది రూపాయలు డొనేషన్లు కట్టి చేరిపోతున్నారు.

ఈ కోర్ బ్రాంచ్‌లకు పడిపోయిన డిమాండ్..

ఇంజనీరింగ్‌లో 40కి పైగా బ్రాంచ్‌లున్నా వీటిలో కోర్ బ్రాంచ్‌లకే విద్యార్థుల ఆదరణ ఉండేది. నాలుగైదేళ్ల క్రితం వరకు బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), కెమికల్, సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ వంటి బ్రాంచ్‌ల్లో విద్యార్థులు చేరిపోయేవారు. వీటిలో ఏ బ్రాంచ్‌లో చేరినా ఆ తర్వాత ఉద్యోగాలు దక్కేవి. బీటెక్ తర్వాత ఉన్నతవిద్య పరంగానూ మంచి అవకాశాలు ఉండేవి. అయితే ఐటీ రంగం బూమ్ కొనసాగుతుండటం, అన్ని రంగాల్లోకి ఇది విస్తరిస్తుండటంతో కంప్యూటర్ సైన్స్ ఎవర్‌గ్రీన్‌గా, హాట్ కేకులా నిలిచింది. రాష్ట్రంలో దాదాపు 230 వరకు ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా వీటిలో సగానికి పైగా సీట్లు కంప్యూటర్ సైన్స్, దాని అనుబంధ కోర్సులవే కావడం గమనార్హం.

సీఎస్ఈ సీట్లు పెంచుకుంటున్న కళాశాలలు..

కంప్యూటర్ సైన్స్, దాని అనుబంధ కోర్సులకు డిమాండ్ పెరుగుతుండటంతో కళాశాలలు సైతం ఈ కోర్సుల్లో సీట్లు పెంపునకే మొగ్గుచూపుతున్నాయి. విద్యార్థులు అంతగా చేరని మెకానికల్, సివిల్, కెమికల్, ఆటోమొబైల్, ఈఈఈ, మైనింగ్ ఇంజనీరింగ్ తదితర కోర్సులను వదిలించుకుంటున్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ–కాకినాడ (జేఎన్‌టీయూకే) పరిధిలోకి వచ్చే ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో సుమారు 100 కళాశాలలు గతేడాది కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌లో సీట్లు పెంచాలని దరఖాస్తు చేసుకున్నాయి. దీంతో విద్యార్థులు అంతగా చేరని బ్రాంచ్‌ల స్థానంలో కంప్యూటర్ సైన్స్‌లో 5 వేల సీట్లకు జేఎన్‌టీయూకే అనుమతినిచ్చింది. అలాగే ఈ ఏడాది కూడా 4 వేల సీట్ల భర్తీకి అనుమతి మంజూరు చేసింది. గత విద్యా సంవత్సరం జేఎన్‌టీయూకే పరిధిలో ఉన్న 158 ఇంజనీరింగ్ కళాశాలల్లో బీటెక్‌లో అన్ని బ్రాంచ్‌లు కలిపి 69,245 సీట్ల భర్తీకి ఆమోదం తెలిపింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 160 కళాశాలల్లో అన్ని బ్రాంచ్‌ల్లో 66 వేల ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ఆమోదం లభించింది. ఈ మొత్తం సీట్లలో ఒక్క కంప్యూటర్ సైన్స్, దాని అనుబంధ కోర్సులైన ఐవోటీ, ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వంటివాటిలోనే 23 వేలకుపైగా సీట్లున్నాయి. ఈ ఏడాది ఇంజనీరింగ్ మొదటి కౌన్సెలింగ్‌లోనే సీఎస్ఈ సీట్లు 90 శాతం భర్తీ అయిపోయాయని జేఎన్‌టీయూకే వర్గాలు తెలిపాయి. మెకానికల్, సివిల్, పెట్రోలియం, ఈఈఈ వంటి బ్రాంచ్‌ల్లో మాత్రమే సీట్లు మిగిలాయని వెల్లడించాయి.

కనీసం రూ.4 లక్షల వార్షిక వేతనం..

సీఎస్ఈ చేసిన వారిలో 70 నుంచి 80 శాతం మందికి మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఐబీఎం, టీసీఎస్, విప్రో, హెచ్‌సీఎల్, ఒరాకిల్, డెల్, మైక్రోసాఫ్ట్, టెక్ మహీంద్రా, కాగ్నిజెంట్, ఎసెంచర్ వంటి వాటిలో ఉద్యోగాలు దక్కుతున్నాయి. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగం దక్కగానే కనీసం రూ.4 లక్షల వార్షిక వేతనాలు లభిస్తున్నాయి. ఆ తర్వాత రెండేళ్లలోనే వార్షిక వేతనాలు ఏడెనిమిది లక్షల రూపాయలకు చేరుతున్నాయి. ప్రభుత్వ క్యాంపస్ ఇంజనీరింగ్ కళాశాలలు, పేరున్న టాప్ ప్రైవేటు కళాశాలల్లో చదివినవారికైతే నెలకు రూ.లక్షల్లోనే జీతాలు ఉంటున్నాయి.

ఉపాధినిచ్చే కోర్సులపై ఆసక్తి..



ఉపాధినిచ్చే కోర్సులపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అమితాసక్తి చూపుతున్నారు. ప్రతి కళాశాలలోనూ సీఎస్ఈ బ్రాంచ్‌లో అధిక సీట్లు ఉంటున్నాయి. ఎలక్ట్రానిక్స్ విభాగంలో డిమాండ్‌ను బట్టి ఈ విద్యా సంవత్సరం వీఎల్ఎస్ఐ డిజైన్ టెక్నాలజీ, ఈసీఈ (అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ)లో కొత్త సీట్లకు అనుమతిచ్చాం.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఉపకులపతి, జేఎన్‌టీయూకే, కాకినాడ

భవిష్యత్ అంతా సీఎస్ఈదే..



సాఫ్ట్‌వేర్ రంగానికి మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో సీఎస్ఈ సీట్లు 100 శాతం భర్తీ అవుతున్నాయి. బీటెక్‌లో ఏ బ్రాంచ్ చేసినా చివరకు సాఫ్ట్‌వేర్ వైపే విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది జేఎన్‌టీయూకే 650 మందికి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి కల్పించింది. సీఎస్ఈ చదివినవారికి భారీ వేతన ప్యాకేజీలు లభిస్తున్నాయి. భవిష్యత్ అంతా ఈ బ్రాంచ్‌దే.

– ఎస్.రామకృష్ణన్, ప్రొఫెసర్, సీఎస్ఈ, జేఎన్‌టీయూకే, కాకినాడ

తెలంగాణ

30 మంది విద్యార్థినులకు అస్వస్థత

- అల్పాహారం తిని వాంతులు చేసుకున్న బాలికలు
- పులిహోరాలో పురుగులు వచ్చాయని వెల్లడి
- మంచాల బీసీ బాలికల వసతి గృహంలో ఘటన

మంచాల: హాస్టల్‌లో వడ్డించిన అల్పాహారం తిని 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. బీసీ బాలికల వసతి గృహంలో మొత్తం 94 మంది విద్యార్థినులు ఉన్నారు. శనివారం ఉదయం వీరికి అల్పాహారంగా పులిహోర పెట్టారు. అందులో పురుగులు వచ్చాయని విద్యార్థినులు చెబుతున్నారు. అల్పాహారం తిన్నవారిలో ఒకరి తర్వాత ఒకరు తలనొప్పి, కడుపు నొప్పి సమస్యలతో ఇబ్బంది పడ్డారు. పదుల సంఖ్యలో పిల్లలు అస్వస్థతకు గురికావడంతో వారిని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గంట వ్యవధిలోనే 30 మందికి పైగా విద్యార్థినులు వాంతులు చేసుకుని, కాళ్లు, చేతులు లాగుతున్నాయని వాపోయారు. వారికి ఆస్పత్రి వైద్యుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డి చికిత్స చేశారు. కాగా, తీవ్ర అస్వస్థతకు గురైన కె.అనిత (7వ తరగతి), కె.అఖిల (8), వి.వైష్ణవి (5), ఎం.శిరీష (5), పి.అక్షర (3), ఎం.పూజ (7), ఆర్.త్రిష (10), ఎం.శ్రీనిధి (4వ తరగతి)ని మెరుగైన వైద్యం కోసం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఇందులో నలుగురిని వనస్థలిపురంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. విద్యార్థుల విషయంలో వార్డెన్‌తో పాటు హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వివిధ సంఘాల నాయకులు ఆరోపించారు.

నిజాంను ఎదిరించిన యోధుల కుటుంబ సభ్యులకు సన్మానం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి
- పరేడ్ గ్రౌండ్స్‌లో విమోచన దినోత్సవ సభ ఏర్పాట్ల పరిశీలన

రసూల్‌పురా (హైదరాబాద్): నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుల కుటుంబ సభ్యులను తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమంలో సన్మానిస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న విమోచన దినోత్సవ కార్యక్రమానికి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం సభ ఏర్పాట్లను కిషన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా చేయడం లేదని, దీంతో ఈ యేడు కూడ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఉత్సవానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని ఆయన తెలిపారు. కాగా, కేంద్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమంపై పోలీసులు, ఒక పార్టీ మీటింగ్ తరహాలో సర్క్యులర్ జారీ చేశారని, దీనిపై వెంటనే క్షమాపణ చెప్పాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నిజాం పాలనలో పోరాటాలు, ప్రజల కష్టాలపై కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పర్పువల్‌గా ఎగ్జిబిషన్, నిజాం పాలన నుంచి విముక్తి కోసం పోరాడిన ప్రముఖ పాత్రికేయుడు షోయబుల్లాఖాన్, గిరిజన యోధుడు రాంజీ గోండు పేర్ల మీద పోస్టల్ కవర్ విడుదల చేస్తున్నామని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ జైల్లో పెట్టింది..

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో తెలంగాణ విమోచన ఉత్సవాలను జరపాలని బీజేపీ డిమాండ్ చేస్తే తమ నాయకులను, కార్యకర్తలను కొట్టి జైల్లో వేశారని కిషన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు ఎప్పుడూ విమోచన వేడుకలు నిర్వహించలేదని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం రజాకార్ల వారసుల పార్టీతో కలసి చరిత్రను తెలియనివ్వలేదని విమర్శించారు.

క్లుప్తంగా...

పాకిస్తాన్‌లో లీటర్ పెట్రోల్ రూ.330

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లోని ఆపద్ధర్మ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను మరోసారి పెంచింది. లీటర్ పెట్రోల్‌పై రూ.26.02, డీజిల్‌పై రూ.17.34 పెంచుతున్నట్లు శుక్రవారం అర్ధరాత్రి ప్రకటించింది. తాజా పెంపుతో లీటర్ పెట్రోల్, హైస్పీడ్ డీజిల్ ధర గతంలో ఎన్నడూ లేనంత స్థాయికి రూ.330కు చేరుకుంది. ద్రవ్యోల్బణం 27.4 శాతానికి చేరడంతో ఈ చర్య అనివార్యమయినట్లు ప్రభుత్వం చెబుతోంది. శనివారం అమెరికా డాలర్‌తో పోలిస్తే 296.41 పాకిస్తానీ రూపాయలకు చేరుకుంది. ఈ నెల ఒకటో తేదీన కూడా ఆపద్ధర్మ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ.14 చొప్పున పెంచింది.

'ఇండియా' కూటమి బహిరంగ సభ వాయిదా

భోపాల్: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో అక్టోబర్‌లో నిర్వహించ తలపెట్టిన ప్రతిపక్ష 'ఇండియా' కూటమి తొలి బహిరంగ సభ వాయిదా పడింది. మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ శనివారం ఈ విషయం ప్రకటించారు. బహిరంగ సభ ఎప్పుడు నిర్వహించాలన్నది ఇంకా నిర్ణయించలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సూర్జేవాలా చెప్పారు. భోపాల్‌లో ఉమ్మడిగా భారీ సభ నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని ఇండియా కూటమి పక్షాలు ఇటీవలే నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే.

దమ్ముంటే దేశం పేరు మార్చండి: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: కేంద్రంలోని అధికార బీజేపీకి నిజంగా దమ్ముంటే దేశం పేరును మార్చాలని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సవాలు విసిరారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం చాలా పథకాలకు ఇండియా అని పేరు పెట్టిందని చెప్పారు. ప్రతిపక్ష కూటమి 'ఇండియా' అని పేరుపెట్టుకున్న తర్వాత అది సహించలేక దేశం పేరు మార్చే ఆలోచన చేస్తోందని ఆరోపించారు. ''దేశం మీ అబ్బ సొత్తా? ఇది 140 కోట్ల మందికి చెందిన దేశం. ఇండియా, భారత్, హిందూస్తాన్ అనేవి ప్రజల హృదయాల్లో జీవిస్తున్నాయి'' అని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఆయన శనివారం ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. ఇప్పుడు దేశం పేరును 'భారత్'గా మార్చిన తర్వాత ప్రతిపక్ష కూటమి పేరు భారత్‌గా మారితే అప్పుడు కూడా దేశం పేరును మారుస్తారా? అని ప్రశ్నించారు.

- సరైన చర్యలుంటేనే 2050 కల్లా ఉద్గారాలకు పూర్తిగా కళ్లెం
- కానీ 2030 లక్ష్యాలకే అతీగతీ లేని దుస్థితి
- సంపన్న దేశాల ద్వంద్వ ప్రమాణాలే ప్రధాన కారణం
- భావితరాలకు పెను ప్రమాదమే
- హెచ్చరిస్తున్న తాజా నివేదిక..



రూ. 2.24 కోట్ల కోట్లు!

కర్బన, గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలు. ప్రస్తుతం ప్రపంచ మానవాళికి పెను ప్రమాదంగా పరిణమించిన పెను సమస్యలు. పర్యావరణం పట్ల మనిషి బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట. వాటిని ఎలాగైనా తగ్గించాలన్న ప్రతినలు, లక్ష్యాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. భావితరాల భద్రత పట్ల మన జవాబుదారీతనాన్ని నిరంతరం ప్రశ్నిస్తూనే ఉన్నాయి. ప్రస్తుత లెక్కల్లో 2050 నాటికి ఉద్గారాలను పూర్తిగా (నెట్ జీరో స్థాయికి) తగ్గించాలంటే ప్రపంచ స్థాయిలో ఇప్పటి నుంచీ ఏటా కనీసం 2.24 కోట్ల కోట్ల రూపాయలు (2.7 లక్షల కోట్ల డాలర్లు) వెచ్చించాల్సి ఉంటుందట! అలాగైతేనే ఈ శతాబ్దాంతానికల్లా అంతర్జాతీయ సగటు ఉష్ణోగ్రతలు కూడా 1.5 డిగ్రీ సెంటీగ్రేడ్ పరిమితిని దాటకుండా ఉంటాయట. కానీ ఉద్గారాలకు ప్రధాన కారణంగా ఉన్న చాలా దేశాలు తామే స్వయంగా నిర్దేశించుకున్న 2030 లక్ష్యాల సాధనకే అల్లంత దూరంలో ఉన్నాయనీ తాజా నివేదిక ఒకటి వాపోతోంది! ఈ పరిస్థితుల్లో వాటి నుంచి 2050 లక్ష్యాల పట్ల చిత్తశుద్ధితో కూడిన కార్యాచరణను ఆశించడం అత్యాశేనని పర్యావరణవేత్తలు అంటున్నారు. మరోవైపు సముద్రాలకు ముప్పు కూడా నానాటికీ మరింతగా పెరిగిపోతోందని గ్రీన్ పీస్ నివేదిక హెచ్చరిస్తోంది. చేపల వేట విచ్చలవిడిగా సాగుతోందని, గత నాలుగేళ్లలో 8.5 శాతం దాకా పెరిగిందని అది పేర్కొంది!

లక్ష్యాలు ఘనమే కానీ...

- కర్బన ఉద్గారాల కట్టడికి ప్రస్తుతం అన్ని దేశాలూ కలిపి ఏటా 1.9 లక్షల కోట్ల డాలర్లు వెచ్చించాలన్నది లక్ష్యం. కానీ ఇదీ ఒక్క ఏడాది కూడా జరగడం లేదు.
- పలు కీలక సంపన్న దేశాలు ఈ విషయంలో చేస్తున్న గొప్ప ప్రకటనలు మాటలకే పరిమితమవుతున్నాయి.
- అవి పాటిస్తున్న ఈ ద్వంద్వ ప్రమాణాలు పరిస్థితిని మరింత జటిలం చేస్తున్నాయి.
- అవిలాగే దాటవేత ధోరణి కొనసాగిస్తే ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు 2050 కల్లా ఏకంగా 2.5 డిగ్రీలు పెరగడం, మానవాళి మనుగడ పెను ప్రమాదంలో పడటం ఖాయమని స్వయంగా ఐక్యరాజ్యసమితే తాజాగా హెచ్చరించింది.

నెట్ జీరో అంటే..

- కర్బన ఉద్గారాలను దాదాపుగా సున్నా స్థాయికి తగ్గించడం.
- కాస్తో కూస్తో మిగిలే ఉద్గారాలను మహా సముద్రాలు, అడవుల వంటి ప్రాకృతిక వనరులు శోషించుకుంటాయన్నది సిద్ధాంతం.
- ఇందుకు ఉద్దేశించిన నిధుల్లో మూడొంతులు కీలకమైన ఇంధన, మౌలిక రంగాలపై వెచ్చించాలన్నది లక్ష్యం. మిగతా లక్ష్యాలు ఏమిటంటే...
- రవాణా రంగాన్ని వీలైనంతగా విద్యుదీకరించడం.
- గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి.

సముద్రాలకు 'మహా' ముప్పు

మహా సముద్రాలలో విచ్చలవిడిగా సాగుతున్న చేపల వేటపై అంతర్జాతీయ పర్యావరణ సంస్థ గ్రీన్ పీస్ తాజా నివేదిక తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది...



- కానీ ఏ దేశమూ ఈ ఒప్పందాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదని నివేదిక వాపోతోంది.
- విచ్చలవిడిగా వేట దెబ్బకు అరుదైన సముద్ర జీవరాశులు దాదాపుగా అంతరించిపోతున్నాయి.
- 2018తో పోలిస్తే 2022 నాటికి సముద్రాల్లో చేపల వేట 8.5 శాతం పెరిగింది. ప్రత్యేక రక్షిత ప్రాంతాలైన సున్నిత సముద్ర జలాల్లోనైతే ఏకంగా 23.5 శాతం పెరిగింది.
- నిర్దిష్ట అంతర్జాతీయ సముద్ర జలాలను చేపల వేటను నిషేధించాలన్న ప్రతిపాదనలు ఏళ్ల తరబడి గ్రీన్ పీస్ చేసిన కృషి ఫలించి ఎట్టకేలకు గత మార్చిలో ఒప్పందంగా రూపుదాల్చాయి. జూన్‌లో ఐరాస కూడా దానికి ఆమోదముద్ర వేసింది.
- ఉదాహరణకు పసిఫిక్ బ్లూఫిన్ ట్యూనా చేప జాతి గత మూడు దశాబ్దాల్లోనే ఏకంగా 90 శాతానికి పైగా క్షీణించిపోయింది.
- '30 బై 30' లక్ష్య సాధనకు దేశాలన్నీ ఇప్పటికైనా నడుం బిగిస్తే మేలని గ్రీన్ పీస్ నివేదిక పేర్కొంది.
- ప్రపంచంలోని భూ, జలవనరులను 2030 కల్లా కనీసం 30 శాతమన్నా సంపూర్ణంగా సురక్షితంగా తీర్చిదిద్దడమే '30 బై 30' లక్ష్యం.

ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే '1.5 డిగ్రీ ఉష్ణోగ్రత లక్ష్య సాధన అత్యంత పెను సవాలేనని చెప్పాలి. ఈ దశాబ్దంలో మిగిలి ఉన్న ఆరేళ్లలో ఆ దిశగా ఎంత చిత్తశుద్ధితో ప్రయత్నిస్తామన్న దానిపైనే ప్రపంచ భవిష్యత్తు చాలావరకు ఆధారపడి ఉంటుంది'
– సైమన్ ఫ్లవర్స్
సీఈఓ, చీఫ్ స్ట్రాటజిస్ట్, వుడ్ మెకంజీ సంస్థ

'లక్ష్యాల మాట ఎలా ఉన్నా చమురు, సహజ వాయువు పాత్ర అంతర్జాతీయ స్థాయి లో కనీసం మరి కొన్నేళ్ల పాటు కీలకంగానే ఉండనుంది'
– ప్రకాశ్ శర్మ
వైస్ ప్రెసిడెంట్, వుడ్ మెకంజీ

– సాక్షి, నేషనల్ డెస్క్

రేపటి నుంచి పార్లమెంట్

నేడు అఖిలపక్షం భేటీ

న్యూఢిల్లీ: ఈనెల 18వ తేదీ నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరుగనుండగా ఒక రోజు ముందుగా ఆదివారం అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో ప్రభుత్వం సమావేశం కానుంది. ఈ సెషన్ ఉద్దేశం వారికి వివరించి, అభిప్రాయాలు తెలుసుకోనుంది. అయిదు రోజుల సమావేశాల్లో మొదటిరోజు రాజ్యాంగ సభ మొదలుకొని 75 ఏళ్ల పార్లమెంట్ ప్రస్థానంపై ప్రత్యేక చర్చ ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే రాజ్యసభలో ప్రవేశపెట్టిన ది అడ్వొకేట్స్(సవరణ)బిల్లు–2023, ది ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లు–2023, ది పోస్టాఫీస్ బిల్లు–2023లను ఈ సెషన్‌లో లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన మార్పులతో గత సమావేశాల్లో రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లును ఈసారి చర్చకు పెట్టనుంది. అయితే, అనూహ్యంగా మరికొన్ని అంశాలను సైతం ముందుకు తీసుకువచ్చే అవకాశాలున్నాయన్న చర్చ సర్వత్రా జోరుగా సాగుతోంది. లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు కోటా కల్పించే బిల్లును ఈ సమావేశాల్లోనే ప్రవేశపెడుతుందనే వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం దీనిపై ఎటువంటి ప్రకటన చేయలేదు. ఈ ప్రత్యేక సెషన్ సమయంలోనే పార్లమెంట్‌ను నూతన భవనంలోకి మార్చనుందని భావిస్తున్నారు. పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రధాని మోదీ మే 28వ తేదీ ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులోకి మారాక వివిధ విభాగాల సిబ్బందికి కొత్త యూనిఫాం అందజేసేందుకు సైతం కేంద్రం ఆమోదం తెలిపింది. అయితే, ఈ యూనిఫాంపై బీజేపీ ఎన్నికల గుర్తు కమలం ముద్రించడంపై కాంగ్రెస్ మండిపడింది. ఈ అంశంపైనా ప్రత్యేక సెషన్‌లో ప్రతిపక్షాలు చర్చకు పట్టుబడ్డే అవకాశాలున్నాయి. ప్రధాని మోదీ సారథ్యంలో దేశ రాజధానిలో ఇటీవల విజయవంతంగా ముగిసిన జీ20 శిఖరాగ్రం అంశాన్ని పాలకపక్షం చర్చకు తీసుకు వస్తుందని భావిస్తున్నారు. ఏడాదిలో మూడుసార్లు బడ్జెట్, వర్షాకాల, శీతాకాల సమావేశాలు సర్వసాధారణంగా జరుగుతుంటాయి.



నూతన భవనంపై నేడు పతాకావిష్కరణ

పార్లమెంట్ నూతన భవనంపై ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆదివారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు సోమవారం నుంచి కొత్త భవనంలోనే ప్రారంభం కానున్న దృష్ట్యా జగదీప్ ధన్‌ఖడ్ గజద్వారంపై జాతీయ జెండాను ఎగురవేస్తారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతోపాటు కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

ఆ పోలీసును తొలగించాలి

అమెరికాలో ఆన్‌లైన్ పిటిషన్

వాషింగ్టన్: అమెరికాలో గత జనవరిలో పోలీసు వాహనపు అతి వేగానికి బలైన తెలుగమ్మాయి జాహ్నవి కందుల విషయంలో జాత్యహంకార వ్యాఖ్యలు చేసిన సియాటిల్ పోలీసు అధికారి డేనియల్ ఆడరర్‌పై ఆగ్రహ జ్వాలలు నానాటికీ పెరుగుతున్నాయి. 'ఇదేమంత పెద్ద విషయం? ఏ 11 వేల డాలర్లకో చెక్కు రాస్తే సరి. ఆమెకు 26 ఏళ్లు. అలా చూస్తే ఆమె జీవితం అంత విలువైనదేమీ కాదు' అంటూ ఈ ఉదంతంపై అతను చేసిన వ్యాఖ్యలు గత సోమవారం బాడీకామ్ ద్వారా వెలుగులోకి వచ్చాయి. అప్పటినుంచీ వాటిపై తీవ్ర దుమారం రేగుతోంది. రాజా కృష్ణమూర్తి వంటి భారత అమెరికన్ చట్ట సభ్యులతో పాటు అమెరికా చట్ట సభ్యులు కూడా వాటిని తీవ్రంగా తప్పుబడుతున్నారు. డేనియల్ ప్రవర్తన మీద స్వతంత్ర విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. అతన్ని ఉద్యోగం నుంచి తొలగించాలంటూ శుక్రవారం (అమెరికా కాలమానం ప్రకారం) ఆన్‌లైన్ పిటిషన్ దాఖలైంది. నిషిత రోహజా గోయల్ అనే భారత్ అమెరికన్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై ఇప్పటికే వేలాది మంది సంతకాలు చేశారు. శుక్రవారం రాత్రికే సంతకాల సంఖ్య 6,700 దాటిపోయింది. 'డేనియల్ ప్రవర్తనతో సియాటిల్ పోలీసు శాఖపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లింది. అందుకే అతన్ని తక్షణం ఉద్యోగం నుంచి తొలగించడంతో పాటు ఇకపై కొత్తగా పోలీసు శాఖలో చేరే ప్రతి ఒక్కరికీ సున్నితత్వం తదితరాల విషయంలో విధిగా శిక్షణ ఇవ్వాలి. అప్పుడే జాహ్నవి, అలాంటి ఇతర బాధిత కుటుంబాలకు కాస్తయినా సాంత్వన చేకూరుతుంది' అని పిటిషన్ పేర్కొంది. మరోవైపు, డేనియల్‌ను సియాటిల్ పోలీసు అధికారుల గిల్డ్ సమర్థించింది! అతను ప్రైవేట్‌గా చేసిన వ్యాఖ్యలను అసంబద్ధంగా విడుదల చేసి అపార్థాలకు తావిచ్చారని ఆరోపించింది. ఈ మేరకు సుదీర్ఘ వివరణ విడుదల చేసింది. తన వ్యాఖ్యలను దురర్థం వచ్చేలా వక్రీకరించారని డేనియల్ కూడా ప్రకటన విడుదల చేశాడు.

చొరబాట్లు ఆగాలంటే మోదీకే ఓటేయండి

బిహార్‌లో జరిగిన ర్యాలీలో హోం మంత్రి అమిత్ షా ● నితీశ్, లాలూవి బుజ్జగింపు రాజకీయాలని ఆరోపణ

ఝంఝార్‌పూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మరోసారి అధికారం ఇవ్వకుంటే బిహార్‌లోని సరిహద్దులకు సమీపంలోని ప్రాంతాలు అక్రమ చొరబాటుదార్లతో నిండిపోతాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హెచ్చరించారు. బిహార్‌లో ఝంఝార్‌పూర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో శనివారం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. బిహార్‌లోని ఈ ప్రాంతం నేపాల్, బంగ్లాదేశ్‌ల సరిహద్దులకు సమీపంలో ఉంటుంది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దుతోపాటు వచ్చే ఏడాది జనవరికల్లా అయోధ్యలో రామాలయ నిర్మాణం పూర్తి చేయనున్న ప్రధాని మోదీపై ఆయన ప్రశంసలు కురిపించారు. లాలూ– నితీశ్ ద్వయం మళ్లీ అధికారంలోకి వచ్చినా, ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టలేకపోయినా ఈ ప్రాంతం మొత్తం అక్రమ చొరబాటుదార్లతో కిక్కిరిసిపోవడం ఖాయమన్నారు. ఫలితంగా బిహార్‌ను అనేక సమస్యలు చుట్టుముడతాయని ఆయన హెచ్చరించారు. చొరబాటుదార్లతో ఈ ప్రాంతం నిండిపోవాలని మీరు అనుకుంటున్నారా అని ఆయన ప్రశ్నించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగానే 2024 లోనూ బిహార్‌లోని మొత్తం 40 సీట్లను బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



యూపీఏ బదులు..ఇండియా ఎందుకంటే..

యూపీఏ హయాంలో 12 లక్షల కోట్ల కుంభకోణంతో సంబంధాలున్నాయి కాబట్టే అప్పటి పార్టీలన్నీ కలిసి ఈసారి ఇండియా అనే కొత్త పేరు పెట్టుకున్నాయని అమిత్ షా వ్యాఖ్యానించారు. ఆ కూటమి నేతలు సనాతన ధర్మాన్ని చులకన చేసి మాట్లాడటాన్ని ఆయన తప్పుపట్టారు. ప్రధాని పీఠంపై ఆశలు పెట్టుకున్న నితీశ్ కుమార్ గతంలో లాలూ ప్రసాద్ పాల్పడిన కుంభకోణాలను చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారని ఆరోపించారు. అయితే, ప్రధాని పదవి ఖాళీగా లేదన్న విషయం నితీశ్ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. లాలూతో నితీశ్ పొత్తు నీళ్లు, చమురు కలయిక చందంగా ఉంటుందన్నారు. నీళ్లతో చమురు కలియకపోగా నీళ్లన్నిటినీ కలుషితం చేస్తుందని అమిత్ షా వ్యాఖ్యానించారు. ప్రధాని కావడమెలాగని నితీశ్ ఆలోచిస్తుండగా లాలూ మాత్రం తన కొడుకు, డిప్యూటీ సీఎం తేజస్వీని సీఎంగా చూడాలని ప్రణాళికలు వేస్తున్నారని చెప్పారు. సీఎం నితీశ్ కుమార్, ఆర్‌జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ కలిసి ప్రభుత్వ స్కూళ్లకు సెలవులు తగ్గించడం వంటి బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నా రని ఆరోపించారు. రాష్ట్రంలోని సంకీర్ణ కూటమిలోని కాంగ్రెస్ కూడా ఇదే వైఖరితో ఉందన్నారు. కృష్ణాష్టమి, రక్షాబంధన్ సందర్భంగా సెలవులను రద్దు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వును రద్దు చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చిన బిహార్ ప్రజలకు అమిత్ షా అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులు సమ్మె చేయడంతో ఏడాదిలో అవసరమైనన్ని రోజులు తరగతులు నిర్వహించాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన కొత్త క్యాలెండర్‌ను విద్యాశాఖ ఉపసంహరించుకున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

23న కోవింద్ కమిటీ తొలి భేటీ

'వన్ నేషన్–వన్ ఎలక్షన్'పై చర్చ

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిఫార్సులు చేసేందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన ఏర్పాటైన అత్యున్నత స్థాయి కమిటీ తొలి అధికారిక సమావేశం ఈనెల 23న జరగనుంది. ఈ విషయాన్ని భువనేశ్వర్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న కోవింద్ స్వయంగా ప్రకటించారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే అంశంపై వీలైనంత త్వరగా పరిశీలించి సిఫార్సులు చేసేందుకు 8 మంది సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీని ప్రభుత్వం గతంలోనే నోటిఫై చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీలో హోం మంత్రి అమిత్‌షా, లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి, రాజ్యసభలో మాజీ ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్, ఆర్థిక సంఘం మాజీ చైర్మన్ ఎన్‌కే సింగ్, మాజీ లోక్‌సభ సెక్రటరీ జనరల్ సుభాష్ సి.కశ్యప్, సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారీ సభ్యులుగా ఉన్నారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉన్న న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, ప్యానల్ కార్యదర్శిగా ఉన్న న్యాయశాఖ కార్యదర్శి నితిన్ చంద్ర భేటీకి హాజరయ్యే అవకాశాలున్నాయి. 'వన్ నేషన్–వన్ ఎలక్షన్'పై రాజ్యాంగానికి అవసరమైన నిర్దిష్ట సవరణలు, ప్రజాప్రాతినిధ్య చట్టంలో, ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం కోసం అవసరమయ్యే ఇతర సవరణలపై లోతుగా చర్చించనుంది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఈ నెల 22వ తేదీతో ముగియనుండగా, ఆ మరుసటి రోజే కమిటీ భేటీ కానుండటం గమనార్హం.



రష్యాలో కిమ్ జోంగ్ ఉన్ బిజీబిజీ

అత్యాధునిక క్షిపణులు, ఆయుధాలు పరిశీలించిన ఉత్తర కొరియా నియంత

సియోల్: ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ రష్యా పర్యటనలో బిజీబిజీగా గడుపుతున్నారు. ఆయన శనివారం రష్యా ఆయుధాగారాన్ని సందర్శించారు. రష్యా అభివృద్ధి చేసిన అణ్వస్త్ర సహిత బాంబర్లు, హైపర్‌సానిక్ క్షిపణులు, అత్యాధునిక యుద్ధ నౌకను పరిశీలించారు. కిమ్ తొలుత ఉత్తర కొరియా నుంచి రైలులో అర్టియోమ్ సిటీకి చేరుకున్నారు. ఇక్కడికి సమీపంలోని ఎయిర్‌పోర్టులో రష్యాకు చెందిన వ్యూహాత్మక బాంబర్లు, యుద్ధ విమానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కిమ్ వెంట రష్యా రక్షణ మంత్రి సెర్గీ షోయిగు ఉన్నారు. టు–160, టు–95–, టు–22 బాంబర్ల గురించి కిమ్ ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. మిగ్–31 ఫైటర్ జెట్ నుంచి ప్రయోగించే హైపర్‌సానిక్ కింజాల్ క్షిపణుల గురించి కిమ్‌కు సెర్గీ వివరించారు. ఇలాంటి క్షిపణులను ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా సైన్యం ప్రయోగిస్తోంది. కిమ్, సెర్గీ షోయిగు కలిసి రేవు నగరం వ్లాదివోస్తోక్ చేరుకున్నారు. ఇక్కడ అత్యాధునిక యుద్ధ నౌకలను, ఆయుధాలను కిమ్ పరిశీలించారు. ఆయుధాలు, ఉపగ్రహాల తయారీ విషయంలో రష్యా నుంచి ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికే కిమ్ రష్యాలో పర్యటిస్తున్నట్లు పశ్చిమ దేశాలు అంచనా వేస్తున్నాయి.

యూకే విజిటింగ్, స్టూడెంట్ వీసా ఫీజుల మోత

లండన్: బ్రిటన్ ప్రభుత్వం విద్యార్థి, సందర్శక వీసా ఫీజులను త్వరలో భారీగా పెంచనుంది. విజిటింగ్ వీసాపై 15 పౌండ్లు, విద్యార్థి వీసాపై అదనంగా 127 పౌండ్లు పెంచుతున్నట్లు తెలిపింది. భారతీయులు సహా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల వారికి ఇవి వర్తిస్తాయని పేర్కొంది. ఈ పెంపుదల అక్టోబర్ నాలుగో తేదీ నుంచి అమల్లోకి రానుందని స్పష్టం చేసింది. శుక్రవారం పార్లమెంట్‌లో హోంశాఖ ఈ మేరకు బిల్లు ప్రవేశపెట్టింది. దీని బిల్లు ప్రకారం ఆరు నెలల విజిటింగ్ వీసా ఫీజు ప్రస్తుతమున్న 100 పౌండ్ల నుంచి 115 పౌండ్ల(సుమారు రూ.12 వేలు)కు, విద్యార్థి వీసాకు ఫీజు 363 పౌండ్ల నుంచి 490 పౌండ్ల(సుమారు రూ.50 వేలు)కు పెరగనుంది. ఫీజుల పెంపు ఆరోగ్యం, సంరక్షణ వీసాతో సహా దాదాపు అన్ని రకాల వీసాలకు వర్తిస్తుంది; బ్రిటిష్ పౌరుడిగా నమోదు దరఖాస్తుకు, ఆరు నెలలు, రెండు, ఐదు, 10 సంవత్సరాల సందర్శన వీసాల ఫీజులు కూడా పెరగనున్నాయి. ఉద్యోగం, చదువుకు సంబంధించిన కొన్ని దరఖాస్తులకు సైతం ఈ పెంపు వర్తిస్తుంది. అక్టోబర్ నాలుగో తేదీ నుంచి ఇవి అమల్లోకి వస్తాయని హోం శాఖ తెలిపింది.

పైకప్పు కూలిపడి అయిదుగురు మృత్యువాత



లక్నో: ఇంట్లో నిద్రిస్తున్న వారిపై పైకప్పు కొంతభాగం కూలిపడిన ఘటనలో తల్లిదండ్రులు, వారి ముగ్గురు చిన్నారులు మృత్యువాతపడ్డారు. ఆలంబాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆనంద్‌నగర్ రైల్వే కాలనీలో శనివారం వేకువజామున ఘటన చోటుచేసుకుంది. ఉదయం 8 గంటల సమయంలో పారిశుధ్య సిబ్బంది గమనించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక సిబ్బంది, స్థానికులతో కలిసి శిథిలాల నుంచి చంద్ర, సరోజినీ దేవి(35), వారి పిల్లలు హర్షిత్(13), హర్షిత(10), అన్ష్(5) మృతదేహాలను వెలికి తీశారు. కాలనీలోని వారుంటున్న ఇల్లు శిథిలావస్థకు చేరుకుందని, ఖాళీ చేయమని నోటీసులిచ్చినా పట్టించుకోలేదని రైల్వే అధికారులు తెలిపారు.

లిఫ్టు కూలిన ఘటనలో 8కి చేరిన మృతులు

నోయిడా: గ్రేటర్ నోయిడాలోని నిర్మాణంలో ఉన్న భవనంలో లిఫ్టు కూలిన ఘటనలో క్షతగాత్రులైన నలుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో, ఈ ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరుకుంది. ఆమ్రపాలి డ్రీమ్ వ్యాలీ ప్రాజెక్టులోని నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో శుక్రవారం ఉదయం 14వ ఫ్లోర్ నుంచి లిఫ్టు కూలి నలుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలించిన అయిదుగురిలో నలుగురు శనివారం చనిపోయారు. మరొకరు ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. బాధితులంతా యూపీ, బిహార్‌లకు చెందిన వలస కార్మికులు.



కేరళలోని కోజికోడ్ బీచ్ ఇది. నిఫా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు అధికారులు విధించిన ఆంక్షలతో ఇలా బోసిపోయింది. రాష్ట్రంలో నిఫా వైరస్ కేసులేవీ కొత్తగా నమోదు కాలేదని ప్రభుత్వం శనివారం తెలిపింది. బాధితులతో సన్నిహితంగా మెలిగినట్లుగా అనుమానిస్తున్న 1,192 మందిని గుర్తించామంది.

డ్రోన్లతో చొరబాట్లు!

- పాకిస్తాన్ నుంచి భారత్‌లోకి ఉగ్రవాది చేరవేత
- లష్కరే తోయిబా బరితెగింపు

న్యూఢిల్లీ: డ్రోన్లతో ఉగ్రవాదులు ఆయుధాలు, మాదక ద్రవ్యాలు, డబ్బులు చేరవేయడం గురించి విన్నాం. చొరబాట్లకు కూడా డ్రోన్లను ఉపయోగించుకుంటున్నట్లు తేలడం ఆందోళన కలిగిస్తోంది. పాకిస్తాన్ చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా కొన్ని నెలల క్రితం డ్రోన్‌తో పంజాబ్‌లో ఓ ఉగ్రవాదిని జార విడిచిందని నిఘా వర్గాలు వెల్లడించాయి. ఈ డ్రోన్‌కు 70 కిలోల వరకు బరువును మోసుకెళ్లగల సామర్థ్యం ఉందని తెలియజేశాయి. పాకిస్తాన్ భూభాగంలోని షాకర్‌గఢ్‌లో లష్కరే తోయిబా శిక్షణా కేంద్రంలో ఇలాంటి డ్రోన్ల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న వీడియోను నిఘా వర్గాలు సేకరించాయి. డ్రోన్లు మనుషులను సునాయాసంగా మోసుకెళ్లి, నీటిలో భద్రంగా వదిలిపెడుతున్న దృశ్యాలు ఈ వీడియోలో కనిపిస్తున్నాయి. పంజాబ్‌లో డ్రోన్ సాయంతో అక్రమంగా చొరబడిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించామని అధికారులు చెప్పారు. లష్కరే తోయిబా నాయకులే డబ్బులు ఇచ్చి పంపించినట్లు అతడు అంగీకరించాడని తెలిపారు. డ్రోన్ సాయంతో పంజాబ్ వెళ్లి, అక్కడే స్థిరపడి, ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించాలంటూ లష్కరే తోయిబా నాయకత్వం నుంచి అతడికి ఆదేశాలు అందాయని వెల్లడించారు. పంజాబ్‌లో ఇప్పటికే మకాం వేసిన ముష్కరుల నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రి తీసుకోవాలంటూ అతడికి సూచనలిచ్చారని పేర్కొన్నారు. లష్కరే తోయిబాపై భారత్ గతంలోనే నిషేధం విధించిన సంగతి తెలిసిందే. పాకిస్తాన్ నుంచి భారత్‌లోకి ఆయుధాలను, డ్రగ్స్‌ను పంపించడానికి పాకిస్తాన్ ఉగ్రవాద మూకలు డ్రోన్లను వాడుకుంటున్నట్లు ఇప్పటికే నిర్ధారణ అయ్యింది. ప్రధానంగా జమ్మూకశ్మీర్, పంజాబ్‌కు ఈ డ్రోన్ల ద్వారా ఆయుధాలు, డ్రగ్స్ వచ్చి పడుతున్నాయి. ఈ వ్యవహారం వెనుక పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలతోపాటు ఖలిస్తాన్ అనుకూల శక్తుల హస్తం కూడా ఉండొచ్చని భారత నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.

ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: వాస్తవాధీన రేఖ(ఎల్‌ఓసీ) వద్ద చొరబాటు యత్నాన్ని భారత భద్రతా దళాలు విజయవంతంగా తిప్పికొట్టాయి. ఈ క్రమంలో చోటుచేసుకున్న ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. బారాముల్లా జిల్లాలోని యూరీ సెక్టార్ హత్లాంగ్ ఫార్వర్డ్ ఏరియాలో శనివారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. సైన్యం, కశ్మీర్ పోలీసులు, నిఘా ఏజెన్సీలు ఉమ్మడి ఆపరేషన్ చేపట్టాయని, చొరబాటు యత్నాన్ని భగ్నం చేశాయన్నారు. పొరుగు దేశం నుంచి మన భూభాగంలోకి ప్రవేశిస్తున్న ఉగ్రవాదులను అడ్డుకొనేందుకు ప్రయత్నించగా, కాల్పులు జరిపారని, దాంతో భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరిపాయని తెలిపారు. కాల్పుల్లో ముగ్గురు ముష్కరులు మరణించారని, ఇద్దరి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పాకిస్తాన్ వైపు నుంచి కాల్పులు కొనసాగుతున్నాయన్నారు. హతమైన ముగ్గురు ముష్కరుల వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మరోవైపు, అనంత్‌నాగ్ జిల్లాలో ముగ్గురు భారత ఉన్నతాధికారులను బలి తీసుకున్న ఉగ్రవాదుల కోసం వేట కొనసాగుతోందని వెల్లడించారు. ఈ ఆపరేషన్ శనివారం నాలుగో రోజుకు చేరింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం : 17 : సెప్టెంబర్ : 2023



అందమైన వేడుక

బెంగళూరు హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్‌లో శనివారం ఓ నగల షోరూం ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా క్యాట్‌వాక్‌తో అలరించిన ముద్దుగుమ్మలు

ప్రైవేటు బస్సుల్లో పండుగ బాదుడు

- దూర ప్రాంతాలకు రెట్టింపు ధరలు
- పండుగ, వరుస సెలవులను సొమ్ము చేసుకుంటున్న వైనం



శివాజీనగర: గౌరీ గణేశ పండుగ, వరుసగా సెలవులు రావడంతో బెంగళూరు నుంచి ఇతర నగరాలకు, అలాగే తెలుగు రాష్ట్రాలకు వేలాది మంది తరలివెళ్తున్నారు. సొంతూరిలో బంధుమిత్రుల మధ్య సంతోషంగా పండుగ జరుపుకోవాలనే ఆశ ప్రైవేటు బస్సు యజమానులకు వరమైంది. టికెట్ల ధరలను రెండు రెట్లు పెంచి దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి.



బెంగళూరు మెజెస్టిక్ బస్టాండులో కిటకిట

టికెట్‌పై రూ.వెయ్యి వరకూ

శనివారం నుంచి సోమవారం వరకూ ప్రైవేట్, ప్రభుత్వ బస్సుల సీట్లు భర్తీ అయ్యాయి. బెంగళూరు నుంచి రాష్ట్రం, ఇతర రాష్ట్రాలకు సంచరించే అనేక ప్రైవేట్ బస్సుల ప్రయాణం ధరలు రెండింతలయ్యాయి. పండుగ సమయంలో ఇది సహజం, దూరపు ప్రాంతాలకు బస్సుల టికెట్ ధరను రూ.800 నుండి రూ.1000 వరకూ పెంచినట్లు ప్రైవేటు ట్రావెల్స్ సిబ్బంది తెలిపారు.

అవసరం కాబట్టి..

సొంతూళ్లకు వెళ్లేవారు అనివార్యంగా అడిగినంత సొమ్ము ఇచ్చి ప్రయాణం చేస్తారు. ఈ సమయంలో టికెట్ ఎంతపెంచినా కొంటారనేది బస్సు యజమానులకు తెలుసు. ఒకవేళ ఎవరైనా ప్రశ్నిస్తే అలాంటి వారిపై బస్సు సిబ్బంది దౌర్జన్యంతో నోరు మూయిస్తారని కొందరు ప్రయాణికులు వాపోయారు. ఎక్కువ చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న ప్రభుత్వ హెచ్చరికలకు సైతం విలువ లేకుండా పోయింది. టికెట్ ధరల బాదుడుపై పలువురు ప్రయాణికులు సోషల్ మీడియాలోనూ ఆవేదన వెళ్లగక్కారు.



పండుగ చాటున ప్రయాణికుల్ని దోచేస్తున్న ట్రావెల్స్

మామూలు రోజులు, ఇప్పుడు చార్జీలు ఇలా

- బెంగళూరు–మంగళూరు: 700 నుండి రూ. 800; ప్రస్తుతం రూ.1300
- బెంగళూరు–ఉడుపి: రూ.880–1050; ప్రస్తుతం రూ.1500 నుండి 2500
- బెంగళూరు–బళ్లారి : రూ.900 –రూ.1050; ప్రస్తుతం రూ.1000 నుండి 1500
- బెంగళూరు–బెళగావి: రూ.900 నుండి రూ.1050; ప్రస్తుతం రూ.1600 నుండి 3000
- బెంగళూరు–రాయచూరు: రూ.850 నుండి రూ.1110; ఇప్పుడు రూ.850 నుండి 1500
- బెంగళూరు నుంచి తెలుగు రాష్ట్రాలకు ధరలు ఇదేమాదిరిగా పెరిగాయి

బస్టాండ్లు కిటకిట

శుక్రవారం సాయంత్రం నుంచి బెంగళూరులో ఆర్టీసీ, ప్రైవేటు బస్టాండు రద్దీగా మారాయి. కుటుంబాలతో సహా ఊళ్లకు వెళ్లేవారు కార్లు, రైళ్లు దొరకనివారు బస్సుల బాట పట్టారు. అయితే లగ్జరీ బస్సుల్లో ఆర్టీసీ బస్సుల్లో అప్పటికే రిజర్వేషన్లు కావడంతో సాధారణ ప్రయాణికులకు సీట్లు దొరకడం గగనమైంది. ఉచిత ప్రయాణం వల్ల మహిళల రద్దీ పెరిగింది.

న్యూస్‌రీల్

యోగాలో బంగారు పతకం



తుమకూరు: బ్యాంకాక్‌లో నిర్వహించిన అంతర్జాతీయ యోగా చాంపియన్‌షిప్‌లో తుమకూరు జిల్లా శిరా తాలూకాలోని 9వ తరగతి విద్యార్థి ఉదిత్ బాలాజీ మొదటి స్థానం పొంది బంగారు పతకం సాధించాడు. బ్యాంకాక్ నగరంలోని యూనివర్సల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఇన్ అసోషియేషన్ విత్ ఎస్.జీ.ఎస్ ఇంటర్నేషనల్ యోగా ఫౌండేషన్ బెంగళూరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏషియా పసిఫిక్ యోగా చాంపియన్ షిప్‌లో సోలో విభాగంలో భారత్ నుంచి పోటీ పడిన ఉదిత్ ఉత్తమ ప్రదర్శన ఇచ్చి బంగారు పతకం సాధించాడు.

కిద్వాయ్‌లో అక్రమాలపై సీఎం దృష్టి

శివాజీనగర: బెంగళూరులోని ప్రముఖ ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రి కిద్వాయ్‌లో రోగులకు సక్రమంగా చికిత్స చేయడం లేదని, ఔషధాల కొనుగోలులో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై కమిటీచే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీఎం సిద్దరామయ్య ఆదేశించారు. కిద్వాయ్ వైద్యాలయంలో రోగులకు సరిగా వైద్యచికిత్సలు చేయడం లేదని, మందుల కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని సీఎంకు ఫిర్యాదులు వచ్చాయి. ఐఏఎస్ అధికారి నేతృత్వంలో కమిటీ నియమించి, వివిధ శాఖల అధికారులతో విచారణ జరిపి 2 వారాల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

నీటిని నిలిపేయాలని ధర్నా



మండ్యలో రైతుల రాస్తారోకో

మండ్య: తమిళనాడుకు ఇంకెంతమాత్రం ప్రభుత్వం కావేరి నీటిని వదలరాదని కోరుతూ జిల్లా రైతు హితరక్షణ సమితి, రైతుసంఘాలు చేస్తున్న సత్యాగ్రహం 14వ రోజుకు చేరుకుంది. శనివారం ఎమ్మెల్యే హెచ్.టి. మంజు ధర్నాలో పాల్గొని మాట్లాడారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కావేరి నీటిని తమిళనాడుకు వదలడం కుదరదన్నారు. రాష్ట్రంలో తీవ్రమైన కరువు ఉందని, అనేక జలాశయాల్లో నీరు పడిపోయిందని చెప్పారు. నీటిని నిలిపివేసే వరకూ రైతులు, పోరాట సంఘాలు ఆందోళనను కొనసాగిస్తాయని తెలిపారు.

రెండు తిమింగలాల మృత్యువాత



ఓ తిమింగలం కళేబరం

యశవంతపుర: ఉత్తర కన్నడ జిల్లా హొన్నావర తాలూకా ముగళి సముద్రతీరంలో శనివారం రెండు బలీన్ జాతికి చెందిన తిమింగలాల కళేబరాలు బయటపడ్డాయి. గత వారం క్రితం 35 మీటర్ల పొడవైన తిమింగలం కళేబరం కొట్టుకు రావడం తెలిసిందే. ఈసారి 25 మీటర్ల పొడవున్న మృత తిమింగలం, దానికి దగ్గరలో మరో తిమింగలం కళేబరం ఒడ్డుకు వచ్చాయి. బలీన్ తిమింగళాలు సంతానోత్పత్తి సమయం కావటంతో నేత్రాణి, ముగళి సముద్ర తీరాలకు వస్తుంటాయి. ఈ సమయంలో పెద్ద ఓడలు ఢీకొనడం వల్ల చనిపోయి ఉంటాయని స్థానిక జీవశాస్త్ర విజ్ఞాని ప్రకాశ మేస్త తెలిపారు. తరచుగా తిమింగలాలు మృత్యువాత పడడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది.

ప్రజలు బీజేపీకి ఆపరేషన్ చేశారు: సీటీ

బనశంకరి: మేము అధికారం కోసం ఆపరేషన్ కమల చేపట్టాం, కానీ ప్రజలు మా అధికారానికి ఆపరేషన్ చేశారని బీజేపీ మాజీ మంత్రి సీటీ రవి అన్నారు. శనివారం మంగళూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక బీజేపీ మాజీ కార్పొరేటర్లు, నేతలు కొందరు కాంగ్రెస్‌లో చేరారు, బెల్లం ఉన్నచోటకు చీమలు వెళ్లడం సహజం, అదేమాదిరిగా కొందరు అక్కడికి వెళ్లారని అన్నారు. మేము మంత్రులు, ఎమ్మెల్యేలను బీజేపీలోకి తీసుకున్నప్పటికీ అధికారం కాపాడుకోవడం సాధ్యం కాలేదని, వారు కార్పొరేటర్లను తీసుకెళ్లి ఏం చేస్తారని కాంగ్రెస్‌ను హేళన చేశారు. ఇప్పుడు ఆపరేషన్ హస్తం చేస్తున్నారు. ఇకముందు ప్రజలే కాంగ్రెస్‌కు ఆపరేషన్ చేస్తారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో నా ఓటమికి నేనే కారణమం, వేరే ఎవరూ కాదు, ఎక్కువ ఓట్లు వచ్చినప్పటికీ ఓడిపోయానని వాపోయారు. బీజేపీ– జేడీయస్ పొత్తు ఖరారు కాలేదని, పార్టీ పెద్దలు చూసుకుంటారని తెలిపారు.

అక్టోబరు 15 నుంచి నవరాత్రి ఉత్సవాలు



- మైసూరు దసరా సంబరాలు..

మైసూరు: విశ్వవిఖ్యాత మైసూరు దసరా ఉత్సవాల కార్యక్రమాల జాబితాను జిల్లా యంత్రాంగం విడుదల చేసింది. అక్టోబర్ 15వ తేదీ ఆదివారం శరన్నవరాత్రి ఉత్సవాలకు నాంది పలుకుతారు. చాముండికొండ పైన చాముండేశ్వరి అమ్మవారికి పూజలు నిర్వహించడం ద్వారా 9 రోజుల ఉత్సవాలకు అంకురార్పణ గావిస్తారు. ఆ రోజున ఉదయం 10.15 గంటల నుంచి 10.36 గంటల మధ్య ఉన్న శుభ వృశ్చిక లగ్నంలో పూజలు చేసి దసరా ఉత్సవాలను అతిథులు ప్రారంభిస్తారు. ప్యాలెస్‌లోనూ ఇదే సమయంలో రాజవంశీకులు వేడుకలకు నాంది పలుకుతారు. నాటి నుంచి నిత్యం చాముండేశ్వరి ఆలయంలో, ప్యాలెస్‌లో, మైసూరులో వివిధ వేదికల్లో ఉత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

23న ఆయుధ పూజ

అక్టోబర్ 23వ తేదీన మైసూరు ప్యాలెస్‌లో ఆయుధపూజను నిర్వహిస్తారు. అక్టోబర్ 25వ తేదీన విజయదశమి రోజున మధ్యాహ్నం 1.46 గంటల నుంచి 2.08 గంట:ల మకర లగ్నంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య నందిధ్వజ పూజ చేస్తారు. సాయంత్రం 4.40 గంటల నుంచి 5.00 మధ్య ఉన్న శుభ మీన లగ్నంలో చాముండేశ్వరి మాతకు పూజలు చేసి దసరా జంబూ సవారీ ఊరేగింపును ప్రారంభిస్తారు. అలాగే మైసూరు ప్యాలెస్ ఆవరణతో పాటు పలుచోట్ల ఎగ్జిబిషన్లు, వినోద, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించనున్నాయి.

దంపతుల కలహం శాంతిభద్రతల సమస్యా?

- పోలీసులపై ధార్వాడ హైకోర్టు బెంచ్ అసంతృప్తి

హుబ్లీ: ఇంట్లో పూజ చేసే విషయమై భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణ కేసులో భర్తపై క్రిమినల్ కేసులు పెట్టిన తీరుపై ధార్వాడ హైకోర్టు తీవ్రంగా అభ్యంతరం తెలిపింది. ఆ చార్జ్‌షీట్‌ను కోర్టు రద్దు చేసింది. కేసు రద్దును కోరుతూ బాగలకోటె విద్యాగిరి నివాసి వివేకానంద దాఖలు చేసిన రిట్ విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్నతో కూడిన ఏకసభ్య ధర్మాసన ధార్వాడ పీఠం ఈ ఆదేశాలను వెలువరించింది.

ఏం జరిగిందంటే..

ఫిర్యాదిదారుకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి 14 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. 2016లో శ్రావణ శుక్రవారం రోజున పూల సామగ్రి కొనాలని భార్య కోరగా ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తింది. దీనికి సంబంధించి భార్య బాగలకోటె నవనగర పోలీస్ స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేయగా, పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ సెక్షన్లు అన్యాయమంటూ భర్త హైకోర్టును ఆశ్రయించాడు.



ఈ కేసులో దంపతుల మధ్య ఘర్షణ జరిగింది. దీని వల్ల సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగిందని చెబుతూ క్రిమినల్, బెదిరింపుల సెక్షన్ చేర్చడం సరికాదని కోర్టు అభిప్రాయ పడింది. కుటుంబ కలహానికి ఇలాంటి కేసులు పెట్టడం తమాషాగా ఉందని జడ్జి పేర్కొన్నారు.

ఆలయ దర్శనాలకు ఆన్‌లైన్ యాప్

బనశంకరి: దేవదాయశాఖ పరిధిలోకి వచ్చే ఆలయాల్లో భక్తుల కోసం ఆన్‌లైన్ వ్యవస్థ అమల్లోకి తీసుకువస్తామని ఆ శాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. శనివారం నగరంలో విలేకరులతో రామలింగారెడ్డి మాట్లాడుతూ... దేవదాయశాఖ పరిధిలో ఉన్నతస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించామని, పూజలు, ఆలయాల్లో దర్శనాలకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడానికి ప్రత్యేక యాప్‌ను విడుదల చేస్తామని చెప్పారు. కాశీయాత్ర, మానస సరోవర, చార్‌ధామ్, భారత్ గౌరవ కాశీయాత్ర కు యాప్ విడుదల చేస్తామని తెలిపారు.

ఘనంగా స్నాతకోత్సవం



తుమకూరు: జ్ఞానం, అన్వేషణ అనేది నిరంతర ప్రయత్నం అని, పెద్ద బాధ్యతతో పాటు భవిష్యత్తులో శక్తినిస్తుందని పారిశ్రామికవేత్త హరీష్ రవి అన్నారు. శనివారం తుమకూరు నగరంలోని సిద్ధగంగా సాంకేతిక మహా విద్యాలయంలో నిర్వహించిన 14వ స్నాతకోత్సవంలో పాల్గొని పట్టభద్రులకు పట్టాలను అందజేశారు. సిద్దలింగస్వామి పాల్గొన్నారు.

కావేరితో కేంద్రానికి సంబంధం లేదు: సింహా

మైసూరు: కావేరి నదీ జలాలను తమిళనాడుకు విడుదల గురించి సమస్య ఉంటే సీఎం సిద్దరామయ్య తమిళనాడు ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం చేయాలి తప్ప కేంద్రం పైన రుద్దకూడదని మైసూరు ఎంపీ ప్రతాపసింహ అన్నారు. శనివారం మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ కావేరి నీటిని తమిళనాడుకు పంపిణీలో కేంద్రానికి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఇందులో ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాల్సిన అవసరం కూడా లేదన్నారు. ఇందులో ముఖ్యమంత్రుల పాత్రే ఉంటుంది, ఇద్దరు సీఎంలు చర్చించుకొని తీర్మానం చేసుకోవాలన్నారు. అవసరమైతే కోర్టులో పోరాడాలని, కేంద్రానికి ఏ హక్కు ఉండదని అన్నారు.

కిరాతకంగా భార్య హత్య

- గౌరిబిదనూరు వద్ద దారుణం



భర్త అంజుంఖాన్



రోడ్డుపై షానవాజ్ మృతదేహం

గౌరిబిదనూరు: గౌరిబిదనూరు తాలూకా అలకాపురంలో షానవాజ్ (30) అనే మహిళను భర్త అంజుంఖాన్ హత్య చేశాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. పుట్టపర్తి జిల్లాలోని హిందూపురానికి చెందిన అంజుంఖాన్ (33), షానవాజ్‌లకు 8 ఏళ్ల కిందట పెళ్లయింది, ఆరేడేళ్ల కిందట ఉపాధి కోసం అలకాపురానికి వచ్చి స్థిరపడ్డారు. అక్కడే ఒక ఫ్యాక్టరీలో కూలీ పనులకు వెళ్లేవారు. వీరికి పిల్లలు లేరు. కొంతకాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి ఎస్‌డిఎం వైనరీ సమీపంలో గొడవ పడిన భర్త చాకుతో భార్య గొంతుకోసి హత్య చేశాడు. తరువాత గౌరిబిదనూరు రూరల్ స్టేషనుకు వెళ్లి లొంగిపోయాడు. మంచేనహళ్లి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హిందూపురంలో ఉన్న హతురాలి అన్న జబీవుల్లాకు సమాచారమందించారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అంజుంఖాన్‌ని అరెస్టు చేశారు.

హంతకునిపై దాడి.. వెయ్యి మందిపై కేసు

కోలారు: శ్రీనివాసపురం తాలూకా నంబిహళ్లి గ్రామంలో గత 12వ తేదీన నాగేశ్ అనే మటన్ వ్యాపారి మాజీ భార్యను ఇంట్లోకి దూరి నరికి చంపడం తెలిసిందే. ఈ సమయంలో గ్రామస్తులు ఆగ్రహంతో అతన్ని పట్టుకుని దాడి చేయడానికి యత్నించారు. ఒకదశలో పెట్రోల్ పోసి హంతకున్ని దహనం చేయాలని చూశారు. గ్రామస్తులను పోలీసులు అడ్డుకోగా తోపులాట చోటుచేసుకుంది. చివరికి పోలీసులు వీరిపై లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసుల విధి నిర్వహణకు అడ్డుపడ్డారనే కారణంపై పెద్ద సంఖ్యలో గ్రామస్తులపై శ్రీనివాసపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సుమారు వెయ్యి మందిపైపై కేసు పెట్టినట్లు తెలుస్తోంది.

గ్రామస్తుల మండిపాటు

దీంతో అరెస్టు చేస్తారనే భయంతో గ్రామానికి చెందిన పలువురు గ్రామం వదిలి వెళ్లినట్లు తెలిసింది. హంతకున్ని పట్టుకుంటే కేసులు పెడతారా? అని గ్రామస్తులు పోలీసుల తీరుపై మండిపడుతున్నారు. తమ ఊరికి వచ్చి హత్యలు చేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? అని పలువురు ప్రశ్నించారు.

మహిళకు రూ.1.45 లక్షల బురిడీ

మైసూరు: మైసూరులో ఆన్‌లైన్ నేరాల కేసులు నానాటికీ పెరుగుతున్నాయి. దుండగులు ఇంటి నుంచి పని ఇస్తామని మహిళను నమ్మించి రూ. 1.45 లక్షలు కొట్టేశారు. శక్తినగరకు చెందిన సుధారాణి అనే మహిళకు వాట్సాప్‌లో వర్క్ ఫ్రం హోం మెసెజ్ రాగా, అందులో ఉన్న నంబర్‌కు కాల్‌చేసి మాట్లాడింది. వివిధ రుసుముల కింద మీరు 1.45 లక్షలు చెల్లిస్తే, మంచి జీతంతో ఇంటి నుంచి పని ఇప్పిస్తామని మోసగాళ్లు చెప్పారు. దీంతో ఆమె అంత డబ్బును ఆన్‌లైన్‌లో చెల్లించింది. తరువాత కాల్ చేస్తే ఆ నంబర్ స్విచాఫ్ అని రావడంతో మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కద్రి ఆలయమే కుక్కర్ బాంబు లక్ష్యం!



యశవంతపుర: మంగళూరు నగరంలో ఆటో రిక్షాలో జరిగిన కుక్కర్ పేలుడు కేసులో పోలీసుల విచారణలో కొత్త విషయాలు బయటపడ్డాయి. నిందితుడు షారిక్ ప్రసిద్ధ కద్రి ఆలయాన్ని పేల్చడానికి ఈ బాంబును సిద్ధం చేసినట్లు గుర్తించారు. 2022 నవంబర్ 19న నాగురియగరోడ్డు వద్ద వెళుతున్న ఆటోలో కుక్కర్ బాంబ్ అనుకోకుండా పేలింది. నిందితుడు షారిక్‌తో పాటు ఆటో డ్రైవర్ పురుషోత్తమ పూజారిలు తీవ్రంగా గాయపడి కోలుకున్నారు. కేసును ఎన్ఐఏ విచారిస్తోంది. కద్రి దేవస్థానమే లక్ష్యమని నిందితుడు షారిక్ విచారణలో వెల్లడించాడు. మరో నిందితుడు అరాఫత్ అలీని రెండు రోజుల క్రితం ఢిల్లీలో అరెస్ట్ చేశారు. ఇతను మంగళూరులో గోడల మీద రెచ్చగొట్టే రాతలు రాశాడని, కుక్కర్ బాంబులో ముఖ్య పాత్ర ఉందని అభియోగాలున్నాయి.

టికెట్ పేరుతో రూ.5 కోట్లు హాంఫట్!

దొడ్డబళ్లాపురం: ఎమ్మెల్యే ఎన్నికల్లో టికెట్ ఇప్పిస్తామని కోట్లాది రూపాయలు వసూలు చేశారని ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. వివరాలు.. నెలమంగల నివాసి రిటైర్డ్ ఉప తహసీల్దార్ బీ హొంబయ్య అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్ పొందాలనుకున్నాడు. ఈ క్రమంలో నాగరాజు, హరిశాస్త్రి, వీరేశ్ అనే ముగ్గురు వ్యక్తులతో చర్చించాడు. వీరు 2022 డిసెంబర్‌లో హొంబయ్యను కలిసి తమ వద్ద రూ.49 కోట్ల డీడీ ఉందని, రూ.50 లక్షలు ఇస్తే మూడు రోజుల్లో తిరిగి ఇస్తామని నమ్మబలికారు. అలా పలు దఫాలుగా రూ.1 కోటి 29 లక్షలు ఇచ్చానన్నాడు. డీడీ ఇంకా నగదు కాలేదంటూ మొత్తంగా రూ 5 కోట్ల వరకూ వసూలు చేశారని, తరువాత ముఖం చాటేశారని చెప్పాడు. ఆ ముగ్గురిపై నెలమంగల పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. నిందితులు పరారీలో ఉన్నారు.

మంత్రి అనుచరులు బెదిరిస్తున్నారు

శివాజీనగర: విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప అనుచరులు తనను బెదిరిస్తున్నారని ప్రణవానంద స్వామి తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన ప్రణవానంద స్వామి, తనకు ఫోన్ కాల్ చేసి మంత్రి మధు బంగారప్ప అనుచరులు బెదిరిస్తున్నారు. తాను శరణ సంస్కృతి ప్రకారం వివాహం చేసుకున్నాను. సముదాయం కోసం పోరాటం చేపట్టానని తెలిపారు. తనను భయపెట్టి, బెదిరించి పోరాటాన్ని అణచివేసేందుకు యత్నిస్తున్నారు. వారి బెదిరింపులకు లొంగనని, ప్రాణ బెదిరింపు నేపథ్యంలో ప్రణవానందస్వామి శనివారం పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

విఘ్నాధిపతికి స్వాగతమాల



శనివారం బెంగళూరు గాంధీనగరలో గణపతి విగ్రహాల విక్రయాలు



కేఆర్ మార్కెట్లో జోరుగా పూల వ్యాపారం

- ఐటీ సిటీలో చురుగ్గా ఏర్పాట్లు

శివాజీనగర: విఘ్నాలు తొలగించి ఏడాదంతా సాఫీగా సాగిపోయేలా అందరూ భక్తిశ్రద్ధలతో గణనాథున్ని పూజించడం ఆనవాయితీ. ఇందుకోసం వినాయక చతుర్థి పండుగ కోసం సిలికాన్ సిటీలో ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి. వీధుల్లో మండపాల్లో పెద్ద గణపతులను, ఇళ్లలో బుజ్జి వినాయకుల్ని ప్రతిష్ఠించి నైవేద్యాల సమర్పణకు ఒక్కరోజే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో నగరమంతటా గణేశ నిమజ్జనానికి చెరువులు, పుష్కరిణుల వద్ద సన్నాహాలు చేపట్టారు. ఇందుకోసం పాలికె వందకు పైగా స్థలాలను ఏర్పాటు చేసింది.

చిన్న విగ్రహాలకు మొబైల్ ట్యాంకర్లు

చిన్న విగ్రహాలను సులువుగా జలార్పణం చేయడానికి మొబైల్ ట్యాంకులను నడపనున్నట్లు పాలికె అధికారులు తెలిపారు. 5 ఇంచుల నుంచి 3 అడుగుల ఎత్తు కలిగిన అన్ని మట్టి విగ్రహాలను ఈ ట్యాంకుల్లో నిమజ్జనం చేయవచ్చు. అంతకంటే పెద్ద మూర్తుల కోసం నగరమంతటా 12 చోట్ల చెరువులను, మడుగులను నిర్దేశించారు. యడియూరు, హెబ్బాళ, శాంకీ చెరువులకు అధిక సంఖ్యలో రద్దీ ఉన్నందున ఇక్కడ కల్యాణిల్లో పూడికతీసి, రంగులు వేశారు. అంతటా పోలీసులు, సీసీ కెమెరాలు, లైట్లు, క్రేన్, అంబులెన్స్ వసతులు ఉంటాయని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను కూర్చోబెట్టడం, నిమజ్జనం చేయరాదని సూచించారు.

విగ్రహాలు, పూలు పండ్లకు గిరాకీ

మరోవైపు నగరంలో ట్యానరీ రోడ్డు, శివాజీనగర, బాణసవాడి, హలసూరు, మల్లేశ్వరం, యశ్వంతపురతో పాటుగా వివిధ స్థలాల్లో గౌరీ–గణేశ విగ్రహాల విక్రయాలు ముమ్మరంగా సాగుతున్నాయి. రూ.100 నుండి రూ.2 లక్షల వరకు విలువైన విగ్రహాలు మార్కెట్లో ఉన్నాయి. అలాగే పూలు, పండ్లు, చెరుకులు వంటి పూజా సామగ్రి అమ్మకాలు జోరందుకున్నాయి. మార్కెట్లలో పండుగ సందడి అలముకొంది.

క్లుప్తంగా

డ్రైయినేజీల్లో చెత్త తొలగింపు



చెత్త తొలగింపును పరిశీలిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో వివిధ ప్రాంతాల్లో మురుగు కాలువల్లో చెత్త తొలగింపు పనులను సత్వరం పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు చిన్న నీటిపారుదల శాఖా మంత్రి బోసురాజు సూచించారు. ఆయన శనివారం నగరంలోని జవహర్ నగర్‌లోని, నగరేశ్వరాలయం వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి మాట్లాడారు.

కురుబలను ఎస్టీల్లోకి చేర్చాలి



మాట్లాడుతున్న రేవణ్ణ

రాయచూరు రూరల్: రాష్ట్రంలో కురుబలను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తామని మాజీ మంత్రి రేవణ్ణ వెల్లడించారు. శనివారం పాత్రికేయుల భవనంలోని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ సర్కార్ హయాంలో కురుబలను ఎస్టీల్లోకి చేర్చాలని ప్రతిపాదనలు చేశామన్నారు. ఈ విషయంపై బెళగావిలో రాష్ట్ర స్థాయి సమావేశం అక్టోబర్ 3న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

ట్రక్ ఢీకొని 25 గొర్రెల మృతి




మరణించిన గొర్రెలు

రాయచూరు రూరల్: యాదగిరిలోని చిత్తాపుర రోడ్డులో ట్రక్ ఢీకొని 25 గొర్రెలు మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారు జామున జరిగింది. చిత్తాపుర తాలూకా నాగనహట్టికి చెందిన గొర్రెల కాపరులు నాగప్ప, అంబలయ్య, ధర్మరాజ, నింగప్పలు తమ గొర్రెల మందను తోలుకెళుతుండగా వేగంగా వచ్చిన ట్రక్ వచ్చి మందపైకి దూసుకెళ్లడంతో గొర్రెలు మరణించాయి. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే రిట్‌పై విచారణ వాయిదా

హుబ్లీ: జిల్లా పంచాయతీ సభ్యుడు యోగేష్‌గౌడ హత్య ఆరోపణలను ఎదుర్కొంటున్న ధార్వాడ రూరల్ ఎమ్మెల్యే వినయ్‌కులకర్ణికి ధార్వాడ జిల్లాలో ప్రవేశానికి అనుమతి కోరుతూ ప్రజాప్రతినిధుల కోర్టులో దాఖలైన రిట్‌పై విచారణను ధార్వాడ హైకోర్టు బెంచ్ ఈనెల 23కు వాయిదా వేసింది. హత్య కేసులో అరెస్ట్ అయి బెయిల్‌పై బయట ఉన్న ఎమ్మెల్యే వినయ్ కులకర్ణికి ధార్వాడ జిల్లాలో ప్రవేశంపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. శుక్రవారం రిట్‌ను స్వీకరించిన న్యాయపీఠం ఈ విషయంలో మరింత కూలంకషంగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

పట్టు చీరల ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నగర మేయర్ త్రివేణి

సాక్షి బళ్లారి: గౌరి గణేష్ పండుగను పురస్కరించుకుని నగరంలోని కమ్మ భవన్‌లో మెగా పట్టు చీరల ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. శనివారం పట్టు అభివృద్ధి సంస్థ(సిల్క్ ఇండియా) ఆధ్వర్యంలో దేశంలో 23 రాష్ట్రాల్లో అన్ని వర్గాలను ఆకట్టుకొనే విధంగా తయారు చేసిన పట్టుచీరల ఎగ్జిబిషన్‌ను నగర మేయర్ త్రివేణి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకులు అభినందన్ తదితరులు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 23 వరకు వారం రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్‌ను కొనసాగిస్తామని తెలిపారు. ఈ ప్రదర్శనలో ఉంచే కశ్మీర్ నుంచి కాంచీపురం వరకు తయారు చేసిన పట్టుచీరలను మహిళలు కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిరుత దాడిలో ఇద్దరికి గాయాలు

బనశంకరి: న్యామతిలో రోడ్డులో సంచరిస్తున్న వారిపై చిరుత దాడిచేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి హాశేమకలి గ్రామానికి మంజునాథ్, మల్లికార్జున్ అనే ఇద్దరు న్యామతి నుంచి తమ గ్రామానికి వెళుతుండగా చిరుతపులి దాడిచేసింది. ఇద్దరు గట్టిగా కేకలు వేయడంతో చిరుత వెళ్లిపోయింది. వారి చేతులు, కాళ్లకు గాయాలు కావడంతో తాలూకా ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. చిరుతను బంధించాలని స్థానిక ప్రజలు అటవీశాఖ అధికారులకు మనవిచేశారు.

చవితికి గణనాథులు సిద్ధం

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వాడకం నిషేధం
- గణనీయంగా పెరిగిన విగ్రహాల ధరలు



వినాయక చవితి పూజలందుకోవడానికి మార్కెట్‌లో సిద్ధంగా ఉన్న బొజ్జగణపయ్య విగ్రహాలు

కోలారు: భాద్రపద మాసంలో ప్రజల నుంచి పూజలందుకోవడానికి వినాయక విగ్రహాలు నగరంలో సిద్ధంగా ఉన్నాయి. గత సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం వినాయక విగ్రహాల ధరలు గణనీయంగా పెరిగాయి. చిన్న సైజు వినాయక విగ్రహానికి కూడా రూ.500 నుంచి రూ.1000 వరకు సొమ్ము వెచ్చించాల్సి వస్తోంది. జిల్లా యంత్రాంగం పరిసరాల రక్షణ ఉద్దేశంతో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే వినాయక విగ్రహాలను పూర్తిగా నిషేధించడం వల్ల వినాయక విగ్రహాల ధరలు గణనీయంగా పెరిగిపోయాయి. కేవలం మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలనే కొనుగోలు చేయాల్సి రావడం ధరల పెరుగుదలకు మరో కారణం. మట్టి వినాయక విగ్రహల కంటే ప్లాస్టిక్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేయడం సులభం, పైగా ఖర్చు తక్కువ. వినాయక విగ్రహాలను తక్కువ సమయంలో ఎక్కువ విగ్రహాలను తయారు చేసే అవకాశం ఉంది.

మట్టి ప్రతిమలకు భారీ డిమాండ్

అయితే మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయడం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసినంత సులువు కాదు. బంకమట్టిని కూడా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఒక్కో విగ్రహం తయారీకి ఎక్కువ సమయం తీసువడంతో పాటు విగ్రహాలను నాణ్యతతో తయారు చేయకపోతే బీటలు వారుతాయి. బీటలు వారిన విగ్రహాలను ఎవరూ కొనుగోలు చేయరు, పూజించరు. దీని వల్ల వినాయక విగ్రహాలకు ఈ సారి భారీ డిమాండ్ ఏర్పడింది. ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. ఒక అడుగు ఎత్తు చిన్న విగ్రహం కొనుగోలు చేయడానికి భారీగా ధరలు పెట్టాల్సి వస్తోంది. కాలనీలలో ప్రతిష్టించే మూడు అడుగుల విగ్రహాలకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది, ఇక భారీ విగ్రహాల ధరలు కూడా బాగా పెరిగి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ధర పెట్టి కొనాల్సి వస్తోంది.

ఉచిత వితరణలు లేవు

ఎన్నికలకు ముందు ఉచిత వినాయక విగ్రహాలను ప్రజా ప్రతినిధులు, దాతలు భారీ సంఖ్యలో కొనుగోలు చేసి వివిధ సంఘాలకు, అభిమానులకు ఉచితంగా పంచేవారు. అయితే ఈసారి ఎలాంటి ఎన్నికలు లేకపోవడం వల్ల ఉచితాలు కరువై అందరూ విపణివీధిలో వినాయక విగ్రహాలను కొనుగోలు చేయాల్సి వస్తోంది. ధరలు పెరిగినా, ఉచితాలు లేకున్నా ప్రజలు మాత్రం వినాయక విగ్రహాల కొనుగోలులో ఉత్సాహం ఎంతమాత్రం తగ్గలేదు. ఈ యేడాది గౌరి వినాయక పండుగలు రెండూ ఒకే రోజు అంటే సామవారం రావడం వల్ల శని, ఆదివారాల్లో నగరంలో భారీ ఎత్తున గౌరి గణేష విగ్రహాలు, పూలు, పండ్లను ముందుగానే ప్రజలు కొనుగోలు జరిగే అవకాశం ఉంది.

పీఓపీ వద్దు.. మట్టి గణపతులే ముద్దు



గణపతులను తయారు చేస్తున్న విద్యార్థులు

రాయచూరు రూరల్: పర్యావరణ సంరక్షణకు మట్టి గణపతులే ముద్దు అని రాయచూరు గ్రీన్ సంస్థ అధ్యక్షురాలు సరస్వతి పేర్కొన్నారు. శనివారం ఎన్‌జీఓ కాలనీలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చేపట్టిన మట్టి గణపతుల తయారు చేసి శిబిరంలో ఆమె మాట్లాడారు. మట్టి గణపతులను పూజించడం ద్వారా పర్యావరణ సంరక్షణకు సహకరించాలని పిలుపునిచ్చారు. 10 అంగుళాల ఆకారంలో బంక మట్టితో గణేష్ మూర్తులను సిద్ధం చేసి ఒక్కొక్కటి రూ.150ల ధరకు విక్రయించడానికి సిద్ధమయ్యారు. సోమవారం గణేష్ చవితి పండుగ సందర్భంగా పూజించడానికి, గణపతుల విసర్జనకు అనుకూలంగా ఉంటుందని రాజేంద్ర కుమార్ అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్(పీఓపీ), ఇతర రసాయనిక పదార్థాలతో తయారు చేసిన వినాయకుల నిమజ్జనంతో చెరువులు, బావులు, కుంటల్లో నీరు కలుషితమవుతాయని, చెత్తచెదారం, ప్లాస్టిక్ వంటి వాటితో పరిసరాలు పాడవుతాయనే ఉద్దేశ్యంతో మట్టి గణపతులను వినియోగించాలని ప్రజలకు సూచించారు.

హాస్టళ్లలో సమస్యలను తీర్చండి



మాట్లాడుతున్న మంత్రి బోసురాజు

రాయచూరు రూరల్: జిల్లాలోని హాస్టళ్లలో మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు అక్కడ నెలకొన్న సమస్యలను అధికారులు తీర్చాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ఎస్ బోసురాజు అధికారులకు సూచించారు. ఆయన శనివారం జెడ్పీ జల నిర్మల సభాంగణంలో జరిగిన వెనుకబడిన, సాంఘీక సంక్షేమ శాఖ, మైనార్టీ, మొరార్జి దేశాయి, ఏకలవ్య వసతి శాఖ అధికారుల సమావేశంలో మాట్లాడారు. హాస్టల్ భవనాల నిర్మాణాలపై పూర్తి నివేదిక అందించాలని ఆదేశించారు. హాస్టళ్లలో తాగునీరు, విద్యుత్, భోజన వసతి వంటి సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో మాన్వి ఎమ్మెల్యే హంపయ్య నాయక్, ఏడీసీ దురుగేష్, ఏసీ మెహబూబీ, జెడ్పీ సీఈఓ రాహుల్ పాండే తుకారాం, ఉప కార్యదర్శి శశికాంత్, ప్రకాష్, జెస్కాం చీఫ్ ఇంజినీర్ చంద్రశేఖర్ దేశాయి, విద్యా శాఖాధికారి సురేష్, బీసీఎం అధికారి వాల్మీకి, సాంఘీక సంక్షేమ శాఖాధికారి రాజేంద్ర జాలదార్‌లున్నారు.

సీబీఐ అధికారి పేరుతో నకిలీ అకౌంట్

- నగల వ్యాపారికి రూ.లక్ష డిమాండ్



సీబీఐ అధికారి పేరుతో నకిలీ కార్డు

రాయచూరు రూరల్: జిల్లాలో రోజురోజుకు సైబర్ నేరాల సంఖ్య పెరుగుతోంది. 15 రోజుల క్రితం కలబుర్గి వాసులు ప్రైవేట్ వైద్యుడిపై పిస్తోలు ఎక్కుపెట్టి డబ్బులు డిమాండ్ చేస్తూ పట్టుబడిన విషయం అందరికీ తెలిసిందే. వైద్యుడి విషయం కనుమరుగు కాక మునుపే నగల వ్యాపారిపై దుండగుల కన్నుపడింది. రెండు రోజుల క్రితం రాయచూరు షరాఫ్ బజారులో సురేష్ అనే బంగారు నగల దుకాణ దారుడికి ఫోన్ చేసి తన పేరు సుబోధ్ కుమార్ జైస్వాల్, న్యూఢిల్లీకి చెందిన సీబీఐ అధికారినంటూ వాట్సప్‌లో సందేశం పంపడమేగాక రూ.లక్ష చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే నగల వ్యాపారి భయపడకుండా సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసుల విచారణలో అది నకిలీ ఫేస్‌బుక్ ఖాతా అని తేలింది. దీంతో నగల వ్యాపారి ఊపిరి పీల్చుకున్నారు.

వక్కలోడు లారీ పట్టివేత



బైపాస్ వద్ద లారీని చుట్టుముట్టిన వాహనాలు

రాయదుర్గం: కేరళ నుంచి న్యూఢిల్లీకి లోడ్‌తో వెళుతున్న ఓ లారీ శుక్రవారం రాత్రి కర్ణాటక జీఎస్టీ అధికారుల కళ్లు గప్పి తప్పించుకుని ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించింది. ఆద్యంతం సినీ ఫక్కీలో సాగిన ఛేజింగ్‌లో చివరకు ఆంధ్ర ప్రాంతంలో లారీ టైర్ బరస్ట్ కావడంతో కర్ణాటక పోలీసులు స్వాధీనం చేసుకోగలిగారు. వివరాలు... కేరళ నుంచి వస్తున్న లారీని కర్ణాటకలోని హానగల్ వద్ద జీఎస్టీ, సేల్స్ ట్యాక్స్ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకు దూకించడంతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుని తమ వాహనాల్లో వెంబడిస్తూ మొళకాల్మూరు పోలీసులకు సమాచారం అందించారు. దాదాపు 14 కిలోమీటర్ల మేర ఛేజింగ్ చేసినా లారీ వేగాన్ని పోలీసులు, జీఎస్టీ అధికారులు అందుకోలేకపోయారు. చివరకు రాయదుర్గం పట్టణ సమీపంలో నిర్మాణంలో ఉన్న బైపాస్ వద్దకు చేరుకోగానే టైర్లు బరస్ట్ అయ్యాయి. వెనుకనే వెంబడిస్తూ వచ్చిన కర్ణాటక పోలీసులు, జీఎస్టీ అధికారుల వాహనాలు లారీని చుట్టుముట్టాయి. లారీలో ఉన్న సరుకుపై అధికారులు ఆరా తీశారు. వక్కలోడుతో వెళుతున్నట్లుగా డ్రైవర్, సహాయకులు తెలిపారు. ముందుగా గుర్తించిన కర్ణాటక జీఎస్టీ అధికారులకే కేసు నమోదు బాధ్యతలు అప్పగించేలా అంగీకారానికి వచ్చారు.

21న కేంద్ర బృందం జిల్లాకు రాక

- కరువు ధృవీకరణ పత్రాలను సిద్ధం చేయండి
- అధికారులకు జిల్లాధికారి దివాకర్ సూచన



అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి దివాకర్

హొసపేటె: కేంద్ర కరువు అధ్యయన బృందం ఈనెల 21న జిల్లాలో పర్యటించి కరువు ప్రాంతాల రికార్డులను గణాంకాలతో పాటు క్రోఢీకరించుకోనున్నట్లు జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ తెలియజేశారు. శనివారం జిల్లాధికారి కార్యాలయ సభామందిరంలో జనన మరణాల సివిల్ రిజిస్ట్రేషన్ విధానం, పంటకోత ప్రయోగాలు, పంట పొలాల రీ అలైన్‌మెంట్ సమస్యలపై జిల్లా జనగణన అధికారితో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023–24వ సంవత్సరానికి కర్ణాటక రైతు భద్రత ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద జిల్లాలోని అన్ని తాలూకాల తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి నిర్ణీత వ్యవధిలో వర్షాకాలంలో నోటిఫై చేసిన పంటల సాగు ప్రయోగాలను నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత ఏడాది వానాకాలంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదైనందున పంటలు మొలక దశలోనే ఎక్కువగా నష్టపోయే అవకాశం ఉందని సంబంధిత రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం పంట కోత పరీక్షలను నిర్వహించాలని సూచించారు. కొన్ని ఆస్పత్రుల్లో జనన మరణాల నమోదులో జాప్యం చేస్తున్నందున నిర్ణీత గడువులోగా ఈ–జన్మ సాఫ్ట్‌వేర్‌లో జనన మరణాలను నమోదు చేయాలని ఆదేశించారు. కేంద్ర కరువు అధ్యయన బృందానికి చూపించే అత్యల్ప వర్షపాతం, పంట నష్టానికి సంబంధించిన అదనపు ఫోటో, వీడియో రికార్డులను సేకరించి జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ అనురాధ, అధికారులు శరణప్ప ముదుగల్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కేకేఆర్‌డీబీ.. అభివృద్ధి ఏదీ?

- ఏళ్లు గడిచినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే
- పేరు మారినా పురోగతిలో మాత్రం వెనుకంజే



కళ్యాణ కర్ణాటక చిత్రపటం

రాయచూరు రూరల్: ప్రాంతీయ అసమానతల నిర్మూలన కోసం కళ్యాణ కర్ణాటకలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్రంలో గతంలో హైదరాబాద్–కర్ణాటక అభివృద్ధి మండలి(హెచ్‌కేడీబీ)ని ఏర్పాటు చేశారు. అనంతరం దీనిని కళ్యాణ కర్ణాటక గ్రామీణ అభివృద్ధి మండలి(కేకేఆర్‌డీబీ)గా పేరు మార్చారు. విద్య, వైద్య, ఆరోగ్య, ఉద్యోగ రంగాల్లో ఇతర ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన మండలి సేవలు కేవలం నామమాత్రంగా నిలిచాయి. కళ్యాణ కర్ణాటక పరిధిలో కలబుర్గి, యాదగిరి, రాయచూరు, కొప్పళ, బీదర్, బళ్లారి, విజయనగర జిల్లాలు వస్తాయి. అయితే 66 ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధి విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

ఏటా రూ.వెయ్యి కోట్ల కేటాయింపు

రాష్ట్రంలో అధికారం చేపట్టిన ప్రభుత్వాలు ఈ ప్రాంతం అభివృద్ధి కోసం బడ్జెట్‌లో ప్రతి ఏడాది రూ.1000 కోట్ల నిధులు కేటాయిస్తారు. ఈ నిధులతో ఎమ్మెల్యేలు రహదారులు, పాఠశాలలు, తాగునీటి పథకాలకు నిధులను వినియోగించుకోవాల్సి ఉంది. ప్రత్యేక కమిషనరేట్ కార్యాలయం ఏర్పాటు హుళక్కే అయింది. 1957 సెప్టెంబర్ 17న హైదరాబాద్ నిజాం పాలన నుంచి విముక్తి కలిగింది. వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి కోసం 2001లో అప్పటి ముఖ్యమంత్రి ఎస్ఎం.కృష్ణ హెచ్‌కేడీబీని స్థాపించి అభివృద్ధికి ప్రాముఖ్యతనిచ్చారు. మండలికి ఎమ్మెల్యేనే అధ్యక్షుడిగా కొనసాగుతారు.

నేడు సీఎం సిద్దరామయ్య కలబుర్గి రాక

ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదివారం కలబుర్గిలో జరిగే కళ్యాణ కర్ణాటక విమోచన దినోత్సవ వేడుకల్లో పాల్గొంటున్నారు. సర్దార్ వల్లభ్‌బాయి పటేల్ విగ్రహానికి పుష్పార్చన చేస్తారు. అనంతరం కలబుర్గి క్రీడా మైదానంలో కళ్యాణ కర్ణాటక విమోచన దినోత్సవంలో జాతీయ పతాకావిష్కరణ చేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు.

జెస్కాం ఉద్యోగినుల ధర్నా



ధర్నా చేస్తున్న మహిళా ఉద్యోగులు

రాయచూరు రూరల్: మహిళా సిబ్బందిపై లైంగిక వేధింపులను నిరసిస్తూ ఉద్యోగినులు శనివారం గుల్బర్గా విద్యుత్ సరఫరా మండలి(జెస్కాం) కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కేపీటీసీఎల్ 220 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్ శ్రీనివాస్ కార్యాలయంలో పని చేసే మహిళ సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు గురి చేసినట్లు ఆరోపించారు. సదరు అధికారిపై చర్యలు చేపట్టాలని ఒత్తిడి చేశారు. ధర్నాలో కేపీటీసీఎల్ ఉద్యోగుల సంఘం పదాధికారులు హులిరాజ్, రామకృష్ణ, మౌనేష్, గోపి, నరసప్ప, యల్లప్ప, శరణప్ప, రవి, వెంకటేష్ తదితరులున్నారు.

కోలారు వార్తలు...

విశ్వేశ్వరయ్య సేవలు అపారం

కోలారు: దేశానికి సర్ ఎం విశ్వేశ్వరయ్య అందించిన సేవలు అపారమని జిల్లా కలెక్టర్ అక్రం పాషా తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సభాంగణంలో విశ్వేశ్వరయ్య 163వ జయంతిలో ఆయన మాట్లాడారు. విశ్వేశ్వరయ్య గొప్ప ఇంజినీర్ అని, ఆయన తన మేధాశక్తితో నిర్మించిన కేఆర్ఎస్ డ్యాం ఎంతో మంది రైతులకు జీవనాధారమైందన్నారు. జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య తన మేధస్సు ద్వారా సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకున్నారన్నారు. మైసూరు మహారాజుల ఆస్థానంలో ఇంజినీర్‌గా, దివాన్‌గా దేశం గరివ్వించదగిన పథకాలకు రూపకల్పన చేశారన్నారు. అలాంటి మహనీయుడు అవిభజిత కోలారు జిల్లా వాసి కావడం హర్షణీయమన్నారు. కలెక్టరేట్ సిబ్బంది వాసుదేవ, వేదమూర్తి, మల్లేష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందీని నేర్చుకోవాలి

కోలారు: తాలూకాలోని వక్కలేరి విద్యాభివృద్ధి ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ దివస్‌ను నిర్వహించారు. కెనరా బ్యాంకు మేనేజర్ ప్రియాంక కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ నేడు దేశ వ్యాప్తంగా ఉద్యోగార్థులకు హిందీని నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హిందీని చులకనగా చూడడం సరికాదన్నారు. కార్యక్రమంలో వక్కలేరి జీపీ అధ్యక్షురాలు వైఎం రాధిక, యశస్విని మహిళా మండలి సంస్థాపక డైరెక్టర్ నాగవేణి, పాఠశాల హెచ్ఎం వి శాంతమ్మ, జి సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

నంది అవార్డుల లోగో విడుదల

బనశంకరి: తెలుగు సినిమా రంగంలో మాదిరిగా కన్నడ చిత్రరంగంలోనూ నంది అవార్డులను అందజేయనున్నారు. నంది అవార్డుల లోగో ను సీఎం సిద్దరామయ్య శుక్రవారం విడుదలచేశారు. కర్ణాటక చలనచిత్ర వాణిజ్యమండలి అధ్యక్షుడు బా.మా.హరీశ్, అనితారెడ్డి, నిత్యానంద ప్రభు, పద్మావతిచంద్రశేఖర్, బామాగిరీశ్, గిరీశ్ తదితరులు పాల్గొన్నారు.

కుస్తీ సంఘం ఏర్పాటు

సంప్రదాయక కుస్తీని ప్రోత్సహించడానికి కర్ణాటక కుస్తీసంఘం ఏర్పాటుచేశామని నూతన అధ్యక్షుడు బీ.వీరణ్ణ తెలిపారు. నగరంలో భారతీయ శైలి కర్ణాటక రాష్ట్ర సంప్రదాయక కుస్తీ సంఘం నూతన పదాధికారులను నియామకం జరిగింది. మట్టి కుస్తీకి ప్రాచుర్యం కల్పించడమే తమ లక్ష్యమని చెప్పారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరం



క్రీడా జ్యోతిని అందిస్తున్న డీడీపీఐ కృష్ణమూర్తి

కేజీఎఫ్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతనివ్వాలని డీడీపీఐ కృష్ణమూర్తి తెలిపారు. శనివారం బెమెల్ క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్–17 విద్యార్థుల క్రీడాపోటీలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ సామర్థ్య ప్రదర్శనకు క్రీడలు ఉత్తమ వేదిక అని అన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. బీఈఓ మునివెంకటరామాచారి మాట్లాడుతూ కోలారులో స్టేడియం మరమ్మతు పనులు జరుగుతున్నందున ఈ పోటీలను బెమెల్ క్రీడాంగణంలో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని తాలూకా నుంచి 600 మంది విద్యార్థులు క్రీడా పోటీలకు హాజరయ్యారు. ఆయా తాలూకాల వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయల సంఘం అధ్యక్షుడు అప్పయ్యగౌడ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించరూ



వినతిపత్రం సమర్పిస్తున్న రైతు సంఘం నేతలు

కోలారు: రైతులకు నాణ్యమైన బంగాళాదుంప విత్తనాలను సబ్సిడీ ధరతో అందించాలని కోరుతూ రైతు సంఘం పదాధికారులు శనివారం వ్యవసాయ శాఖ కార్యదర్శి శ్రీనివాస్‌కు వినతి పత్రం సమర్పించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణగౌడ మాట్లాడుతూ దుకాణాల నుంచి నకిలీ విత్తనాల విక్రయాన్ని అరికట్టి ఉద్యాన శాఖ నుంచే విత్తనాలను సబ్సిడీపై అందించాలని, రైతులకు పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. రైతు నాయకుడు మరగల్ శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఏడాది బంగాళాదుంప పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించాలని ఒత్తిడి చేశారు. జిల్లా అధ్యక్షుడు ఈకంబల్లి మంజునాథ్, కామసముద్రం ఫిర్కా అధ్యక్షుడు మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటలో సహకార సంఘం



మాట్లాడుతున్న అధ్యక్షుడు శ్రీరామగౌడ

శ్రీనివాసపురం: తాలూకాలోని కుప్పహళ్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1.37 లక్షల నికర లాభాలు గడించిందని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు వి.శ్రీరామగౌడ తెలిపారు. శనివారం కుప్పహళ్లిలో సంఘం వార్షిక సామాన్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రైతులకు పాడి ఉత్పత్తుల వృద్ధికి అవసరమైన సామగ్రిని సంఘం నుంచి రాయితీ ధరల్లో అందిస్తున్నామన్నారు. ప్రతి సభ్యుడు సంఘం అభివృద్ధికి తగిన సలహా, సూచనలివ్వాలన్నారు. సమావేశంలో కోముల్ విస్తరణాధికారి పీకే నరసింహరాజు, కాడుదేవండనహళ్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సీఈఓ కేవీ నంజుండప్ప, సంఘం ఉపాధ్యక్షుడు మునియప్ప, డైరెక్టర్ కేవీ మంజునాథ్, రామకృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఇంట్లో చోరీ

రాయచూరు రూరల్: దొంగలు పార్వతమ్మ అనే వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న ఆమె చెవి కమ్మలు, గొంతులోని బంగారు నగలను చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గురువారం రాత్రి లింగసూగూరులో జరిగిన ఈ ఘటనలో చెవి పోగులను దొంగలు లాగడంతో వృద్ధురాలికి గాయాలయ్యాయి. ఆమె నోరు మెదపకుండా ఉండేలా నోటిలో గుడ్డలు కుక్కి నగలు దోచుకెళ్లారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీటి వృథాతో రోడ్డు అధ్వానం



నీటి వృథాతో రోడ్డు పాడైన దృశ్యం

కంప్లి: రామసాగర 4వ వార్డులో తాగునీటి పైపులు లీకై నీరంతా వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. వార్డు సభ్యురాలు పార్వతి అయినా పెత్తనం అంతా ఆమె భర్త చేతిలో ఉంది. నీరు లీకై వార్డులోని రోడ్లలో వృథాగా పారుతోంటే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై పీడీఓ దృష్టి తెచ్చినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తమ గోడును ఆలకించి పీడీఓ, సభ్యురాలు నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

షేర్లలో నష్టాల పాలై ఐటీ ఇంజినీరు ఆత్మహత్య

తాడిపత్రి అర్బన్: ఐటీ ఇంజినీర్ ఉద్యోగం చేస్తూ మరోవైపు షేర్ మార్కెట్లో పెట్టుబడి పెట్టి నష్టపోయి ఆత్మహత్య చేసుకున్నాడో యువకుడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లాలోని తాడిపత్రి నియోజకవర్గం యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన పెనుగొండ ఓబిరెడ్డి (26) అనే బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుండేవాడు, అయితే అక్కడ షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోవడంతో మనస్తాపం చెంది గత నెల 15న ఉద్యోగాన్ని వదిలేసి తాడిపత్రికి వచ్చి ఇంట్లో ఉండేవాడు. గురువారం తాడిపత్రి పట్టణంలో విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తల్లిదండ్రులు ఓబిరెడ్డిని చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు.

విద్యుత్‌కు అధిక డిమాండ్: మంత్రి

శివాజీనగర: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రోజు రోజుకు అధికమవుతోందని ఇంధన శాఖ మంత్రి కే.జే.జార్జ్ తెలిపారు. శనివారం సర్ ఎం.విశ్వేరయ్య 163 జయంతి సందర్భంగా కర్ణాటక విద్యుత్ మండలి ఇంజనీర్ల సంఘం నిర్వహించి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్షాలు లేక విద్యుదుత్పత్తి తక్కువైంది. కోవిడ్ సమయంలో విద్యుత్‌కు డిమాండ్ ఉండేది కాదు. ప్రస్తుతం ఆర్థిక కార్యకలాపాలు అధికమై కరెంటుకు డిమాండ్ అధికమైందన్నారు. ఈ నేపథ్యంలో సోలార్, విండ్ ఎనర్జీ ద్వారా విద్యుదుత్పత్తికి పథకాలను రూపొందిస్తామని తెలిపారు.

ఏపీఎంసీలో ఆకస్మిక తనిఖీ

హొసపేటె: ఏపీఎంసీ ఆవరణలో నిర్మిస్తున్న హోల్ సేల్ దుకాణాలను వెంటనే తరలించాలని జిల్లాధికారి దివాకర్ ఆదేశించారు. ఆయన శనివారం ఏపీఎంసీ మార్కెట్ యార్డ్‌లో ఆకస్మిక తనిఖీ చేసి కార్యాలయాన్ని పరిశీలించారు. ఆవరణలో నిర్మిస్తున్న హోల్ సేల్ దుకాణాల్లోకి సత్వరం దుకాణాలను తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా

9 తాలూకాల్లో తీవ్రమైన కరువు


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాస్

తుమకూరు: ఈ ఏడాది వర్షాలు సరిగా కురవక అనేక జిల్లాల్లో పంటలు పండలేదని, కరువు నెలకొందని జిల్లా అధికారి శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... తుమకూరు జిల్లాలో కూడా తొమ్మిది తాలూకాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించినట్లు తెలిపారు. జిల్లాలోని చిక్కనాయకనహళ్లి, గుబ్బి, కొరటిగెరె, కుణిగల్, మధుగిరి, పావగడ, శిరా, తిపటూరు, తురువెకెరె తాలూకాల్లో తీవ్రమైన కరువు ఉందని తెలిపారు. కరువు సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు.

ఉపాధ్యాయురాలికి అభినందన

గౌరిబిదనూరు: పిల్లలకు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడానికి ఉపాధ్యాయులు సైతం సంబంధిత విషయంలో పరిజ్ఞానం పొంది వుండాలని శ్రీ రామకృష్ణ శారదా దేవి విద్యాసంస్థ అధ్యక్షుడు వీడీ గణేశ్ అన్నారు. శనివారం పాఠశాల ఆవరణంలో తాలూకా ప్రైవేటు పాఠశాలల పాలక మండళ్ల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల పోటీలలో రెండవ స్థానంలో గెలుపొంది జిల్లా స్థాయికి ఎన్నికైన ఉపాధ్యాయురాలు కౌస్తుభరత్నను అభినందించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివ ప్రకాశరెడ్డి, గౌతమి, అర్చన, రేష్మతాజ్, రేణుకాదేవి, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్త వలలో అధికారి

మైసూరు: లంచం తీసుకుంటూ ఆహార సురక్షిత అధికారి లోకాయుక్త అధికారులకు పట్టుబడ్డాడు. మైసూరు జిల్లా నంజనగూడులోని గుండ్లుపేటె రోడ్డులో ఉంటున్న రఘు హోల్‌సేల్ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. దుకాణం లైసెన్స్ అవధి వచ్చే నెలలో పూర్తి అవుతుందని, రెన్యూవల్ కోసం దరఖాస్తు చేశాడు. ఆహార సురక్షిత శాఖ అధికారి లోకేశ్ రెన్యూవల్‌కు రూ. 15 వేలు డిమాండ్ చేశాడు. బాధితుడు లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో అధికారులు నిఘా ఉంచి నగదు చేతులు మారుతున్న సమయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వినాయక మంటపాలకు అనుమతి ఉండాలి



గౌరిబిదనూరు: నగరంలో వినాయక విగ్రహాల మంటపాలకు నగర సభతో పాటు పోలీసు ఇతర శాఖల అనుమతి ఉండాలని పోలీసు సీఐ సత్యనారాయణ తెలిపారు. శనివారం డా హెచ్ ఎన్ కళాభవనంలో పోలీసు శాఖచే వినాయక పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని, అనుమతి కోసం నగరసభ, పోలీసు, విద్యుత్, అగ్నిమాపక ఇతర శాఖల అధికారులు ఒకే చోట ఉండి సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు భాస్కర్, గోపాల్, విజయ్‌కుమార్, వినాయక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులపై అవగాహన



మైసూరు: మైసూరు నగరం చాముండిపురం బాలబోధిని పాఠశాలలో విద్యార్థులకు మట్టి వినాయకుల తయారీపై అవగాహన కల్పించారు. అపూర్వ స్నేహ బళగ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ మట్టి వినాయకుల తయారీ, నిమజ్జనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని వీహెచ్‌పీ పరిషత్ విభాగం నేత సవిత ప్రారంభించారు.

చిన్నారులకు గ్రహణ శక్తి ఎక్కువ



బొమ్మనహళ్లి: బాల్యంలో చిన్న పిల్లలకు అర్థం చేసుకునే శక్తి ఎక్కువగా ఉంటుందని ఐక్య సంస్థ సంచాలకుడు ప్రవీణ్ గోఖె అన్నారు. శనివారం బెంగళూరు నగర జిల్లా పరిధి ఆనేకల్ పట్టణంలోని ప్రభుత్వ పాత ప్రాథమిక పాఠశాలలో కొత్తగా ప్రారంభమైన ఎల్‌కేజీ, యూఏజీ తరగతుల్లో సౌకర్యాలను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రవీణ్, బెల్లంకొండ ఉషా, భూమిక, అనుపమ, గిరిశ్, శ్యామ్, కృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాలతో ప్యాటరీ టౌన్ కళకళ

- చవితికి భారీగా విగ్రహాల తయారీ
- ముచ్చటైన డిజైన్లలో చేసిన కళాకారులు

శివాజీనగర: ప్రథమ పూజలందుకునే హేరంభుని పండుగ ఈ నెల 18నే. వినాయక చవితి కోసం విగ్రహాల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. చవితికి ముందు నెల రోజులు గణనాథుణ్ణి తీర్చిదిద్దడంలోనే బెంగళూరు పాటరీటౌన్ కళాకారులు, శ్రామికులు నిమగ్నమవుతారు. ఎన్ని విగ్రహాలను విక్రయిస్తే బతుకు తెరువుకు అంత భరోసా. అందుకే


పాటరీటౌన్‌లో ఆకర్షిస్తున్న గణనాథుడి విగ్రహం


విక్రయానికి సిద్ధంగా ఉంచిన వినాయక విగ్రహాలు


ఇంటిల్లిపాది విగ్రహాలకు రంగులు వేస్తున్న దృశ్యం

పోటీలుపడి ఆకర్షణీయంగా ఎలుక వాహనధారికి ప్రాణం పోస్తుంటారు. విఘ్న వినాయక రంగురంగుల విగ్రహాలతో బెంగళూరులోని పాటరీ టౌన్ కళకళలాడుతోంది. చుట్టుపక్కల జిల్లాల నుంచి వస్తున్న ఉత్సవ కమిటీలు తమకు నచ్చిన రీతిలో విగ్రహాల తయారీకి ఆర్డర్లు ఇచ్చాయి. ఇందుకు అనుగుణంగా కళాకారులు, కార్మికులు సృజనాత్మకంగా గణనాథుని విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. పాటరీటౌన్ మట్టి వస్తువులకు పేరు గాంచినది. నగరవాసులే కాకుండా ఇతర ప్రాంతాల ప్రజలు ఇక్కడికి వచ్చి వస్తువులను చిల్లరగా, టోకుగా కొంటుంటారు. సుమారు యాభైకి పైగా కుటుంబాలవారు ఏకదంతుని విగ్రహాలను తయారు చేస్తున్నారు. వినాయక చవితికి నెల రెండు నెలల ముందుగానే గణేశమూర్తులను తయారు చేసుకుని విక్రయానికి ఉంచుతారు. ఈ ఏటా వ్యాపారం అధికంగా ఉంటుందన్న ఆశాభావంతో వ్యాపారులు నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం ఆదేశించిన విధంగానే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ)ని వాడటం లేదు. మట్టితోనే విగ్రహాలు తయారు చేసి విక్రయానికి సిద్ధంచేసి పెట్టారు. ఈ ప్రాంతంలో రూ.50 నుంచి రూ.20 వేల ధరలతో కూడిన విగ్రహాలు ఉన్నాయి. అయితే రాత్రి పగలు కష్టపడి తయారు చేసిన విగ్రహాలను ఉంచుకోవటానికి ఈ ప్రాంతంలో స్థలం కొరతపడింది. ఈ ప్రాంతంలో ఉన్నవారంతా కులవృత్తిని నమ్ముకొని జీవించే కుమ్మరులే. మట్టితో తయారుచేసే వస్తువులను కాపాడుకోవటానికి షెడ్లు కట్టించాలని కళాకారుడు రాజశేఖర్ కోరుతున్నారు. అతి ఖరీదైన విగ్రహాలను తయారు చేశాం. వర్షం వస్తే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం వృత్తినే నమ్ముకునే జీవనం చేసేవారిని ఆదుకోవాలని విన్నవిస్తున్నారు.

గణపతి ఏనాడూ నష్టం కలిగించరు :

ఇంటిల్లిపాది పని చేస్తుంటామని కరోనా కారణాన గత ఏడాది మినహాయిస్తే ఏ సంవత్సరం వినాయకుడి విగ్రహాల తయారీలో తమకు నష్టం కలగలేదని విగ్రహాల తయారీ కళాకారిణి మల్లిగె తెలిపారు. తమ ఇంట్లో కుటుంబ సభ్యులతో మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేస్తామని, కాలేజీకి వెళ్లే తన మనవరాళ్లు సైతం సెలవు ఉన్నపుడు విగ్రహాలకు రంగులు వేయటం చేస్తుంటారని తెలియజేశారు. ఈ సంవత్సరం రూ.6 లక్షల వరకు మట్టి విగ్రహాల తయారీకి పెట్టుబడి పెట్టానని, రూ.10 లక్షల వరకు లాభం పొందుతాననే విశ్వాసం ఉందని పేర్కొన్నారు.

స్వామీజీ లింగైక్యం


మహాస్వామి (ఫైల్)

యశవంతపుర: హావేరి జిల్లా రాణిబెన్నూరు తాలూకా చళగేరి గ్రామంలో ఉన్న కటగెహళ్లిమఠం డాక్టర్ మహంతేశ్వర మహాస్వామి(72) శనివారం లింగైక్యమయ్యారు. కొద్దికాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం సాయంత్రం సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. భక్తులు శోకసాగరంలో మునిగిపోయారు.

ఉపాధ్యాయులను సన్మానించడం హర్షనీయం

మండ్య: మంచి మనసుతో పాఠశాలకు వచ్చె విద్యార్థులను అర్థం చేసుకుని వారికి ఉత్తమ విద్యను అందించే ఉపాధ్యాయులు ఎంతో అభినందనీయులని బీజేపీ నాయకుడు హెచ్‌ఆర్ అరవింద్ అన్నారు. శనివారం మండ్య నగరంలోని తావరెకెరె లేఔట్‌లోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో కస్తూరి సిరిగన్నడ వేదిక రాష్ట్ర విభాగం, కన్నికా శిల్ప నవోదయ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల దినోత్సవంలో ఆదర్శ ఉపాధ్యాయులకు గురుకుల తిలక అవార్డుల ప్రధాన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

16 నుంచి మైసూరు దసరా చలన చిత్రోత్సవం

మైసూరు: విశ్వ విఖ్యాత మైసూరు దసరా వేడుకల్లో భాగంగా దసరా చలన చిత్రోత్సవంలో చిన్న చిత్రాల పోటీలతో పాటు అనేక ప్రత్యేకతలు ఉన్న సినిమాలను మైసూరు దసరా చలన చిత్రోత్సవంలో ప్రదర్శిస్తారు. పర్యాటక శాఖ కార్యాలయంలో మైసూరు దసరా చలన చిత్రోత్సవం ఉప సమితి, ఉప విభాగం పత్యేక అధికార, జాయింట్ డైరెక్టర్ అధ్యక్షతలో దసరా చలన చిత్రోత్సవంపై మొదటి ముందస్తు సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 16 నుంచి 22 వరకు నగరంలోని మాల్ ఆఫ్ మైసూరులోని ఐనాక్స్, డీఆర్‌సీ, మల్టిప్లెక్స్‌లలో దసరా చలన చిత్రోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్టోబర్ 15న కళా మందిరంలో సీఎం సిద్ధరామయ్య దసరా చలన చిత్రోత్సవాన్ని ప్రారంభిస్తారు.

కీచక హెచ్‌ఎం అరెస్ట్

మండ్య: విద్యార్థులను లైంగికంగా వేధిస్తున్న కీచక ఉపాధ్యాయుడిని మండ్య జిల్లా మద్దూరు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. తాలూకాలోని నిడఘట్ట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న శివరామ్ (56)ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతనిపై పోక్సో కేసు నమోదు చేసి జుడీషియల్ కస్టడీకి తరలించారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుడటంతో రెండు రోజుల క్రితం విద్యార్థినుల తల్లిదండ్రులు మద్దూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేసి కీచక హెచ్‌ఎంను అరెస్ట్ చేసి జుడీషియల్ కస్టడీకి తరలించారు.

రైతు ఆత్మహత్యాయత్నం

యశవంతపుర: బ్యాంకులో రైతు ఆత్మహత్యకు యత్నించిన ఘటన హావేరి జిల్లా రాణిబెన్నూరు తాలూకా మాకనూరు గ్రామంలో జరిగింది. రైతు సంజీవ్ బ్యాంక్‌లో వ్యవసాయం కోసం రూ. 3.45 లక్షలు అప్పు తీసుకున్నారు. వడ్డీ పెరగటంతో ఇది రూ.10 లక్షలకు చేరింది. తనకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ సౌకర్యం కల్పించాలని బ్యాంక్ అధికారులకు విజ్ఞప్తి చేశాడు. వారు స్పందించలేదు. శనివారం బ్యాంక్‌కు వెళ్లిన రైతు సంజీవ్ తనకు ఓటీఎస్ కల్పించకపోవడంతో అసలు, వడ్డీ పెరిగిపోతోందని ఆగ్రహిస్తూ పురుగుల మందు తాగడానికి యత్నించాడు. గమనించిన సిబ్బంది అడ్డుకున్నారు.


ఆత్మహత్యకు యత్నిస్తున్న రైతు సంజీవ

ప్రతిభను నిరూపించుకోవాలి


అధికారిని సన్మానిస్తున్న దృశ్యం

విజయపుర (బెంగళూరు గ్రామీణ): ప్రతి విద్యార్థిలో ప్రతిభ ఉంటుందని, ఇలాంటి పోటీ సమయాల్లో వారు ప్రతిభను నిరూపించుకోవాలని కర్ణాటక బ్యాంక్ మేనేజర్ రాజేశ్ అన్నారు. శనివారం విజయపుర పట్టణంలోని నందిని విద్యాసంస్థలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్ వస్తు ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలన్నారు.

అక్షర దాసోహ కార్మికుల ధర్నా


రోడ్డుపై బైఠాయించిన కార్మికులు

తుమకూరు: కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అక్షర దాసోహం కార్మికులు శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తుమకూరు నగరంలోని టౌన్‌హాల్ సర్కిల్ నుంచి భారీ ర్యాలీగా జిల్లా అధికారి కార్యాలయం చేరుకుని అక్కడ బైఠాయించారు. అనంతరం జిల్లా అధికారికి వినతిపత్రం అందజేశారు.

దేశాభివృద్ధిలో యువకుల పాత్ర కీలకం

బనశంకరి: దేశాభివృద్ధిలో విద్యావంత యువకుల పాత్ర కీలకమని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో యువత మరింత దూసుకుపోవాలని బసవనగుడి ఎమ్మెల్యే ఎల్.రవిసుబ్రమణ్య పిలుపునిచ్చారు. శనివారం బనశంకరి మూడోస్టేజ్ ఐటీఐ లేఔట్‌లోని శ్రీకృష్ణవిద్యాసంస్థలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని విద్యాసంస్థ సంస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎం రుక్మాంగద నాయుడుతో కలిసి ఎమ్మెల్యే ఎల్.రవిసుబ్రమణ్య ప్రారంభించి మాట్లాడారు. డిగ్రీ పట్టభద్రులు రానున్న రోజుల్లో మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. అనంతరం శ్రీకృష్ణ విద్యాసంస్థ అధ్యక్షుడు రుక్మాంగదనాయుడు మాట్లాడుతూ... విద్యార్థులు డిగ్రీతో ముగింపు పలకకుండా పోస్టు గ్రాడ్యుయేషన్ చేయడం మంచిదన్నారు. ఈ సందర్భంగా డిగ్రీ పట్టభద్రులకు సర్టిఫికెట్లు వితరణ చేశారు. బెంగళూరు వర్సిటీ చాన్సలర్ టీ.జవరేగౌడ, విద్యాసంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌పీ.మనోహర్, పీజీ విభాగ డైరెక్టర్ ప్రొఫెసర్ వేణుగోపాల్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిసుబ్రమణ్య తదితరులు

యువతి దుర్మరణం

యశవంతపుర: బైక్‌ను కారు ఢీకొనడంతో యువతి మృతి చెందిన ఘటన దక్షిణ కన్నడ జిల్లా ముల్కి పట్టణానికి సమీపంలో జరిగింది. కాసరగోడు జిల్లా బాక్రబైలుకు చెందిన ప్రీతికాశెట్టి (21) మృతి చెందారు. బైక్ నడుపుతున్న యువకుడికి బలమైన గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉడుపి నుంచి మంగళూరు వైపు వెళ్తున్న కారు రోడ్ క్రాస్ అవుతున్న బైక్‌ను ఢీకొంది. కిందపడి యువతి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ముల్కి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నేమకల్లు అంజన్నకు అభిషేకం

బొమ్మనహాళ్: ప్రసిద్ధి నేమకల్లు అంజనేయస్వామికి శనివారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలతో, పుష్పలతో శోభాయమానంగా అలకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమారస్వామి, సంతోష్‌కుమారస్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామి వారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకు పూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులతో ఆలయం పోటెత్తింది. వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

19న దుగ్గిలమ్మ జాతర

రాయదుర్గం టౌన్: పట్టణంలోని 17వ వార్డులోని శ్రీదుగ్గిలమ్మ ఆలయ జాతర ఉత్సవాలను ఈ నెల 19న మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకోవాలని కోరారు. కాగా దుగ్గిలమ్మ జాతర అనంతరం మరుసటి రోజు బుధవారం ఫైర్ స్టేషన్ వద్ద గల మారెమ్మ ఆలయంలో విశేష పూజలు, సిడిమాను ఉత్సవం నిర్వహిస్తామన్నారు.

హోసూరు వార్తలు..

వలస మహిళా కూలీ ఆత్మహత్య

కెలమంగలం: గత పది రోజులుగా స్వగ్రామానికెళ్లాలని డిమాండ్ చేసినా భర్త తీసుకెళ్లకపోవడంతో వలస కూలీ మహిళ ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మాదన్‌సావ్ భార్య పూనం దేవి (35), వీరు తళి సమీపంలోని అగళకోట వద్ద నివాసముంటూ కూలీ పనులు చేస్తున్నారు. పది రోజులుగా సొంతూరికెళ్దామని పూనం దేవి భర్తను కోరుతూ వచ్చింది. ఈ విషయంపై శుక్రవారం రాత్రి ఇద్దరూ గొడవపడడంతో విరక్తి చెందిన పూనందేవి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. తళి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని స్వాధీనపరుచుకొని డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రులకు ఉపకరణాల విరాళం

హోసూరు: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి శతజయంతి ఉత్సవాల సందర్భంగా డీఎంకే పార్టీ వైద్య విభాగం నాయకులు ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రులకు వైద్య ఉపకరణాలను విరాళమిచ్చారు. క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా వైద్య విభాగ నాయకుడు డాక్టర్ భూపేష్ కార్తిక్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాష్, మేయర్ ఎస్.ఏ. సత్యలు ముఖ్య అతిథులుగా పాల్గొని హోసూరు కార్పొరేషన్ పరిధిలోని మూకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, వేపనపల్లి, తళి ఆస్పత్రులకు వైద్య ఉపకరణాలను అందజేశారు. డిప్యూటీ మేయర్ ఆనందయ్య, వెంకటేష్, సెందిల్‌కుమార్, గోపి, తళి యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పండుగ వేళ పోలీసుల కవాతు

కెలమంగలం: గట్టి భద్రతతో వినాయక చవితిని జరుపుకోవాలని సూచిస్తూ కెలమంగలం, డెంకణీకోట ప్రాంతాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. క్రిష్ణగిరి జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి వివిద హిందూ సంఘాలు భారీఎత్తున వినాయక మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. మండపాలకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా పొందాలని, సీసీ కెమెరాలతో గట్టి భద్రత చేపట్టాలని, ప్రజలకు, భక్తులకు ఇబ్బందులు కల్పించక పూజలు నిర్వహించాలని, కాలుష్యం లేని వినాయక ప్రతిమలనే వినియోగించాలని అధికారులు ప్రకటించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం కవాతు నిర్వహించారు.


కెలమంగలంలో పోలీసు కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

హైవేపై వరుస యాక్సిడెంట్లు


ఢీకొని ధ్వంసమైన వాహనాలు



- ఒకరు మృతి, పలువురికి గాయాలు

క్రిష్ణగిరి: హోసూరు– క్రిష్ణగిరి జాతీయ రహదారిపై వరుసగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా కొందరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. వినాయక చవితి సందర్భంగా వరుసగా మూడు రోజుల పాటు సెలవులు రావడంతో కర్ణాటక, బెంగళూరు ప్రాంతంలో ఉద్యోగ, వ్యాపార నిమిత్తం వలస వెళ్లిన ప్రజలు శనివారం సాయంత్రం స్వగ్రామాలకు బయల్దేరారు. కార్లు, బస్సులు అధికంగా రావడంతో జాతీయ రహదారిపై రద్దీ పెరిగింది. సూళగిరి సమీపంలోని మేలుమలై వద్ద అదుపుతప్పి రెండు లారీలు, మూడు కార్లు వరుసగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులోని ఓ వ్యక్తి మృతి చెందగా, ఇతర కార్లలోని కొందరు తీవ్ర గాయాలపాలైయ్యారు. సంతోషంగా సొంతూళ్లకు వెళ్తున్న సమయంలో ప్రమాదాలు జరగడంతో బాధితులు ఆవేదనకు గురయ్యారు.

సహాయక చర్యలు

సూళగిరి పోలీసులు చేరుకొని వాహనాల్లో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీసి చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను సక్రమం చేశారు. సుమారు గంట పాటు ట్రాఫిక్ సమస్య ఎదురైంది. కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

రూ.7 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం





స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను చూపుతున్న నగర సీపీ దయానంద్ తదితరులు

- 14 మంది డ్రగ్స్‌పెడ్లర్ల అరెస్ట్

బనశంకరి: మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్న సీసీబీ పోలీసులు శనివారం అంతర్జాతీయ, అంతరాష్ట్రాలకు చెందిన 14 మంది డ్రగ్స్‌పెడ్లర్లను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.7.83 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని నగర సీపీ దయానంద్ తెలిపారు. శనివారం డ్రగ్స్‌పెడ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను పరిశీలించిన అనంతరం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బెంగళూరు నగరంలో మొదటిసారిగా మెఫడ్రోన్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఏడు కేసులు నమోదు :

బెంగళూరు నగరంలోని వర్తూరు, బనశంకరి, విద్యారణ్యపుర, కాటన్‌పేటే, కాడుగోడి పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సీసీబీ పోలీసులు దాడులు చేసి అంతర్జాతీయ, అంతరాష్ట్ర డ్రగ్స్ పెడ్లర్లను అరెస్ట్ చేసి వీరిపై 7 కేసులు నమోదు చేశారు. అరెస్టైన డ్రగ్స్‌పెడ్లర్లలో ముగ్గురు విదేశీయులు, ఒడిస్సా, కేరళకు చెందిన నలుగురు, బెంగళూరుకు చెందిన ముగ్గురిని కోర్టులో హాజరు పరిచి కస్టడీలోకి తీసుకుని విచారణ చేస్తున్నామని దయానంద్ తెలిపారు.

1.450 కిలో హాశీశ్‌ఆయిల్ స్వాధీనం

పట్టుబడినవారి నుంచి 182 కిలోల గంజాయి, 1.450 కిలో హాశీశ్ ఆయిల్, 16.2 గ్రాములు ఎండీఎంఏ క్రిస్టల్, 135 ఎక్స్‌టెసీ మాత్రలు, కిలో మెఫడ్రీన్ వైట్‌పౌడర్, మెఫడ్రీన్‌క్రిస్టల్ 870 గ్రాములు, కొకైన్ 80 గ్రాములు, ఎండీఎంఏ ఎక్స్‌టెసీ పౌడర్ 230 గ్రాములు, 8 మొబైల్స్ రెండు కార్లు, ఒక స్కూటర్‌ను స్వాధీనం చేసుకోగా వీటి విలువ రూ.7 కోట్ల 83 లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. సీసీబీ డీసీపీ ఆర్.శ్రీనివాస్‌గౌడ మార్గదర్శనంలో అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ డీ.కుమార్ నేతృత్వంలో సీసీబీ సిబ్బంది డ్రగ్స్ పెడ్లర్లను అరెస్ట్ చేశారని తెలిపారు. విలేకరుల సమావేశంలో అదనపు పోలీస్ కమిషనర్ సతీశ్‌కుమార్, డీసీపీ శ్రీనివాస్‌గౌడ పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



బొమ్మనహళ్లి: బెంగళూరు నగర జిల్లా పరిధి ఆనేకల్ పట్టణంలోని శ్రీరామ కుటీరంలో ఆనేకల్ తాలుకా పారిపాలన విభాగం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ ప్రజా ప్రభుత్వ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆనేకల్ ఎమ్మెల్యే బీ. శివణ్ణ పాల్గొని భారత రాజ్యాంగ్యాన్ని పఠనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శశిధర్ మాడ్యాళ్, ఈఓ మంజునాథ్ రెడ్డి, ఇన్స్‌పెక్టర్ చంద్రప్ప, సీడీపీఓ కవితా, టీహెచ్‌ఓ రవి, బీఈఓ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే డెంగీకి మందు

హోసూరు: క్రిష్ణగిరి జిల్లాలో డెంగీ జ్వరాల నియంత్రణపై జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో కలెక్టర్ శరయు అధ్యక్షతన అధికారులతో సమావేశం నిర్వహించారు. తాగునీటి తొట్టెలను పరిశుభ్రంగా ఉంచాలని, వర్షపు నీరు నిలువ లేకుండా చూడాలని, ఇళ్ల పరిసరాల్లో కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, పగిలిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని, అంతటా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. జిల్లాలో నకిలీ వైద్యులను గుర్తించి వారిపై కఠిన చర్యలు చేపట్టాలని, ప్రైవేట్ ఆస్పత్రుల్లో డాక్టర్ చీటీ లేకుండా ఔషధాలను అమ్మరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో హోసూరు కార్పొరేషన్ కమిషనర్ స్నేహ, సబ్‌కలెక్టర్ శరణ్య, క్రిష్ణగిరి ఆర్డీవో బాబు, డెప్యూటీ డైరెక్టర్ రమేష్‌కుమార్, బీడీవోలు, ఆరోగ్యశాఖాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

జగన్‌తోనే కాపులకు ప్రాధాన్యం

- జాతీయ కాపు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి



వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వంలోనే కాపులకు అత్యధిక ప్రాధాన్యం లభించిందని జాతీయ కాపు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి స్పష్టం చేశారు. నిడదవోలు సభలో 3.57 లక్షల కాపు సోదరీమణులకు రూ.536.77 కోట్ల మేర కాపు నేస్తం పేరుతో సాయం అందించడం అపూర్వమని కొనియాడారు. ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పలు సంస్థలకు అధ్యక్షులుగా కాపులను నియమించిన జగన్‌కు యావత్ కాపు సమాజం అండగా ఉండాలని కోరారు.

కాపుల అభివృద్ధికి జగన్ కృషి

- ప్రజా కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రంశెట్టి అంజిబాబు



లబ్బీపేట (విజయవాడ తూర్పు): కాపుల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని ప్రజా కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు అన్నారు. కాపు నేస్తం నాలుగో విడత విడుదల చేసిన నేపథ్యంలో అంజిబాబు శనివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కాపు మహిళలు వెనకబడి ఉన్నారని గుర్తించి ఎన్నికల మేనిఫెస్టోలో లేకపోయినా కాపు నేస్తం పథకాన్ని రూపొందించారని పేర్కొన్నారు. కాపు మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ పథకం చాలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

టీడీపీ వ్యాఖ్యలపై రజక సంఘాల నిరసన

- తెనాలిలో ధర్నా.. టీడీపీపై ఆగ్రహం



ధర్నా చేస్తున్న రజక సంఘాల నాయకులు

తెనాలి: మాజీ సీఎం చంద్రబాబు అరెస్ట్‌ను ఖండిస్తూ బెంగళూరులో టీడీపీ ఆధ్వర్యాన ఐటీ ఉద్యోగులు చేపట్టిన నిరసనలో ఓ మహిళ 'రజకులు వెధవలు...' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంపై రజక సంఘాల నేతలు మండిపడ్డారు. సదరు మహిళ వ్యాఖ్యలను ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చానల్ పదేపదే ప్రసారం చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళ వ్యాఖ్యలను నిరసిస్తూ గుంటూరు జిల్లా తెనాలిలో శనివారం ధర్నా చేశారు. టైర్లను దహనం చేసి, ఆ మంటల్లో ఆంధ్రజ్యోతి పత్రిక ప్రతులను పడేశారు. ఐటీ ఉద్యోగుల ముసుగులో టీడీపీ కార్యకర్తలే రజకులను కించపరిచేలా మాట్లాడారని, తక్షణమే క్షమాపణ చెప్పాలని రాష్ట్ర రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు డిమాండ్ చేశారు.

గజదొంగ చంద్రబాబుకు వత్తాసా?

- 1,084వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాష్ట్రాన్ని దోచేసిన గజదొంగలు చంద్రబాబు అండ్‌కోకు వత్తాసు పలకడం ఎల్లో మీడియా లక్ష్యమనే నగ్నసత్యాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,084వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శనివారం పలువురు మాట్లాడారు. రాజధానిలో పేదవాడికి సెంటు స్థలం ఇస్తే సామాజిక అసమతుల్యత ఏర్పడుతుందంటూ తప్పుడు కేసులు వేసిన బాబు అండ్ కోకు తమ ఉసురు తగిలి జైలు పాలయ్యాడన్నారు. తాను ఆశించిన తీర్పు రాలేదనే ఆవేశంతో హింసను ప్రేరేపించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన సిద్దార్థ్ లూథ్రాపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

'పాలమూరు-రంగారెడ్డి' ప్రాజెక్టు ప్రారంభం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/సాక్షి, నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్ జిల్లా కృష్ణా తీరంలోని నార్లాపూర్ వద్ద పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రారంభించారు. తొలుత పంపుహౌస్ వద్ద ఏర్పాటుచేసిన పాలమూరు ప్రాజెక్టు పైలాన్‌ను ఆయన ఆవిష్కరించారు. తర్వాత 145 మెగావాట్ల సామర్థ్యమున్న మొదటి మోటారును ఆన్‌చేసి, నీటి ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టారు. నార్లాపూర్ పంపుహౌజ్ వద్ద డెలివరీ సిస్టర్న్ నుంచి అంజనగిరి రిజర్వాయర్‌కు తరలుతున్న నీటి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొల్లాపూర్‌లో బహిరంగ సభలో కేసీఆర్ మాట్లాడారు.

చెప్పకుండా శైలజ దేశం దాటారు

చందాదారుల ప్రయోజనాలు కాపాడేందుకే లుక్ అవుట్ నోటీసులు

దర్యాప్తునకు ఆమె సహకరించడంలేదు

- విదేశాలకు వెళ్తున్నట్లు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు
- విచారణను తప్పించుకోవడానికే అమెరికా వెళ్లారు
- 'మార్గదర్శి' కేసులో తెలంగాణ హైకోర్టులో ఏపీ సీఐడీ కౌంటర్



సొంత ప్రయోజనాల కోసం వేల కోట్లు మళ్లించారు

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ది భారీ కుంభకోణమని, ఈ కేసులో వేలాది చందాదారుల ప్రయోజనాలు కాపాడటం తమ బాధ్యత అని ఏపీ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. ఇంత పెద్ద స్కాంలో నిందితులుగా ఉన్న రామోజీరావు(ఏ-1), శైలజ (ఏ-2) దర్యాప్తునకు ఏమాత్రం సహకరించడంలేదని తెలిపింది. మూడుసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదని చెప్పింది. దర్యాప్తు అధికారులు అడిగిన డాక్యుమెంట్లు, రికార్డులు చూపించడంలేదని తెలిపింది. అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా శైలజ దేశం దాటి వెళ్లారని, అందుకే ఆమెపై లుక్ అవుట్ నోటీసులు (ఎల్‌వోసీ) జారీ చేయాలని కేంద్రాన్ని కోరామని వెల్లడించింది. దర్యాప్తు నుంచి తప్పించుకోవడానికే అమెరికా పర్యటనను సాకుగా ఎంచుకున్నారని పేర్కొంది. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ లుక్ ఔట్ నోటీసులు జారీ చేశారని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆ సంస్థ ఎండీ సీహెచ్ శైలజ వేర్వేరుగా దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్లపై జస్టిస్ కె.సురేందర్ విచారణ చేపట్టారు. ఈ పిటిషన్లలో ఏపీ సీఐడీ కౌంటర్లు దాఖలు చేసింది. అనంతరం వాదనలకు పిటిషనర్ల తరఫు న్యాయవాది రెండు వారాల సమయం కోరడంతో న్యాయమూర్తి విచారణను ఈ నెల 29కి వాయిదా వేశారు. కౌంటర్‌లో ఏపీ సీఐడీ వెల్లడించిన కీలక వివరాలు..

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్‌లోని 37 బ్రాంచ్‌ల్లో ఆ సంస్థ రూ.25 వేల నుంచి రూ.కోటి వరకు చిట్‌లు నడుపుతోంది. వీటిలో చందాదారులు పెద్దఎత్తున పెట్టుబడి పెట్టారు. మార్గదర్శి చైర్మన్ రామోజీరావు, ఎండీ శైలజ, బ్రాంచ్ మేనేజర్లు వసూలు చేసిన వేల కోట్ల రూపాయల్ని అక్రమ మార్గాల్లో సొంత సంస్థల్లోకి, మ్యూచువల్ ఫండ్స్‌లోకి మళ్లిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. చందాదారులకు చెల్లింపుల్లో విఫలమయ్యారు. ఇవన్నీ నేరపూరిత కుట్ర, విశ్వాస ఉల్లంఘన, మోసం కిందికే వస్తాయి. మార్గదర్శి ఎండీ శైలజపై సీఐడీ ఏడు క్రిమినల్ కేసులు నమోదు చేసింది. దర్యాప్తు కీలక దశలో ఉంది. ఈ కేసులో మరిన్ని వివరాలు, కీలక ఆధారాలు తెలుసుకోవడానికి శైలజ విచారణ ప్రధానం. దర్యాప్తు సంస్థ ముందు హాజరై ఆమె వివరాలు వెల్లడించాల్సి ఉంది. ఏప్రిల్ 6న విచారణలో ఆమె సహకరించలేదు. అంతేకాదు అధికారులు అడిగిన ఆర్థిక లావాదేవీల రికార్డులు, డాక్యుమెంట్లు తీసుకురాలేదు. ఆమెకు రాజకీయంగా ఉన్నత స్థాయి వ్యక్తులతో ఉన్న పరిచయాలతో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ చట్టం నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. దేశం విడిచి పారిపోయే అవకాశం కూడా ఉంది. ఇదే జరిగితే చందాదారులకు కోలుకోలేని దెబ్బ తగులుతుంది. వేలాది చందాదారుల ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణకు శైలజను అదుపులోకి తీసుకుని ఏపీ పోలీసులకు అప్పగించాలని ఇమ్మిగ్రేషన్ అధికారులను కోరాల్సివచ్చింది.

సీఆర్‌పీసీ సెక్షన్ 160 కింద ఏప్రిల్ 27న విచారణకు హాజరుకావాలని ఏప్రిల్ 22న నోటీసులు జారీ చేశా. కుటుంబ వ్యవహారాల్లో పాల్గొనాల్సి ఉన్నందున ఏప్రిల్ 27 నుంచి మూడు నాలుగు వారాలు హాజరుకాలేనని ఏప్రిల్ 23న సమాధానం ఇచ్చారు. అనంతరం మే 12న, మే 22న రెండు సార్లు నోటీసులు జారీ చేసినా ఆమె నిరాకరించారు. ఆమె ఇంట్లోనే విచారణ చేపడతామని చెప్పినా అంగీకరించలేదు. అధికారులకు ఇచ్చిన సమాధానంలో ఎక్కడా అమెరికా వెళ్తున్న విషయం చెప్పలేదు. ఆ సమాచారాన్ని ఉద్దేశ్యపూర్వకంగా దాచి ఉంచారు. విచారణలో సహకరించకపోవడం, నోటీసులకు సమాధానం ఇవ్వకపోవడం, సమాచారం లేకుండా దేశం దాటి వెళ్లడం.. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎల్‌ఓసీ జారీ చేయాల్సి వచ్చింది. శైలజ చర్యలు రిజర్వు బ్యాంకు చట్టాలకు విరుద్ధం. బ్రాంచిలలో సోదాల సందర్భంగా అధికారులు పలు ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిపై శైలజ నుంచి వివరణ తీసుకోవడం అత్యంత కీలక. ఇంత పెద్ద ఆర్థిక అవకతవకలపై దర్యాప్తు సాగుతుంటే.. విదేశాలకు వెళ్లడానికి ఆమె చెప్పిన కారణం ఓ సాకు మాత్రమే. ఈ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ను ఉల్లంఘించలేదు అని సీఐడీ కౌంటర్‌లో తెలిపింది.

ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు జాతీయ గుర్తింపు

- వరించిన 'టాప్ ఎక్స్‌పోర్ట్ అవార్డ్ ఆఫ్ క్యాపెక్సిల్'
- లోక్‌సభాపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న కార్పొరేషన్ చైర్మన్ గుర్రంపాటి
- విదేశాలకు ఎర్రచందనం ఎగుమతిలో పురోగతి



మీడియాతో మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. టాప్ ఎక్స్‌పోర్ట్ అవార్డ్ ఆఫ్ క్యాపెక్సిల్ అవార్డును సొంతం చేసుకుంది. శనివారం ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ గుర్రంపాటి దేవేందర్‌రెడ్డికి లోక్‌సభాపతి ఓంబిర్లా ఈ అవార్డును అందజేశారు. అనంతరం దేవేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎర్రచందనాన్ని విదేశాలకు ఎగుమతి చేయడంలో పురోగతి సాధించినట్టు చెప్పారు. ఏపీ ప్రభుత్వ యాజమాన్యంలోని కార్పొరేషన్ కలప ఆధారిత, అటవీ ఆధారిత పరిశ్రమలతో పాటు బీడీ ఆకు, ఎర్రచందనం వ్యాపారం చేసే ఒక ఏజెన్సీగా పనిచేస్తోందన్నారు. ఎకో టూరిజాన్ని కూడా కార్పొరేషన్ ప్రోత్సహిస్తోందని తెలిపారు. 4 లక్షల మెట్రిక్ టన్నుల సగటు ఉత్పత్తితో 35 వేల హెక్టార్లలో యూకలిప్టస్‌ను పెంచుతున్నట్టు చెప్పారు. 6 వేల హెక్టార్లలో జీడి మామిడి, 4 వేల హెక్టార్లలో కాఫీ, మిరియాలు, 2,500 హెక్టార్లలో వెదురు, 825 హెక్టార్లలో టేకు, 1000 హెక్టార్లలో ఇతర వాణిజ్య పంటల్ని ప్రోత్సహిస్తున్నట్టు పేర్కొన్నారు. 5,353 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని విక్రయించి సుమారు రూ.2 వేల కోట్లు సమీకరించామని, 2023లో ఇప్పటి వరకూ రూ.218 కోట్ల విదేశీ మారకద్రవ్యాన్ని సాధించామని, మరో రూ.250 కోట్లు సాధించే దిశగా ముందుకెళుతున్నట్టు తెలిపారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ నుంచి కార్పొరేషన్ 'త్రీస్టార్ ఎక్స్‌పోర్ట్ హౌస్' హోదాను పొందిందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో, ఆయన దిశానిర్దేశంలో కార్పొరేషన్ మరిన్ని విజయాలు సాధిస్తుందని దేవేందర్‌రెడ్డి వివరించారు.

నేడు రాష్ట్రంలో 'స్వచ్ఛత హీ సేవా' ప్రారంభం

సీఎస్ జవహర్‌రెడ్డి



'స్వచ్ఛత హీ సేవా' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎస్ జవహర్‌రెడ్డి, అధికారులు

సాక్షి, అమరావతి : చెత్త రహిత దేశంగా ఇండియాను తీర్చిదిద్దే లక్ష్యంలో దేశ వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని రాష్ట్రంలో ఆదివారం లాంఛనంగా ప్రారంభిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధుల నుంచి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు త్వరలో జరగనున్న మూడో జాతీయ చీఫ్ సెక్రటరీల సమావేశం సన్నాహక చర్యల్లో భాగంగా శనివారం ఢిల్లీ నుంచి కార్యదర్శుల కమిటీతో కలిసి కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్‌గౌబ.. వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంపై వారి చర్చించారు. సమావేశం అనంతరం సీఎస్ జవహర్‌రెడ్డి.. అధికారులతో మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కూటమిగా కలబడదాం... గర్వంగా నిలబెడదాం

సీడబ్ల్యూసీ సమావేశంలో నిర్ణయం



సీడబ్ల్యూసీలో కాంగ్రెస్ అగ్రనేతలు

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని దీటుగా ఎదుర్కొనేందుకు ఏర్పాటు చేసిన ఇండియా కూటమిని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) నిర్ణయించింది. కూటమిలో కీలక పాత్ర వహించడం ద్వారా దేశ ప్రజానీకానికి బాధ్యతాయుతమైన, పారదర్శక ప్రభుత్వాన్ని అందించాలని తీర్మానించింది. విభజన, విద్వేష రాజకీయాలకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చింది. అంతర్జాతీయ సమాజం గర్వించేలా దేశాన్ని నిర్మిస్తామని ప్రకటించింది. హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్లో సీడబ్ల్యూసీ సమావేశాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఖర్గే అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో ఆయనతో పాటు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ప్రసంగించారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు, చైనా దురాక్రమణ, కొత్త రాజ్యాంగ రూపకల్పన, జమిలి ఎన్నికలు, భారత్ జోడో యాత్ర, మణిపూర్ హింస, కశ్మీర్‌లో ఉగ్ర కాల్పులు తదితర 14 అంశాలపై సీడబ్ల్యూసీ చర్చించి తీర్మానాలు చేసింది.

సీడబ్ల్యూసీ తీర్మానాలివీ..

1. జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన ఆర్మీ, పోలీసు అధికారులకు సీడబ్ల్యూసీ తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. ఇలాంటి విషాద సమయంలో జాతి మొత్తం మౌనం పాటిస్తున్న తరుణంలో బీజేపీ, ప్రధాన మంత్రి జీ-20 సమావేశాల విజయవంతం పేరుతో సంబరాలు చేసుకున్నారని, ఇది అమర వీరులకు అవమానమని దుయ్యబట్టింది.
2. ఏడాది కాలంగా సమర్థవంతంగా బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సీడబ్ల్యూసీ అభినందించింది.
3. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ప్రారంభమై ఏడాది గడుస్తున్న సందర్భంగా సీడబ్ల్యూసీ హర్షం వ్యక్తం చేసింది. యాత్ర స్ఫూర్తిని పార్టీలోని అన్ని స్థాయిల్లో కొనసాగించాలని తీర్మానించింది.
4. మణిపూర్‌లో హింస కొనసాగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధాని నిర్లక్ష్యం, హోంమంత్రి వైఫల్యం, ముఖ్యమంత్రి మొండితనమే ఇంతటి దారుణానికి తెరతీసిందని ధ్వజమెత్తింది.
5. కుల, మత, ప్రాంతీయ తత్వాలపై పదేళ్ల మారటోరియం ప్రకటించాలని ప్రధాని తన మొదటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో చెప్పినప్పటికీ సమాజంలో ఈ మూడు దురాచారాలు పేట్రేగిపోతున్నాయని సీడబ్ల్యూసీ అభిప్రాయపడింది.
6. పంటలకు మద్దతు ధర, రైతులు, రైతుసంఘాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రధానిని డిమాండ్ చేసింది.
7. పెరుగుతున్న నిరుద్యోగం, నిత్యావసరాల ధరలపై ఆందోళన వ్యక్తం చేసింది. పదేళ్లకోసారి చేపట్టే జనగణనను 2021లో నిర్వహించకపోవడం సిగ్గుచేటని పేర్కొంది. వెంటనే కులగణన చేపట్టి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్ల గరిష్ఠ పరిమితిని పెంచాలని డిమాండ్ చేసింది.
8. కొత్త రాజ్యాంగ రూపకల్పన ప్రతిపాదనను సీడబ్ల్యూసీ తిరస్కరించింది. ఇది రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించింది. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలను కాపాడేందుకు ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చింది.
9. ఎన్నికల సంఘానికి ఉండాల్సిన స్వయంప్రతిపత్తి కోల్పోయేలా కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన, ఇతర కమిషనర్ల నియామక బిల్లు ఉందని మండిపడింది. ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లు ప్రవేశపెట్టడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని, ఈ సమావేశాల్లోనే మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేసింది.
10. ప్రధానికి సన్నిహితుడైన ఆదానీ గ్రూపుపై వస్తున్న ఆరోపణలపై విచారణకు సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది.
11. ఒకే దేశం-ఒకే ఎన్నిక (జమిలి ఎన్నికలు) విధానం దేశ సమాఖ్య వ్యవస్థపై తీవ్రమైన దాడిగా సీడబ్ల్యూసీ అభివర్ణించింది. రాష్ట్రాల హక్కులను హరించేలా కేంద్రం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని, గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని, విపత్తు సహాయ నిధులివ్వడంలోనూ వివక్ష పాటిస్తోందని ఆక్షేపించింది.
12. చైనాతో సరిహద్దు వివాదాలను వెంటనే పరిష్కరించుకోవాలని కేంద్రానికి సూచించింది.
13. మతసామరస్యం, సామాజిక, ఆర్థిక సమానత్వం, యువత ఆకాంక్షలను నెరవేర్చి అంతర్జాతీయ సమాజం గర్వించేలా దేశాన్ని నిర్మించేందుకు కట్టుబడి ఉన్నట్టు సీడబ్ల్యూసీ ప్రకటించింది. కులం-మతం, ధనిక-పేద, యువకులు-వృద్ధులు లాంటి భేదాల్లేని జాతి నిర్మాణానికి కృషి చేస్తామని తీర్మానించింది.
14. ఇండియా కూటమి ఏర్పాటు ప్రధానితోపాటు బీజేపీకి భయాందోళనలు కలిగించిందని ఎద్దేవా చేసింది. ఇండియా కూటమిని ఒక సైద్ధాంతిక, ఎన్నికల విజయంగా తీర్చిదిద్దడం ద్వారా దేశంలో విభజన, విద్వేష రాజకీయాలకు చరమగీతం పాడాలని పేర్కొంది.

ప్రజా సమస్యలతోనే ముందుకెళ్లాలి : రాహుల్‌గాంధీ

సభలు, సమావేశాలు, తీర్మానాలు చేసి కూర్చుంటే ఫలితం రాదని, సమస్యలే ఎజెండాగా ముందుకు వెళితేనే ప్రజలు ఆదరిస్తారని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సీడబ్ల్యూసీ సమావేశంలో స్పష్టం చేసినట్టు సమాచారం. సమావేశంలో శనివారం రాత్రి మాట్లాడారు. కాంగ్రెస్ కేడర్ బేస్డ్ అన్న ఆలోచనతోనే ఉంటే కష్టమని, ప్రజా ఆందోళనలతోనే వెళ్లాలని చెప్పారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా బీజేపీ విద్వేష రాజకీయాలను స్పష్టంగా చెప్పగలిగామని తెలిపారు. కర్ణాటక ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను కాంగ్రెస్ పార్టీ ఎజెండాగా తీసుకున్నదని, ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, అధికారంలోకి వస్తే ఏఏ వర్గాలకు ఎలాంటి ప్రయోజనాలు కల్పిస్తామో స్పష్టంగా చెప్పడం, నాయకులు సమష్టిగా పనిచేయడం వల్ల విజయం సాధ్యమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని, ఇండియా కూటమి విజయం సాధిస్తుందని చెప్పారు.

1ఏకతాటిపై 27 పార్టీలు: ఖర్గే

దేశం ముందున్న మౌలిక సమస్యల విషయంలో 'ఇండియా' కూటమిలోని 27 పార్టీలు ఏకతాటిపై ఉన్నాయని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. ప్రజావ్యతిరేక బీజేపీ ప్రభుత్వంపై పోరులో కూటమి దూసుకుపోతోందని, అందువల్లే బీజేపీ ప్రభుత్వం విపక్ష పార్టీలపై ప్రతీకార చర్యలకు దిగిందని మండిపడ్డారు. సీడబ్ల్యూసీ సమావేశంలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సమావేశాల్లో లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధిర్‌రంజన్ చౌదరి, సీడబ్ల్యూసీ సభ్యులు ఏకే ఆంటోని, పి.చిదంబరం, కేసీ వేణుగోపాల్, అంబికా సోని, దిగ్విజయ్‌సింగ్, జైరాంరమేశ్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు అశోక్‌గహ్లోత్, సిద్ధరామయ్య, భూపేశ్‌భగేల్‌తోపాటు ఇతర సభ్యులు సుఖ్వీందర్‌సింగ్ సుఖు, రాజీవ్‌శుక్లా, దామోదర రాజనర్సింహ, రఘువీరారెడ్డి యాదవ్, వంశీచందర్‌రెడ్డి, సుబ్బిరామిరెడ్డి పాల్గొన్నారు.

అడ్డంగా దొరికిపోయి.. జడ్జిలపై నిందలా!

జడ్జిలపై విమర్శలను కోర్టులు సుమోటోగా తీసుకోవాలి

- చంద్రబాబు కేసులో న్యాయవ్యవస్థ సక్రమంగా పనిచేసింది
- చట్టం ముందు అంతా సమానులేనని నిరూపణ అయింది
- న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగింది
- 'కోర్టు తీర్పులపై రాజకీయాలు-వక్ర భాష్యాలు' సదస్సులో వక్తలు



సదస్సులో ప్రసంగిస్తున్న తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



క్విజ్ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను బహూకరించిన వక్తలు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): 'అడ్డగోలుగా తప్పులు చేసి సాక్ష్యాధారాలతో అడ్డంగా దొరికిపోయి.. ఆ కేసుల్లో తీర్పు చెప్పిన జడ్జిలపై నిందలు వేస్తారా' అంటూ టీడీపీ నాయకులు, ఆ పార్టీ అనుకూల మీడియాను పలువురు వక్తలు ప్రశ్నించారు. విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో ఆంధ్రా అడ్వకేట్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో 'కోర్టు తీర్పులపై రాజకీయాలు-వక్ర భాష్యాలు' అనే అంశంపై శనివారం సదస్సు జరిగింది. ఫోరం కన్వీనర్ బి.అశోక్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో న్యాయవాదులు, న్యాయ నిపుణులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, మేధావులు పాల్గొన్నారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించిన నాటి నుంచి టీడీపీ నాయకులు, అనుకూల మీడియా న్యాయవ్యవస్థపై, జడ్జిలపై విమర్శలు చేయడాన్ని వక్తలు ఖండించారు. జడ్జిలపై వ్యక్తిత్వ హననం చేసేలా ఉన్న వ్యాఖ్యలను కోర్టులు సుమోటోగా తీసుకోవాలన్నారు. తీర్పులు తమకు అనుకూలంగా వస్తే ఒక విధంగా, వ్యతిరేకంగా వస్తే మరో విధంగా జడ్జిలపై నిందలు వేస్తూ మాట్లాడటం సరికాదని హితవు పలికారు. కోర్టు సాక్ష్యాధారాలు చూస్తుందని, చంద్రబాబు కేసులో పూర్తి సాక్ష్యాధారాలు చూపినందు వల్లే కోర్టు ఆయనకు రిమాండ్ విధించిందన్నారు. సదస్సు అనంతరం న్యాయవ్యవస్థపై నిర్వహించిన క్విజ్ పోటీలలో గెలుపొందిన పాఠశాలల విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. సదస్సులో వివిధ సంఘాల ప్రతినిధులు ఎం శ్రీనివాసరెడ్డి, బడేజానీ, హృదయరాజు, ఎం.కోటేశ్వరరావు, వలిపర్తి బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయస్థానం సుమోటోగా తీసుకోవాలి

రాష్ట్రంలో ప్రధాన మీడియా తీర్పులు చెప్పిన జడ్జిల వ్యక్తిత్వ హననానికి తెగబడుతోంది. తీర్పులపై చర్చలు పెట్టడం ఆశ్చర్యంగా ఉంది. ఇది కచ్చితంగా కోర్టు ధిక్కారం అవుతుంది. హైకోర్టు, సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకోవాలి. జైలర్ సెలవుపై పుంఖాను పుంఖాలుగా కథనాలు రాశారు. చివరికి అతని భార్య చనిపోతే ఆ వార్త కూడా కనిపించకుండా చేశారు.

– విజయబాబు, అధ్యక్షుడు, అధికార భాషా సంఘం

కేసు పూర్వాపరాలు చూసే రిమాండ్

స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు సాక్ష్యాధారాలతో దొరికిపోయారు. జడ్జి పూర్వాపరాలు పరిశీలించిన మీదటే రిమాండ్ విధించారు. బెయిల్ పిటిషన్ వేయకుండా రిమాండ్ విధించడమే తప్పు అన్న వాదన తెచ్చారు. చంద్రబాబు తాను తప్పు చేయకపోతే నిర్దోషిత్వం నిరూపించుకోవాలి. జడ్జిలను తప్పుబట్టడం, న్యాయస్థానాలను తప్పుబట్టడం సరికాదు.

– పి.గౌతంరెడ్డి, చైర్మన్, ఏపీ ఫైబర్ నెట్

జడ్జిల వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నారు

కేసులు విచారణలో ఉండగా వాటిపై చర్చలు పెట్టడం, విమర్శలు చేయడం పరిపాటిగా మారింది. అక్రమ అరెస్ట్, రిమాండ్ అక్రమం, నిర్బంధం అక్రమమంటూ చెబుతున్నారు. వాస్తవానికి అది చెప్పాల్సింది కోర్టులు. కోర్టులు చెప్పాల్సిన అంశాలను మీడియా చానల్స్ చెప్పడం దురదృష్టకరం.

– వీవీఆర్ కృష్ణంరాజు, ఎడిటర్స్ అసోసియేషన్

చంద్రబాబు బొక్క బోర్లా పడ్డాడు

స్కిల్ కుంభకోణం కేసులో చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించడం చరిత్రాత్మక తీర్పు. ఇన్నాళ్లు వ్యవస్థలను మేనేజ్ చేస్తూ తప్పించుకు తిరుగుతున్న చంద్రబాబు చట్టం ముందు బొక్క బోర్లా పడ్డాడు. లూథ్రాను ఆంధ్ర న్యాయవాదులు తిప్పికొట్టారు.

– ఎం.గురునాథం, రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్‌డీఎఫ్

ప్రభుత్వంపై బురద జల్లడం సరికాదు

చంద్రబాబు కేసులో నిష్పక్ష తీర్పు వచ్చింది. చంద్రబాబుకు జైల్లోనూ పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. తనకు వ్యతిరేకంగా తీర్పు రావడంతో ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారు. జడ్జిలపై విమర్శలు చేస్తూ ఏవేవో ఆపాదిస్తూ నిందలు వేస్తున్నారు. ఇది సరైన విధానం కాదు.

– విఠల్ రావు, సీనియర్ న్యాయవాది

సూత్రధారులకు శిక్ష తప్పదు

ఏ కేసులోనైనా నేరం చేసిన వాడిది ఎంత తప్పో, నేరానికి ప్రేరేపించిన వాడిది అంతే తప్పు. కేసులో సాక్ష్యాధారాలు ఉంటేనే కోర్టు రిమాండ్ విధిస్తుంది. చంద్రబాబు కేసులో అదే జరిగింది. న్యాయవ్యవస్థపై, జడ్జిలపై నిందలు మోపొద్దు.

– జయరాజ్, మాజీ పీపీ

తీర్పులకు వక్రభాష్యం తగదు

తవ్వేకొద్దీ చంద్రబాబు స్కామ్‌లు బయటకు వస్తున్నాయి. ఇన్నాళ్లు కొందరు వ్యక్తులను అడ్డుపెట్టుకుని వ్యవస్థలను అనుకూలంగా మార్చుకున్నారు. అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబుకు రిమాండ్ విధిస్తే జడ్జి తీర్పులపై వక్రభాష్యం చెబుతున్నారు. కోర్టు తీర్పులపై మీడియా తప్పుడు ప్రచారం చేయడం సరికాదు.

– ఎం.వెంకటేశ్వరరెడ్డి, హోటల్స్ అసోసియేషన్

అమిత్‌షాతో పీవీ సింధు భేటీ



సింధుతో మాట్లాడుతున్న అమిత్‌షా

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను బాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శనివారం రాత్రి సీఆర్‌పీఎఫ్ సెక్టార్ ఆఫీసర్స్ మెస్‌లో తన తండ్రి పీవీ రమణ, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు ఆమె అమిత్‌షాను కలిశారు. బాడ్మింటన్ క్రీడలో సాధించిన ఘనత, ఒలింపిక్స్‌లో పతకాలను గెలుపొందడం ద్వారా దేశానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు తీసుకురావడంతోపాటు దేశంలోని యువతకు స్ఫూర్తిగా నిలుస్తుండటం పట్ల సింధును అమిత్‌షా అభినందించారు. రాబోయే ప్రతిష్టాత్మక టోర్నమెంట్లకు ప్రాక్టీస్, సౌకర్యాలు, వసతులు ఎలా ఉన్నాయి ప్రభుత్వం నుంచి ఇంకా ఏమైనా కోరుకుంటున్నారా అని అమిత్‌షా ఆరా తీసినట్టు సమాచారం. సినీ, సంగీత, క్రీడా, సాంస్కృతిక, తదితర రంగాల్లో ప్రభావం చూపే ప్రముఖుల (ఇన్‌ఫ్లుయెన్సర్ల)ను కలిసి వారిని అభినందించడం బీజేపీ జాతీయ నేతలకు కొంతకాలంగా ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. గతంలోనూ రాష్ట్ర పర్యటనలకు వచ్చిన సందర్భంగా సినీ హీరోలు జూనియర్ ఎన్టీఆర్ నితిన్‌లను, బాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్‌ను అమిత్‌షా కలుసుకున్నారు. ప్రముఖ మహిళా క్రికెటర్ మిథాలీరాజ్‌ను, ఆర్థిక రాజకీయ రంగాల విశ్లేషకులు కె.నాగేశ్వర్‌ను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కలిసిన విషయం తెలిసిందే. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ విమోచన దినోత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు అమిత్‌షా ఇక్కడకు వచ్చిన సంగతి విదితమే.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
ఆదివారం ॥ 17-9-2023

వైరల్





పిల్లలూ తల్లులూ చల్లని వారే!



దృశ్యం:1

ప్రియాంక చోప్రా తన కూతురు మాల్తీ మేరీ జోనాస్ కోసం ఇంట్లో ‘ప్లే డేట్’ నిర్వహించింది. ఈ ఆటల కార్యక్రమానికి ప్రీతీ జింటా పిల్లలు జే, గియాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ‘ఇన్‌క్రెడిబుల్ వీకెండ్’ కాప్షన్‌తో ప్రియాంక ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ పిల్లల ఆటల ఫొటోలు నెటిజనులను ఆకట్టుకున్నాయి.

‘మంచి ఐడియా దొరికింది. మా చిన్నారి కోసం ఇలాంటి కార్యక్రమం త్వరలో మా ఇంట్లో ఏర్పాటు చేయనున్నాను’ అని ఒక నెటిజన్ స్పందించారు.

దృశ్యం: 2

అమ్మ గురించి చెప్పడానికి ఎన్నో మాటలు అక్కర్లేదు. ‘అమ్మా’ అనే పిలుపులోనే ఎన్నో వినిపిస్తాయి.

తల్లి ఒమ్న కురియన్ పుట్టిన రోజు సందర్భంగా ‘హ్యాపీ బర్త్ డే మై ఎవ్రీ థింగ్’ అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో శుభాకాంక్షలు తెలియజేసింది నయనతార. తన సర్వస్వం అయిన తల్లి గురించి ఎన్నో సందర్భాల్లో నయన్ చెప్పింది.

ఇటీవలే ఇన్‌స్టాలోకి అడుగు పెట్టింది. తన కుమారులు ఉయిర్, ఉలాగ్‌లతో ఉన్న ఫస్ట్ పోస్ట్ 2.6 మిలియన్‌ల లైక్‌లను దక్కించుకుంది.



ఔరా అనిపించిన అండర్ వాటర్ డ్యాన్సర్

మన దేశ ఫస్ట్ అండర్‌వాటర్ డ్యాన్సర్ జయదీప్ గోహిల్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన స్టన్నింగ్ డ్యాన్స్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. మైకేల్ జాక్సన్ ఫేమస్ ‘మూన్‌వాక్’ స్టెప్పులు నీటి గర్భంలో వేసి తన పెర్‌ఫార్మెన్స్‌తో నెటిజనులు ‘ఔరా’ అనుకునేలా చేశాడు. ‘ది ఇన్వెంటర్’ కాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ వీడియో 3.6 మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకుంది. ‘వీఎఫ్ఎక్స్’ ఉపయోగించి సృష్టించిన వీడియో ఇది అని కొందరు యూజర్‌లు మొదట భ్రమ పడి, ఆ తరువాత నిజం తెలుసుకొని అబ్బురపడ్డారు.





పెళ్లినాటి ప్రమాణాలు



‘పెళ్లినాటి ప్రమాణాలు పెళ్లయిన మరుసటి రోజే కనిపించవు’ అనే చమత్కారం మాట ఎలా ఉన్నా నవ వధువు సుచీత ముఖర్జీ మాత్రం పెళ్లినాటి ప్రమాణాల విషయంలో పక్కాగా ఉంది. పెళ్లిమండపంలో ఆహ్వానితుల సమక్షంలో చాంతాడంత పొడవు ఉన్న పెళ్లి ప్రమాణాల లిస్ట్ చదవడం మొదలు పెట్టింది.

‘ఇవి నెరవేర్చడం అంత సులువేమీ కాదు’ అని చదవడం మొదలు పెట్టింది.

అవి విని పెళ్లికి వచ్చిన వాళ్ల నవ్వులే నవ్వులు.

చివరికి వరుడు కూడా నవ్వు ఆపుకోలేకపోయాడు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో 17.5 మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకుంది.

‘ఈ వీడియో సరదాగా చేశారో, సీరియస్‌గా చేశారో తెలియదుగానీ పెళ్లి మండపంలో ఇలా చదవడం ఒక ట్రెండ్‌గా మారనుంది’ అంటూ నెటిజనులు స్పందించారు.

30 అడుగుల అభిమానం



‘జవాన్’తో మరో పెద్ద విజయాన్ని అందుకున్నాడు షారుక్‌ఖాన్. అభిమానులు ఖుషీ ఖుషీగా ఉన్నారు.

కోల్‌కత్తాకు చెందిన షారుక్‌ఖాన్ అభిమాని, చిత్రకారుడు ప్రీతమ్ బెనర్జీ మార్బుల్ స్టోన్ చిప్స్, పెయింట్ బ్రష్‌ను ఉపయోగిస్తూ 30 అడుగుల షారుక్ పోర్ట్రాయిన్ రూపొందించాడు.

ఈ స్టన్నింగ్ పోర్ట్రయిట్ డ్రోన్ షాట్ అదిరిపోయింది.

ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ మేకింగ్ వీడియో చూసిన నెటిజనులు ‘వావ్’ అంటున్నారు.

‘ట్రిబ్యూట్ టూ ది కింగ్‌ఖాన్. ఇది నా హృదయంలో నుంచి వచ్చిన కళారూపం. నా అభిమాన హీరో దీన్ని త్వరలోనే చూడాలనుకుంటున్నాను’ అంటూ రాశాడు బెనర్జీ.

కేశ సంపన్నుడు



ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సిదక్‌దీప్ సింగ్ చాహల్ ‘లాంగెస్ట్ హెయిర్ మేల్ టీనేజర్’గా గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాడు. అతడి జుట్టు పొడవు నాలుగు అడుగుల మూడు అంగుళాలు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ (జీ డబ్ల్యూ ఆర్) ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన సింగ్ వీడియో వైరల్ అయింది.

సిదక్ దీప్‌సింగ్ తన తలవెంట్రుకలను శుభ్రపరుచుకోవడానికి కనీసం 20 నిమిషాలు, అవి ఆరడానికి గంట సమయం పడుతుంది.

‘నీలాగే మాకు కూడా ఇంత జుట్టు ఉంటే ఎంత బాగుణ్ణు’ అని ఎవరో ఒకరు అంటున్నప్పుడల్లా సిదక్ దీప్‌సింగ్‌కు సంతోషంగా, గర్వంగా అనిపిస్తుంది.

భుజాల వరకు వేలాడుతున్న వెంట్రుకలను చూసి చిన్నప్పుడు స్నేహితులు సింగ్‌ను ఆటపట్టించేవారు. అవి భరించలేక తనకు హెయిర్ కటింగ్ చేయించమని అమ్మానాన్నలకు చెప్పాడు. అయితే వారు అదేమీ సీరియస్‌గా తీసుకోలేదు. అలా అడగడం అదే మొదటి సారి చివరిసారి. ఇప్పుడు మాత్రం తన కేశసంపదను చూసి గర్విస్తుంటాడు. ‘తెల్లారి లేచింది మొదలు నా జుట్టుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయం మీద మాత్రమే నేను దృష్టి పెట్టను. చదువుకుంటాను, వ్యాయామం చేస్తాను. వీడియో గేమ్స్ ఆడతాను’ నవ్వుతూ అంటాడు సిదక్ దీప్‌సింగ్.



సంగీత మమకారం


క్షణం తీరిక లేని పనుల్లో అభిరుచులు చిన్నబోతుంటాయి. ఎందుకంటే సమయాభావం వల్ల వాటి జోలికి వెళ్లం. అయితే పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన అభిరుచుల విషయంలో రాజీ పడదు.

సమయం చేసుకొని, చూసుకొని వాటికి న్యాయం చేస్తుంది.

దీదీ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ప్రసంగించే వక్త మాత్రమే కాదు బ్యాడ్మింటన్ ప్లేయర్ కూడా. చక్కగా ఆడుతుంది. కవిత్వం రాస్తుంది. పాటలు పాడుతుంది. బొమ్మలు గీస్తుంది. ఆమె మానసిక బలానికి ఈ సృజనాత్మక శక్తులే కారణం కావచ్చు.

అధికార పర్యటనలో భాగంగా ఇటీవల స్పెయిన్‌కు వెళ్లిన మమతా బెనర్జీ, ఒకవైపు సమావేశాలలో పాల్గొంటూనే మరోవైపు తనలోని ఆర్టిస్ట్‌ను అధికారులకు పరిచయం చేసింది. పియానోపై రవీంద్రుడి సంగీతాన్ని వినిపించింది. అంతకుముందు మాడ్రిడ్ వీధుల్లో అకార్డియన్‌పై ‘హమ్ హోంగే’ గీతాన్ని ప్లే చేసింది. ఈ వీడియోలు ఇంటర్నెట్‌లో సందడి చేస్తున్నాయి.

హెల్త్



అల్జైమర్స్ డిమెన్షియా, వాస్క్యులార్ డిమెన్షియా!!

వయసు పెరుగుతున్న కొద్దీ మతిమరపు వస్తుండటం సహజం. మతిమరపును ఇంగ్లిష్‌లో ‘డిమెన్షియా’ అంటారు. డిమెన్షియాకు కారణాల్లో అత్యంత సాధారణమైంది ‘అల్జైమర్స్’ అయితే... దానితో పోలిస్తే... దానికంటే కొద్దిగా అరుదైనది వాస్క్యులార్ డిమెన్షియా. ఈ సందర్భంగా మతిమరపునకు కారణమయ్యే అల్జైమర్స్ డిమెన్షియా, వాస్క్యులార్ డిమెన్షియా లపై అవగాహన కోసం ఈ కథనం.

డిమెన్షియా, అల్జైమర్స్‌ని ఓ వ్యాధిగా కాకుండా ఓ సిండ్రోమ్‌గా చెప్పవచ్చు. అంటే... నిర్దిష్టంగా ఓ వ్యాధి లక్షణంతో కాకుండా... అనేక లక్షణాల సమాహారంతో కనిపించే ఆరోగ్య సమస్యను సిండ్రోమ్ అనవచ్చు. డిమెన్షియా ఉన్నప్పుడు అది కొత్త అంశాల్ని నేర్చుకునేందుకు దోహదపడే (కాగ్నిటివ్) నైపుణ్యాల్లోని జ్ఞాపకశక్తి (మెమరీ) పైనా, తార్కికంగా ఆలోచించే సామర్థ్యం (రీజనింగ్)పైనా ప్రతికూలంగా ప్రభావం చూపుతుంది.

అల్జైమర్స్ విషయానికి వస్తే ఇది కూడా డిమెన్షియాలో ఒక రకం. అందుకే దీన్ని అల్జైమర్స్ డిమెన్షియా (ఏడీ) అనవచ్చు. గతంతో పోలిస్తే ఇప్పుడిది చాలా సాధారణంగా కనిపిస్తోంది. ముఖ్యంగా కోవిడ్ తర్వాత నలుగురితో కలవకపోవడం, ఒంటరితనం, మానసిక ఒత్తిడి లాంటి అంశాల కారణంగా అల్జైమర్స్ పెరిగింది.

అల్జైమర్స్ డిమెన్షియా కొన్ని నెలలు మొదలుకొని ఏళ్ల వ్యవధిలో క్రమంగా పెరుగుతూ పోతుంటుంది. ఒకసారి అల్జైమర్స్ మొదలయ్యాక బాధితుల్ని మునపటిలా అయ్యేలా చికిత్స సాధ్యం కాదు. కాకపోతే దీనిలో మరపు అన్నది మొదట్లో తాజా తాజా విషయాలు మొదలుకొని... క్రమంగా పాత విషయాల్ని మరచిపోతుంటారు. తాము ఎంతోకాలంగా నివాసమున్న ప్రదేశాల్నీ, కాలాన్నీ (అది పగలా, రాత్రా అన్నదానితో సహా) మరచిపోతారు. ప్రశ్నలకు సమాధానాలివ్వలేకపోవడం, కుటుంబ సభ్యుల్ని అడిగిన ప్రశ్నల్నే మళ్లీ మళ్లీ అడగడం, సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం, ప్రవర్తనలో మార్పు రావడం... చివరకు సొంత కుటుంబ సభ్యుల్ని సైతం గుర్తుపట్టలేనంతగా మరచిపోతారు.


మతిమరపులకు ‘వాస్క్యులార్ డిమెన్షియా’ అనేది ‘అల్జైమర్స్ డిమెన్షియా’ కంటే రెండో అతి ముఖ్యమైన కారణం. మెదడుకు క్రమంగా రక్త సరఫరా తగ్గిపోవడం వల్ల వస్తుంది కాబట్టి దీన్ని ‘వాస్క్యులార్ డిమెన్షియా’గా చెబుతారు. ఇది కొందరిలో అకస్మాత్తుగా కనిపిస్తుంది. ఫలితంగా అభ్యాస, అధ్యయన, నేర్చుకునే ప్రక్రియలు... ఇలా ఇవన్నీ మరుస్తూపోవడం వల్ల పరిస్థితి అకస్మాత్తుగా దిగజారిపోతుంది.

మతిమరుపు, అల్జైమర్స్ తెచ్చి పెట్టే అంశాల్లో కొన్ని...

జన్యుపరమైనవి : మతిమరపులో జన్యుపరమైన అంశాలు కీలకమైన భూమిక పోషిస్తాయి. కొందరి కుటుంబాల్లో వంశపారంపర్యంగా కనిపిస్తుంటాయి. ఏపీఓఈ 4 ఎల్లీల్ వంటి కొన్ని నిర్దిష్టమైన జన్యువులు ఈ ముప్పులను పెంచుతాయి.

వయసు : పెరిగే వయసు మతిమరపును తెచ్చిపెట్టే అల్జైమర్స్, వాస్క్యులార్ డిమెన్షియాలకు ప్రధానమైన రిస్క్ ఫ్యాక్టర్. పైగా ఇది నిరోధించలేని అంశం.

జీవనశైలి (లైఫ్ స్టైల్) : ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించని వాళ్లలో అంటే... ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోకపోవడం, కొవ్వులు, చక్కెరలు ఎక్కువగా తీసుకోవడం, వ్యాయామం లేకపోవడం, పొగ, ఆల్కహాల్ అలవాట్ల వంటి అనారోగ్యకరమైన జీవనశైలి ఉన్నవారిలో ఈ ముప్పులు ఎక్కువ.



దేహంలోని ఇతర సమస్యలు : దీర్ఘకాలికంగా ఉండే డయాబెటిస్, హైబీపీ, గుండెజబ్బులు మెదడు పనితీరుపై ప్రతికూలం ప్రభావం చూపి, పరోక్షంగా అల్జైమర్స్, వాస్క్యులార్ అల్జైమర్స్‌కూ, గురకను కల్పించే స్లీప్ ఆప్నియాకు కారణమవుతాయి.

వాతావరణ అంశాలు : వాతావరణ కాలుష్యాలూ, విష పూరిత వ్యర్థాలూ చాలావరకు మతిమరపునకు కారణమవుతాయి. అందుకే వీలైనంత వరకు పరిశుభ్రమైన ప్రదేశాలూ, కాలుష్యాలు లేని వాతావరణాలూ వీటి నివారణకు చాలావరకు తోడ్పడతాయి.

ఆహారం : పోషకాలన్నీ ఉండే సమతులాహారం తీసుకోవడం మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ముఖ్యంగా భారతీయ వంటల్లో ఉపయోగించే పసుపు, మెడిటేరియన్ డైట్ (ఆల్మండ్స్, వాల్‌నట్, డార్క్ చాక్లెట్స్, ఆలివ్ ఆయిల్, క్రాన్‌బెర్రీ) వంటివి మతిమరపు నివారణకు తోడ్పడతాయి.

చికిత్స : అల్జైమర్స్ డిమెన్షియానూ, వాస్క్యులార్ డిమెన్షియానూ పూర్తిగా తగ్గించే మందులు లేకపోయినప్పటికీ... వాటి పురోగతిని ఆలస్యం చేయడానికి మందులు అందుబాటులో ఉన్నాయి. లక్షణాల తీవ్రత ఆధారంగా డోనెపెజిల్, రివాస్టిగ్మిన్, మెమాంటిన్, గ్యాలంటమైన్ వంటి మందులు ఇవ్వాల్సి ఉంటుంది.

‘లెకానిమ్యాబ్’ అనే సరికొత్త మందును ఈ ఏడాదే ఎఫ్‌డీఏ ఆమోదించింది. పైవన్నీ నోటిద్వారా తీసుకునే మందులు కాగా... లెకానిమ్యాబ్‌ను రెండో వారాలకు ఒకసారి సూది మందు రూపంలో ఇస్తారు.

నివారణ... పై అంశాలలో పెరిగే వయసు, జన్యుపరమైన అంశాలు నిరోధించలేనివి. ఇవి మినహా మిగతా రిస్క్ ఫ్యాక్టర్స్‌ను ప్రయత్నపూర్వకంగా అదుపులో ఉంచడం ద్వారా వీటిని చాలావరకు నివారించవచ్చు. ఈ కింది అంశాలు నివారణకు చాలావరకు తోడ్పడతాయి.

వ్యాయామం : దేహాన్ని చురుగ్గా ఉంచే వ్యాయామాలు చేయాలి. ఫలితంగా మెదడుకు రక్తప్రసరణ పెరిగి, న్యూరాన్ల వాటి న్యూరల్ కనెక్షన్లు, జీవక్రియల కోసం మెదడు స్రవించే రసాయనాలన్నీ ఆరోగ్యకరంగా ఉంటాయి. దాంతో జ్ఞాపకశక్తి మెరుగవుతుంది.

మెదడుకు మేత : కొత్త భాషలు నేర్చుకోవడం, పుస్తక పఠనం, పజిల్స్ సాధించడం, మెదడుకు మేత కల్పించే పొడుపుకథలు, ఉల్లాసంగా ఉంచే హాబీలు, మానసిక వ్యాయామాలు మెదడును ఆరోగ్యంగా ఉంచి మతిమరపు నివారణకు తోడ్పడతాయి.

దీర్ఘకాలిక వ్యాధుల అదుపు : డయాబెటిస్, హైబీపీ వంటి వ్యాధులను అదుపులో పెట్టుకోవాలి.

నలుగురిలో ఒకరిగా : వేడుకలు, పుట్టిన రోజులూ, పెళ్లిళ్ల వంటి ఫంక్షన్లలో పదిమందినీ కలవడం వంటివి మతిమరపును దూరం చేస్తుంది.

రివర్సిబుల్ డిమెన్షియా..

అదృష్టవశాత్తూ ఇప్పుడు కొన్ని రకాల డిమెన్షియాలను పూర్తిగా నయం చేయడం సాధ్యమవుతోంది. అవి... బీ1, బీ6, బీ12 విటమిన్‌ల లోపాలతో వచ్చిన మతిమరపులూ, రక్తంలో కొన్ని లవణాల సమతుల్యత కోల్పోవడం వల్ల, మెదడులో అతిగా నీరు ఉండటం (హైడ్రో కెఫలస్), కొన్ని రకాల బ్రెయిన్ ట్యూమర్స్, బ్రెయిన్ ఇన్ఫెక్షన్స్, కొన్ని భారలోహాలు, కొన్ని రకాల మందుల కారణంగా వచ్చిన మతిమరపులను ఇప్పుడు పూర్తిగా నయం చేయవచ్చు.



డా॥ బి. చంద్రశేఖర్ రెడ్డి
సీనియర్ న్యూరో ఫిజీషియన్.



చిన్నారుల్లో బ్రాంకియోలైటిస్ వస్తే...?

చిన్నారుల ఊపిరితిత్తులకు గాలిని తీసుకెళ్లే చిన్న గాలిగొట్టాల్ని బ్రాంకియోల్స్ అంటారు. ఇన్ఫెక్షన్లు లేదా ఇతర కారణాలతో వీటిల్లో వాపు వస్తే దాన్ని బ్రాంకియోలైటిస్‌గా చెప్పవచ్చు. సాధారణంగా ఇది నెలల వయసుగల పిల్లలు మొదలుకొని రెండేళ్ల వరకు చాలా తరచుగా కనిపిస్తుంది.

పిల్లల్లో బ్రాంకియోలైటిస్‌కు చాలా కారణాలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ప్రధాన గాలి గొట్టం (ట్రాకియా) లేదా నోరు, ముక్కు, గొంతుల్లో వచ్చే ఇన్ఫెక్షన్లు కిందికి వ్యాపించడం వల్ల ఈ సమస్య రావచ్చు. వైరస్‌లలో రెస్పిరేటరీ సిన్సీషియల్ వైరస్, రైనో వైరస్, ఎడినో వైరస్, ఇన్‌ఫ్లుయెంజా, కరోనా లాంటి వైరస్‌లు, కొన్నిసార్లు కొన్ని రకాల బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు కూడా బ్రాంకియోలైటిస్‌కు కారణం కావచ్చు.

ముప్పు ఎవరిలో ఎక్కువ?
- నెలలు నిండకముందే పుట్టిన చిన్నారులు
- తల్లిపాలపై పెరగని పిల్లల్లో
- ఇంతకుముందే ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పిల్లలు
- డే కేర్ సెంటర్‌లోని పిల్లలు... మొదలైనవారిలో.

నిర్ధారణ...
- ఛాతీ ఎక్స్-రే
- కొన్ని రకాల రక్తపరీక్షలు
- ముక్కు, గొంతు నుంచి సేకరించిన స్వాబ్‌ను పరీక్షించడం ద్వారా వైరలా లేక బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షనా అన్నది చాలావరకు నిర్ధారణ చేయవచ్చు.

నివారణ:
- పిల్లలు తమ చేతుల్ని తరచూ శుభ్రంగా కడుక్కునేలా చూడటం
- పరిసరాల్ని శుభ్రంగా ఉంచుకోవడం
- అవసరాన్ని బట్టి కొందరికి ఫ్లూ టీకాలు ఇప్పించడం
- చల్ల గాలికి ఎక్స్‌పోజ్ కాకుండా చూడటం
- చల్లటి పదార్థాలు, కూల్‌డ్రింక్స్ తీసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

చికిత్స: చాలావరకు వైరల్ ఇన్ఫెక్షన్‌లే బ్రాంకియోలైటిస్‌కి కారణం కాబట్టి లక్షణాల ఆధారంగా సపోర్టివ్ ట్రీట్‌మెంట్ ఇస్తారు. అంటే... తగినన్ని నీళ్లు తాగించడం, కాస్త పెద్ద పిల్లలైతే ద్రవాహారాలు ఇవ్వడం, పాలు పట్టే ముందర వారి నోరు, ముక్కుల్లో ఉండే చిక్కటి స్రావాలను ‘బల్బ్ సిరంజీ’తో బయటకు తొలగించడం, నిద్రపోతున్నప్పుడు బాగా శ్వాస అందేలా తలను కాస్త ఎత్తుగా ఉంచడం, జ్వరం ఉంటే టెంపరేచర్ తగ్గించే మందులు, యాంటిహిస్టమైన్స్, కాఫ్ సిరప్, నెబ్యులైజేషన్ వంటివి కొంతవరకు ఉపయోగపడతాయి. బ్లడ్ రిపోర్టులు, ఎక్స్-రే బట్టి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు మాత్రమే యాంటీబయాటిక్స్ ఇస్తారు.

పిల్లలు బాగా డల్‌గా ఉండటం, పాలు, ఆహారం తీసుకోవడం బాగా తగ్గడం, పిల్లలకు ఊపిరి అందనప్పుడు / తమంతట తామే శ్వాస తీసుకోలేనప్పుడు ఇది కాస్త ప్రమాదకరమైన పరిస్థితి అని గ్రహించి, వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. అక్కడ డాక్టర్లు వారికి...
- రక్తనాళం ద్వారా ఫ్లూయిడ్స్ ఎక్కించడం
- ఆక్సిజన్ అందకపోతే ఆక్సిజన్ పైప్‌తో ఆక్సిజన్ అందించడం
- పిల్లల ఊపిరితిత్తుల్లో, ముక్కులోని చిక్కటి స్రావాలను (సక్షన్ ద్వారా) బయటకు పంపడం వంటి ప్రక్రియలతో చికిత్స అందిస్తారు. ఆక్సిజన్ అందకపోతే వెంటిలేటర్ మీద ఉంచాల్సి వస్తుంది.

లక్షణాలు...

బ్రాంకియోలైటిస్ లక్షణాలు దాదాపు ఓ వారం పాటు పిల్లలను బాధిస్తాయి. ఇవి ఫ్లూ లక్షణాలను పోలి ఉంటాయి. కొన్నిసార్లు తీవ్రమైన దగ్గుతో శ్వాస సరిగా అందక పిల్లలు బాధపడుతుంటారు.

సాధారణంగా కనిపించే లక్షణాలివి...
- దగ్గు, పిల్లికూతలు
- ముక్కు కారడం
- ఊపిరి సాఫీగా అందకపోవడం
- పిల్లలు ఛాతీ పట్టేసినట్లుగా బాధపడటం
- జ్వరం
- ఆకలి తగ్గడం
- చిరాకు / చికాకు
- కొన్నిసార్లు వాంతులు కావడం
- ఆరు నెలల కంటే తక్కువ వయసున్న పిల్లలు పాలు సరిగా తాగలేకపోవడం, ఎక్కువగా ఏడవటం లాంటివి.



డా॥ సత్యనారాయణ కావలి
కన్సల్టెంట్ పీడియాట్రీషియన్.



చీలమండ నొప్పి తగ్గాలంటే...

మడమ, దాని పరిసరాల్లో వచ్చే నొప్పిని చీలమండ నొప్పి (యాంకిల్ పెయిన్) అంటారు. వయసు పెరుగుతున్న కొద్దీ ఎముకలు బలహీనంగా మారడం మొదలుకొని దేహంలో పెరిగిన యూరిక్ యాసిడ్ చీలమండ కీళ్లలో స్ఫటికాలుగా మారి ఒరుసుకుపోవడం వరకు అనేక కారణాల వల్ల ఈ నొప్పి రావచ్చు. ఇది తగ్గడానికి ఈ కింది సూచనలు పాటించడం మంచిది. అవి...
- పాదాలకు నప్పేలా పాదరక్షలు వేసుకోవడంతో పాటు అవి మెత్తగా ఉండటం మంచిది. హైహీల్స్ మంచిది కాదు.
- క్రేప్‌బ్యాండ్ చుట్టడం వల్ల నొప్పి తగ్గుతుంది
- ఊబకాయం వల్ల దేహం బరువు చీలమండపై పడి నొప్పి పెరుగుతుంది. బరువు తగ్గించుకోవడం మేలు చేసే అంశం.
- వాపు ఉన్నప్పుడు... పడుకునే సమయంలో కాలి కింద తలగడ ఉంచి, చీలమండ మిగతా శరీర భాగం కంటే కాస్త పైకి ఉండేలా ఆ తలగడను అమర్చాలి.
- వాపు దగ్గర ఐస్ ప్యాక్ పెట్టాలి.
- నడిచేటప్పుడు మడమ మీద బరువు పడకుండా చూసుకోవాలి. ఈ జాగ్రత్తల తర్వాతా నొప్పి తగ్గకపోతే డాక్టర్‌ను కలిసి తగిన చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది.

ప్రపంచకప్‌కు నసీమ్ షా దూరం!



వచ్చే నెలలో భారత్ వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ ప్రారంభానికి ముందే పాకిస్తాన్ జట్టుకు గట్టి దెబ్బ తగిలే అవకాశముంది. ఆ జట్టు యువ పేస్ బౌలర్ నసీమ్ షా ఈ మెగా ఈవెంట్ మొత్తానికి దూరమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఆసియా కప్ టోర్నీలో భాగంగా భారత్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా నసీమ్ షా భుజానికి గాయమైంది. ఈ గాయానికి స్కాన్‌లు నిర్వహించారు. గాయం తీవ్రతదృష్ట్యా నసీమ్ షా మూడు నెలలు ఆటకు దూరమయ్యే అవకాశముందని తెలిసింది. 20 ఏళ్ల నసీమ్ పాక్ తరఫున 14 వన్డేలు ఆడి 32 వికెట్లు తీశాడు.

పోరాడి ఓడిన రష్మిక జోడీ



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక పోరాటం ముగిసింది. పెర్త్‌లో జరిగిన డబుల్స్ సెమీఫైనల్లో రష్మిక (భారత్)-మోనిక్ బ్యారీ (న్యూజిలాండ్) ద్వయం 6-3, 1-6, 7-10తో మిసాకి-నాహో (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది. సింగిల్స్‌లో రష్మిక తొలి రౌండ్‌లో 3-6, 3-6తో ఐవా డెస్టానీ (ఆస్ట్రేలియా) చేతిలో ఓటమి పాలైంది.

విజేత మౌనిక అక్షయ

ఆసియా జూనియర్ చెస్



జంషెడ్‌పూర్: టాటా స్టీల్ ఆసియా జూనియర్ చెస్ చాంపియన్‌షిప్ మహిళల బ్లిట్జ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మిని మౌనిక అక్షయ విజేతగా అవతరించింది. గుంటూరు జిల్లాకు చెందిన 20 ఏళ్ల మౌనిక అక్షయ నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత 7.5 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. మౌనిక అక్షయ ఏడు గేముల్లో గెలిచి, ఒక గేమ్‌ను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. భారత్‌కే చెందిన భాగ్యశ్రీ పాటిల్, బ్రిస్టీ ముఖర్జీ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి రజత, కాంస్య పతకాలను దక్కించుకున్నారు.

కుశాగ్ర మోహన్‌కు రజతం



బ్లిట్జ్ ఓపెన్ విభాగంలో తెలంగాణకు చెందిన కుశాగ్ర మోహన్ రజత పతకం సాధించాడు. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత అలెక్సీ గ్రెబనోవ్ (రష్యా), కుశాగ్ర మోహన్ 7.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంక్‌ను వర్గీకరించగా... గ్రెబనోవ్‌కు స్వర్ణం ఖరారైంది. కుశాగ్ర మోహన్‌కు రజతం లభించింది.

క్వార్టర్స్‌లో ఓడిన అభిమన్యు



బెల్‌గ్రేడ్: ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు నలుగురు భారత రెజ్లర్లు నిరాశపరిచారు. ఆకాశ్ దహియా (61 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో, అభిమన్యు (70 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో... సందీప్ మాన్ (86 కేజీలు) రెండో రౌండ్‌లో... సుమిత్ మలిక్ (125 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు. ఒలింపిక్ వెయిట్ కేటగిరీల్లో సందీప్, సుమిత్‌లపై నెగ్గిన రెజ్లర్లు ఫైనల్ చేరుకోకపోవడంతో భారత రెజ్లర్లకు 'రెపిచాజ్' రౌండ్‌లలో ఆడే అవకాశం కూడా రాలేదు. అభిమన్యు క్వార్టర్ ఫైనల్లో 2-9తో అలెన్ రూథర్‌ఫర్డ్ (అమెరికా) చేతిలో ఓడిపోయాడు. అలెన్ ఫైనల్ చేరుకోవడంతో అభిమన్యుకు నేడు 'రెపిచాజ్' బౌట్‌లలో పోటీపడే అవకాశం లభించింది.

నిరీక్షణ ముగించాలని!

- ఐదేళ్లుగా అంతర్జాతీయ టోర్నీల్లో భారత్‌కు నిరాశ
- ఆసియా కప్‌తో ముగింపు పలకాలని రోహిత్ బృందం పట్టుదల
- నేడు శ్రీలంకతో ఆసియా కప్ టైటిల్ పోరు
- మధ్యాహ్నం గం. 3 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం
- వర్షం అంతరాయం కలిగిస్తే 'రిజర్వ్ డే'న కొనసాగింపు



రోహిత్ శర్మ, షనక

ద్వైపాక్షిక సిరీస్‌లు కాకుండా మూడు అంతకంటే ఎక్కువ దేశాలు పాల్గొన్న అంతర్జాతీయ టోర్నీలలో భారత జట్టు విజేతగా నిలిచి ఐదేళ్లయింది. 2018లో ఆసియా కప్ టైటిల్ సాధించాక భారత జట్టు మరో టోర్నీలో చాంపియన్‌గా నిలువలేదు. 2019 వన్డే ప్రపంచకప్‌లో, 2022 టి20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్స్‌లో ఓడిన టీమిండియా... 2019, 2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్స్‌లో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్ల చేతుల్లో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ టోర్నీ టైటిల్ నిరీక్షణ ముగించేందుకు భారత జట్టుకు ఆసియా కప్ రూపంలో మరో అవకాశం దక్కింది. స్ఫూర్తిదాయక ఆటతీరుతో ఆకట్టుకుంటున్న శ్రీలంకతో నేడు జరిగే ఫైనల్లో టీమిండియా 'ఢీ'కొంటుంది. తుది పోరులో గెలిచి భారత జట్టు టైటిల్ నిరీక్షణకు తెరదించుతుందా లేదా మరికొన్ని నెలలు పొడిగిస్తుందా మరికొన్ని గంటల్లో తేలిపోతుంది.

కొలంబో: వర్షంతో దోబూచులాడిన ఆసియా కప్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ తుది అంకానికి చేరుకుంది. నేడు భారత్, శ్రీలంక జట్ల మధ్య జరిగే ఫైనల్‌తో ఈ టోర్నీకి తెరపడనుంది. వచ్చే నెలలో మొదలయ్యే వన్డే ప్రపంచకప్‌నకు సన్నాహకంగా భారత్, శ్రీలంక జట్లకు ఈ టోర్నీ ఉపయోగపడుతోంది. బంగ్లాదేశ్‌తో చివరి 'సూపర్-4' మ్యాచ్‌లో అనూహ్యంగా ఓడిపోయిన భారత జట్టు ఫైనల్‌ను మాత్రం తేలిగ్గా తీసుకునే అవకాశం లేదు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకున్న విరాట్ కోహ్లి, హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, సిరాజ్, బుమ్రా ఫైనల్లో బరిలోకి దిగుతారు. అక్షర్ పటేల్ చేతి వేళ్లకు గాయం కావడంతో అతను ఫైనల్‌కు దూరమయ్యాడు. అక్షర్ పటేల్‌కు ప్రత్యామ్నాయంగా టీమ్ మేనేజ్‌మెంట్ స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను శనివారం కొలంబోకు రప్పించింది. బ్యాటింగ్ పరంగా భారత్ పటిష్టంగా కనిపిస్తోంది. రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్, కోహ్లి, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా మెరిస్తే భారత్ భారీ స్కోరు చేయడం ఖాయం. ఈ టోర్నీలో గిల్, కోహ్లి, రాహుల్ ఒక్కో సెంచరీ కూడా చేశారు. బౌలింగ్‌లోనూ భారత్ సమతూకంగా ఉంది. జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, పాండ్యా పేస్‌తో ఆకట్టుకుంటే.. కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా స్పిన్‌తో ప్రత్యర్థిని కట్టడి చేయగలరు.

సమష్టిగా రాణిస్తూ...

ఆసియా కప్‌లో ఆరుసార్లు చాంపియన్‌గా నిలిచిన శ్రీలంక ఏడో టైటిల్‌పై గురి పెట్టింది. భారత్ అత్యధికంగా ఏడుసార్లు ఆసియా కప్ టైటిల్‌ను సాధించింది. పలువురు స్టార్ ఆటగాళ్లు అందుబాటులో లేకపోయినా ఈ టోర్నీలో శ్రీలంక స్ఫూర్తిదాయక ఆటతో ఫైనల్‌కు దూసుకొచ్చింది. దాసున్ షనక నాయకత్వంలో తుది పోరులోనూ అదే జోరు కొనసాగించాలని శ్రీలంక పట్టుదలతో ఉంది. బ్యాటింగ్‌లో కుశాల్ మెండిస్, నిసాంక, అసలంక, సమర విక్రమపై లంక ఆశలు పెట్టుకుంది. షనక, ధనంజయ డిసిల్వా, వెలలాగె ఆల్‌రౌండ్ పాత్రలను పోషిస్తారు. గాయం కారణంగా స్పిన్నర్ తీక్షణ ఫైనల్‌కు దూరమయ్యాడు. పతిరణ, కసున్ రజిత తమ పేస్‌తో భారత బ్యాటర్లను ఏమేరకు కట్టడి చేస్తారో చూడాలి.

పిచ్, వాతావరణం

గత తొమ్మిది రోజుల్లో ప్రేమదాస స్టేడియంలో ఆరు మ్యాచ్‌లు జరిగాయి. దాంతో పిచ్ మందకొడిగా మారింది. స్పిన్నర్లకు ఎక్కువ అనుకూలంగా ఉండే అవకాశముంది. ఈ మ్యాచ్‌కు వర్ష సూచన ఉంది. ఆదివారం సాయంత్రం, రాత్రి వేళల్లో ఒకట్రెండు సార్లు ఉరుములతో కూడిన వర్షం పడవచ్చు. ఒకవేళ వర్షంవల్ల ఆట సాధ్యపడకపోతే రిజర్వ్ డే సోమవారం ఫైనల్‌ను కొనసాగిస్తారు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), శుబ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, కోహ్లి, ఇషాన్ కిషన్/తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, శార్దుల్ ఠాకూర్/వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, బుమ్రా, సిరాజ్.

శ్రీలంక: షనక (కెప్టెన్), కుశాల్ పెరీరా, నిసాంక, కుశాల్ మెండిస్, సమరవిక్రమ, అసలంక, ధనంజయ డిసిల్వా, దునిత్ వెలలాగె, దుషాన్ హేమంత, పతిరణ, కసున్ రజిత.

7 ఆసియా కప్ ఇప్పటి వరకు 15 సార్లు జరిగింది. 13 సార్లు వన్డే ఫార్మాట్‌లో, రెండుసార్లు టి20 ఫార్మాట్‌లో నిర్వహించారు. భారత్, శ్రీలంక జట్లు ఆసియా కప్ ఫైనల్స్‌లో ఏడుసార్లు తలపడ్డాయి. నాలుగుసార్లు భారత్, మూడుసార్లు శ్రీలంక గెలుపొందాయి.

250 శ్రీలంకతో ఫైనల్ మ్యాచ్ భారత కెప్టెన్ రోహిత్ శర్మకు 250వ వన్డే మ్యాచ్ కానుంది. 250 వన్డేలు ఆడిన ఎనిమిదో భారతీయ క్రికెటర్‌గా రోహిత్ గుర్తింపు పొందుతాడు.

5 ప్రస్తుత ఆసియా కప్‌లో కొలంబో వేదికగా జరిగిన ఆరు మ్యాచ్‌ల్లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన జట్టు ఐదుసార్లు గెలిచింది.


భారత్ 1 మొరాకో 1



సుమిత్

లక్నో: డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-2 టెన్నిస్ పోటీలో తొలి రోజు భారత్, మొరాకో క్రీడాకారులు ఒక్కో మ్యాచ్‌లో గెలిచారు. దాంతో స్కోరు 1-1తో సమంగా నిలిచింది. తొలి సింగిల్స్‌లో శశికుమార్ ముకుంద్ 7-6 (7/4), 5-7, 1-4తో యాసిన్ దిల్మీ చేతిలో ఓడిపోయాడు. రెండో సింగిల్స్‌లో సుమిత్ నగాల్ 6-3, 6-3తో ఆడమ్ మౌన్‌డిర్‌పై గెలుపొందాడు. దిల్మీతో జరిగిన మ్యాచ్‌లో ముకుంద్ నిర్ణాయక మూడో సెట్‌లో 1-4తో వెనుకబడిన దశలో కాలి కండరాలు పట్టేయడంతో వైదొలిగాడు. నేడు మూడు మ్యాచ్‌లు జరుగుతాయి. డబుల్స్ మ్యాచ్‌లో రోహన్ బోపన్న-యూకీ బాంబ్రీ జోడీ బెన్‌చిట్రి-లారూసి జంటతో ఆడుతుంది. రివర్స్ సింగిల్స్‌లో దిల్మీతో సుమిత్ నగాల్, ఆడమ్‌తో శశికుమార్ తలపడతారు.

సెయింజ్‌కు 'పోల్'



సింగపూర్: ఫార్ములావన్‌లో ఈ సీజన్‌లో తొలిసారి రెడ్‌బుల్ డ్రైవర్లు వెర్‌స్టాపెన్, సెర్జియో పెరెజ్ నిరాశ పరిచారు. శనివారం జరిగిన సింగపూర్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ సెషన్‌లో వెర్‌స్టాపెన్ 11వ స్థానంలో, పెరెజ్ 13వ స్థానంలో నిలిచారు. నేడు జరిగే ప్రధాన రేసును వెర్‌స్టాపెన్ 11వ స్థానం నుంచి, పెరెజ్ 13వ స్థానం నుంచి ప్రారంభిస్తారు. మరోవైపు ఫెరారీ డ్రైవర్ కార్లోస్ సెయింజ్ అందరికంటే వేగంగా ల్యాప్‌ను 1 నిమిషం 30.984 సెకన్లలో ముగించి 'పోల్ పొజిషన్' సాధించాడు. నేడు జరిగే ప్రధాన రేసును సెయింజ్ తొలి స్థానం నుంచి మొదలు పెడతాడు. ఈ సీజన్‌లో 14 రేసులు జరగ్గా... 14 రేసుల్లోనూ రెడ్‌బుల్ డ్రైవర్లు వెర్‌స్టాపెన్ (12 రేసుల్లో), పెరెజ్ (2 రేసుల్లో) విజేతలుగా నిలిచారు.

ఇంగ్లండ్‌దే సిరీస్



లండన్: న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగు వన్డేల సిరీస్‌ను ఇంగ్లండ్ జట్టు 3-1తో సొంతం చేసుకుంది. లార్డ్స్ మైదానంలో న్యూజిలాండ్‌తో జరిగిన చివరిదైన నాలుగో వన్డేలో జోస్ బట్లర్ నాయకత్వంలోని ఇంగ్లండ్ జట్టు 100 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 311 పరుగులు చేసింది. ఓపెనర్ డేవిడ్ మలాన్ (114 బంతుల్లో 127; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. న్యూజిలాండ్ బౌలర్లలో రచిన్ రవీంద్ర (4/60), డారిల్ మిచెల్ (2/40) రాణించారు. అనంతరం 312 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 38.2 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. రచిన్ రవీంద్ర (48 బంతుల్లో 61; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ స్పిన్నర్ మొయిన్ అలీ 50 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు.

సినిమా



కథ కలిపింది

కొన్ని కథల్లో అతిథి పాత్రలకు కూడా 'స్టార్' రేంజ్ యాక్టర్లు కావాల్సి వస్తుంది. కథలో ఆ పాత్రలకు అంత ప్రాధాన్యం ఉంటుంది. ఆ ప్రాధాన్యాన్ని గ్రహించి అతిథి పాత్రలకు స్టార్స్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తారు. అలా కొన్ని క్రేజీ కాంబినేషన్స్‌ని కొన్ని కథలు కలిపాయి. ఆ కాంబినేషన్స్ గురించి తెలుసుకుందాం.

కల్కి కలిపింది

ప్రభాస్ హీరోగా రూపొందుతోన్న పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. 'మహానటి' వంటి సూపర్ హిట్ తర్వాత డైరెక్టర్ నాగ్ అశ్విన్ ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ సినిమాలో బిగ్ బీ అమితాబ్ బచ్చన్, లోక నాయకుడు కమల్‌హాసన్, ప్రముఖ దర్శకుడు రాజమౌళి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇలా ఇద్దరు లెజెండరీ నటులను, ఒక స్టార్ డైరెక్టర్‌ని 'కల్కి' కలిపింది. భారతీయ ఇతిహాసం మహాభారతం స్ఫూర్తితో మూడో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ప్రభాస్ కర్ణుడిని పోలిన పాత్రలో కనిపించనున్నారని టాక్. అమితాబ్ క్యారెక్టర్ మహాభారతంలోని అశ్వత్థామ పాత్రను పోలి ఉంటుందని భోగట్టా. అలాగే కమల్‌హాసన్ విలన్ పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. రాజమౌళిది అతిథి పాత్ర. ఆయన ఎలాంటి పాత్రలో కనిపిస్తారనేది తెలియాల్సి ఉంది. బాలీవుడ్ హీరోయిన్లు దీపికా పదుకోన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నటిస్తున్న 'కల్కి 2898 ఏడీ' సినిమాని జనవరి12 విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే.



ప్రభాస్, విష్ణు

కన్నప్పలో శివుడు?

మంచు విష్ణు హీరోగా నటిస్తున్న తొలి పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'. ఈ చిత్రంలో స్టార్ హీరో ప్రభాస్ నటించనున్నారు. ఈ మూవీకి 'మహాభారత' ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించనున్నారు. అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై నటుడు, నిర్మాత మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ సినిమా ఇటీవల శ్రీకాళహస్తిలో ప్రారంభమైంది. శివ భక్తుడైన కన్నప్ప, ఆయన భక్తి నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనుంది. కన్నప్పగా మంచు విష్ణు నటించనున్నారు. శివుడి పాత్రలో ప్రభాస్ కనిపిస్తారని టాక్.

కోలీ స్టార్‌తో టాలీ స్టార్

'సార్' వంటి హిట్ సినిమా తర్వాత తమిళ హీరో ధనుష్ తెలుగులో నటిస్తున్న రెండో స్ట్రయిట్ ఫిల్మ్ 'డీ 51' (వర్కింగ్ టైటిల్). శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించనున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో తెలుగు స్టార్ హీరోల్లో ఒకరైన అక్కినేని నాగార్జున కీలక పాత్రలో నటించనున్నారు. నాగార్జున పుట్టినరోజుని (ఆగస్టు 29) పురస్కరించుకుని 'డీ 51' చిత్ర నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహనరావు ఈ చిత్రంలో ఆయన నటించనున్న విషయాన్ని వెల్లడించారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందనున్న ఈ చిత్రంలో నాగార్జున పాత్రకి చాలా ప్రాధాన్యం ఉందని టాక్. ప్రస్తుత సమాజంలో నెలకొన్న అసమానతల నేపథ్యంలో ఈ సినిమా రూపొందనుందట. ఈ చిత్రంలో రష్మికా మందన్న కథానాయికగా నటిస్తారు.



వార్‌కి సిద్ధం


'ఆర్ ఆర్ఆర్' సినిమాతో పాన్ ఇండియాని మించిన స్థాయిలో స్టార్‌డమ్ సొంతం చేసుకున్నారు హీరో ఎన్టీఆర్. ఇప్పటివరకూ తెలుగు సినిమాలు మాత్రమే చేసిన ఆయన తొలిసారి పరభాషా చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. హృతిక్ రోషన్ హీరోగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందనున్న 'వార్ 2' సినిమా ద్వారా ఎన్టీఆర్ హిందీ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇస్తున్నారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ నటించిన 'వార్' (2019) సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' రూపొందనుంది.

ఒట్టుగా.. గుట్టుగా...



నాని, మృణాల్ ఠాకూర్

'సమయమా... భలే సాయం చేశావమ్మా ఒట్టుగా... కనులకే తన రూపాన్నందించావే గుట్టుగా..' అని పాడుకున్నారు నాని.. 'సరే సరే.. త్వరపడకో.. తదుపరి కథ ఎటుకో..' అని పాడారు మృణాల్ ఠాకూర్. ఈ ఇద్దరూ జంటగా రూపొందుతున్న 'హాయ్ నాన్న' చిత్రంలోని తొలి పాట ఇది. చిత్ర సంగీతదర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. శనివారం ఈ పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రంలో బేబీ కియారా ఖన్నా కీలక పాత్ర పోషిస్తోంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని డిసెంబర్ 21న విడుదల చేయనున్నారు.



"నలభై ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 800 పైగా సినిమాలు చేశాను. వీటిలో 300 పైగా తండ్రి పాత్రలు ఉన్నాయి. దీంతో తండ్రి పాత్రలు చేయాలంటే విసుగొచ్చింది. ఈ ఏడాది 18 సినిమాల్లో తండ్రి పాత్రలు చేయమని అవకాశాలు రాగా, వదులుకున్నాను. కొత్త తరహా పాత్రలు చేయాలనుకుంటున్న నాకు 'పెదకాపు-1'లో మంచి పాత్ర దొరికింది. నా కెరీర్‌లో నేను గుర్తుంచుకోదగ్గ పాత్రల్లో 'పెదకాపు 1' ఉంటుంది" అన్నారు నటుడు-దర్శకుడు తనికెళ్ల భరణి. విరాట్ కర్ణ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పెదకాపు 1'. మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ చిత్రంలో కీలక పాత్రలో నటించిన తనికెళ్ల భరణి పంచుకున్న విశేషాలు.

అందుకే పద్ధెనిమిది సినిమాలు వదులుకున్నా!

- తనికెళ్ల భరణి

- 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు', 'బ్రహ్మోత్సవం' చిత్రాల తర్వాత శ్రీకాంత్ అడ్డాలతో నేను చేసిన చిత్రం 'పెదకాపు 1'. ఈ చిత్రంలో సమాజంపై విసిగిపోయిన ఓ టీచర్ పాత్రలో కనిపిస్తాను. శ్రీకాంత్ అడ్డాల పోషించిన పాత్రను తప్పిస్తే ఈ సినిమాలో లీడ్ రోల్ చేసిన అందరితో నాకు కాంబినేషన్ సీన్స్ ఉన్నాయి. 'మాతృ దేవో భవ, లేడీస్ టైలర్, శివ, మన్మథుడు, అతడు'.. ఇలా నిడివితో సంబంధం లేకుండా నా కెరీర్‌లో నేను గుర్తుపెట్టుకోదగ్గ పాత్రలు ముప్పై వరకు ఉంటాయి. ఈ జాబితాలో 'పెదకాపు 1' చేరుతుంది. చాలా గ్యాప్ తర్వాత ఈ సినిమాకి కెమెరామేన్ చోటా కె. నాయుడుతో వర్క్ చేయడం థ్రిల్‌గా అనిపించింది. విరాట్ కర్ణ కొత్తవాడైనా బాగా నటించాడు. మిక్కీ జే మేయర్ సంగీతం బాగుంటుంది. మిర్యాల రవీందర్‌రెడ్డి గారు ఈ సినిమాను భారీగా నిర్మించారు.
- 'మిథునం' తర్వాత నా దర్శకత్వంలో మరో చిత్రం రాలేదు. నేను కమర్షియల్ సినిమాలు తీయలేను. నా దగ్గర కొన్ని కథలు ఉన్నాయి. ఆర్ట్ ఫిల్మ్ తరహా చిత్రాలను నిర్మించే నిర్మాతలు దొరకడం లేదు. నా నలభై ఏళ్ల కెరీర్‌లో నేను అనుకున్నవన్నీ చేశాను. అయితే ఓ అంతర్జాతీయ సినిమా తీయాలనే ఆకాంక్ష మాత్రం మిగిలిపోయి ఉంది. ప్రస్తుతం శివరాజ్‌కుమార్, ప్రభుదేవా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమాలో కీలక పాత్ర చేస్తున్నాను. శేఖర్ అనే కొత్త దర్శకుడు తీస్తున్న సినిమాలో ఓ వైవిధ్యమైన పాత్ర చేస్తున్నాను.

సౌత్ ఇండియన్ ఇంటర్‌నేషనల్ మూవీ అవార్డ్స్ - 2023 (సైమా) వేడుకలు దుబాయ్‌లో ఘనంగా జరిగాయి. ఈ నెల 14న బిజినెస్ అవార్డ్స్‌ని, 15న తెలుగు, కన్నడ చిత్రపరిశ్రమల విజేతలకు, 16న తమిళ, మలయాళ పరిశ్రమల విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించి ఉత్తమ నటుడుగా ఎన్టీఆర్ (ఆర్ ఆర్ఆర్), ఉత్తమ నటిగా శ్రీలీల (ధమాకా) అవార్డులు అందుకున్నారు. ఇక ఉత్తమ చిత్రంగా 'సీతారామం', ఉత్తమ దర్శకుడిగా రాజమౌళి (ఆర్ఆర్ఆర్), ఉత్తమ సంగీత దర్శకుడిగా కీరవాణి, ఇంకా పలు విభాగాలకు చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు అవార్డులు ప్రకటించారు.



ఎన్టీఆర్



శ్రీలీల

హాలీవుడ్ థ్రిల్లర్



వెంకట్ సాయి

తెలుగు నటుడు వెంకట్ సాయి గుండ హీరోగా నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రం హాలీవుడ్ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ 'ది డిజర్వింగ్'. ఎస్ఎస్ అరోరా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో పలువురు హాలీవుడ్ స్టార్స్‌తో పాటు ఇండియన్ స్టార్స్ నటిస్తున్నారని యూనిట్ పేర్కొంది. విస్మయ్ కుమార్, తిరుమలేష్ గుండ్రాత్ ఇతర నిర్మాతలు. ''హాలీవుడ్‌లో ప్రధాన పాత్రధారుడిగా ఒక తెలుగు కుర్రాడు నటించడం ఇదే మొదటిసారి కావొచ్చు. ప్రపంచవ్యాప్త ప్రేక్షకులకు నచ్చేలా ఈ చిత్రం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. విదేశీ యాక్టర్లు సిమోన్ స్టాడ్లర్, కెల్సీ స్టార్డర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎన్‌జీఏ వెంగ్ చియా, సినిమాటోగ్రఫీ: కోషి కియోకావా.

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



బ్రాహ్మణ/2వ పెళ్లి /గుడ్ లుకింగ్ / 43/ 5'10"/ MBA, BE/SWE/4 Lakhs.PM/ Hyd/ కోట్ల ఆస్తి గల వరుడికి 1st మ్యారేజ్ వధువు కావలెను. Ph: 8367619529, 9515349877 [HA-14756]

రెడ్డి/High ప్రొఫైల్, డివోర్స్, 40 ఉన్నత విద్య, ఎలైట్ ఫ్యామిలీ, మంచి జాబ్ 30 లక్షలు జీతం, Well సెటిల్, గుడ్ ప్రాపర్టీ గల వరుడికి తగిన రెడ్డి వధువు కావలెను. కాల్ : 9347668696 [HA-11771]

SC హిందూ మాదిగ: M.Tech / Govt. Asst. ఇంజనీర్/ జెన్‌కో/ 14 Lakhs. P.A/ 6'ఎత్తు/ 29 సం||ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9963410191 [HA-14749]

ముదిరాజ్: కట్నం ప్రసక్తిలేదు/ B.Tech, IIT/C.Govt. ఇన్‌స్పెక్టర్/ కస్టమ్స్ Dept/ 75000/- PM/5'11" ఎత్తు/ 29 సం||ల వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-14749]

వడ్డెర: కట్నం ప్రసక్తిలేదు/ M.Tech/ C.Govt. ఇంజనీర్/ రైల్వే/ 90,000/- PM/ 5'11" ఎత్తు/ 29 సం||ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-14749]

రజక: కట్నం ప్రసక్తి లేదు/B.Tech / C.Govt బ్యాంక్ మేనేజర్/ SBI / 80,000/- PM/ 5'10" ఎత్తు/ 29 సం||ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 8341650195 [HA-14749]

SC మాల: కట్నం ప్రసక్తి లేదు/B.Tech / C.Govt కస్టమ్స్ ఆఫీసర్/ 80,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం||ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 8341650195 [HA-14749]

SC మాల & క్రిస్టియన్: B.Tech(EEE)/ C.Govt. ఇంజనీర్ రైల్వే/ 85,000/- PM/ 5'8" ఎత్తు/ 28 సం||ల వరునికి తగిన వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. Ph: 9676995093 [HA-14749]

SCమాదిగ & క్రిస్టియన్: B.Tech(EEE)/C.Govt. మేనేజర్/ యూనియన్ బ్యాంక్/ 14 Lakhs P.A/ 5'8" ఎత్తు/ 28 సం||ల వరునికి వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. Ph: 9676995093 [HA-14749]

మాదిగ: Govt Job 30 సం|| 5'9" B.Tech, MBA (గ్రూప్-I Job) 18L P/A Two Own House Well Settled Family వరుడికి తగిన వధువు కావలెను. Ph: 6281925716 [H-11772]

కాపు: 30 సం|| 5'9" M.Tech, 24L P/A, SWE Job Well Settled Family 10Cr ఆస్తి కలదు వరుడుకి తగిన వధువు కావలెను. Ph: 6301621607 [H-11772]

గౌడ్స్/2వ పెళ్లి 33Y/5'9"/ఫెయిర్/M.Tech/ Software/well settled Hyd వరునికి గౌడ్స్/other caste వధువు కావలెను. డైరెక్ట్ Ph: 9505232926, 9848065087 [H-788367]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 27, 5'9", Manager, 125K, 50 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5'7", SWE, 153 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 6'1", Data Engineer, 200 K, 80 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 6', Associate, 140 K, 200 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MS, 27, 5'8", Data Engineer, 110 K, H1, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5'5", Doctor, 3 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5'5", Analyst, 85 K, 6 Crores, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5'7", SWE, 170 K, 40 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
(రెడ్డిలకు మాత్రమే)
690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad
D.V. Koti Reddy
98480 11818, 93933 11818

రెడ్డి BE, M Tech (BITS), 28, 5'9", SWE, 24 L P/A, Hyd, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE, Business, 30, 5'8", 30 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, MBA, 30, 5'11", 130 K, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIT), MBA (IIM), 32, 5'10", 34 L P/A, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 23, 5'4", Software Developer, 10.8 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, Doctor, 28, 5'7", 25 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5'3", Team Leader, 80 K, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Degree, 32, 5'2", Hyderabad, 5 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

రెడ్డి: 35y/5'8"/Business/ 60 లక్షలు నెలకు సొంత ఇల్లు 10 ఎకరాల పొలం కల్గిన వరుడికి మిడిల్ క్లాస్ వధువు కావలెను కట్నప్రసక్తి లేదు డైరెక్ట్. Ph: 8897213126, 8019468462 [H-189396]

36 సం||ల బిజినెస్ చేస్తున్న ప్రాపర్టీ ఉన్న వరుడికి రెండవ/విడో పిల్లలు ఉన్న వారు అయిన సంప్రదించండి. డౌరీ, కుల ప్రసక్తి లేదు. Ph: 8885582668, 7396730091 [H-189494]

రెడ్డి: 45y/5'10"/Govt Employee/ 1 లక్ష నెలకు 3Cr Well Settled పిల్లలులేని విడో వరుడికి వధువు కావలెను. కుల ప్రసక్తిలేదు డైరెక్ట్ Ph: 8019468462, 8897213126 [H-189396]

దేవాంగ/ (Cast No Bar)/40yrs/5'5"/Fair/ M.Tech, MCA, RPM వరుడునకు. చదువు కున్నా, దైవభక్తి గల సాంప్రదాయ కుటుంబంలో వధువు కాలెను. (డైరెక్ట్) సంప్ర: 7036361292 [H-788682]

1 వ పెళ్లి/30, 1L.PM & 2వ పెళ్లి/36Y/కుల పట్టింపు లేదు/2L.PM, బాగా స్థిరపడిన వరునికి వధువు కావలెను. పిల్లలున్నా OK. సంప్ర: 7386429819, 8520829819 [HA-13700]

క్యాస్ట్ నో బార్, డైవర్స్, యాదవ్, 43y, 5'.10", (MBBS/MD) డాక్టర్ @hyd, జీతం : 50 లక్ష లు PA సంపన్న వరుడికి తగిన గ్రాడ్యుయేట్ వధువు కావలెను ✆ 879 079 6154 [B-394]

వడ్డెర /2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు / సొంత వ్యాపారం సం||లక్ష ఆదాయం, 12సం|| పాప, 18సం|| బాబు ఉన్నారు . ఏ బాదరబందిలేని పిల్లలు లేని జీవిత భాగస్వామి కావలెను. 9949699139 [G-781718]

రెడ్డి/2వ పెళ్లి/43y/M.Sc/సాఫ్ట్‌వేర్/10 Lakhs. PA/పిల్లలు లేని వరునికి తగిన Any FC/BC వధువు కావలెను. కట్నం పట్టింపు లేదు. Ph: 9701605100 [HA-14756]

గౌడ/29 /5'5"/ B.Tech, NIT / Own హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్/2 Lakhs PM/20Cr ప్రాపర్టీ గల అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. Ph: 9441039962 [HA-14756]

★

2వ వివాహం : మాదిగ 40 years, జాబ్ చేస్తున్న వరునికి వధువు కావలెను. వివరాలకు సంప్ర. 95815 77024. [M-1221549]

★★

బ్రాహ్మణ వరుడు/43y/డిగ్రీ/SWE, 6L/Per Year/Hyd/ 2nd మ్యారేజ్ గల వరుడికి 35-40y/Inter మిడిల్ క్లాస్ సాంప్రదాయ కుటుంబం గల వధువు కావలెను. Ph: 9290758336 [H-788917]

కాపు 53సం||, 5.10ఎత్తు అందమైన వరుడుకు ప్రేమతో నవ్విస్తూ, నవ్వుతూ ఉండే మంచి కుటుంబములోని వధువు కావలెను. డైరెక్ట్. సంప్ర|| 8985800554 [G-751641]

వరుడు కావలెను



రెడ్డి/కుల, ఆస్తి పట్టింపు లేదు. బిజినెస్, జాబ్, 6 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ముఖాముఖి కల్పించి త్వరగా ఖచ్చితంగా కుదుర్చబడును. Ph: 9704477206 [H-189494]

No Caste Bar/1వ, 2వ 1కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు. వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK. త్వరగా చూసు కునే వారి కోసం మాత్రమే. Ph: 7794960803 [H-189494]

కుల పట్టింపు లేదు/విడో/53y / Dept Of PR & RD/1 L PM/Own House/ల్యాండ్స్ / కోట్ల ప్రాపర్టీ గల ఆర్థికంగా స్థిరపడిన వధువుకు వరుడు కావలెను. Ph: 8019928755 [H-788546]

కాపు/డైవర్సీ/32y/5'4"/Fair/MA /Govt Emp /95,000/-PM/కోట్ల ప్రాపర్టీ గల అందమైన పిల్లలులేని వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9848226983 [H-788546]

రెడ్డి/27/5'4"/V.Fair/MBA/Business / 24Lakhs PA వెల్ సెటిల్ ఫ్యామిలీ గల ఏకైక వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6309344166 [H-788546]

కాపు/డైవర్సీ/29y/5'5"Fair / M.Com/Bank Officer/80,000/-PM కోట్ల ప్రాపర్టీ గల పిల్లలు లేని అందమైన వధువుకు తగిన వరుడు కావలెను (కుల ప్రసక్తి లేదు) Ph: 9553652167 [H-788546]

రెడ్డి/విడో కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/A: 30, Qly: డిగ్రీ/బిజినెస్‌లు కలిగిన అందమైన వధువుకి 1st or 2nd మ్యారేజ్ వరుడు కావలెను (ఇల్లరికం OK) Ph: 8143011223 [HA-11771]

కాపు/2వ పెళ్లి/37/5'5"MCA/ SWE/ MNC/ Hyd/20L.PA/GoodLooking వెల్ సెటిల్ వధువుకు తగిన వయసు గల SWE వరుడు కావలెను. నో బ్రోకర్స్. 8019933068, 6590103583wup. [HA-11771]

రెడ్డి/సెకండ్ Matches వధువులు *USA, 32, సాఫ్ట్‌వేర్, *డాక్టర్, 35 *ఫెయిర్, 28. మరిన్ని వివరాలకు వాట్సాప్ 9392023911 (దేశ, విదేశీ, హైస్థాయి సంబంధాలు రెడ్డీస్‌కి చూడబడును) [HA-11771]

రెడ్డి/విడో/50y/5'5"/VFair / Govt. Teacher / సొంత ఇల్లు/ఆంధ్రాలో 2 ఎకరాల మాగాణి గల ఒంటరి వధువుకి స్నేహ స్వభావం గల వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 8019324258 [H-788918]

చౌదరి/విడో/58y/ప్రభుత్వ పెన్షనర్/2 సొంత ఇళ్ళు గల వెల్ సెటిల్డ్ వధువుకు కుల ప్రసక్తి లేని స్నేహ స్వభావం గల వరుడు కావలెను Ph: 9121509718 [H-788918]

రెడ్డి/విడో/50y/ 5'5"/ VFair/ Govt.Job/ సొంత ఇల్లు & రెంట్స్/25 ఎకరాల పొలం ఏ బాదరబందీలేని సాంప్రదాయక వధువుకు వరుడు కావలెను. కుల ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 7287079096 [H-788918]

ఆస్తి, కుల పట్టింపు లేని/వధువుకి వరుడు కావలెను/ 58y/ విడో/ 5'3"/సొంత ఇల్లు/ Govt. Teacher/60,000/PM/ ట్యూషన్స్/ 40K/PM పిల్లలు లేరు. Ph: 6303063858 [H-788918]

కాపు/52y/విడో/B.Ed/ పెన్షనర్/సొంత ఇల్లు & షాప్/75,000/PM/2 ఎకరాల ల్యాండ్ గల వధువుకి కుల, ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను. Ph: 9703982351 [H-788918]

క్రిస్టియన్ మాల: ఏకైక కుమార్తె / B.Tech/ C.Govt. టెక్నికల్ Asst/ ఇస్రో/60,000/- PM/ 5'5" ఎత్తు/ 25 సం||ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9966760501 [HA-14749]

రజక: B.Tech / C.Govt Asst. మేనేజర్/ బ్యాంక్ ఆఫ్ బరోడా/ 50,000/- PM, / 5'5" ఎత్తు/ 24 సం||ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-14749]

వడ్డెర: C.A/ చార్టర్డ్ అకౌంటెంట్ / 60,000/- PM, / 5'4" ఎత్తు/ 25 సం||ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14749]

CNOB: II Match కాపు 42 సం|| 5'4" సెంట్రల్ Govt Job 10L P/A Own House అందమైన వధువుకు, అర్థము చేసుకునే, వరుడు కావలెను. (No Issues) Ph: 9390933661. [H-11772]

MALA SC: Govt Job 27 సం|| 5'4"/ B.Tech/ MBA/ 12L P/A Only Daughter Well Settled Family అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7702195227 [H-11772]

కమ్మ: 40y/5'5"/Govt Employee/ 60 వేలు నెలకు Own House బాగా స్థిరపడిన వధువుకి వరుడు కావలెను కుల ప్రసక్తి లేదు. Ph: 8019484384, 8019468462 [H-189396]

వైశ్య: 45y/5'5"/Own Super Market/ 1లక్ష నెలకు Widow వధువుకు బిజినెస్ చూసుకునే వరుడు కావలెను కుల ప్రసక్తి లేదు. Ph: 7396608019, 8019468462 [H-189396]

రెడ్డి: 38y/ 5'4"/ JOB/ 80 వేలు నెలకు /1Cr, Late Marriage వధువుకు Job/ Business చేయు వరుడు కావలెను. Ph: 7396608019, 8019468462 [H-189396]

రెడ్డి/విడో/53y/5'2"/ఒంగోలులో సొంత ఫ్లాట్స్/ Hydలో/సొంత బిజినెస్; రెంట్స్ /మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్). 7799083500, 7386660643 [H-189494]

కుల పట్టింపు లేదు/2వ పెళ్లి/Govt.ఎంప్లాయ్/ 2,50,000(pm)/35years. కోట్ల ప్రాపర్టీ కలిగి & బాగా స్థిరపడిన అందమైన వధువుకు వరుడు కావలెను. (ఇల్లరికం & పిల్లలు ఉన్నా OK) సంప్ర : 7386550413 [H-788682]

కమ్మ/40y/కుల పట్టింపు లేదు/Govt.ఎంప్లాయ్/ 80K (pm)/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ బిజినెస్ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (1st & 2nd మ్యాచ్, ఇల్లరికం OK) సంప్ర : 9492081545 [H-788682]

కాపు/35yr/కుల పట్టింపు లేదు/Govt.ఎంప్లాయ్/ 60K (pm), వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ, బిజినెస్ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర: 7095282404 [H-788682]

రెడ్డి/48yr/కుల పట్టింపు లేదు/ఫెయిర్/ Govt. ఎంప్లాయ్/ 11 లక్షల (pm), వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ, సొంత బిజినెస్ & 4 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర: 8374802603 [H-788682]

1వ పెళ్లి/26, 1L.PM & 2వ పెళ్లి/32Y/కుల పట్టింపులేదు/2.5L.PM, బాగా స్థిరపడిన అందమైన వధువుకి వరుడు కావలెను. పిల్లలున్నా OK. సంప్ర:8520829819, 7386429819 [HA-13699]

29, 5.3'', MNC Job, 50K ముస్లిం సున్నీ వధువునకు Hydలో జాబ్ చేస్తున్న 30-33 సం||లలోపు SW / MNC (ముస్లిం/దూదేకుల) వరుడు కావలెను. ✆ 86396 56798 [B-46]

మాల : MBBS., MS (Gynic) / 5'5 / 26Y / V.Fair/2 Cr. / నెలకు 1 లక్ష జీతంతో జాబ్ చేస్తున్న వధువు కొరకు (అర్జెంట్‌గా) సంప్ర|| 81065 01199, 92484 94810. [M-274]

కాపు/54yr/5'4"/కుల పట్టింపు లేదు/ఫెయిర్/ MA. English/Govt. ఎంప్లాయ్ 85K (PM) & బిజినెస్, సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర : 8008474869 [H-189494]

కాపు/2వ పెళ్లి, 34Y, పిల్లలు లేరు, MBA, సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి, 60,000/PM కి వరుడు కావలెను. Any FC/ BC Only. Ph: 9542093659 [HA-14756]

బ్రాహ్మణ/24/5'3"/B.Com/డైవర్సీ * డైవర్సీ/27/ 5'5"/ B.Sc *26/5'3"/MBA వధువులకు జాబ్/బిజినెస్ /పురోహితం వరులు కావలెను. కట్న ప్రసక్తి లేని వారు 1వ, 2వ సం||దాలు సెటిల్కై Ph: 7842635086 [HA-14756]

క్రిస్టియన్/2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/ B.Tech/SWE/60,000/-PM / 5'5" ఎత్తు/ 36 సం||ల పిల్లలులేని వధువుకు వరుడు కావలెను. Ph: 9550650024 [HA-14756]

బ్రాహ్మణ/33yrs/5'2"/ఇంటర్/29Yrs/5'4"/ డిగ్రీ/25Yrs/5'2"/MBA వధువులకు వరులు కావలెను/రిక్వేర్ Pvt, Govt జాబ్ & పురోహితం అయినా OK. Ph: 9959725419 [HA-14756]

కుల పట్టింపు లేదు/53Yrs/2వ పెళ్లి/ఫ్యామిలీ పెన్షన్ 50,000/-PM & Own House & 12 ఎకరాల భూమి గల వధువుకు కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 8885374003. [HA-14756]

యాదవ/B.Tech(సివిల్) / Govt.A.E / ట్రాన్స్‌కో/ 65000/-PM/ 5'4" ఎత్తు /25 సం||ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515755629 [HA-14756]

★

హిందూ/SC/ఆది ఆంధ్ర/ఇంటర్/ 43y/ 5'3"/ లేట్ మ్యారేజ్ వధువుకు Hydలో 40K పైన జీతం జాబ్ ఉన్న అప్పర్‌క్లాస్ 1st మ్యారేజ్ వరుడు కావలెను. Ph: 9502172967 [H-189524]

SC Mala Christian Parents seek alliances for their daughter working as Grp-I officer in nationalised bank. The boy should be employed in MNCs/category-1 Central/State aged 27 to 30 years. No brokers Pl. Contact: 8106903423 [HA-5443]

★★

రెడ్డి/Age: 28, Height: 5'4", Colour: Fair/సొంత వ్యాపారం కలిగిన వధువుకి మంచి వరుడు కావలెను 1st (or) 2nd అయినా పర్వాలేదు. Ph: 9121300377 [HA-14757]

పద్మశాలి, క్రిష్టియన్, డైవర్సీ (BPT, MIAP) 30 yrs, 5'.1", Good Look, ఇన్‌కం, 35,000/- (PM), Property : 50 Lakhs, Girl. 5 Yrs, No Caste, No Brokers, VJA ✆ 94946 50753 [B-1210228]

వేదికలు



కావ్య మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ, లేట్ మ్యారేజెస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్స్, అన్ని కులాలవారికి త్వరగా కుదుర్చబడును స్త్రీలకు ఫ్రీ. Ph: 7702526428 [H-788546]

ఒంటరి జీవితమా? తగిన తోడు/భాగస్వామి కోసం చూస్తున్నారా? అన్ని వయస్సుల వారికి నమ్మకమైన సర్వీస్ ద్వారా మీకు నచ్చే, తగిన పార్టనర్ మేము చూస్తాము. మీ వివరాలను వాట్సాప్ 6304826162 చేయండి [HA-11771]

కులపట్టింపు లేని అన్ని కులములవారికి ఒకటవ, రెండవ సంబంధములు చూడబడును. 21 సం|| నుండి 60 సం|| వరకు సంబంధములు చూడబడును. Govt, Pvt, SWE బిజినెస్ మొదలగునవి ఫాస్ట్ సెటిల్. Ph: 9391646037 [H-11772]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd మ్యా/విడో సంబంధాలకై సం|| S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.నారదాగౌడ్, Ph: 8790690809 [H-788919]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 8500688938/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14751]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14751]

Kamma - Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 8500688938/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14751]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14751]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 8500688938/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14751]

మాల, మాదిగ స్పెషల్ : IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK, Ph : 73969 15712 (A). [M-10225]

గంగపుత్రుల పెళ్లి సంబంధాలకైబెస్త, గూండ్ల, అగ్నికుల క్షత్రియ, వాడబలిజ, జాలరి & ఇతరత్రా. శ్రీ గంగాభవాని గంగపుత్రుల వివాహ పరిచయాలు. అంబర్‌పేట్, Hyd. Ph: 9000541008 [H-189411]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt/సాఫ్ట్‌వేర్/గెజిటెడ్/ MBBS/ PG/ NRI/Pvt/బిజినెస్/1వ/2వ/లేట్ AP, TS 15 సం|| Exp. Ph: 8712384555 [H-30503]

శ్రావణమాసం-పెళ్లిళ్ల సీజన్. అబ్రాడ్, సాఫ్ట్‌వేర్స్, రిచ్, IAS, IPS, IRS వారికి ఫాస్ట్ సెటిల్మెంట్. పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, సంప్రదించండి: 7093722724. [T-1918]

కురువ/కురుమ/కురుబ: వివాహ వేదిక 24-09-2023, ఉ||9.00 గం||లకు జిల్లా పరిషత్‌లో, కర్నూలు, ఆంధ్ర. బయోడేటా, కలర్ ఫోటోలు, రిజిస్ట్రేషన్ ఫీజు:800/-. 99857 39713, 90327 41194 [L-780992]

ఫ్రీ...అన్ని కులముల (India& Abroad) మొదటి, రెండవ, లేటు వధువు/వరుల వివాహ సంబంధములకై వెంటనే ఫోటో బయోడేటా పంపించండి. "మా సేవ" (Since: 1998) PH/WA: 9291503949 [HA-14756]

★★

Free Registration బ్రాహ్మణ మరియు అన్నికులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp). [HA-500]

‘జగనన్న భూహక్కు -భూరక్ష’కు సర్వే రాళ్లు సిద్ధం

- మూడో దశలో అక్టోబర్ 15 నాటికి 25.42 లక్షల రాళ్లు అందించడమే లక్ష్యం
- గ్రానైట్ ఫ్యాక్టరీల నిర్వాహకులతో సమీక్షలో మంత్రి పెద్దిరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 305 గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ యూనిట్లకే జగనన్న భూహక్కు-భూరక్ష పథకం కోసం వినియోగించే సర్వే రాళ్ల ఆర్డర్లిస్తున్నామని రాష్ట్ర గనులు, ఇంధన, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. మూడో దశలో అక్టోబర్ 15 నాటికి 25.42 లక్షల సర్వే రాళ్లు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో గ్రానైట్ ఫ్యాక్టరీ నిర్వాహకులతో సర్వే రాళ్ల సరఫరాపై శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో గ్రానైట్ ఫ్యాక్టరీలకు అండగా నిలిచేందుకు సీఎం జగన్ ప్రాధాన్యం ఇస్తున్నారని, సంక్షోభంలో కూరుకుపోయిన గ్రానైట్ ఫ్యాక్టరీలకు చేయూతనిస్తూ స్లాబ్ సిస్టమ్ తెచ్చారని, విద్యుత్ రాయితీలు కల్పించారని తెలిపారు. సర్వే రాళ్ల తయారీ ఆర్డర్లను గ్రానైట్ ఫ్యాక్టరీలకే ఇవ్వడం వల్ల ఆయా కర్మాగారాల్లో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, వీటిపై ఆధారపడ్డ వారికి ఉపాధి లభిస్తోందన్నారు. ఇప్పటి వరకు 44.03 లక్షల సర్వే రాళ్లు సరఫరా చేశామని, ఇందుకు రూ.1,153.2 కోట్లను సరఫరాదారులకు, రాళ్ల రవాణా కోసం రూ.63.8 కోట్లు చెల్లించామన్నారు. రీసర్వే కోసం గతంలో గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ యూనిట్ల నిర్వాహకులతో జరిగిన సమావేశంలో రోజుకు లక్ష సర్వే రాళ్లు కావాలని కోరామన్నారు. యూనిట్లకు రా మెటీరియల్‌ను కూడా గనుల శాఖ అధికారులు సమకూర్చారని, మొదట రూ.270 ఉన్న రేటును రూ.300కి పెంచామన్నారు. ఇంత చేస్తున్నా ఫ్యాక్టరీలకు బదులు బయటి నుంచి ట్రేడర్లు సర్వే రాళ్లు సరఫరా చేస్తున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనివల్ల ఫ్యాక్టరీలకు నష్టం జరుగుతోందని, దీనిని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని స్పష్టం చేశారు. అన్ని ఫ్యాక్టరీలకూ సమానంగా స్టోన్స్‌కు ఆర్డర్లిస్తామన్నారు. కాగా, గ్రానైట్ ఫ్యాక్టరీలను ఆదుకునేందుకు ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ పట్ల పలువురు ఫ్యాక్టరీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఊపందుకున్న మిరప సాగు

- కలిసొస్తున్న వర్షాలు
- 2022-23లో 5.77 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు
- ఈ ఏడాది కనీసం 6.50 లక్షల ఎకరాలు దాటుతుందని అంచనా
- ఇప్పటికే 3.50 లక్షల ఎకరాలు దాటిన సాగు
- ఆర్బీకేల ద్వారా మిరప విత్తనాలు.. ఎరువులు పంపిణీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మిరప సాగు ఊపందుకుంటోంది. సీజన్ ప్రారంభంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోయినప్పటికీ.. గడచిన రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలు మిరప రైతులకు ఊరట ఇస్తున్నాయి. ఫలితంగా లక్ష్యం దిశగా మిరప సాగు పయనిస్తోంది. మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండటం.. పెరిగిన ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతులు మిరప పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేసేందుకు సమాయత్తమయ్యారు. రాష్ట్రంలో మిరప సాధారణ విస్తీర్ణం 4.87 లక్షల ఎకరాలు కాగా.. 50 శాతం వర్షాధారం కింద, మరో 50 శాతం బోర్ల కింద సాగవుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విత్తు నుంచి మార్కెటింగ్ వరకు తీసుకున్న చర్యల ఫలితంగా నాణ్యమైన దిగుబడులు పెరగడంతో మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తున్నాయి. నాలుగేళ్లలో కనిష్ట ధర 3 రెట్లు పెరిగితే.. గరిష్ట ధర రెట్టింపు దాటింది. ఫలితంగా మిరప సాగు ఏటా విస్తరిస్తోంది. 2022-23లో 5.77 లక్షల ఎకరాల్లో మిర్చి సాగవగా.. 11.50 లక్షల టన్నుల దిగుబడులొచ్చాయి. 2023-24 ఖరీఫ్ సీజన్‌లో 5.67 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యంగా నిర్దేశించగా.. ప్రస్తుతం రికార్డు స్థాయిలో పలుకుతున్న ధరల ఫలితంగా 6.50 లక్షల ఎకరాల్లో మిర్చి సాగవుతుందని అంచనా. దిగుబడులు సైతం 12 లక్షల టన్నులు దాటుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆర్బీకేల ద్వారా అన్ని సేవలు

ఆర్బీకేల ద్వారా సర్టిఫై చేసిన నాణ్యమైన డిమాండ్ ఉన్న మిరప సీడ్ రైతులకు అందుబాటులో ఉంది. ఎరువులు, పురుగుల మందుల కొరత లేకుండా సీజన్ ముందు నుంచే ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. నల్లతామరతో పాటు ఇతర చీడపీడలు, తెగుళ్ల బారిన పడకుండా పంటను కాపాడటం, ఉత్తమ యాజమాన్య పద్ధతుల ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించడమే లక్ష్యంగా ఆర్బీకేల ద్వారా తోట బడులు నిర్వహిస్తూ రైతులకు శిక్షణ కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

రైతుకు ఊరటనిస్తోన్న వర్షాలు


మిరప రైతులు సాధారణంగా జూన్, జూలైలో నారు పోస్తారు. అక్టోబర్ వరకు నాట్లు వేస్తారు. సీజన్ ఆరంభంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు మిరప రైతులను ఒకింత కలవరపాటుకు గురి చేశాయి. బోర్ల కింద ఇబ్బంది లేనప్పటికీ వర్షాధారం కింద పండించే చోట్ల ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. ఆగస్టు నెలాఖరు నుంచి కురుస్తున్న వర్షాలు మిరప రైతులకు ఊరటనిచ్చాయి. కనీసం సాధారణ విస్తీర్ణంలోనైనా సాగవుతుందో లేదో అనే ఆందోళన చెందిన అధికారులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఇదే రీతిలో కొనసాగితే నిర్దేశించిన సాగు విస్తీర్ణం అధిగమించడం పెద్ద కష్టం కాదని చెబుతున్నారు. ప్రస్తుతం 3.50 లక్షల ఎకరాల్లో మిరప నాట్లు పడగా.. ఇదేరీతిలో వర్షాలు కురిస్తే సీజన్ ముగిసే నాటికి 5.50 లక్షల నుంచి 6 లక్షల ఎకరాలు దాటుతుందని చెబుతున్నారు. వర్షాలు కురవకపోతే 5 లక్షల నుంచి 5.50లక్షల ఎకరాలకు పరిమితమవుతుందని, దిగుబడులు మాత్రం 11 నుంచి 12 లక్షల టన్నుల మధ్య ఉంటుందని ఉద్యాన శాఖ అంచనా వేస్తోంది.

సంవత్సరం	సాగు విస్తీర్ణం (లక్షల ఎకరాల్లో)	దిగుబడులు (లక్షల టన్నుల్లో)
2018-19	4.10	9.51
2019-20	4.50	10.80
2020-21	4.78	11.61
2021-22	5.62	7.80
2022-23	5.77	11.50

ధరలు ఇలా..

సంవత్సరం	కనిష్ట ధర	గరిష్ట ధర (క్వింటాల్‌కు రూపాయల్లో)
2018-19	3,149	10,011
2019-20	4,404	13,788
2020-21	2,750	13,242
2021-22	4,952	15,225
2022-23	7,691	22,219
2023-24	9,526	21,648

ప్రతికూల పరిస్థితుల్ని ఎదురొడ్డి..



ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో ప్రతికూల పరిస్థితులను ఎదురొడ్డి మరీ మిరప రైతులు సాగు చేస్తున్నారు. ఆగస్టులో వర్షాభావ పరిస్థితులను చూస్తే ఈసారి సాధారణ విస్తీర్ణం కూడా దాటలేం అనుకున్నాం. కానీ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మిరప సాగు విస్తీర్ణం పెరిగేందుకు దోహదపడేటట్టు ఉన్నాయి. అక్టోబర్ నెలాఖరు వరకు ఇదే రీతిలో వర్షాలు కురిస్తే విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది.

– ఎస్ఎస్.శ్రీధర్, కమిషనర్, ఉద్యాన శాఖ

ఇలా అమ్ముకోండి.. అలా కొనుక్కోండి



- విద్యుత్ కొనుగోళ్లు, విక్రయాలపై కేంద్రం మార్గదర్శకాలు
- పీపీఏ ముగిశాక కూడా పాత రేటుతో కొనే అవకాశం ఇకపై డిస్కంలకు లేదు
- ఐఈఎక్స్ లేదా ఎక్కువ రేటు ఇచ్చే డిస్కంలకు జెన్‌కోలు అమ్ముకోవచ్చు
- కేంద్ర ప్రభుత్వ జెన్‌కోలకు కొత్తగా సెంట్రల్ పూల్ విధానం
- ముందస్తు దరఖాస్తు ద్వారా కేంద్ర ప్లాంట్ల విద్యుత్ కొనుక్కోవచ్చు

సాక్షి, అమరావతి: విద్యుత్ కొనుగోళ్లు, విక్రయాలపై కేంద్ర ప్రభుత్వం తాజాగా పలు మార్గదర్శకాలను విడుదల చేసింది. విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) ముగిసిన విద్యుత్ ఉత్పత్తి సంస్థ (జెన్‌కో)లు కరెంటును నేరుగా ఎవరికైనా అమ్ముకొనే అవకాశం కల్పించింది. ఏదైనా జెన్‌కో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించినప్పుడు డిస్కంలతో పీపీఏ కుదుర్చుకుంటుంది. ఇది సాధారణంగా 12 ఏళ్ల నుంచి 25 ఏళ్ల వరకూ ఉంటుంది. ఈ ఒప్పందం గడువు ముగిసిన తరువాత కూడా డిస్కంలు అదే రేటుకి అదే జెన్‌కో ద్వారా విద్యుత్‌ను తీసుకునే వెసులుబాటు ఇప్పటివరకూ ఉంది. ఇప్పుడు కేంద్రం ఈ వెసులుబాటు లేకుండా చేసింది. గడువు ముగిసిన తరువాత కూడా అదే రేటుకి కొంటే జెన్‌కోలకు నష్టం వాటిల్లుతుందన్నది కేంద్రం చెబుతున్న కారణం. దీంతో జెన్‌కోలు పీపీఏల గడువు ముగిసిన తరువాత ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ (ఐఈఎక్స్)లోగానీ, ఎక్కువ ధర ఇచ్చే డిస్కంలకు గానీ విద్యుత్‌ను విక్రయించుకోవచ్చు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో కరెంటును పీపీఏలు ముగిసిన తరువాత విక్రయించేందుకు సెంట్రల్ పూల్ విధానాన్ని కేంద్రం కొత్తగా తీసుకువచ్చింది. కేంద్రానికి చెందిన పదహారు ప్లాంట్లలో విద్యుత్‌ను డిస్కంలు ముందస్తు దరఖాస్తు ద్వారా కొనుక్కొనే అవకాశం కల్పించింది. కొనుగోలు ఒప్పందాన్ని కూడా ఐదేళ్లకు పరిమితం చేసింది. పీపీఏలు చేసుకోగా మిగిలిన విద్యుత్‌ను ఐఈఎక్స్‌లో విక్రయిస్తారు.

అంతా ఐఈఎక్స్‌లోనే

విద్యుత్‌ను అమ్మాలన్నా, కొనాలన్నా ఇప్పుడు జెన్‌కోలు, డిస్కంలకు ఉన్న ప్రధాన మార్కెట్ ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీ అనుమతితో 2008 జూన్ 27న ప్రారంభమైన ఐఈఎక్స్ 2017లో స్టాక్ మార్కెట్‌లో లిస్టెడ్ కంపెనీగా మారింది. అప్పటినుంచి విద్యుత్ క్రయ విక్రయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. 29 రాష్ట్రాలు, 5 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 55కు పైగా విద్యుత్ పంపిణీ సంస్థలు, 600కుపైగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, 1800కుపైగా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, 4,600కు పైగా వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు ఐఈఎక్స్‌లో చేరాయి. గత నెలలో ఐఈఎక్స్‌లో 8,469 మిలియన్ యూనిట్ల లావాదేవీలు జరిగాయి. యూనిట్ సగటు ధర రూ.6.89గా ఉంది. బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ లావాదేవీలకు జెన్‌కోలు, డిస్కంల నుంచి గరిష్టంగా యూనిట్‌కు 2 పైసలు రుసుమును (ఐఈఎక్స్) వసూలు చేస్తోంది.

‘వైఎస్సార్ పర్యావరణ’ భవనాలు సిద్ధం

- విజయవాడలో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రాష్ట్ర ప్రధాన కార్యాలయం..
- తిరుపతిలో రీజనల్, కర్నూలులో జోనల్ కార్యాలయాలు రెడీ
- రూ.54.43 కోట్లతో మూడుచోట్ల నిర్మాణం

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, అన్ని వసతులతో సొంత కార్యాలయాలను నిర్మించింది. ‘డాక్టర్ వైఎస్సార్ పర్యావరణ భవనాలు’ పేరిట రూ.54.43 కోట్లతో రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో నిర్మించిన భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. రూ.22.57 కోట్లతో విజయవాడ ఏపీఐఐసీ కాలనీలో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రధాన కార్యాలయాన్ని నిర్మించారు. కర్నూలులో రూ.15.93 కోట్లతో జోనల్ కార్యాలయం, తిరుపతిలో మరో రూ.15.93 కోట్లతో రీజనల్ కార్యాలయం నిర్మించారు. ఐదు అంతస్తుల్లో అత్యాధునిక రీతిలో ఈ భవనాల నిర్మాణం పూర్తిచేశారు. ఈ భవనాల్లో విద్యుత్ బిల్లులు తగ్గించేందుకు సోలార్ సిస్టం, రక్షణ కోసం అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేయడంతోపాటు అన్ని అంతస్తుల్లోనూ సెంట్రల్ ఏసీ, ఇతర అన్ని సదుపాయాలను కల్పించారు. త్వరలోనే ఈ భవనాలను ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

విజయవాడలోని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రధాన కార్యాలయం



క్లుప్తంగా...

ఈవీఎంల నిర్వహణపై అవగాహన పెంచుకోండి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

సాక్షి, అమరావతి: జిల్లా ఎన్నికల అధికారులు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం)ల నిర్వహణపై అధికారులంతా పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా శనివారం విజయవాడలో ఒక రోజు ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) వర్క్‌షాప్ నిర్వహించారు. రాష్ట్రస్థాయిల్లోని జిల్లా అధికారులు (కలెక్టర్లు), ఎఫ్ఎల్‌సీ సూపర్‌వైజర్లు హాజరయ్యారు. మీనా మాట్లాడుతూ.. అక్టోబర్ 3వ తేదీ నుంచి 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈవీఎంలు తయారు చేసే బెల్, ఈసీఎల్ కంపెనీలకు చెందిన అధికారులు.. ఈవీఎంల పనితీరు విధానం, అనుసంధానించడం తదితర సాంకేతిక పరమైన శిక్షణను అందించారు. ఈవీఎం నోడల్ అధికారి సి కవాలే, ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ సుందర్ రాజన్, సీఈవో వెంకటేశ్వరరావు హాజరయ్యారు.

త్వరితగతిన కేసుల పరిష్కారం

- న్యాయమూర్తుల వర్క్‌షాప్‌లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావు



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న జస్టిస్ ఆర్.రఘునందనరావు

ఏలూరు (మెట్రో): త్వరితగతిన కేసుల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావు అన్నారు. ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి మందిరంలో శనివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయమూర్తులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఉదయం జిల్లా గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న జస్టిస్ రఘునందనరావుకు పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అభినేని విజయకుమార్, ఇతర న్యాయమూర్తులు, జిల్లా అధికారులు న్యాయమూర్తికి స్వాగతం పలికారు. సమావేశంలో కేసుల విచారణ, కోర్టుల పనితీరుపై విశ్లేషించారు. అనంతరం జిల్లా కోర్టు, అదనపు జిల్లా కోర్టులను తనిఖీ చేశారు.

ఇక లెవల్ క్రాసింగ్స్ లేని రైల్వే లైన్లు

- రైల్వే శాఖ కీలక నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: జాతీయ రహదారుల తరహాలో క్రాసింగ్స్ లేకుండా రైల్వే లైన్లను నిర్మించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. రైలు మార్గాన్ని రోడ్లు క్రాస్ చేసే ప్రాంతాల్లో, వాటి మీదుగా వెళ్లే వాహనాల రద్దీ ఆధారంగా రోడ్ ఓవర్ బ్రిడ్జీలు(ఆర్‌ఓబీ), రోడ్ అండర్ బ్రిడ్జీలు(ఆర్‌యూబీ), తక్కువ ఎత్తున్న అండర్‌పాస్‌లను నిర్మించనున్నారు. ప్రాజెక్టు ప్రణాళికల సమయంలోనే ఇందుకు ఏర్పాట్లు చేసి అంచనా వ్యయాన్ని నిర్ధారించనున్నారు. ప్రస్తుతం కొత్తగా నిర్మిస్తున్న జాతీయ రహదారుల్లో ఎక్కడా ఇతర రోడ్లు క్రాస్ చేయకుండా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే తరహాలో రైల్వే లైన్లను కూడా నిర్మించాలని తాజాగా రైల్వే శాఖ నిర్ణయించింది. నిర్ణయించటమే కాకుండా వెంటనే అమలులోకి తెచ్చింది. అంతేగాక ఇప్పటికే మొదలై పనులు జరుగుతున్న ప్రాజెక్టుల విషయంలోనూ దీన్ని అమలు చేయాలని నిర్ణయించటం విశేషం. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పాత లైన్ల మీద ఇంకా 1150 వరకు లెవల్ క్రాసింగ్స్ ఉన్నాయి. కాపలా లేని క్రాసింగ్స్‌ను పూర్తిగా తొలగించినా, కాపలా ఉన్న లెవల్ క్రాసింగ్స్ ఇంకా కొనసాగుతున్నాయి. వాటిని దశలవారీగా తొలగించే పని జరుగుతోంది. కానీ, కొత్తగా చేపట్టిన, చేపట్టబోయే ప్రాజెక్టుల్లో మాత్రం అసలు లెవల్ క్రాసింగ్స్ ఉన్న ఊసే ఉండక పోవటం విశేషం.

కాంగ్రెస్‌లో చేరిన తుమ్మల, జిట్టా

- తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: ఖమ్మం జిల్లాకు చెందిన మాజీమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, నల్లగొండ జిల్లాకు చెందిన జిట్టా బాలకృష్ణారెడ్డి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజ్‌కృష్ణ హోటల్‌లో జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశాల సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో తుమ్మల పార్టీలో చేరారు. ఆయనకు కండువా కప్పి ఖర్గే పార్టీలోకి ఆహ్వానించారు. జిట్టా బాలకృష్ణారెడ్డి మాత్రం టీపీసీసీ స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. తన అనుచరులతో కలిసి హైదరాబాద్‌లోని కోమటిరెడ్డి నివాసానికి వచ్చిన జిట్టా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం కూడా ఈ చేరికల పర్వం కొనసాగుతుందని, కొందరు మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు పార్టీలో చేరుతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

అబద్ధాలు ఆపండి.. అసలు నిజాలివీ

- చంద్రబాబును జైలుకు పంపింది ప్రభుత్వం కాదు కోర్టు
- స్కిల్ స్కాంకు సంబంధించి సీఎంగా చంద్రబాబు 13 చోట్ల సంతకాలు చేశారు లోకేశ్..
- గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద మేం ఏ రాష్ట్రంలోనూ ప్రాజెక్టు చేపట్టలేదని సీమెన్స్ స్పష్టంచేసింది
- రాష్ట్రంలో మాకు తెలియకుండానే కంపెనీ ప్రతినిధులు కొందరు కుమ్మక్కయారని సీమెన్స్ చెప్పిన మాట వాస్తవం కాదా!?
- రూ.130 కోట్లు ఖర్చుచేసి రూ.3,300 కోట్ల ప్రాజెక్టు అంటే నమ్మేదెలా?
- రూ.240 కోట్లు హవాలా మార్గంలో తరలించినట్లు ఈడీ, ఐటీ విచారణల్లో తేలిన విషయం నిజమా కాదా?
- సీఐటీడీ నివేదిక రాకుండానే హడావుడిగా నిధుల విడుదలతోనే కుంభకోణం జరిగిందని స్పష్టమవుతోంది
- పాఠశాల విద్యార్థులకు శిక్షణనిచ్చి ఆ పేరున కూడా డబ్బులు కొట్టేసింది వాస్తవం కాదా?
- గుజరాత్‌లో సీఓఈ ఏర్పాటుకు రూ.17.1 కోట్లు ఖర్చుచేస్తే ఇక్కడ రూ.546.84 కోట్లు ఎందుకు అవుతుంది?



ఆరోపణ: ప్రతిష్టాత్మక కేంద్ర సంస్థ సీఐటీడీ కన్నా ప్రైవేటు సంస్థే ముద్దా? అంటూ ఈనాడు కథనం. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు మదింపులో సీఐటీడీ నివేదికను పరిగణలోకి తీసుకోరా? ఒక్కో క్లస్టర్‌కు రూ.559 కోట్లుగా సీఐటీడీ నివేదికను ఎందుకు పట్టించుకోవడం లేదంటూ ఈనాడు ప్రశ్నలు..

వాస్తవం: ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టుపై తాము ఇండిపెండెంట్ మదింపు చేయలేదని సీఐటీడీ స్పష్టంచేసింది. ఒక్కో కోర్సుకు, ఒక్కో స్టూడెంటుకు ఎంత ఖర్చవుతుందో సీమెన్స్ చెప్పిన వివరాల ఆధారంగా యథాతథంగా సంతకం చేశామని విచారణలో స్పష్టంచేసింది. సాఫ్ట్‌వేర్ విలువను మదింపు చేసే సామర్థ్యం తమకులేదని కూడా చెప్పింది. స్కిల్ డెవలప్‌మెంట్ క్లస్టర్లను స్వయంగా పరిశీలించి అక్కడి సాఫ్ట్‌వేర్, మౌలిక వసతులను పరిశీలించి ప్రాజెక్టు వ్యయాన్ని అంచనా వేయాల్సి ఉంటుందని.. కానీ, తమను ఆ విధంగా మదింపు నివేదిక ఇవ్వాలని ఏపీఎస్ఎస్‌డీసీ కోరనేలేదని సీఐటీడీ విచారణలో వెల్లడించింది. మదింపు నివేదిక ఇవ్వాలంటూ సీఐడీటీని ఏపీఎస్ఎస్‌డీసీ అధికారులు, డిజైన్ టెక్ ప్రతినిధులు 2015 డిసెంబర్ 5న కోరగా 2016 మార్చి 22న నివేదిక ఇచ్చింది. కానీ, ఆ నివేదికతో నిమిత్తం లేకుండానే, అంతకంటే ముందే డిజైన్ టెక్‌కు టీడీపీ సర్కారు 2015 డిసెంబర్ 5న రూ.185 కోట్లు, 2016 జనవరి 29న రూ.85 కోట్లు, మార్చి 11న రూ.67 కోట్లు విడుదల చేశారు. ఈ విధంగా రూ.337 కోట్లు డిజైన్‌టెక్ కంపెనీకి అప్పనంగా ఇచ్చేశారు. చివరగా.. 2016 మార్చి 31న మిగిలిన రూ.34 కోట్లు కూడా విడుదల చేశారు. ఇలా డబ్బులన్నీ ఇచ్చేశాక మదింపు నివేదిక కోరడం ఏమిటి? కోరిన రోజే రూ.185 కోట్లు విడుదల చేయడం ఏంటి? ఇదంతా నిబంధనలకు విరుద్ధం కాదా?

ఆరోపణ: ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు లాంటిదే గుజరాత్‌లోనూ, తమిళనాడులోనూ కూడా చేశారు కదా? అక్కడలేని తప్పు ఇక్కడేముంది?

వాస్తవం: ఏపీలో ఒక్కో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు రూ.546.84 కోట్లు, ఇందులో ప్రభుత్వ వాటా రూ.55 కోట్లు. టెక్ కంపెనీల నుంచి ఒక్క రూపాయి కూడా రాకుండానే రూ.371 కోట్లు విడుదల చేశారు. అదే గుజరాత్‌లో ఒక్కో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు రూ.17.1 కోట్లు, ప్రభుత్వ వాటాగా సుమారు రూ.188 కోట్లు విడుదల చేశారు. తమిళనాడులో ఒకే ఒక్క యూనివర్సిటీలో మాత్రమే చేశారు.

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సాక్ష్యాధారాలతో అడ్డంగా దొరికిపోయి రిమాండ్ ఖైదీగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సచ్ఛీలుడని చెప్పేందుకు ఎల్లో మీడియా నానాపాట్లు పడుతోంది. ఇందుకోసం నిత్యం టన్నుల కొద్దీ అసత్య కథనాలు, అభూత కల్పనలను వండివారుస్తూ పాఠకుల మెదళ్లను కలుషితం చేస్తోంది. రాజకీయ కక్ష్యతోనే అరెస్టులు జరిగాయని, సీమెన్స్‌తో ఒప్పందం జరిగిందని, ఇందుకోసం రూ.వేల కోట్లు ఖర్చు పెట్టింది నిజమని నమ్మించేందుకు తెగ ప్రయాసపడుతోంది. ఈ కుంభకోణానికి చంద్రబాబుకు ఏమిటి సంబంధం?.. ఆయన ఎక్కడైనా సంతకం చేశారా? ఈ ల్యాబ్‌లు పరికరాలు అన్నీ ఉత్తివేనా అంటూ శుద్ధపూసలా ప్రశ్నిస్తూ తమ బాబు అమాయకుడంటూ ప్రజలను నమ్మించేలా ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు తనయుడు లోకేశ్, ఈనాడు చేస్తున్న ఆరోపణలు, వాదనల్లోని నిజాలు ఏమిటంటే..

ఆరోపణ: రాజకీయ ప్రతీకారంతోనే చంద్రబాబును జైలుకు పంపించారు..

వాస్తవం: చంద్రబాబును జైలుకు పంపింది ప్రభుత్వం కాదు.. కోర్టు. చంద్రబాబు ఎదుర్కొంటున్న అవినీతి ఆరోపణలకు సంబంధించి ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయని కూడా కోర్టు విశ్వసించింది. అలాగే, స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు ఎదుర్కొంటున్న అభియోగాల మీద కోర్టులో సీఐడీ సమర్పించిన రిమాండ్ రిపోర్టుపై దాదాపు 10 గంటలసేపు వాదోపవాదాలు జరిగాయి. చంద్రబాబు తరపున ఢిల్లీ నుంచి పెద్ద పెద్ద లాయర్లు వచ్చి వాదించారు. వారి వాదనలకు గౌరవ న్యాయస్థానం సంతృప్తికర స్థాయిలో సమయం ఇచ్చింది. ఇంతటి న్యాయ ప్రక్రియ తర్వాతే కోర్టు చంద్రబాబుకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో ఆయన్ని జైలుకు తరలించాల్సి వచ్చింది. ఇందులో రాజకీయ కక్షకు, ప్రతీకారానికి ఆస్కారం ఎక్కడ? పైగా కక్ష ఉంటే ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే అరెస్టు చేసేది. నాలుగేళ్ల పాటు సుదీర్ఘ విచారణలో చంద్రబాబు ప్రమేయంపై ఆధారాలను కోర్టుకు సమర్పించాకే ఆయనకు రిమాండ్ విధించారు.



ఆరోపణ: రూ.371 కోట్లు ఖర్చుచేశారు కదా? పరికరాలు ఏర్పాటుచేశారు కదా? ఇకఅవినీతి ఆరోపణలకు ఆస్కారం ఎక్కడుంది?

వాస్తవం: ఎలాంటి టెండర్లు లేకుండా కేవలం నామినేషన్ పద్ధతిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని డిజైన్‌టెక్ కంపెనీకి అప్పనంగా ఐదు విడతల్లో రూ.371 కోట్లు విడుదల చేశారు. ఇందులో రూ.241 కోట్లను హవాలా మార్గంలో తరలించారు. ఆ డబ్బు తిరిగి చంద్రబాబు మనుషులకే చేరిందని ఐటీ, ఈడీ విచారణలో తేలింది. చంద్రబాబు పీఏ శ్రీనివాస్ పాత్రపైనా ఆధారాలు ఉండడంతో ఐటీ శాఖ నోటీసులిచ్చింది. అందుకే డిజైన్ టెక్, షెల్ కంపెనీల వ్యవహారాలపై జీఎస్టీ, ఈడీ అధికారులు అప్పటి టీడీపీ ప్రభుత్వానికి సమాచారమిచ్చినా చంద్రబాబు మౌనం దాల్చడం, చంద్రబాబే సూత్రధారి అనేందుకు నిదర్శనం.

ఆరోపణ: ఏపీతో ఒప్పందానికి సీమెన్స్ ఆసక్తి అంటూ ప్రచారం. గతంలో డిజైన్‌టెక్‌కు పంపిన ఈ–మెయిల్స్‌లో సీమెన్స్ వైస్ ప్రెసిడెంట్ పెట్ క్యారియర్ వెల్లడి అంటూ ఈనాడు రాతలు..

వాస్తవం: తమకు తెలియకుండానే భారత్‌లో తమ కంపెనీ ప్రతినిధి కొందరితో కుమ్మక్కై ఈ ప్రాజెక్టును చేపట్టారని చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే 2018లో సీమెన్స్ సంస్థ తన ఇంటర్నల్ ఆడిట్ రిపోర్టులో తేల్చిచెప్పింది. సీమెన్స్ విచారణాధికారులు మూస్మా యెర్ క్లాస్, ఎస్. రాబర్ట్ ఈ నివేదిక ఇచ్చారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు 90 శాతం గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఇవ్వలేదని కూడా విచారణాధికారికి స్పష్టంచేశారు. అలాగే, సీమెన్స్ ఇంటర్నల్ ఆడిట్ చేస్తున్న సమయంలోనే ప్రభుత్వానికి ఈ స్కాంపై ఓ సామాజిక కార్యకర్త సమాచారమిస్తే దాన్ని పక్కనపెట్టేశారు. ఇదంతా దురుద్దేశపూరితం కాదా?

ఆరోపణ: ఈ ప్రాజెక్టుకు సంబంధించి చంద్రబాబు సంతకాలు ఎక్కడైనా పెట్టారా? పెడితే చూపించండి అంటూ జాతీయ మీడియా ఇంటర్వ్యూలో లోకేశ్ సవాల్..

వాస్తవం: ఒకచోట కాదు.. మొత్తం 13 చోట్ల చంద్రబాబు సంతకాలు పెట్టారు. రూ.371 కోట్ల విడుదల దగ్గర నుంచి ప్రతిచోటా కూడా సంతకాలు పెట్టారు. ఉదా.. ఆర్థిక శాఖ ఫైలులోని ఎనెగ్జర్–1 పేజీ నంబర్ 42లో చంద్రబాబు సంతకం చేశారు. సాధారణ పరిపాలన శాఖ ఎనెగ్జర్ పేజీ నంబర్–15లో గంటా సుబ్బారావును స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ కార్యదర్శిగా నియమిస్తూ సంతకం చేశారు. సాధారణ పరిపాలన శాఖ ఎనెగ్జర్–1, పేజీ–11లో డిప్యూటీ సీఈఓగా అపర్ణను నియమించారు. సీమెన్స్ స్కాంలో కీలకంగా వ్యవహరించిన జీవీఎస్ భాస్కర్ భార్యే అపర్ణ.

ఆరోపణ: పరికరాలు, ఫలితాలు అన్నీ అబద్ధాలేనా అన్న లోకేశ్..

వాస్తవం: రూ.371 కోట్లలో రూ.241 కోట్లు తినేసి, మిగతా డబ్బుతో మమ అనిపించేసి, వీటికి రూ.3,300 కోట్లు ఖర్చుచేశారంటే నమ్మాలా? అందులోనూ తప్పుడు బిల్లులు, రశీదులు ఉన్నాయి. వాడిన సాఫ్ట్‌వేర్ విలువకు నిర్ధారణే లేదు. వాటి విలువను నిర్ధారించే సామర్థ్యం తమకులేదని సీఐటీడీ విచారణలో చెప్పింది కూడా. మరి పరికరాలున్నాయి? ఫలితాలు వచ్చేశాయి? అని మాయమాటలు చెప్పడం దేనికి?

ఆరోపణ: 2.13 లక్షల మందికి శిక్షణ ఇచ్చాం.. ఇందులో 80 వేల మందికి ఉద్యోగాలిచ్చామంటూ లోకేశ్, ఈనాడు బాకా..

వాస్తవం: లక్షల మందికి శిక్షణ ఇచ్చామంటూ ఈనాడు, లోకేశ్, టీడీపీ చెప్తున్న మాటల్లో అంతా డొల్లతనమే. విహార యాత్ర పేరుతో బీసీ వెల్ఫేర్ స్కూళ్ల విద్యార్థులను తరలించి, వారికి శిక్షణ ఇచ్చామని చెప్పుకున్నారు. శిక్షణ ఇచ్చామన్న వారిలో 70,000 మంది స్కూల్ పిల్లలున్నారు. శిక్షణ ఇచ్చినట్లు రికార్డులు తయారుచేసి నిధులు స్వాహా చేశారు. ఒక్కో విద్యార్థికి రూ.200 ఇచ్చినట్లు సంతకాలు పెట్టించారు. ఆరు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ల్లో సగానికి పైగా ల్యాబ్‌లు ఏర్పాటుకాలేదు. దీన్నిబట్టి స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఎంత బూటకమో అర్థమవుతోంది.

ఆరోపణ: సీమెన్స్ ప్రాజెక్టు నిజం.. సాఫ్ట్‌వేర్ హార్డ్‌వేర్ ఇచ్చింది వాస్తవం.. ఆరు క్లస్టర్లకు వాటా విలువ రూ.3,356 కోట్లపైనే. ఒక్కో క్లస్టర్‌లో పరికరాల విలువ రూ.559 కోట్లు.. అయినా నిధులు మళ్లించారంటూ అడ్డగోలుగా రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తోంది..

వాస్తవం: సీమెన్స్ ప్రాజెక్టు పక్కా అబద్ధం. అసలు ఈ ప్రాజెక్టుతో సంబంధం లేదని సీమెన్స్ తన ఇంటర్నల్ రిపోర్టులోనూ, విచారణాధికారితోనూ స్పష్టంచేసింది. రూ. 3,300 కోట్ల ప్రాజెక్టు అని, 90% సీమెన్స్ గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా, 10% ఏపీ ప్రభుత్వం ఇస్తుందని జీఓలో రాశారు. కానీ, దీనికి భిన్నంగా ఒప్పందం చేసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చే వాటాను ఆర్థిక సహాయంగా పేర్కొన్నారు. ఒప్పందంలో ఎక్కడా కూడా ఏ లెటర్ ఆధారంగా చేస్తున్నారో, తేదీ ఏంటో కూడా పేర్కొనలేదు. ఒప్పందంలో భాగస్వాములైన సీమెన్స్, డిజైన్ టెక్ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండానే ఆర్థిక శాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తంచేసినా, నిబంధనలను బేఖాతరు చేస్తూ చంద్రబాబు నిధులు విడుదల చేశారు. అంతేకాక.. తాను ఎంపిక చేసుకున్న గంటా సుబ్బారావు అనే ప్రైవేటు వ్యక్తికి కీలక హోదాలను కట్టబెట్టారు. పరికరాల కొనుగోలు కోసం రూ.58 కోట్లు తప్ప ఒక్క రూపాయి కూడా అందలేదని, గ్రాంట్ ఇన్ ఎయిడ్ అన్న స్కీమే తమ వద్ద లేదని సీమెన్స్ సంస్థ స్పష్టంచేసింది. గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్ధతిలో ఏ రాష్ట్రంలో కూడా తాము ఎలాంటి కార్యక్రమాలు చేయలేదని చెప్పింది. అలాంటప్పుడు సీమెన్స్ ప్రస్తావన ఎందుకొస్తుంది?

‘పాల వెల్లువ’కు కేంద్రం ప్రశంసలు

దేశంలోనే అత్యధికంగా ఏపీలో పాల సేకరణ ధర

- లీటర్‌కు గేదె పాలకు రూ.100, ఆవుపాలకు రూ.54కుపైగానే
- మెజార్టీ రాష్ట్రాల్లో రైతులకు తక్కువ చెల్లిస్తున్నారు
- ఏపీని ఆదర్శంగా తీసుకోవాలి
- జేవీపీ ప్రాజెక్టును అధ్యయనం చేయాలని కేరళ సదస్సులో సూచన

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న పాల వెల్లువ(జేవీపీ) పథకానికి జాతీయ స్థాయిలో ప్రశంసలు వెల్లువెత్తాయి. జేవీపీ ప్రాజెక్టు ఆలోచన అద్భుతమని కేంద్రం ప్రశంసించింది. రాష్ట్ర ప్రభుత్వ కృషి ఫలితంగా ఏపీలో పాడి రైతులకు దేశంలోనే అత్యధిక పాలసేకరణ ధరలు దక్కుతున్నాయని పేర్కొంది. ఏపీని బెంచ్ మార్క్‌గా తీసుకొని పాడి రైతులకు గరిష్ట ధర చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఇతర రాష్ట్రాలకు సూచించింది. పశు సంవర్ధక, డెయిరీ రంగాలపై కేరళలోని తిరువనంతపురంలో జరిగిన దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సదస్సులో జేవీపీ ప్రాజెక్టుపై ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఎండీ అహ్మద్ బాబు, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ రెడ్నం అమరేంద్రకుమార్‌తో కలసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

– సాక్షి, అమరావతి



పాడి రైతులకు గిట్టుబాటు ధరే లక్ష్యం: అహ్మద్ బాబు



సహకార డెయిరీ రంగాన్ని బలోపేతం చేయడం, పాడిరైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020 డిసెంబర్‌లో జగనన్న పాల వెల్లువ పథకానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన అమూల్ సంస్థతో ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. గ్రామస్థాయిలో మహిళా పాడి రైతు సంఘాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తున్నాం. ఈ ప్రాజెక్టు ద్వారా లీటర్‌కు రూ.10 నుంచి 20 వరకు పాడి రైతులకు అదనపు లబ్ధి చేకూరుతోంది. మూడు జిల్లాలతో ప్రారంభమై ప్రస్తుతం 19 జిల్లాలకు విస్తరించింది. 400 గ్రామాలతో మొదలై 3,775 గ్రామాలకు విస్తరించింది. 14,845 మందితో మొదలైన ఈ ఉద్యమంలో నేడు 3.61లక్షల మంది భాగస్వాములయ్యారు. రోజూ 85 వేల మంది సగటున 1.86 లక్షల లీటర్ల పాలు పోస్తున్నారు. మూడేళ్లలో పాల సేకరణ ధరలను ఎనిమిది సార్లు పెంచారు. గేదె పాల ధర లీటర్‌కు రూ.71.74 నుంచి రూ.89.76కు, ఆవుపాల ధర లీటర్‌కు రూ.34.20 నుంచి రూ.43.69కు పెంచారు. ఫ్యాట్ శాతాన్ని బట్టి లీటర్ గేదెపాలకు రూ.103, లీటర్ ఆవుపాలకు రూ.54కు పైగా పాడి రైతులకు ధర లభిస్తోంది. 10 రోజులకు నేరుగా వారి ఖాతాలకు చెల్లింపులు చేస్తున్నాం. ఇప్పటి వరకు జేవీపీ కింద 9.98 కోట్ల లీటర్ల పాలు సేకరించగా రూ.446.93 కోట్లు చెల్లించాం. ప్రైవేటు డెయిరీలు అమూల్‌తో పోటీపడి పాలసేకరణ ధరలు పెంచాల్సి రావడంతో పాడి రైతులు రూ.4,283 కోట్లకు పైగా ప్రయోజనం పొందారు. క్రమం తప్పకుండా 180 రోజుల పాటు పాలుపోసే రైతులకు బోనస్, సొసైటీలకు ఇన్సెంటివ్ ఇస్తున్నాం. వర్కింగ్ క్యాపిటల్‌గా రూ.30 వేల వరకు ఆర్థిక చేయూత ఇవ్వడమే కాకుండా పాడి గేదెల కొనుగోలుకు రూ.90 వేలకు పైగా రుణాలు ఇప్పిస్తున్నాం.

ఏపీ ఆదర్శం : అల్కా ఉపాధ్యాయ, కేంద్ర పాడి పరిశ్రమ శాఖ కార్యదర్శి



జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా మహిళా పాడి రైతులకు గిట్టు బాటు ధర కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం. దేశంలో మెజార్టీ రాష్ట్రాల్లో పాడి రైతులకు చాలా తక్కువ ధరలు చెల్లిస్తున్నారు. కొన్ని రాష్ట్రాల్లో గిట్టుబాటు ధర లభించక రైతులు ఇబ్బందిపడుతున్నారు. ఏపీలో జేవీపీ ప్రాజెక్టు ద్వారా పాడి రైతులకు గరిష్టంగా లీటర్ గేదె పాలపై రూ.100 అంతకంటే ఎక్కువ ధర లభిస్తుండడం ప్రశంసనీయం. దేశంలో పాడి ఆధారిత రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించి జేవీపీ ప్రాజెక్టు అమలు తీరును పరిశీలించాలి. ఏపీని రోల్ మోడల్‌గా తీసుకుని తమ రాష్ట్రాల్లో పాడి రైతులకు గిట్టుబాటు కల్పించాలి.

ఎగుమతుల్లో ఈ ఏడాదీ అదే జోష్

- దేశవ్యాప్తంగా ఎగుమతులు తగ్గుతున్నా రాష్ట్రంలో వృద్ధి నమోదు
- తొలి త్రైమాసికంలో దేశవ్యాప్తంగా 8.48 శాతం తగ్గిన ఎగుమతులు
- రాష్ట్రంలో మాత్రం 6.20 శాతం వృద్ధి
- ఏప్రిల్–జూన్ మూడు నెలల్లో రూ. 43,289.32 కోట్ల ఎగుమతులు
- 5.06 శాతం వాటాతో అయిదో స్థానం
- గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,59,368.02 కోట్ల ఎగుమతులు




సాక్షి, అమరావతి: సముద్ర వాణిజ్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. దేశీయ వాణిజ్య ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దూసుకుపోతోంది. ప్రపంచ ఆర్థిక మందగమనం వల్ల ఈ ఏడాది దేశవ్యాప్తంగా ఎగుమతుల్లో క్షీణత నమోదవుతున్నా, మన రాష్ట్రంలో మాత్రం వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం ఏప్రిల్ – జూన్ మధ్య దేశవ్యాప్తంగా ఎగుమతులు 8.48 శాతం క్షీణించగా, అదే సమయంలో మన రాష్ట్ర ఎగుమతుల్లో 6.20 శాతం వృద్ధి నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం (2022 – 23) తొలి త్రైమాసికంలో దేశవ్యాప్తంగా రూ. 9,34,041.13 కోట్ల విలువైన ఎగుమతులు జరగ్గా ఈ ఏడాది అదే కాలంలో రూ.8,54,792.12 కోట్లకు పడిపోయాయి. ఇదే సమయంలో మన రాష్ట్రం నుంచి ఎగుమతులు రూ.40,760.22 కోట్ల నుంచి రూ.43,289.32 కోట్లకు పెరిగాయి. తొలి త్రైమాసికంలో మొత్తం దేశ ఎగుమతుల్లో 5.06 శాతం వాటాతో మన రాష్ట్రం అయిదో స్థానంలో నిలిచింది. గత ఆర్థిక సంవత్సరంలో ఆరో స్థానంలో ఉండగా ఈ ఏడాది తొలి మూడు నెలల కాలంలో ఒక ర్యాంకును మెరుగుపరుచుకుంది. గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రాష్ట్ర ఎగుమతులు 10.79 శాతం వృద్ధితో రూ.1,59,368.02 కోట్లకు చేరిన సంగతి తెలిసిందే. 2030 నాటికి 10 శాతం మార్కెట్ వాటాతో టాప్ 3 రాష్ట్రాల్లో ఒకటిగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

రాష్ట్రం నుంచి ఎగుమతులను ప్రోత్సహించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఎగుమతుల ప్రోత్సాహానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. విదేశాల్లో డిమాండ్ ఉన్న మన రాష్ట్ర ఉత్పత్తులను గుర్తించి, అక్కడి అవకాశాలను అందిపుచ్చుకునేలా చర్యలు తీసుకుంటోంది. రవాణా, ఇతర మౌలిక సౌకర్యాలు మెరుగుపరుస్తోంది. ఎగుమతుల కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.20,000 కోట్లతో నాలుగు గ్రీన్ ఫీల్డ్ పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లను అభివృద్ధి చేస్తోంది. ఇందులో రామాయపట్నం పోర్టు ఈ ఏడాది చివరికి, మిగిలిన మూడు పోర్టులు 2025 నాటికి అందుబాటులోకి రానున్నాయి. ఎగుమతుల ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నీతి ఆయోగ్ కూడా ప్రశంసించింది. 2022 సంవత్సరానికి నీతిఆయోగ్ ప్రకటించిన ఎగుమతి సన్నద్ధత రాష్ట్రాల్లో రాష్ట్రం 59.27 పాయింట్లతో 8వ స్థానంలో నిలిచింది. రెండేళ్ల క్రితం 20వ స్థానంలో ఉండగా, గత ఏడాదికి 12 స్థానాలు మెరుగుపరుచుకొని 8వ ర్యాంకుకు చేరుకోవడం విశేషం.

ప్రపంచ చోదక శక్తి యువతే

- అభివృద్ధికి యువత టార్చ్ బేరర్‌గా బాధ్యత తీసుకోవాలి
- ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించిన రాష్ట్ర విద్యార్థులు

సాక్షి, అమరావతి: ఐక్యరాజ్య సమితి (యూఎన్ఓ)లో జరిగే సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సదస్సుకు వెళ్లిన మన రాష్ట్ర విద్యార్థులు శనివారం జనరల్ అసెంబ్లీలో జరిగిన సదస్సులో ప్రసంగించారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన ఎస్‌డీజీ యాక్షన్ వీకెండ్ సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ గళం వినిపించారు. వివిధ దేశాల అధినేతలు, కేంద్ర మంత్రులు, యూఎన్ మెంబర్స్ పాల్గొన్న ఈ సదస్సులో తొలిరోజు దడాల జ్యోత్స్న, పసుపులేటి గాయత్రి, అల్లం రిషితారెడ్డి, మోతుకూరి చంద్రలేఖ, షేక్ అమ్మాజాన్, వంజీవాకు యోగేశ్వర్ మాట్లాడారు. 2030 నాటికి భవిష్యత్ తరాలకు స్థిరమైన అభివృద్ధిని అందించాలన్న నినాదంతో నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థులు సుస్థిరాభివృద్ధిలో యువత ప్రాధాన్యం చాలా అవసరమని, అభివృద్ధికి యువత టార్చ్ బేరర్‌గా బాధ్యత తీసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రపంచంలో ప్రస్తుతం ఉన్న 1.9 బిలియన్ల మంది యువత ప్రపంచ చోదక శక్తిగా మారాలని, సానుకూల సామాజిక మార్పుకు దిక్సూచిగా ఉండాలని అంతర్జాతీయ ప్రతినిధుల ముందు చేసిన ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు, ప్రపంచాన్ని తిరిగి సరైన మార్గంలో నడిపించేందుకు యువత కృతనిశ్చయంగా ఉండాలన్నారు. తొలిసారి ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించడంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. తొలిరోజు సదస్సులో ఐక్యరాజ్య సమితి స్పెషల్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్ కుమార్, సమగ్ర శిక్ష ఏపీ ఎస్పీడీ శ్రీనివాసరావు, కేజీబీవీ కార్యదర్శి మధుసూదనరావు, ఉత్తర అమెరికా రాష్ట్ర ప్రతినిధి పండుగాయల రత్నాకర్ పాల్గొన్నారు.



న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ హాల్‌లో రాష్ట్ర విద్యార్థులు

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం : 17 : సెప్టెంబర్ : 2023



అందమైన వేడుక

బెంగళూరు హెచ్ఎస్ఆర్ లేఔట్‌లో శనివారం ఓ నగల షోరూం ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా క్యాట్‌వాక్‌తో అలరించిన ముద్దుగుమ్మలు

ప్రైవేటు బస్సుల్లో పండుగ బాదుడు

- దూర ప్రాంతాలకు రెట్టింపు ధరలు
- పండుగ, వరుస సెలవులను సొమ్ము చేసుకుంటున్న వైనం



శివాజీనగర: గౌరీ గణేశ పండుగ, వరుసగా సెలవులు రావడంతో బెంగళూరు నుంచి ఇతర నగరాలకు, అలాగే తెలుగు రాష్ట్రాలకు వేలాది మంది తరలివెళ్తున్నారు. సొంతూరిలో బంధుమిత్రుల మధ్య సంతోషంగా పండుగ జరుపుకోవాలనే ఆశ ప్రైవేటు బస్సు యజమానులకు వరమైంది. టికెట్ల ధరలను రెండు రెట్లు పెంచి దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి.



బెంగళూరు మెజెస్టిక్ బస్టాండులో కిటకిట

టికెట్‌పై రూ.వెయ్యి వరకూ

శనివారం నుంచి సోమవారం వరకూ ప్రైవేట్, ప్రభుత్వ బస్సుల సీట్లు భర్తీ అయ్యాయి. బెంగళూరు నుంచి రాష్ట్రం, ఇతర రాష్ట్రాలకు సంచరించే అనేక ప్రైవేట్ బస్సుల ప్రయాణం ధరలు రెండింతలయ్యాయి. పండుగ సమయంలో ఇది సహజం, దూరపు ప్రాంతాలకు బస్సుల టికెట్ ధరను రూ.800 నుండి రూ.1000 వరకూ పెంచినట్లు ప్రైవేటు ట్రావెల్స్ సిబ్బంది తెలిపారు.

అవసరం కాబట్టి..

సొంతూళ్లకు వెళ్లేవారు అనివార్యంగా అడిగినంత సొమ్ము ఇచ్చి ప్రయాణం చేస్తారు. ఈ సమయంలో టికెట్ ఎంతపెంచినా కొంటారనేది బస్సు యజమానులకు తెలుసు. ఒకవేళ ఎవరైనా ప్రశ్నిస్తే అలాంటి వారిపై బస్సు సిబ్బంది దౌర్జన్యంతో నోరు మూయిస్తారని కొందరు ప్రయాణికులు వాపోయారు. ఎక్కువ చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న ప్రభుత్వ హెచ్చరికలకు సైతం విలువ లేకుండా పోయింది. టికెట్ ధరల బాదుడుపై పలువురు ప్రయాణికులు సోషల్ మీడియాలోనూ ఆవేదన వెళ్లగక్కారు.



పండుగ చాటున ప్రయాణికుల్ని దోచేస్తున్న ట్రావెల్స్

మామూలు రోజులు, ఇప్పుడు చార్జీలు ఇలా

- బెంగళూరు–మంగళూరు: 700 నుండి రూ. 800; ప్రస్తుతం రూ.1300
- బెంగళూరు–ఉడుపి: రూ.880–1050; ప్రస్తుతం రూ.1500 నుండి 2500
- బెంగళూరు–బళ్లారి : రూ.900 –రూ.1050; ప్రస్తుతం రూ.1000 నుండి 1500
- బెంగళూరు–బెళగావి: రూ.900 నుండి రూ.1050; ప్రస్తుతం రూ.1600 నుండి 3000
- బెంగళూరు–రాయచూరు: రూ.850 నుండి రూ.1110; ఇప్పుడు రూ.850 నుండి 1500
- బెంగళూరు నుంచి తెలుగు రాష్ట్రాలకు ధరలు ఇదేమాదిరిగా పెరిగాయి

బస్టాండ్లు కిటకిట

శుక్రవారం సాయంత్రం నుంచి బెంగళూరులో ఆర్టీసీ, ప్రైవేటు బస్టాండు రద్దీగా మారాయి. కుటుంబాలతో సహా ఊళ్లకు వెళ్లేవారు కార్లు, రైళ్లు దొరకనివారు బస్సుల బాట పట్టారు. అయితే లగ్జరీ బస్సుల్లో ఆర్టీసీ బస్సుల్లో అప్పటికే రిజర్వేషన్లు కావడంతో సాధారణ ప్రయాణికులకు సీట్లు దొరకడం గగనమైంది. ఉచిత ప్రయాణం వల్ల మహిళల రద్దీ పెరిగింది.

న్యూస్‌రీల్

యోగాలో బంగారు పతకం



తుమకూరు: బ్యాంకాక్‌లో నిర్వహించిన అంతర్జాతీయ యోగా చాంపియన్‌షిప్‌లో తుమకూరు జిల్లా శిరా తాలూకాలోని 9వ తరగతి విద్యార్థి ఉదిత్ బాలాజీ మొదటి స్థానం పొంది బంగారు పతకం సాధించాడు. బ్యాంకాక్ నగరంలోని యూనివర్సల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఇన్ అసోషియేషన్ విత్ ఎస్.జీ.ఎస్ ఇంటర్నేషనల్ యోగా ఫౌండేషన్ బెంగళూరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏష్యా పసిఫిక్ యోగా చాంపియన్ షిప్‌లో సోలో విభాగంలో భారత్ నుంచి పోటీ పడిన ఉదిత్ ఉత్తమ ప్రదర్శన ఇచ్చి బంగారు పతకం సాధించాడు.

కిద్వాయ్‌లో అక్రమాలపై సీఎం దృష్టి

శివాజీనగర: బెంగళూరులోని ప్రముఖ ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రి కిద్వాయ్‌లో రోగులకు సక్రమంగా చికిత్స చేయడం లేదని, ఔషధాల కొనుగోలులో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై కమిటీచే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీఎం సిద్దరామయ్య ఆదేశించారు. కిద్వాయ్ వైద్యాలయంలో రోగులకు సరిగా వైద్యచికిత్సలు చేయడం లేదని, మందుల కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని సీఎంకు ఫిర్యాదులు వచ్చాయి. ఐఏఎస్ అధికారి నేతృత్వంలో కమిటీ నియమించి, వివిధ శాఖల అధికారులతో విచారణ జరిపి 2 వారాల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

నీటిని నిలిపేయాలని ధర్నా



మండ్యలో రైతుల రాస్తారోకో

మండ్య: తమిళనాడుకు ఇంకెంతమాత్రం ప్రభుత్వం కావేరి నీటిని వదలరాదని కోరుతూ జిల్లా రైతు హితరక్షణ సమితి, రైతుసంఘాలు చేస్తున్న సత్యాగ్రహం 14వ రోజుకు చేరుకుంది. శనివారం ఎమ్మెల్యే హెచ్.టి. మంజు ధర్నాలో పాల్గొని మాట్లాడారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కావేరి నీటిని తమిళనాడుకు వదలడం కుదరదన్నారు. రాష్ట్రంలో తీవ్రమైన కరువు ఉందని, అనేక జలాశయాల్లో నీరు పడిపోయిందని చెప్పారు. నీటిని నిలిపివేసే వరకూ రైతులు, పోరాట సంఘాలు ఆందోళనను కొనసాగిస్తాయని తెలిపారు.

రెండు తిమింగలాల మృత్యువాత



ఓ తిమింగలం కళేబరం

యశవంతపుర: ఉత్తర కన్నడ జిల్లా హొన్నావర తాలూకా ముగళి సముద్రతీరంలో శనివారం రెండు బలీన్ జాతికి చెందిన తిమింగలాల కళేబరాలు బయటపడ్డాయి. గత వారం క్రితం 35 మీటర్ల పొడవైన తిమింగలం కళేబరం కొట్టుకు రావడం తెలిసిందే. ఈసారి 25 మీటర్ల పొడవున్న మృత తిమింగలం, దానికి దగ్గరలో మరో తిమింగలం కళేబరం ఒడ్డుకు వచ్చాయి. బలీన్ తిమింగళాలు సంతానోత్పత్తి సమయం కావటంతో నేత్రాణి, ముగళి సముద్ర తీరాలకు వస్తుంటాయి. ఈ సమయంలో పెద్ద ఓడలు ఢీకొనడం వల్ల చనిపోయి ఉంటాయని స్థానిక జీవశాస్త్ర విజ్ఞాని ప్రకాశ మేస్త తెలిపారు. తరచుగా తిమింగలాలు మృత్యువాత పడడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది.

ప్రజలు బీజేపీకి ఆపరేషన్ చేశారు: సీటీ

బనశంకరి: మేము అధికారం కోసం ఆపరేషన్ కమల చేపట్టాం, కానీ ప్రజలు మా అధికారానికి ఆపరేషన్ చేశారని బీజేపీ మాజీ మంత్రి సీటీ రవి అన్నారు. శనివారం మంగళూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక బీజేపీ మాజీ కార్పొరేటర్లు, నేతలు కొందరు కాంగ్రెస్‌లో చేరారు, బెల్లం ఉన్నచోటకు చీమలు వెళ్లడం సహజం, అదేమాదిరిగా కొందరు అక్కడికి వెళ్లారని అన్నారు. మేము మంత్రులు, ఎమ్మెల్యేలను బీజేపీలోకి తీసుకున్నప్పటికీ అధికారం కాపాడుకోవడం సాధ్యం కాలేదని, వారు కార్పొరేటర్లను తీసుకెళ్లి చేం చేస్తారని కాంగ్రెస్‌ను హేళన చేశారు. ఇప్పుడు ఆపరేషన్ హస్తం చేస్తున్నారు. ఇకముందు ప్రజలే కాంగ్రెస్‌కు ఆపరేషన్ చేస్తారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో నా ఓటమికి నేనే కారణమం, వేరే ఎవరూ కాదు, ఎక్కువ ఓట్లు వచ్చినప్పటికీ ఓడిపోయానని వాపోయారు. బీజేపీ– జేడీయస్ పొత్తు ఖరారు కాలేదని, పార్టీ పెద్దలు చూసుకుంటారని తెలిపారు.

దంపతుల కలహం శాంతిభద్రతల సమస్యా?

- పోలీసులపై ధార్వాడ హైకోర్టు బెంచ్ అసంతృప్తి



హుబ్లీ: ఇంట్లో పూజ చేసే విషయమై భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణ కేసులో భర్తపై క్రిమినల్ కేసులు పెట్టిన తీరుపై ధార్వాడ హైకోర్టు తీవ్రంగా అభ్యంతరం తెలిపింది. ఆ చార్జ్‌షీట్‌ను కోర్టు రద్దు చేసింది. కేసు రద్దును కోరుతూ బాగలకోటె విద్యాగిరి నివాసి వివేకానంద దాఖలు చేసిన రిట్ విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్నతో కూడిన ఏకసభ్య ధర్మాసన ధార్వాడ పీఠం ఈ ఆదేశాలను వెలువరించింది.

ఏం జరిగిందంటే..

ఫిర్యాదిదారుకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి 14 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. 2016లో శ్రావణ శుక్రవారం రోజున పూల సామగ్రి కొనాలని భార్య కోరగా ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తింది. దీనికి సంబంధించి భార్య బాగలకోటె నవనగర పోలీస్ స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేయగా, పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ సెక్షన్లు అన్యాయమంటూ భర్త హైకోర్టును ఆశ్రయించాడు.

ఈ కేసులో దంపతుల మధ్య ఘర్షణ జరిగింది. దీని వల్ల సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగిందని చెబుతూ క్రిమినల్, బెదిరింపుల సెక్షన్ చేర్చడం సరికాదని కోర్టు అభిప్రాయ పడింది. కుటుంబ కలహానికి ఇలాంటి కేసులు పెట్టడం తమాషాగా ఉందని జడ్జి పేర్కొన్నారు.

అక్టోబరు 15 నుంచి నవరాత్రి ఉత్సవాలు



- మైసూరు దసరా సంబరాలు..

మైసూరు: విశ్వవిఖ్యాత మైసూరు దసరా ఉత్సవాల కార్యక్రమాల జాబితాను జిల్లా యంత్రాంగం విడుదల చేసింది. అక్టోబర్ 15వ తేదీ ఆదివారం శరన్నవరాత్రి ఉత్సవాలకు నాంది పలుకుతారు. చాముండికొండ పైన చాముండేశ్వరి అమ్మవారికి పూజలు నిర్వహించడం ద్వారా 9 రోజుల ఉత్సవాలకు అంకురార్పణ గావిస్తారు. ఆ రోజున ఉదయం 10.15 గంటల నుంచి 10.36 గంటల మధ్య ఉన్న శుభ వృశ్చిక లగ్నంలో పూజలు చేసి దసరా ఉత్సవాలను అతిథులు ప్రారంభిస్తారు. ప్యాలెస్‌లోనూ ఇదే సమయంలో రాజవంశీకులు వేడుకలకు నాంది పలుకుతారు. నాటి నుంచి నిత్యం చాముండేశ్వరి ఆలయంలో, ప్యాలెస్‌లో, మైసూరులో వివిధ వేదికల్లో ఉత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

23న ఆయుధ పూజ

అక్టోబర్ 23వ తేదీన మైసూరు ప్యాలెస్‌లో ఆయుధపూజను నిర్వహిస్తారు. అక్టోబర్ 25వ తేదీన విజయదశమి రోజున మధ్యాహ్నం 1.46 గంటల నుంచి 2.08 గంట:ల మకర లగ్నంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య నందిధ్వజ పూజ చేస్తారు. సాయంత్రం 4.40 గంటల నుంచి 5.00 మధ్య ఉన్న శుభ మీన లగ్నంలో చాముండేశ్వరి మాతకు పూజలు చేసి దసరా జంబూ సవారీ ఊరేగింపును ప్రారంభిస్తారు. అలాగే మైసూరు ప్యాలెస్ ఆవరణతో పాటు పలుచోట్ల ఎగ్జిబిషన్లు, వినోద, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించనున్నాయి.

ఆలయ దర్శనాలకు ఆన్‌లైన్ యాప్

బనశంకరి: దేవదాయశాఖ పరిధిలోకి వచ్చే ఆలయాల్లో భక్తుల కోసం ఆన్‌లైన్ వ్యవస్థ అమల్లోకి తీసుకువస్తామని ఆ శాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. శనివారం నగరంలో విలేకరులతో రామలింగారెడ్డి మాట్లాడుతూ... దేవదాయశాఖ పరిధిలో ఉన్నతస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించామని, పూజలు, ఆలయాల్లో దర్శనాలకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడానికి ప్రత్యేక యాప్‌ను విడుదల చేస్తామని చెప్పారు. కాశీయాత్ర, మానస సరోవర, చార్‌ధామ్, భారత్ గౌరవ కాశీయాత్ర కు యాప్ విడుదల చేస్తామని తెలిపారు.

ఘనంగా స్నాతకోత్సవం



తుమకూరు: జ్ఞానం, అన్వేషణ అనేది నిరంతర ప్రయత్నం అని, పెద్ద బాధ్యతతో పాటు భవిష్యత్తులో శక్తినిస్తుందని పారిశ్రామికవేత్త హరీష్ రవి అన్నారు. శనివారం తుమకూరు నగరంలోని సిద్ధగంగా సాంకేతిక మహా విద్యాలయంలో నిర్వహించిన 14వ స్నాతకోత్సవంలో పాల్గొని పట్టభద్రులకు పట్టాలను అందజేశారు. సిద్ధలింగస్వామి పాల్గొన్నారు.

కావేరితో కేంద్రానికి సంబంధం లేదు: సింహ

మైసూరు: కావేరి నదీ జలాలను తమిళనాడుకు విడుదల గురించి సమస్య ఉంటే సీఎం సిద్దరామయ్య తమిళనాడు ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం చేయాలి తప్ప కేంద్రం పైన రుద్దకూడదని మైసూరు ఎంపీ ప్రతాపసింహ అన్నారు. శనివారం మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ కావేరి నీటిని తమిళనాడుకు పంపిణీలో కేంద్రానికి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఇందులో ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాల్సిన అవసరం కూడా లేదన్నారు. ఇందులో ముఖ్యమంత్రుల పాత్రే ఉంటుంది, ఇద్దరు సీఎంలు చర్చించుకొని తీర్మానం చేసుకోవాలన్నారు. అవసరమైతే కోర్టులో పోరాడాలని, కేంద్రానికి ఏ హక్కు ఉండదని అన్నారు.

టికెట్ పేరుతో రూ.5 కోట్లు హాంఫట్!

దొడ్డబళ్లాపురం: ఎమ్మెల్యే ఎన్నికల్లో టికెట్ ఇప్పిస్తామని కోట్లాది రూపాయలు వసూలు చేశారని ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. వివరాలు.. నెలమంగల నివాసి రిటైర్డ్ ఉప తహసీల్దార్ బీ హొంబయ్య అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్ పొందాలనుకున్నాడు. ఈ క్రమంలో నాగరాజు, హరిశాస్త్రి, వీరేశ్ అనే ముగ్గురు వ్యక్తులతో చర్చించాడు. వీరు 2022 డిసెంబర్‌లో హొంబయ్యను కలిసి తమ వద్ద రూ.49 కోట్ల డీడీ ఉందని, రూ.50 లక్షలు ఇస్తే మూడు రోజుల్లో తిరిగి ఇస్తామని నమ్మబలికారు. అలా పలు దఫాలుగా రూ.1 కోటి 29 లక్షలు ఇచ్చానన్నాడు. డీడీ ఇంకా నగదు కాలేదంటూ మొత్తంగా రూ 5 కోట్ల వరకూ వసూలు చేశారని, తరువాత ముఖం చాటేశారని చెప్పాడు. ఆ ముగ్గురిపై నెలమంగల పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. నిందితులు పరారీలో ఉన్నారు.

మంత్రి అనుచరులు బెదిరిస్తున్నారు

శివాజీనగర: విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప అనుచరులు తనను బెదిరిస్తున్నారని ప్రణవానంద స్వామి తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన ప్రణవానంద స్వామి, తనకు ఫోన్ కాల్ చేసి మంత్రి మధు బంగారప్ప అనుచరులు బెదిరిస్తున్నారు. తాను శరణ సంస్కృతి ప్రకారం వివాహం చేసుకున్నాను. సముదాయం కోసం పోరాటం చేపట్టానని తెలిపారు. తనను భయపెట్టి, బెదిరించి పోరాటాన్ని అణచివేసేందుకు యత్నిస్తున్నారు. వారి బెదిరింపులకు లొంగనని, ప్రాణ బెదిరింపు నేపథ్యంలో ప్రణవానందస్వామి శనివారం పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

విఘ్నాధిపతికి స్వాగతమాల



శనివారం బెంగళూరు గాంధీనగరలో గణపతి విగ్రహాల విక్రయాలు



కేఆర్ మార్కెట్లో జోరుగా పూల వ్యాపారం

- ఐటీ సిటీలో చురుగ్గా ఏర్పాట్లు

శివాజీనగర: విఘ్నాలు తొలగించి ఏడాదంతా సాఫీగా సాగిపోయేలా అందరూ భక్తిశ్రద్ధలతో గణనాథున్ని పూజించడం ఆనవాయితీ. ఇందుకోసం వినాయక చతుర్థి పండుగ కోసం సిలికాన్ సిటీలో ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి. వీధుల్లో మండపాల్లో పెద్ద గణపతులను, ఇళ్లలో బుజ్జి వినాయకుల్ని ప్రతిష్ఠించి నైవేద్యాల సమర్పణకు ఒక్కరోజే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో నగరమంతటా గణేశ నిమజ్జనానికి చెరువులు, పుష్కరిణుల వద్ద సన్నాహాలు చేపట్టారు. ఇందుకోసం పాలికె వందకు పైగా స్థలాలను ఏర్పాటు చేసింది.

చిన్న విగ్రహాలకు మొబైల్ ట్యాంకర్లు

చిన్న విగ్రహాలను సులువుగా జలార్పణం చేయడానికి మొబైల్ ట్యాంకులను నడపనున్నట్లు పాలికె అధికారులు తెలిపారు. 5 ఇంచుల నుంచి 3 అడుగుల ఎత్తు కలిగిన అన్ని మట్టి విగ్రహాలను ఈ ట్యాంకుల్లో నిమజ్జనం చేయవచ్చు. అంతకంటే పెద్ద మూర్తుల కోసం నగరమంతటా 12 చోట్ల చెరువులను, మడుగులను నిర్దేశించారు. యడియూరు, హెబ్బాళ, శాంకీ చెరువులకు అధిక సంఖ్యలో రద్దీ ఉన్నందున ఇక్కడ కల్యాణిల్లో పూడికతీసి, రంగులు వేశారు. అంతటా పోలీసులు, సీసీ కెమెరాలు, లైట్లు, క్రేన్, అంబులెన్స్ వసతులు ఉంటాయని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను కూర్చోబెట్టడం, నిమజ్జనం చేయరాదని సూచించారు.

విగ్రహాలు, పూలు పండ్లకు గిరాకీ

మరోవైపు నగరంలో ట్యానరీ రోడ్డు, శివాజీనగర, బాణసవాడి, హలసూరు, మల్లేశ్వరం, యశ్వంతపురతో పాటుగా వివిధ స్థలాల్లో గౌరీ–గణేశ విగ్రహాల విక్రయాలు ముమ్మరంగా సాగుతున్నాయి. రూ.100 నుండి రూ.2 లక్షల వరకు విలువైన విగ్రహాలు మార్కెట్లో ఉన్నాయి. అలాగే పూలు, పండ్లు, చెరుకులు వంటి పూజా సామగ్రి అమ్మకాలు జోరందుకున్నాయి. మార్కెట్లలో పండుగ సందడి అలముకొంది.

కిరాతకంగా భార్య హత్య

- గౌరిబిదనూరు వద్ద దారుణం



భర్త అంజుంఖాన్



రోడ్డుపై షానవాజ్ మృతదేహం

గౌరిబిదనూరు: గౌరిబిదనూరు తాలూకా అలకాపురంలో షానవాజ్ (30) అనే మహిళను భర్త అంజుంఖాన్ హత్య చేశాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. పుట్టపర్తి జిల్లాలోని హిందూపురానికి చెందిన అంజుంఖాన్ (33), షానవాజ్‌లకు 8 ఏళ్ల కిందట పెళ్లయింది, ఆరేడేళ్ల కిందట ఉపాధి కోసం అలకాపురానికి వచ్చి స్థిరపడ్డారు. అక్కడే ఒక ఫ్యాక్టరీలో కూలీ పనులకు వెళ్లేవారు. వీరికి పిల్లలు లేరు. కొంతకాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి ఎస్‌డిఎం వైనరీ సమీపంలో గొడవ పడిన భర్త చాకుతో భార్య గొంతుకోసి హత్య చేశాడు. తరువాత గౌరిబిదనూరు రూరల్ స్టేషనుకు వెళ్లి లొంగిపోయాడు. మంచేనహళ్లి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హిందూపురంలో ఉన్న హతురాలి అన్న జబీవుల్లాకు సమాచారమందించారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అంజుంఖాన్‌ని అరెస్టు చేశారు.

హంతకునిపై దాడి.. వెయ్యి మందిపై కేసు

కోలారు: శ్రీనివాసపురం తాలూకా నంబిహళ్లి గ్రామంలో గత 12వ తేదీన నాగేశ్ అనే మటన్ వ్యాపారి మాజీ భార్యను ఇంట్లోకి దూరి నరికి చంపడం తెలిసిందే. ఈ సమయంలో గ్రామస్తులు ఆగ్రహంతో అతన్ని పట్టుకుని దాడి చేయడానికి యత్నించారు. ఒకదశలో పెట్రోల్ పోసి హంతుకున్ని దహనం చేయాలని చూశారు. గ్రామస్తులను పోలీసులు అడ్డుకోగా తోపులాట చోటుచేసుకుంది. చివరికి పోలీసులు వీరిపై లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసుల విధి నిర్వహణకు అడ్డపడ్డారనే కారణంపై పెద్ద సంఖ్యలో గ్రామస్తులపై శ్రీనివాసపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సుమారు వెయ్యి మందిపైపై కేసు పెట్టినట్లు తెలుస్తోంది.

గ్రామస్తుల మండిపాటు

దీంతో అరెస్టు చేస్తారనే భయంతో గ్రామానికి చెందిన పలువురు గ్రామం వదిలి వెళ్లినట్లు తెలిసింది. హంతకున్ని పట్టుకుంటే కేసులు పెడతారా? అని గ్రామస్తులు పోలీసుల తీరుపై మండిపడుతున్నారు. తమ ఊరికి వచ్చి హత్యలు చేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? అని పలువురు ప్రశ్నించారు.

మహిళకు రూ.1.45 లక్షల బురిడీ

మైసూరు: మైసూరులో ఆన్‌లైన్ నేరాల కేసులు నానాటికీ పెరుగుతున్నాయి. దుండగులు ఇంటి నుంచి పని ఇస్తామని మహిళను నమ్మించి రూ. 1.45 లక్షలు కొట్టేశారు. శక్తినగరకు చెందిన సుధారాణి అనే మహిళకు వాట్సాప్‌లో వర్క్ ఫ్రం హోం మెసేజ్ రాగా, అందులో ఉన్న నంబర్‌కు కాల్‌చేసి మాట్లాడింది. వివిధ రుసుముల కింద మీరు 1.45 లక్షలు చెల్లిస్తే, మంచి జీతంతో ఇంటి నుంచి పని ఇప్పిస్తామని మోసగాళ్లు చెప్పారు. దీంతో ఆమె అంత డబ్బును ఆన్‌లైన్‌లో చెల్లించింది. తరువాత కాల్ చేస్తే ఆ నంబర్ స్విచాఫ్ అని రావడంతో మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కద్రి ఆలయమే కుక్కర్ బాంబు లక్ష్యం!



యశవంతపుర: మంగళూరు నగరంలో ఆటో రిక్షాలో జరిగిన కుక్కర్ పేలుడు కేసులో పోలీసుల విచారణలో కొత్త విషయాలు బయటపడ్డాయి. నిందితుడు షారిక్ ప్రసిద్ధ కద్రి ఆలయాన్ని పేల్చడానికి ఈ బాంబును సిద్ధం చేసినట్లు గుర్తించారు. 2022 నవంబర్ 19న నాగురియగరోడ్డు వద్ద వెళుతున్న ఆటోలో కుక్కర్ బాంబ్ అనుకోకుండా పేలింది. నిందితుడు షారిక్‌తో పాటు ఆటో డ్రైవర్ పురుషోత్తమ పూజారిలు తీవ్రంగా గాయపడి కోలుకున్నారు. కేసును ఎన్ఐఏ విచారిస్తోంది. కద్రి దేవస్థానమే లక్ష్యమని నిందితుడు షారిక్ విచారణలో వెల్లడించాడు. మరో నిందితుడు అరాఫత్ అలీని రెండు రోజుల క్రితం ఢిల్లీలో అరెస్ట్ చేశారు. ఇతను మంగళూరులో గోడల మీద రెచ్చగొట్టే రాతలు రాశాడని, కుక్కర్ బాంబులో ముఖ్య పాత్ర ఉందని అభియోగాలున్నాయి.

క్లుప్తంగా

డ్రెయినేజీల్లో చెత్త తొలగింపు


చెత్త తొలగింపును పరిశీలిస్తున్న దృశ్యం


రాయచూరు రూరల్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో మురుగు కాలువల్లో చెత్త తొలగింపు పనులను సత్వరం పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖా మంత్రి బోసురాజు సూచించారు. ఆయన శనివారం నగరంలోని జవహర్ నగర్‌లోని, నగరేశ్వరాలయం వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి మాట్లాడారు.

కురుబలను ఎస్టీల్లోకి చేర్చాలి


మాట్లాడుతున్న రేవణ్ణ

రాయచూరు రూరల్: రాష్ట్రంలో కురుబలను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తామని మాజీ మంత్రి రేవణ్ణ వెల్లడించారు. శనివారం పాత్రికేయుల భవనంలోని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ సర్కార్ హయాంలో కురుబలను ఎస్టీల్లోకి చేర్చాలని ప్రతిపాదనలు చేశామన్నారు. ఈ విషయంపై బెళగావిలో రాష్ట్ర స్థాయి సమావేశం అక్టోబర్ 3న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

ట్రక్ ఢీకొని 25 గొర్రెల మృతి


మరణించిన గొర్రెలు

రాయచూరు రూరల్: యాదగిరిలోని చిత్తాపుర రోడ్డులో ట్రక్ ఢీకొని 25 గొర్రెలు మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారు జామున జరిగింది. చిత్తాపుర తాలూకా నాగసహట్టికి చెందిన గొర్రెల కాపరులు నాగప్ప, అంబలయ్య, ధర్మరాజ, నింగప్పలు తమ గొర్రెల మందను తోలుకెళుతుండగా వేగంగా వచ్చిన ట్రక్ వచ్చి మందపైకి దూసుకెళ్లడంతో గొర్రెలు మరణించాయి. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే రిట్‌పై విచారణ వాయిదా

హుబ్లీ: జిల్లా పంచాయతీ సభ్యుడు యోగేష్‌గౌడ హత్య ఆరోపణలను ఎదుర్కొంటున్న ధార్వాడ రూరల్ ఎమ్మెల్యే వినయ్‌కులకర్ణికి ధార్వాడ జిల్లాలో ప్రవేశానికి అనుమతి కోరుతూ ప్రజాప్రతినిధుల కోర్టులో దాఖలైన రిట్‌పై విచారణను ధార్వాడ హైకోర్టు బెంచ్ ఈనెల 23కు వాయిదా వేసింది. హత్య కేసులో అరెస్ట్ అయి బెయిల్‌పై బయట ఉన్న ఎమ్మెల్యే వినయ్ కులకర్ణికి ధార్వాడ జిల్లాలో ప్రవేశంపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. శుక్రవారం రిట్‌ను స్వీకరించిన న్యాయపీఠం ఈ విషయంలో మరింత కూలంకషంగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

పట్టు చీరల ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నగర మేయర్ త్రివేణి

సాక్షి బళ్లారి: గౌరి గణేష్ పండుగను పురస్కరించుకుని నగరంలోని కమ్మ భవన్‌లో మెగా పట్టు చీరల ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. శనివారం పట్టు అభివృద్ధి సంస్థ(సిల్క్ ఇండియా) ఆధ్వర్యంలో దేశంలో 23 రాష్ట్రాల్లో అన్ని వర్గాలను ఆకట్టుకొనే విధంగా తయారు చేసిన పట్టుచీరల ఎగ్జిబిషన్‌ను నగర మేయర్ త్రివేణి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకులు అభినందన్ తదితరులు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 23 వరకు వారం రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్‌ను కొనసాగిస్తామని తెలిపారు. ఈ ప్రదర్శనలో ఉంచే కాశ్మీర్ నుంచి కాంచీపురం వరకు తయారు చేసిన పట్టుచీరలను మహిళలు కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులపై స్థానికుల అభ్యంతరం

గంగావతి: యలబుర్గ ఎమ్మెల్యే బసవరాజ రాయరెడ్డి, కొప్పళ జిల్లాధికారి నళిన్ అతుల్ కుకనూరు పట్టణంలో ప్రభుత్వం చేపట్టిన తహసీల్దార్ కార్యాలయం, తాలూకా క్రీడామైదానం పనులను పరిశీలించారు. పట్టణంలోని గుడ్డేపమఠంలో పనులను పరిశీలిస్తుండగా స్థానికులు అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఈ మఠంలో ఎలాంటి ప్రభుత్వ అభివృద్ధి పనులు చేపట్టరాదని అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యే, జిల్లాధికారి ప్రజలతో వాగ్వాదానికి దిగకుండా వెనుదిరిగారు.

చవితికి గణనాథులు సిద్ధం

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వాడకం నిషేధం
- గణనీయంగా పెరిగిన విగ్రహాల ధరలు


వినాయక చవితి పూజలందుకోవడానికి మార్కెట్‌లో సిద్ధంగా ఉన్న బొజ్జగణపయ్య విగ్రహాలు

కోలారు: భాద్రపద మాసంలో ప్రజల నుంచి పూజలందుకోవడానికి వినాయక విగ్రహాలు నగరంలో సిద్ధంగా ఉన్నాయి. గత సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం వినాయక విగ్రహాల ధరలు గణనీయంగా పెరిగాయి. చిన్న సైజు వినాయక విగ్రహానికి కూడా రూ.500 నుంచి రూ.1000 వరకు సొమ్ము వెచ్చించాల్సి వస్తోంది. జిల్లా యంత్రాంగం పరిసరాల రక్షణ ఉద్దేశంతో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే వినాయక విగ్రహాలను పూర్తిగా నిషేధించడం వల్ల వినాయక విగ్రహాల ధరలు గణనీయంగా పెరిగిపోయాయి. కేవలం మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలనే కొనుగోలు చేయాల్సి రావడం ధరల పెరుగుదలకు మరో కారణం. మట్టి వినాయక విగ్రహల కంటే ప్లాస్టిక్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేయడం సులభం, పైగా ఖర్చు తక్కువ. వినాయక విగ్రహాలను తక్కువ సమయంలో ఎక్కువ విగ్రహాలను తయారు చేసే అవకాశం ఉంది.

మట్టి ప్రతిమలకు భారీ డిమాండ్

అయితే మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయడం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసినంత సులువు కాదు. బంకమట్టిని కూడా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఒక్కో విగ్రహం తయారీకి ఎక్కువ సమయం తీసువడంతో పాటు విగ్రహాలను నాణ్యతతో తయారు చేయకపోతే బీటలు వారుతాయి. బీటలు వారిన విగ్రహాలను ఎవరూ కొనుగోలు చేయరు, పూజించరు. దీని వల్ల వినాయక విగ్రహాలకు ఈ సారి భారీ డిమాండ్ ఏర్పడింది. ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. ఒక అడుగు ఎత్తు చిన్న విగ్రహం కొనుగోలు చేయడానికి భారీగా ధరలు పెట్టాల్సి వస్తోంది. కాలనీలలో ప్రతిష్ఠించే మూడు అడుగుల విగ్రహాలకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది, ఇక భారీ విగ్రహాల ధరలు కూడా బాగా పెరిగి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ధర పెట్టి కొనాల్సి వస్తోంది.

ఉచిత వితరణలు లేవు

ఎన్నికలకు ముందు ఉచిత వినాయక విగ్రహాలను ప్రజా ప్రతినిధులు, దాతలు భారీ సంఖ్యలో కొనుగోలు చేసి వివిధ సంఘాలకు, అభిమానులకు ఉచితంగా పంచేవారు. అయితే ఈసారి ఎలాంటి ఎన్నికలు లేకపోవడం వల్ల ఉచితాలు కరువై అందరూ విపణివీధిలో వినాయక విగ్రహాలను కొనుగోలు చేయాల్సి వస్తోంది. ధరలు పెరిగినా, ఉచితాలు లేకున్నా ప్రజలు మాత్రం వినాయక విగ్రహాల కొనుగోలులో ఉత్సాహం ఎంతమాత్రం తగ్గలేదు. ఈ యేడాది గౌరి వినాయక పండుగలు రెండూ ఒకే రోజు అంటే సొమవారం రావడం వల్ల శని, ఆదివారాల్లో నగరంలో భారీ ఎత్తున గౌరి గణేష విగ్రహాలు, పూలు, పండ్లను ముందుగానే ప్రజలు కొనుగోలు జరిగే అవకాశం ఉంది.

పీఓపీ వద్దు.. మట్టి గణపతులే ముద్దు


గణపతులను తయారు చేస్తున్న విద్యార్థులు

రాయచూరు రూరల్: పర్యావరణ సంరక్షణకు మట్టి గణపతులే ముద్దు అని రాయచూరు గ్రీన్ సంస్థ అధ్యక్షురాలు సరస్వతి పేర్కొన్నారు. శనివారం ఎన్‌జీఓ కాలనీలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చేపట్టిన మట్టి గణపతుల తయారు చేసి శిబిరంలో ఆమె మాట్లాడారు. మట్టి గణపతులను పూజించడం ద్వారా పర్యావరణ సంరక్షణకు సహకరించాలని పిలుపునిచ్చారు. 10 అంగుళాల ఆకారంలో బంక మట్టితో గణేష్ మూర్తులను సిద్ధం చేసి ఒక్కొక్కటి రూ.150ల ధరకు విక్రయించడానికి సిద్ధమయ్యారు. సోమవారం గణేష్ చవితి పండుగ సందర్భంగా పూజించడానికి, గణపతుల విసర్జనకు అనుకూలంగా ఉంటుందని రాజేంద్ర కుమార్ అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్(పీఓపీ), ఇతర రసాయనిక పదార్థాలతో తయారు చేసిన వినాయకుల నిమజ్జనంతో చెరువులు, బావులు, కుంటల్లో నీరు కలుషితమవుతాయని, చెత్తచెదారం, ప్లాస్టిక్ వంటి వాటితో పరిసరాలు పాడవుతాయనే ఉద్దేశ్యంతో మట్టి గణపతులను వినియోగించాలని ప్రజలకు సూచించారు.

హాస్టళ్లలో సమస్యలను తీర్చండి


మాట్లాడుతున్న మంత్రి బోసురాజు

రాయచూరు రూరల్: జిల్లాలోని హాస్టళ్లలో మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు అక్కడ నెలకొన్న సమస్యలను అధికారులు తీర్చాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖా మంత్రి ఎన్ఎస్ బోసురాజు అధికారులకు సూచించారు. ఆయన శనివారం జెడ్పీ జల నిర్మల సభాంగణంలో జరిగిన వెనుకబడిన, సాంఘీక సంక్షేమ శాఖ, మైనార్టీ, మొరార్జి దేశాయి, ఏకలవ్య వసతి శాఖ అధికారుల సమావేశంలో మాట్లాడారు. హాస్టల్ భవనాల నిర్మాణాలపై పూర్తి నివేదిక అందించాలని ఆదేశించారు. హాస్టళ్లలో తాగునీరు, విద్యుత్, భోజన వసతి వంటి సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో మాన్వి ఎమ్మెల్యే హంపయ్య నాయక్, ఏడీసీ దురుగేష్, ఏసీ మెహబూబీ, జెడ్పీ సీఈఓ రాహుల్ పాండే తుకారాం, ఉప కార్యదర్శి శశికాంత్, ప్రకాష్, జెస్కాం చీఫ్ ఇంజినీర్ చంద్రశేఖర్ దేశాయి, విద్యా శాఖాధికారి సురేష్, బీసీఎం అధికారి వాల్మీకి, సాంఘీక సంక్షేమ శాఖాధికారి రాజేంద్ర జాలదార్‌లున్నారు.

సీబీఐ అధికారి పేరుతో నకిలీ అకౌంట్

- నగల వ్యాపారికి రూ.లక్ష డిమాండ్


సీబీఐ అధికారి పేరుతో నకిలీ కార్డు

రాయచూరు రూరల్: జిల్లాలో రోజురోజుకు సైబర్ నేరాల సంఖ్య పెరుగుతోంది. 15 రోజుల క్రితం కలబుర్గి వాసులు ప్రైవేట్ వైద్యుడిపై పిస్తోలు ఎక్కుపెట్టి డబ్బులు డిమాండ్ చేస్తూ పట్టుబడిన విషయం అందరికీ తెలిసిందే. వైద్యుడి విషయం కనుమరుగు కాక మునుపే నగల వ్యాపారిపై దుండగుల కన్నుపడింది. రెండు రోజుల క్రితం రాయచూరు షరాఫ్ బజారులో సురేష్ అనే బంగారు నగల దుకాణదారుడికి ఫోన్ చేసి తన పేరు సుబోధ్ కుమార్ జైస్వాల్, న్యూఢిల్లీకి చెందిన సీబీఐ అధికారినంటూ వాట్సాప్‌లో సందేశం పంపడమేగాక రూ.లక్ష చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే నగల వ్యాపారి భయపడకుండా సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసుల విచారణలో అది నకిలీ ఫేస్‌బుక్ ఖాతా అని తేలింది. దీంతో నగల వ్యాపారి ఊపిరి పీల్చుకున్నారు.

వక్కలోడు లారీ పట్టివేత


బైపాస్ వద్ద లారీని చుట్టుముట్టిన వాహనాలు

రాయదుర్గం: కేరళ నుంచి న్యూఢిల్లీకి లోడ్‌తో వెళుతున్న ఓ లారీ శుక్రవారం రాత్రి కర్ణాటక జీఎస్టీ అధికారుల కళ్లు గప్పి తప్పించుకుని ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించింది. ఆద్యంతం సినీ ఫక్కీలో సాగిన ఛేజింగ్‌లో చివరకు ఆంధ్ర ప్రాంతంలో లారీ టైర్ బరస్ట్ కావడంతో కర్ణాటక పోలీసులు స్వాధీనం చేసుకోగలిగారు. వివరాలు... కేరళ నుంచి వస్తున్న లారీని కర్ణాటకలోని హానగల్ వద్ద జీఎస్టీ, సేల్స్ ట్యాక్స్ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకు దూకించడంతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుని తమ వాహనాల్లో వెంబడిస్తూ మొళకాల్మూరు పోలీసులకు సమాచారం అందించారు. దాదాపు 14 కిలోమీటర్ల మేర ఛేజింగ్ చేసినా లారీ వేగాన్ని పోలీసులు, జీఎస్టీ అధికారులు అందుకోలేకపోయారు. చివరకు రాయదుర్గం పట్టణ సమీపంలో నిర్మాణంలో ఉన్న బైపాస్ వద్దకు చేరుకోగానే టైర్లు బరస్ట్ అయ్యాయి. వెనుకనే వెంబడిస్తూ వచ్చిన కర్ణాటక పోలీసులు, జీఎస్టీ అధికారుల వాహనాలు లారీని చుట్టుముట్టాయి. లారీలో ఉన్న సరుకుపై అధికారులు ఆరా తీశారు. వక్కలోడుతో వెళుతున్నట్లుగా డ్రైవర్, సహాయకులు తెలిపారు. ముందుగా గుర్తించిన కర్ణాటక జీఎస్టీ అధికారులకే కేసు నమోదు బాధ్యతలు అప్పగించేలా అంగీకారానికి వచ్చారు.

21న కేంద్ర బృందం జిల్లాకు రాక


- కరువు ధృవీకరణ పత్రాలను సిద్ధం చేయండి
- అధికారులకు జిల్లాధికారి దివాకర్ సూచన


అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి దివాకర్

హొసపేటె: కేంద్ర కరువు అధ్యయన బృందం ఈనెల 21న జిల్లాలో పర్యటించి కరువు ప్రాంతాల రికార్డులను గణాంకాలతో పాటు క్రోఢీకరించుకోనున్నట్లు జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ తెలియజేశారు. శనివారం జిల్లాధికారి కార్యాలయ సభామందిరంలో జనన మరణాల సివిల్ రిజిస్ట్రేషన్ విధానం, పంటకోత ప్రయోగాలు, పంట పొలాల రీ అలైన్‌మెంట్ సమస్యలపై జిల్లా జనగణన అధికారితో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023–24వ సంవత్సరానికి కర్ణాటక రైతు భద్రత ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద జిల్లాలోని అన్ని తాలూకాల తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి నిర్ణీత వ్యవధిలో వర్షాకాలంలో నోటిపై చేసిన పంటల సాగు ప్రయోగాలను నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత ఏడాది వానాకాలంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదైనందున పంటలు మొలక దశలోనే ఎక్కువగా నష్టపోయే అవకాశం ఉందని సంబంధిత రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం పంట కోత పరీక్షలను నిర్వహించాలని సూచించారు. కొన్ని ఆస్పత్రుల్లో జనన మరణాల నమోదులో జాప్యం చేస్తున్నందున నిర్ణీత గడువులోగా ఈ–జన్మ సాఫ్ట్‌వేర్‌లో జనన మరణాలను నమోదు చేయాలని ఆదేశించారు. కేంద్ర కరువు అధ్యయన బృందానికి చూపించే అత్యల్ప వర్షపాతం, పంట నష్టానికి సంబంధించిన అదనపు ఫోటో, వీడియో రికార్డులను సేకరించి జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ అనురాధ, అధికారులు శరణప్ప ముదుగల్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కేకేఆర్‌డీబీ.. అభివృద్ధి ఏదీ?

- ఏళ్లు గడిచినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే
- పేరు మారినా పురోగతిలో మాత్రం వెనుకంజే



కళ్యాణ కర్ణాటక చిత్రపటం

రాయచూరు రూరల్: ప్రాంతీయ అసమానతల నిర్మూలన కోసం కళ్యాణ కర్ణాటకలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్రంలో గతంలో హైదరాబాద్–కర్ణాటక అభివృద్ధి మండలి(హెచ్‌కేడీబీ)ని ఏర్పాటు చేశారు. అనంతరం దీనిని కళ్యాణ కర్ణాటక గ్రామీణ అభివృద్ధి మండలి(కేకేఆర్‌డీబీ)గా పేరు మార్చారు. విద్య, వైద్య, ఆరోగ్య, ఉద్యోగ రంగాల్లో ఇతర ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన మండలి సేవలు కేవలం నామమాత్రంగా నిలిచాయి. కళ్యాణ కర్ణాటక పరిధిలో కలబుర్గి, యాదగిరి, రాయచూరు, కొప్పళ, బీదర్, బళ్లారి, విజయనగర జిల్లాలు వస్తాయి. అయితే 66 ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధి విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

ఏటా రూ.వెయ్యి కోట్ల కేటాయింపు

రాష్ట్రంలో అధికారం చేపట్టిన ప్రభుత్వాలు ఈ ప్రాంతం అభివృద్ధి కోసం బడ్జెట్‌లో ప్రతి ఏడాది రూ.1000 కోట్ల నిధులు కేటాయిస్తారు. ఈ నిధులతో ఎమ్మెల్యేలు రహదారులు, పాఠశాలలు, తాగు నీటి పథకాలకు నిధులను వినియోగించుకోవాల్సి ఉంది. ప్రత్యేక కమిషనరేట్ కార్యాలయం ఏర్పాటు హుళక్కి అయింది. 1957 సెప్టెంబర్ 17న హైదరాబాద్ నిజాం పాలన నుంచి విముక్తి కలిగింది. వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి కోసం 2001లో అప్పటి ముఖ్యమంత్రి ఎస్ఎం.కృష్ణ హెచ్‌కేడీబీని స్థాపించి అభివృద్ధికి ప్రాముఖ్యతనిచ్చారు. మండలికి ఎమ్మెల్యేనే అధ్యక్షుడిగా కొనసాగుతారు.

నేడు సీఎం సిద్దరామయ్య కలబుర్గి రాక

ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదివారం కలబుర్గిలో జరిగే కళ్యాణ కర్ణాటక విమోచన దినోత్సవ వేడుకల్లో పాల్గొంటున్నారు. సర్దార్ వల్లభ్‌బాయి పటేల్ విగ్రహానికి పుష్పార్చన చేస్తారు. అనంతరం కలబుర్గి క్రీడా మైదానంలో కళ్యాణ కర్ణాటక విమోచన దినోత్సవంలో జాతీయ పతాకావిష్కరణ చేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు.

జెస్కాం ఉద్యోగినుల ధర్నా


ధర్నా చేస్తున్న మహిళా ఉద్యోగులు

రాయచూరు రూరల్: మహిళా సిబ్బందిపై లైంగిక వేధింపులను నిరసిస్తూ ఉద్యోగినులు శనివారం గుల్బర్గా విద్యుత్ సరఫరా మండలి(జెస్కాం) కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కేపీటీసీఎల్ 220 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్ శ్రీనివాస్ కార్యాలయంలో పని చేసే మహిళ సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు గురి చేసినట్లు ఆరోపించారు. సదరు అధికారిపై చర్యలు చేపట్టాలని ఒత్తిడి చేశారు. ధర్నాలో కేపీటీసీఎల్ ఉద్యోగుల సంఘం పదాధికారులు హులిరాజ్, రామకృష్ణ, మౌనేష్, గోపి, నరసప్ప, యల్లప్ప, శరణప్ప, రవి, వెంకటేష్ తదితరులున్నారు.

18న సూర్యప్రభ వాహన గణపతి ప్రతిష్ఠాపన


మాట్లాడుతున్న సునీల్‌కుమార్

బళ్లారి రూరల్: సర్వసిద్ధ వినాయక మిత్రమండలి ఆధ్వర్యంలో ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా నవగ్రహ సమేత సూర్యప్రభ వాహన గణపతి రూపాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మండలి ప్రముఖుడు సునీల్‌కుమార్ తెలిపారు. ఎంజీ వద్ద వినాయక మిత్రమండలి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 12 అడుగుల వినాయక ప్రతిమను 18న ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం పర్యావరణానికి హాని కలగకుండా మట్టిగణపతిని స్థానిక కళాకారులు సిద్ధం చేసినట్లు తెలిపారు. గత 24 ఏళ్లుగా నగరంలోనే ప్రముఖంగా వినాయక చవితిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలో సుమారు 6వ ఏడాది మండలి సభ్యులు చందాల ద్వారా వినాయక చవితిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 60 వేల మంది భక్తులు, ప్రముఖ వ్యక్తులు పాల్గొంటారని తెలిపారు. గత ఏడాది లడ్డూ వేలంపాట ద్వారా రూ.1.40 లక్షలు వచ్చిందని తెలిపారు. ఈ ఏడాది కూడా లడ్డూను వేలం వేయనున్నట్లు తెలిపారు. 5వ రోజు నిమజ్జన కార్యక్రమం ఉంటుందన్నారు. మండలి సభ్యులు నందీశ్, నేకార నాగరాజు, సుబ్బారావు, రాఘవ్, లక్ష్మణ, ఆదిశేష, ఎంఆర్కే రాజేష్, వంద్రి, మాజీ బుడా అధ్యక్షుడు మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా చవితి వేడుకలకు చర్యలు



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీహరిబాబు

హొసపేటె: వినాయక ఉత్సవాల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు సూచించారు. గణేష్ చతుర్థి వేడుకలపై శనివారం తన కార్యాలయ సభామందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు లౌడ్‌స్పీకర్ల వినియోగానికి అనుమతి లభించిందన్నారు. పర్యావరణ పరిరక్షణ మార్గదర్శకాల ప్రకారం మట్టి వినాయకులనే ఉపయోగించాలన్నారు. గణేష్ ప్రతిష్ఠాపన, నిమజ్జనంలో ముఖ్యంగా గణేశ్ విగ్రహ ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత, బందోబస్తు, ఇతర ఏర్పాట్లకు కేటాయించిన అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఊరేగింపు, నిమజ్జన సమయంలో సరైన విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. డిశ్చార్జ్ పాయింట్ల వద్ద భద్రతతో పాటు సీసీ కెమెరాలు, బ్యారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈసందర్భంగా సబ్ డివిజనల్ అధికారి మహ్మద్ అలీ అక్రమ్ పాటు డీఎస్పీ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ కార్యాలయం ముందు విద్యార్థుల క్యూ


దరఖాస్తు సమర్పణకు భారీగా క్యూలో నిలబడి ఉన్న విద్యార్థులు

గంగావతి: ఉచిత ల్యాప్‌టాప్‌కు అర్జీలు సమర్పించేందుకు చివరి రోజు కావడంతో కొప్పళలోని జిల్లాధికారి కార్యాలయంలో ఉన్న కార్మిక శాఖ కార్యాలయంలో భారీ ఎత్తున విద్యార్థులు క్యూలో నిలబడి అర్జీలు సమర్పించారు. కార్మిక శాఖ వారు ఇచ్చే ల్యాప్‌టాప్‌కు దరఖాస్తులను సమర్పించేందుకు జిల్లాలోని 7 తాలూకాల విద్యార్థులు కార్మిక శాఖ కార్యాలయానికి విచ్చేసి దరఖాస్తులను సమర్పించారు. అయితే ఈ సందర్భంగా ఎలాంటి పోలీసు బందోబస్తు కనిపించలేదు.

వృద్ధురాలి ఇంట్లో చోరీ

రాయచూరు రూరల్: దొంగలు పార్వతమ్మ అనే వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న ఆమె చెవి కమ్మలు, గొంతులోని బంగారు నగలను చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గురువారం రాత్రి లింగసూగూరులో జరిగిన ఈ ఘటనలో చెవి పోగులను దొంగలు లాగడంతో వృద్ధురాలికి గాయాలయ్యాయి. ఆమె నోరు మెదపకుండా ఉండేలా నోటిలో గుడ్డలు కుక్కి నగలు దోచుకెళ్లారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీటి వృథాతో రోడ్డు అధ్వానం


నీటి వృథాతో రోడ్డు పాడైన దృశ్యం

కంప్లి: రామసాగర 4వ వార్డులో తాగునీటి పైపులు లీకై నీరంతా వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. వార్డు సభ్యురాలు పార్వతి అయినా పెత్తనం అంతా ఆమె భర్త చేతిలో ఉంది. నీరు లీకై వార్డులోని రోడ్లలో వృథాగా పారుతోంటే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై పీడీఓ దృష్టి తెచ్చినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తమ గోడును ఆలకించి పీడీఓ, సభ్యురాలు నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

షేర్లలో నష్టాల పాలై ఐటీ ఇంజినీరు ఆత్మహత్య

తాడిపత్రి అర్బన్: ఐటీ ఇంజినీర్ ఉద్యోగం చేస్తూ మరోవైపు షేర్ మార్కెట్లో పెట్టుబడి పెట్టి నష్టపోయి ఆత్మహత్య చేసుకున్నాడో యువకుడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లాలోని తాడిపత్రి నియోజకవర్గం యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన పెనుగొండ ఓబిరెడ్డి (26) అనే బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుండేవాడు. అయితే అక్కడ షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోవడంతో మనస్తాపం చెంది గత నెల 15న ఉద్యోగాన్ని వదిలేసి తాడిపత్రికి వచ్చి ఇంట్లో ఉండేవాడు. గురువారం తాడిపత్రి పట్టణంలో విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తల్లిదండ్రులు ఓబిరెడ్డిని చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు.

ఏపీఎంసీలో ఆకస్మిక తనిఖీ


ఏపీఎంసీ మార్కెట్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్మిస్తున్న హోల్‌సేల్ దుకాణాలను వెంటనే తరలించాలని జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ ఆదేశించారు. ఆయన శనివారం నగరంలోని ఏపీఎంసీ మార్కెట్ యార్డ్‌లో ఆకస్మిక తనిఖీ చేసి ఏపీఎంసీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఆవరణలో నిర్మిస్తున్న హోల్‌సేల్ దుకాణాల్లోకి త్వరితగతిన దుకాణాలను తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా సొమ్ము చెల్లించని వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఏపీఎంసీ అధికారికి సూచించారు. ఏపీఎంసీలో కూరగాయల వ్యాపారులతో మాట్లాడి ఆవరణలో కల్పించాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోండి


మాట్లాడుతున్న ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు

బళ్లారిఅర్బన్: జిల్లాలో వినాయక చవతి, ఈద్ మిలాద్ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు తెలిపారు. స్థానిక ఫుట్‌బాల్ క్రీడా మైదానం సభాంగణంలో ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18 నుంచి గణపతి పండుగను వారం రోజుల పాటు ఆయా మిత్ర మండలి వారు బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఈ నెల 28న ఈద్ మిలాద్ పండుగను కూడా ముస్లిం బాంధవులు శాంతియుతంగా జరుపుకోవాలని ఆదేశించారు. నియమాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

వసూళ్ల కేసులో హాలశ్రీ అరెస్టు

బనశంకరి: పారిశ్రామికవేత్త గోవిందబాబు పూజారికి ఎమ్మెల్యే ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తామని రూ.5 కోట్లు వంచన కేసులో సీసీబీ పోలీసులు శనివారం మరో నిందితుడు, బళ్లారి జిల్లాకు చెందిన అభినవ హాలశ్రీ స్వామి, అతని కారుడ్రైవరు వీరప్రజ్ఞని అరెస్టు చేశారు. ప్రధాన నిందితులు చైత్ర, కొందరు నిందితులు బాధితున్ని కలిసిన వీడియోల చిత్రాలను పోలీసులు సేకరించారు. బెంగళూరు నారాయణ గురు కో–ఆపరేటివ్ బ్యాంక్, గోవిందపూజారి ఆఫీసులో పరిశీలించి సమాచారం రాబట్టారు.8వ ఆరోపి ప్రసాద్ కూడా అరెస్టు చేశారు.

చైత్ర లాకర్‌లో భారీగా డబ్బు, నగలు

మరోవైపు ఆస్పత్రిలో మూర్ఛ రోగం నుంచి చైత్రా కుందాపుర కోలుకుంది. ఉడుపి ఉప్పూరి శ్రీరామ సహకార సంఘం లాకర్‌లో చైత్రకు చెందిన నగదు, బంగారు ఆభరణాలు, ఆస్తిపత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ.1కోటి 8 లక్షల విలువైన ఆస్తి పత్రాలు, రూ.40 లక్షల నగదు, రూ.65 లక్షల విలువైన నగలు ఉన్నాయి. శ్రీకాంత్ పేరుతో ఆస్తులను కొనుక్కుంది. దీంతో శ్రీకాంత్ అదుపులోకి తీసుకున్నారు.